వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 16 సంచిక : 10 హైదరాబాద్ 207 అక్టోబర్ 2018 పేజీలు : 68 రు. 25

- భీమా కోరేగాం అరెస్టులు-పూర్వాపరాలు - ఐదు వ్యాసాలు
- కులోన్మాద హత్యలకు ముగింపు ఎప్పుడు?
- పసలేని ప్రగతి నివేదన సభ
- పాతాళంలోకి రూపాయి పయనం
- డార్విన్ పరిణామవాదం
- మార్క్స్ దృష్టిలో పరాయీకరణ

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
విధ్వంసక అభివృద్ధి	డిఎస్‌యు	180
రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే	రైతు సేవా సమితి	100
భారతదేశంలో ఉత్పత్తి విధానం- ఉత్పత్తి సంబంధాలు	విరసం	20
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
మార్క్స్ రాసిన పెట్టుబడి	డేవిడ్ స్మిత్, ఫిల్ ఇవాన్స్	200
శ్రమ సంబంధాల మహిళీకరణ	ఎం. వనమాల	60

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	150
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	120
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	150
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

మా బతుకులు	బేబి కాంబ్లే	130
భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా పూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	120
నేను హిందువునెట్లయిత?	కంచె ఐలయ్య	100

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ డిటెన్యూ డైరీ	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	170
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
సామాజికం	వి. చెంచయ్య	30
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీళాదేవి	75
దారులేసిన అక్షరాలు	భారతీయ మహిళల రచనలు	400
కొలిమి రవ్వలు	గౌరి లంకేశ్ రచనలు	150

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం ప్రచురణ	125
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50
మార్క్సిస్టు నిఘంటువు-1	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	350
మార్క్సిస్టు పదకోశం	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	50

చరిత్ర-జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	120
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్‌సన్	150
24 గంటలు	కె.జి. కన్నబిరాన్	200
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
మహాత్మా జ్యోతిరావ్ పూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100
ఏడవకు బిడ్డా...	గుగి వా థియాంగో	150

విప్లవోద్యమం

మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220
జనతన రాజ్యం	పాణి	300
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
అభాగ్యజీవులు	విరసం ప్రచురణ	170
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం-విప్లవ ద్రోహి కౌట్స్కీ	విరసం ప్రచురణ	60

కథ - నవల

దండకారణ్య కథలు (2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు - రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నా గొడవ	కాళోజీ కవితలు	400
నిషిధ	నల్లూరి రుక్మిణి	180

డివిడి

వీక్షణం (2003 - 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయు'ద్ధకాండ	100

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

207 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

అక్టోబర్ 2018
సంపుటి : 16
సంచిక : 10

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2018 సెప్టెంబర్ నెలలో వచ్చిన విరాళాలు - శ్రేయోభిలాషులు - హైదరాబాద్- రు. 6,000; ఆర్. దిలీప్‌రెడ్డి, హైదరాబాద్ - రు. 2,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం సెప్టెంబర్ 2018 సంచికల జి. హరగోపాల్ సారు రాసిన 'విద్యుత్ కార్మికుల సమ్మె' వ్యాసం చదివి ఈ ఉత్తరం రాస్తున్న. హరగోపాల్ సారును విమర్శించే స్థాయి నాకు లేదు కాని సారు రాసిన కొన్ని వాక్యాలు నాకు మింగుడు పడలేదు. "రెండవ దఫా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఇది తెలంగాణ ఉద్యమ వాగ్దానమని గుర్తు చేస్తూ సమ్మెకు పూనుకోవడంతో ప్రభుత్వం కొంత దూరాలోచనే చేసి క్రమబద్ధీకరణను చేపట్టింది. దీంట్లో సిజియం ప్రభాకర్ రావు పాత్ర కొంత ఉంది. ఆయన మొదటి నుండి కాంట్రాక్టర్ వ్యవస్థ అన్యాయమని వ్యక్తిగతంగా విశ్వసించారు. క్రమబద్ధీకరణ పట్ల కూడా సుముఖంగా ఉన్నారు" అని సారు రాసిండ్రు. తెలంగాణ ప్రభుత్వం నాలుగేండ్లుగా ఎట్ల ప్రవర్తిస్తున్నదో చూస్తున్న సారు, ఈ సర్టిఫికెట్ ఇస్తున్నరంటె ఆశ్చర్యం కలుగుతున్నది. కెసిఆర్ ప్రభుత్వానికి దూరాలోచననా, దురాలోచననా? ఆ దూరాలోచన వెనుక దురాలోచన ఏందో సారు చెప్తె బాగుండు. అట్లనే సిజియం గురించి సారు అంత మంచి మాటలు రాసుడు గుడ నచ్చలేదు. ఈ ప్రభుత్వంల, వ్యవస్థల ఒక మనిషి మంచోడా చెడ్డోడా అన్నది ముఖ్యం కాదు. ఏ స్థానంల ఉన్నడు, ఎవరి కోసం పని చేస్తున్నడు అన్నది ముఖ్యం అని సారుకు చెప్పేటంతోన్ని కాదు. ప్రభాకర్ రావు ఎంత మంచోడైనా, ఈ సర్కారుకు అనుకూలమైన మనిషి కాకపోతే అంత కీలకమైన స్థానంల ఉంటడా?

– పి. రాజేశం
హైదరాబాద్

వీక్షణం సెప్టెంబర్ సంచికలో 'కేరళను ముంచెత్తిన వరద' వ్యాసంలో రచయిత్రి అరుంధతీరాయ్ ప్రకృతి వైపరీత్యాలకు ప్రకృతెంత కారణమో, పాలకులు అభివృద్ధి పేరుతో తెస్తున్న విధానాలు ఇలాంటి వైపరీత్యాలకు ఎలా కారణమవుతున్నాయో చాలా వివరంగా తెలియజేశారు. ఆ క్రమంలో ప్రజలు మానవత్వంతో స్పందించిన తీరును వివరించి ప్రజల్లో ఉన్న మానవ విలువల్ని సమాజం ముందుంచినట్లైంది. ప్రధానంగా గనులు, కొండలను తవ్వినపుడు ప్రకృతి వైపరీత్యాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పర్యావరణవేత్తలు ఎన్ని హెచ్చరికలు చేసినా రాజకీయ అవతారమెత్తిన కాంట్రాక్టర్లు ఇవేవి పట్టించుకోకుండా ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతున్నారనే విషయాన్ని తెలిపి ఇప్పటికైనా ప్రజలు ప్రకృతి సంపదను కాపాడుకొని, పాలకులు అభివృద్ధి పేరుతో చేస్తున్న విధ్వంసాన్ని అడ్డుకోవాల్సిన అవసరాన్ని ఈ వ్యాసం గుర్తింపజేసింది. రచయితకు కృతజ్ఞతలు.

– వినోద్
మంచిర్యాల

నేను గత పది సంవత్సరాలుగా వీక్షణం చదువుతున్నాను. ప్రారంభంలో వీక్షణంలో వస్తున్న వ్యాసాలను చదివి అర్థం చేసుకోవడం కొంత కష్టమయ్యేది. చదువుతున్న క్రమంలో అచ్చయిన వ్యాసాలన్నీ మన చుట్టు జరుగుతున్న పరిణామాలను చెపుతున్నాయని అర్థంచేసుకున్నాను. ఈ క్రమంలో దినపత్రికల్లో వచ్చే వ్యాసాలకన్నా వీక్షణంలో వస్తున్న వ్యాసాల్లో ప్రజా పక్ష కోణం ఉందని అర్థంచేసుకున్నాను. సమాజాన్ని సంక్షోభంలోకి నెడుతున్న అనేక అంశాలపై వ్యాసాలు రావడం అన్ని విషయాలను అర్థం చేసుకోవడానికి, సంక్షోభానికి కారణమవుతున్న ప్రభుత్వ విధానాలను మూలాల నుండి చూసే అవగాహన పెరిగింది. రోజు రోజుకు ప్రభుత్వాలు ప్రజల్ని సమస్యల్లోకి నెట్టివేసి తమ అధికారాన్ని నిలుపుకోవడానికి తాత్కాలిక ప్రయోజనాన్ని చేకూర్చే పథకాలను అమలుపరుస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీలు తమ అధికారాన్ని, పార్టీలను కాపాడుకోవడానికి తమకు పెద్దమొత్తంలో ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చే విధాన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ప్రజల్ని మాత్రం తాత్కాలిక ప్రయోజనాలకే పరిమితం చేసి అడుక్కునే పరిస్థితి కల్పిస్తున్నాయి. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా, వారి నమ్మకాలను, విశ్వాసాలను సంతృప్తిపరిచే పనిని కొనసాగిస్తున్నారు. పాలకులు అవలంబిస్తున్న తప్పుడు విధానాలను అర్థంచేసుకునే చైతన్యం పత్రిక చదవడం ద్వారా పొందుతున్నాను. ఈనాడు మీడియా ప్రభుత్వం చెంత జేరి ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్న సందర్భంలో వీక్షణం లాంటి పత్రిక అవసరం మరింత ఉంది. ఇలాంటి పత్రికలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని, వీక్షణం చేస్తున్న కృషిని అభినందిస్తూ, పత్రిక నిలబడడానికి నావంతు సహకారాన్ని అందిస్తాను.

– తిరుపతి
సిద్దిపేట

వీక్షణం సెప్టెంబర్ సంచికలో డా.ఎ.పున్నయ్య రాసిన 'రాఫెల్ ఒప్పందం – భారీ కుంభకోణ' వ్యాసం నిత్యం నీతివంతమైన పాలన అందిస్తున్నామని చెప్పుకుంటున్న బిజెపికి ఈ వ్యాసం ఆ పార్టీ ఎంత అవినీతికి పాల్పడిందో తెలిపింది. యుపిఎ ప్రభుత్వంలో 126 మల్టీ మోడల్ యుద్ధ విమానాలను 42,000 వేల కోట్లకి అందించాలని మొదట ఒప్పందం కుదుర్చుకున్నారు. బిజెపి అధికారంలోకి రావడంతో 36 యుద్ధ విమానాలనే రు. 58,000 వేల కోట్లకు కొంటున్నారనేది వాస్తవం. ఇంతకు విమానాల సంఖ్య తగ్గింది, రేటు పెరిగింది. ఇది ఎవరి ప్రయోజనాలను నెరవేర్చడానికి ప్రభుత్వం ఈ చర్యకు పూనుకుందో అందులోని లొసుగులను వివరంగా రాశారు. బిజెపి అధికారంలోకి రావడానికి సహకరించిన కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన రిలయెన్స్ ప్రయోజనాలను నెరవేర్చడం కోసమే ఈ చర్యకు పాల్పడినారనే విషయాన్ని తేటతెల్లం చేశారు. సందర్భానుసారంగా ఉంటున్న సంపాదకీయం, సంపాదకీయ వ్యాఖ్యలు, కార్టూన్ పాలకుల మర్మాన్ని బహిర్గతం చేసేలా ఉంటున్నాయి.

– ఎల్. సంతోష్
ర్యాగటిపల్లె

వీక్షణం ఆగస్టు సంచికలో విశ్వం గారు రాసిన 'బస్తర్‌లో భూ సంబంధాలు' వ్యాసం చాలా బాగుంది. అక్కడి ఆదివాసులు పడుతున్న ఇబ్బందులను, వారు ఆచరిస్తున్న సంప్రదాయాలను, ప్రకృతితో వారికున్న సంబంధాలను కళ్లకు కట్టినట్లుగా వివరించారు. ఆలాగే బైరెడ్డి సతీష్ రాసిన 'మొక్కులు సరే! ప్రజా ఆకాంక్షల మాటేమిటి' వ్యాసం తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా ప్రజల సొమ్మును మొక్కుబడుల పేరుతో వివిధ దేవాలయాలకు ఎలా ఖర్చు చేస్తున్నదో, అలాగే యజ్ఞాలు, యాగాల పేరుతో ప్రజల్ని ఎలా తప్పుదోవ పట్టిస్తున్నదో బాగా వివరించారు.

– పోలె వెంకటేష్
మహబూబ్‌నగర్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేష్)

సంపాదకీయం

అక్రమాల యుద్ధ విమానాల రెక్కల చప్పుడు

వీక్షణం

తమది విలువలకు, వ్యక్తిగత నైతికతకు ప్రాధాన్యత ఇచ్చే సాంస్కృతిక సంస్థ అనీ, తమను మించిన దేశభక్తులెవరూ లేరని, ఉండరని సంఘపరివార్ ప్రచారకులు ముక్కుపచ్చలారని చిన్నారి పిల్లలను పోగుచేసి ఇచ్చే శిక్షణలలో, శాఖలలో స్వోత్కర్షలు చేసుకుంటూ, అబద్ధపు అతిశయాన్ని ప్రేరేపిస్తుంటారు. అప్పటి అధికారపక్షం కుంభకోణాలకూ అవినీతికీ నిలయమని, తమను ఎన్నుకుంటే అత్యంత నీతివంతమైన పాలన అందిస్తామని సంఘ్ పరివార్ నాయకులందరూ 2014 ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తాము ప్రధానిగా ప్రకటిస్తున్న వ్యక్తికి భార్యాబిడ్డలూ కుటుంబమూ లేరని, అందువల్ల కుటుంబపాలనకు, అవినీతికి ఆస్కారం ఉండవని చెప్పుకున్నారు. నాలుగు సంవత్సరాల పాలనలో ఈ ప్రగల్భాలన్నీ ఒకటొకటిగా విస్ఫోటనం అవుతున్నాయి. అంత మహత్తరమైన విలువల సంస్థలో జీవితమంతా పనిచేసిన వ్యక్తి ఎట్లా మూడువేలమంది ఊచకోతలకు అగ్రాసనాధిపత్యం వహించి, ఆ రక్తసిక్త సోపానాల మీద దేశ ప్రధాని అయ్యాడో ఇప్పటికే రుజువై పోయింది. ఆ దేశభక్తుల సంస్థ నాయకుడు దేశాన్ని ఎట్లా సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు తాకట్టు పెట్టడానికి కాలికి బలపం కట్టుకుని దేశదేశాలూ తిరుగుతున్నాడో ప్రతి ఒక్కరికీ తెలిసిపోయింది. ఎందరెందరో బందిపోటు దొంగలను స్వేచ్ఛగా దేశ సరిహద్దులు దాటిపోనివ్వడం మాత్రమే కాదు, దేశ చరిత్రలో అత్యంత భారీ కుంభకోణాల్లో ఒకటి స్వయంగా ఈ ఏలిక కాలంలోనే జరిగిందని ఇప్పుడు రాఫేల్ కుంభకోణం బైటపెడుతున్నది.

మామూలుగానే ఈ దేశంలో రక్షణ వ్యవహారాలు ప్రశ్నించడానికి వీలులేని, వివరాలు బైటికి చెప్పడానికి వీలులేని పవిత్రమైన అంశాలుగా చూడడం అలవాటు. ప్రజాప్రతినిధులు అనబడేవారికి కూడ తెలియకుండా, బడ్జెట్‌లో కూడ పొందుపరచకుండా, దేశ రక్షణ రహస్యాల పేరుతో ఆయుధాల, సైనిక సామగ్రి కొనుగోళ్లు, లావాదేవీలు ప్రజలకు అందుబాటులో లేకుండా జరపడం దశాబ్దాలుగా సాగుతున్న తతంగమే. టెండర్ ప్రక్రియ, అతి తక్కువ ఖరీదు, అతి ఎక్కువ సాంకేతిక ప్రమాణాలు ఉన్న సామగ్రిని కొనడం అనే పద్ధతులు నామమాత్రంగా ఉన్నప్పటికీ, అసలు ఆ కంపెనీలు అమ్మజూపే ధరే మామూలు మార్కెట్ ఖరీదు కన్న ఎక్కువ ఉండడం, నాణ్యత ఎంత నాసిరకంగా ఉన్నా సైనిక సలహాదార్లు, నిపుణులు దాన్ని ఆమోదించడం, ఆ నిపుణుల దగ్గరి నుంచి రక్షణ శాఖ అధికారులు, మంత్రులు, ప్రధానమంత్రుల దాకా భాగస్వాములందరికీ ముడుపులు అందడం ఆనవాయితీ అయి పోయాయి. బోఫోర్స్ శతఘ్నుల కొనుగోలు కుంభకోణంలో ఈ తప్పుడు పద్ధతులన్నీ జరిగాయని స్పష్టంగానే బైటపడింది. బోఫోర్స్ కుంభకోణం కొన్ని డజన్ల కోట్ల రూపాయల అవినీతికి సంబంధించినది కాగా, ఇప్పుడు ముప్పై ఏళ్ల తర్వాత వేల కోట్ల రూపాయల అవినీతికి నిలయమైన రాఫేల్ కుంభకోణపు వివరాలు ఒక్కొక్కటే బైట పడుతున్నాయి.

మధ్యంతర శ్రేణిలో బహుళార్థసాధకంగా పనిచేసే యుద్ధవిమానాల అవసరం ఉందని భారత వాయుసేన 2007లో మొదటిసారి తన అవసరాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అసలు ఈ అవసరం నిజమైనదేనా, అది కూడ ఆ విమానాల అమ్మకందార్లు, వాయుసేన అధికారులతో కుమ్మక్కై రుద్దిన అవసరమా అనుమానించవలసి ఉంది. అది అలా ఉంచినా, ప్రభుత్వం 126 యుద్ధ విమానాలు కొనడానికి ప్రక్రియ ప్రారంభించింది. ఫ్రాన్స్ కు చెందిన డసో, రష్యాకు చెందిన మిగ్, స్వీడన్ కు చెందిన సాబ్, అమెరికాకు చెందిన లాక్ హీడ్ మార్టిన్స్, బోయింగ్ వంటి విమాన తయారీ సంస్థలు టెండర్లు దాఖలు చేశాయి. ఈ ప్రక్రియ 2012 నాటికి కొంత ముందుకు సాగి, డసోతో కొనుగోలు ఒప్పందం కుదిరింది. డసో 18 విమానాలను స్వయంగా తయారుచేసి పంపాలనీ, మిగిలిన 108 విమానాలను భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (ఎచ్ ఎ ఎల్) లో తయారు చేసేందుకు సాంకేతిక సహకారం అందించాలనీ ఒప్పందం కుదిరింది. అప్పుడు ఒక్కొక్క విమానానికి భారత ప్రభుత్వం అంగీకరించిన ఖరీదు రు. 526 కోట్లు. 2014 ఎన్నికలకు రెండునెలల ముందు డసో కూ, ఎచ్ ఎ ఎల్ కూ మధ్య సాంకేతిక సహకార ఒప్పందం కూడ కుదిరింది. కాని ఎన్నికలు జరిగి మోడీ ప్రధాని అయిన తర్వాత ఏడాదికి జరిపిన ఫ్రాన్స్ పర్యటనలో 36 రాఫేల్ యుద్ధవిమానాలు కొంటున్నట్టు పారిస్ లో ప్రకటించారు. మరొక నెలన్నర తర్వాత పాత 126 విమానాల కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసినట్టు రక్షణ శాఖ ప్రకటించింది. మోడీ ఫ్రాన్స్ పర్యటనకు పది రోజుల ముందు అనిల్ అంబానీ రిలయన్స్ డిఫెన్స్ అనే సంస్థ ప్రారంభించాడు. 2016 సెప్టెంబర్ లో ఒక్కొక్కటి రు. 1670 కోట్ల చొప్పున రు. 60,000 కోట్లతో 36 రాఫేల్ విమానాలు కొనేందుకు భారత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ కొనుగోలులో స్థానిక భాగస్వామిగా రిలయన్స్ డిఫెన్స్ ఉంటుందని డసో ప్రకటించింది. 2017 డిసెంబర్ లో కాంగ్రెస్ చేసిన ఆరోపణలతో ఈ వ్యవహారంలో లోపాయకారీ అనుమానాస్పద అంశాలు బైటికి రావడం ప్రారంభమైంది. కాగా, ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు ఫ్రాంకోయి హోలన్ ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రిలయన్స్ డిఫెన్స్ ను స్థానిక భాగస్వామిగా చేర్చుకొమ్మని భారత ప్రభుత్వమే డసో కు చెప్పిందని అనడంతో మరిన్ని రహస్యాలు బైటపడ్డాయి. ఇంకా ఈ మూసిపెట్టిన పేటికలో ఎన్ని కంకాళాలున్నాయో చూడాలి.

అవసరమైన విమానాల సంఖ్య మూడో వంతు తగ్గిందంటే అసలు అవసరం నిజమేనా, హేతుబద్ధంగా రూపొందించినదా, అలవోకగా చెప్పినదా అనే అనుమానం కలుగుతున్నది. యుద్ధ విమానాల ఖరీదు మూడు రెట్లు పెరిగిందంటే, ఈ ఖరీదును అంచనా వేయడానికి ఏదైనా శాస్త్రీయ ప్రమాణం ఉన్నదా, అది గుడ్డెద్దు చేనులో పడిన బేరమేనా అని అనుమానించవలసి ఉంది. అన్నిటికన్న ముఖ్యం పదిరోజుల ముందు ఏర్పడిన సంస్థ ఒక కీలకమైన వేల కోట్ల రూపాయల లావాదేవీలో భాగస్వామి కావడానికి ఏ అరతలు, ఏ ప్రమాణాలు పని చేశాయి అని అడగవలసి ఉంది. ఆ సంస్థే ఆ ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడి భార్య తీసిన సినిమాకు పెట్టుబడి పెట్టిందని, అందువల్లనే ఆ కాంట్రాక్టు దక్కించుకుందనీ వివరాలు బైటపడుతున్నాయి. అంటే ఇస్తినమ్మ వాయినం, పుచ్చుకుంటినమ్మ వాయినం జరిగిందని స్పష్టమవుతున్నది. ఇది దేశమా, అంబానీ రాజ్యమా అనీ, ఇది దేశ ప్రయోజనాలు కాపాడే ప్రభుత్వమా, అంబానీల మేలు చూసే దళారీనా అనీ అడగవలసి ఉన్నది. రాఫేల్ యుద్ధవిమానం ఎంత సమర్థమైనదో తెలియదుగాని, దాని రెక్కల చప్పుడులో మోడీ సంఘపరివార్ దేవతావస్త్రాలు జారిపోతున్నాయి. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

మళ్లీ ఒకసారి మాయదారి ఎన్నికలు

తెలంగాణ శాసనసభ రద్దయి మూడు వారాలు కావస్తున్నా, శాసనసభను ఎందుకు రద్దు చేశారో పాలకుల నుంచి సహేతుకమైన వివరణ ఇప్పటిదాకా రాలేదు. అవతలివాళ్లు పని చేయనివ్వడం లేదు గనుక పని మానుకుంటున్నాను అన్నారు గాని ఆ మాట ప్రజాస్వామ్యంలో చెల్లదు. అంతేగాక, తాము బృహత్తరమైన, మహత్తరమైన, అసాధారణమైన పని చేస్తున్నామని చెప్పుకునే వారు, తమ విమర్శకులు కువిమర్శలు చేస్తున్నామని అనేవారు ఆ విమర్శలకు అంత ప్రాధాన్యత ఇచ్చి తమ పని ఎందుకు అర్ధాంతరంగా ముగించారో తెలియదు. బహుశా ఏలికకు ఉన్న మూఢనమ్మకాల రీత్యా ఏదో అతీతశక్తి ఆదేశం మినహా మరే హేతుబద్ధ కారణమూ లేదని చాలమంది అనుకుంటున్న కారణమే నిజం కావచ్చు. అది ఆధునిక ప్రజాస్వామ్యంలో చెల్లదనే మాట అలా ఉంచి, శాసనసభ రద్దు అనే కార్యక్రమమే ఇంత అబందరగా, గందరగోళంగా జరిగిందంటే, ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనేది ఇది రాస్తున్న సమయానికి ఇంకా స్పష్టం కాలేదు. తొమ్మిది నెలల ముందే ఎన్నికలకు వెళ్లడం ఎందుకనేది ఒక అంశమైతే ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అస్పష్టతలు కొన్ని ఉన్నాయి. 2014 ఎన్నికల్లో తెలంగాణలో ఉండి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ కు మారిపోయిన ఏడు మండలాల విషయంలో, అంటే వోటర్లు ఆంధ్రప్రదేశ్ లో, వారు ఎన్నుకున్న ప్రతినిధులు తెలంగాణ శాసనసభలో ఉండిపోయిన విచిత్ర స్థితి విషయంలో ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది గాని, మిగిలిన అస్పష్టతలు అలాగే ఉండిపోయాయి. వోటర్ల జాబితాలు ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారు, ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ గురించి నిర్ధారించకుండానే, నియోజకవర్గాల సంఖ్య పెంపు గురించి చర్చ ప్రారంభమైందంటే ఎన్నికలు ఆ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు ముందు జరుగుతాయా, తర్వాత జరుగుతాయా, ఒకవేళ ఎన్నికలు మామూలుగా జరగవలసిన సమయానికే, 2019 మే నాటికి వాయిదా పడితే ఈ ఏడెనిమిది నెలలు ఆపద్ధర్మ ప్రభుత్వం కొనసాగడాన్ని రాజ్యాంగం అనుమతిస్తుందా వంటి అస్పష్టతలు అలాగే ఉన్నాయి. అయినా మన రాజకీయ వ్యవస్థ ఎంత విచిత్రమైనదంటే, ఇన్ని అస్పష్టతల మధ్య కూడ ఎన్నికల జ్వరం విపరీతంగా పెరిగిపోతున్నది. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జరిగే హడావిడి అంతా ఇప్పుడే జరిగిపోతున్నది. అభ్యర్థుల ప్రకటనలు, అసంతృప్తులు, రాజీలు, రాజీనామాలు, బుజ్జగింపులు, పొత్తులు, డబ్బుల పంపకాలు, ఖండన మండనలు, ప్రత్యర్థులను చిత్తుచేసే ఎత్తుగడలు, అధికార దుర్వినియోగాలు అన్నీ యథావిధిగా జరిగిపోతున్నాయి. నిజానికి మన ఎన్నికలు నిజమైన ప్రజాభిమతానికి సూచికలు కావు. ఇక్కడ పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఒక సహజమైన వృక్షంగా ఎదగనే లేదు. బ్రిటన్ నుంచి తీసుకువచ్చిన వెస్ట్ మినిస్టర్ అంటుమొక్క ఇక్కడ బోన్సాయి వృక్షంగా చూడడానికి మహా వృక్షంగా కనబడుతున్నది గాని, ఈ కుండీలో మహావృక్షం గుంటపూలు తప్ప నిజంగా సువాసన ఇచ్చే పూలు పూయడం లేదు. కుక్కమూతి పిందెలు తప్ప ఆహారం కాగల ఫలాలు కాయడం లేదు. అది ఏడు దశాబ్దాల అనుభవంలో డజన్లకొద్దీ సార్లు రుజువయింది. ఒకవైపు ప్రాంత ప్రయోజనాలే తమ పరమ ప్రాధాన్యత అని అధికారంలోకి వచ్చి పాతపాలన కన్న దుర్మార్గం సాగించిన వారూ, మరొకవైపు ప్రాంతాన్ని ఆరు దశాబ్దాల పాటు అన్యాయం చేసినవారూ ఉన్నవేళ, చెరబండరాజు ఐదు దశాబ్దాల కింద రాసినట్టు, "మళ్లీ వస్తున్నాయి మన ఊరికి/ చిలుక పలుకుల డేగలు/ రక్తం తాగే రాబందుల మూకలు/ ఉషస్సులూ మనస్సులూ జగ్రత్త/ పాపలూ కనుపాపలూ జాగ్రత్త". వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

బాక్సైట్ దురాశ ఎక్కడికి చేర్చింది?

అరకు శాసనసభ్యుడు కిడారి సర్వేశ్వర రావును, మాజీ శాసనసభ్యుడు సివేరి సోమను మావోయిస్టులు కాల్చి చంపడం మీద తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. పదమూడు సంవత్సరాల కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మక్తల్ శాసనసభ్యుడు నర్సిరెడ్డిని కాల్చి చంపిన తర్వాత ఇటువంటి ఘటనలు జరగలేదని, విప్లవోద్యమాన్ని అణచివేశామని ప్రభుత్వాలు చెప్పుకుంటున్న సమయంలో ఇది ఒక సవాల్ అని, మావోయిస్టులు వేచిచూసి పథకం ప్రకారం మాటు వేశారని, ఘాతుకం అని, భయోత్పాతం అని, భీతావహం అని, ఒక ఆదివాసి నేతను ఇలా చంపుతారా అని, నగరాల్లో, మైదానాల్లో ఉన్న బడా దోపిడీదారులను వదిలేస్తున్నారేమిటి అని, మావోయిస్టు సిద్ధాంతానికి కాలం చెల్లిందని రాజకీయ పరిశీలకులు, ప్రచారసాధనాలలో వ్యాఖ్యాతలు ఎన్నెన్నో విశ్లేషణలు చేస్తున్నారు. ఈ విశ్లేషణలన్నీ కూడ వ్యాఖ్యాతల రాజకీయాభిప్రాయాలకు అద్దం పడుతున్నాయి గాని తూర్పు కనుమల్లోని వాస్తవికతను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఎవరి మరణమైనా బాధాకరమే. అందులోనూ ఆదివాసి నేపథ్యం నుంచి ఎదిగివచ్చి, పార్లమెంటరీ రాజకీయాలలో ఒక స్థాయి నాయకుడిగా ఎదిగిన వ్యక్తి మరణం ఆయన కుటుంబానికి, ఆశ్రితులకు, ఆయన ప్రాతినిధ్యం వహించే రాజకీయ పక్షానికి లోటే. అయితే సామాజిక పరిణామ క్రమంలో వ్యక్తిగత స్థాయి విచారకరమైన ఘటనల కన్న ముఖ్యమైనవి సామాజిక ప్రక్రియలు. ఒక ఘటనను ఘాతుకం అనడమా అనకపోవడమా కన్న ముఖ్యమైనది ఆ ఘటన ఏ పరిణామాల ఫలితంగా సంభవించినది, ఆ పరిణామాల దిశ ఈ విధంగానే ఉండక తప్పదా అని ఆలోచించడం. ఉత్తరాంధ్ర అటవీ ప్రాంతం రాజ్యాంగబద్ధంగా షెడ్యూల్డ్ ప్రాంతం. అక్కడ పాలన మాత్రమే కాదు, రాజ్యాంగం అమలు, చట్టాల అమలు కూడ భిన్నంగా, ఆదివాసుల పట్ల సున్నితత్వంతో, ఆదివాసి జీవిత సరళిని ధ్వంసం చేయకుండా జరగాలని రాజ్యాంగం చెపుతున్నది. దానికి తోడు, భూబదలాయింపుల చట్టానికి 1970లో తెచ్చిన ఒకటో సవరణ, ఆ తర్వాత సమత కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఆ ఆదివాసి ప్రాంతాలలో భూమిని అన్యాక్రాంతం చేయగూడదని, ప్రభుత్వానికి కూడ ఆ భూమిని ఆక్రమించే హక్కు లేదని చెపుతున్నాయి. తర్వాతి పెసా, అటవీ హక్కుల చట్టం అటవీ వనరులపై ఆదివాసుల హక్కును నిర్ధారిస్తున్నాయి. కాని ఆదివాసులలోనే ఒక దళారీవర్గాన్ని తయారుచేసి వారి ద్వారానే ఆ ప్రాంతాన్ని తాకట్టు పెట్టించే, అమ్మించే, అక్కడి వనరులను కొల్లగొట్టే దుర్మార్గ వ్యూహాన్ని పాలకులు తయారు చేశారు. అలా తమ వనరుల దోపిడీకి తామే సహకరించే దళారీలు పుట్టుకతో ఆదివాసులైనా, ప్రయోజనాల రీత్యా ఆదివాసులు కాకుండా పోయారు. ఆ ప్రాంతంలో బాక్సైట్ వంటి విలువైన ఖనిజాలను కొల్లగొట్టడానికి, బహుళ జాతి సంస్థలకు అప్పగించడానికి ప్రభుత్వాలు దాదాపు ఇరవై సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నాయి. ఆ ఇనుప గొడ్డలి తనంత తానుగా చేయలేని పనిని, అందులో దూరిన కర్రగా మారిన దళారీలు చేసిపెడు తున్నారు. పోనీ ఈ దళారీలు తమ ప్రయోజనాల్ని చూసుకుంటూనే, తమ మూలాల్నిమరిచిపోకుండా తమ సమూహపు ప్రయోజనాల కొరకు నిలుస్తున్నారా అంటే అదికూడ లేదు. జరిగిన ఘటన పట్ల విచారాన్ని వ్యక్తం చేస్తూనే అయినా సరే గుర్తించవలసిన కఠిన వాస్తవం ఇది.

వీ

యెమెన్‌లో సౌదీ మారణ హోమం

- ఎ. నర్సింహారెడ్డి

అమెరికా, బ్రిటన్‌ల సహాయ సహకారాలతో సౌదీ అరేబియా యెమెన్‌లో చేస్తున్న దాడులు అమాయక పౌరులను హతమార్చే జాతి హననాన్ని తలపిస్తున్నాయి. మూడు సంవత్సరాలుగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇతర అరబ్బు దేశాలు యెమెన్‌లో హైతీ తిరుగుబాటుదారులపై అమానుష దాడులకు పాల్పడుతున్నాయి. పది వేలకు మించి యెమెన్ పౌరులు మరణించారు. ఇందులో అనేక మంది స్త్రీలు, పిల్లలు ఉన్నారు. పాశ్చాత్య మీడియా ఈ నరహత్యలను కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తోంది. అమెరికా, బ్రిటన్లు సమకూర్చిన ఫైటర్ విమానాలు, ఇతర ఆయుధాలు, ఇంటలిజన్స్ సహకారం లేనిదే సౌదీ సైన్యానికి ఈ స్థాయిలో దాడులు సాధ్యమయ్యేవి కావు. బ్రిటన్, అమెరికా మిలిటరీ నిపుణులు సౌదీ వార్ రూంలో కూర్చుని యెమెన్‌పై దాడులను పర్యవేక్షిస్తున్నారు. యెమెన్‌లో జరుగుతున్నవి యుద్ధనేరాలని చెప్పక తప్పదు. అమెరికా, బ్రిటన్ల దుర్మార్గపు వైఖరి అందరి ముందు బట్టబయలైంది. సౌదీ దాడుల వల్ల యెమెన్‌లో పెద్ద సంఖ్యలో సాధారణ ప్రజలు మరణించారని ఐక్యరాజ్య సమితి నివేదిక తెలిపింది. యెమెన్‌లోని ఓడరేవులను, గగనతలాన్ని దిగ్బంధించడం ద్వారా సౌదీ మిత్రపక్షాలు అంతర్జాతీయ మానవీయ సూత్రాలను ఉల్లంఘించాయని కూడా ఐక్యరాజ్య సమితి విమర్శించింది. నిజానికి యెమెన్ యుద్ధం ఇరానీ షియాలకు, సౌదీ సున్నీలకు మధ్య సాగుతున్న పరోక్ష యుద్ధం. యెమెన్‌లో హైతీ తిరుగుబాటుదారులకు ఇరాన్ సహాయం, ఆయుధాలు లభిస్తున్నాయి. హైతీలను కట్టడి చేయడంలో అరబ్బు దళాలు విఫలమైన తర్వాత సౌదీ అరేబియా కొత్త సైనిక నాయకత్వాన్ని తీసుకువచ్చింది. పాకిస్తాన్ రిటైర్డ్ ఆర్మీ చీఫ్ రాహిల్ షరీఫ్ సేవలను 2016 నుంచి పొందడం ప్రారంభించింది. ఆ తర్వాతి నుంచి సౌదీ దాడుల తీవ్రత పెరిగింది. యుద్ధనేరాల ట్రిబ్యునల్ ఏర్పడితే రాహిల్ షరీఫ్‌పై కూడా కేసు తప్పదు.

సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఇరాన్‌ను కట్టడి చేయడానికి ఇజ్రాయిల్‌తో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. డోనాల్డ్ ట్రంప్ అల్లుడు, సలహాదారు జెరెడ్ కుష్నర్ సౌదీ యువరాజుకు సన్నిహిత మిత్రుడు. ట్రంప్‌కు కూడా వ్యక్తిగతంగా ఇరాన్ పట్ల ద్వేషం ఉంది.

ఈ కారణాలన్నీ ఇప్పుడు పశ్చిమాసియాలో పరిస్థితిని మరింత చిక్కుముడిగా మార్చేశాయి. సౌదీ పాలకులకు షియాల పట్ల ఎంత వ్యతిరేకత ఉందంటే ఈసారి హజ్‌కు ఇరాన్ యాత్రికులకు అనుమతి లభించలేదు. యెమెన్‌లో యుద్ధనేరాలను చూస్తే సౌదీ యువరాజు ఆలోచనలు ఎంత ప్రమాదకరంగా ఉన్నాయో అర్థమవుతుంది.

సౌదీ, ఎమిరేట్స్ దేశాలకు ఆయుధాలు అమ్మరాదన్న ఒత్తిడి ఇప్పుడు అమెరికా, బ్రిటన్లపై పెరుగుతోంది. అయినా ఈ దేశాలు ఒప్పుకోవడం లేదు. ఆయుధాల అమ్మకం ద్వారా లభించే ఆదాయాన్ని వదులుకోడానికి అవి సిద్ధంగా లేవు. యెమెన్ హననంలో యుద్ధ నేరస్తులకు శిక్షలు పడే అవకాశం కన్పించడం లేదు.

ముస్లిం తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందన్న సాకుతో ఇరాన్ ప్రాబల్యాన్ని దెబ్బతీయడమే సౌదీ, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సామ్రాజ్యవాద దేశాల లక్ష్యం. నిజానికి అల్‌ఖైదాను సృష్టించింది అమెరికానే. నిధులు సమకూర్చింది సౌదీ అరేబియానేనన్నది అందరికి తెలిసిందే. సౌదీ, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్ వంటి అరబ్బు దేశాలు, వారికి సహకరిస్తున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర పాశ్చాత్య దేశాలు పాల్పడుతున్న యుద్ధనేరాలకు ట్రిబ్యునల్ ముందు విచారణ జరగకపోతే కేవలం నోటిమాటలుగా వ్యక్తం చేసే విచారాలు, సానుభూతులకు అర్థం లేదు. సామ్రాజ్యవాద ప్రోత్సహంతో చేస్తున్న యుద్ధాలను, యుద్ధ నేరస్తులను శిక్షించాలని అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తేవాలి.

వీ




పెట్రోల్ ధరలు తగ్గించడం ఎంత సులభమో తెలుసా?

ఇదిగో, శీర్షాసనం వేయండి,


పెట్రోల్ లీటర్ 06 రూపాయలే!



❖ **భూమి పుట్టిన రోజు** - కవితా సంపుటి - ఆకెళ్ల రవిప్రకాశ్ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి ప్రచురణ - 104 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: ఎ.ఎస్.పి.ఎస్. రవిప్రకాశ్, ప్లాట్ నెం. 37, 38, శ్రీకృష్ణ స్ట్రీట్, శాంతినగర్ ఎక్స్‌టెన్షన్, లాస్‌పేట్, పాండిచ్చేరి - 605008



❖ **అర్ధనారి** - పెరుమాళ్ మురుగన్ - అనువాదం ఓల్గా - ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ - 168 పేజీలు, 1/8 డెమీ, రు. 100




❖ **విశాల వేదికలు - వినూత్న ఉద్యమాలు** - మార్తా హర్నేకర్ - అనువాదం కె. సత్యరంజన్ - ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ-48 పేజీలు, 1/8 డెమీ, రు. 30




❖ **స్వేచ్ఛకు సంకెళ్లు** - వ్యాస సంకలనం - ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ-104 పేజీలు, 1/8 డెమీ, రు.70

పై మూడు ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, ఇ. నెం. 27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533,



❖ **సింగరాజు లింగమూర్తి రచనలు** - కథలు మొదటి సంపుటం - నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ - 243 పేజీలు, 1/8 డెమీ, రు. 170,



❖ **గుండె జబ్బు** - కారణాలు-నివారణలు - డా. బండారు రాధాకృష్ణమూర్తి, డా. బండారు సులోచన - నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ-127 పేజీలు, 1/8 డెమీ, రు. 90

పై రెండు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, జి.ఎస్.ఐ పోస్ట్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్ - 500068, ఫోన్ : 24224453/54,



❖ **అడవి ద్వీపాలు** - కవిత్వం - తోకల రాజేశం - పాలపిట్ట బుక్స్ ప్రచురణ - 128 పేజీలు, 1/8 డెమీ, రు. 80



❖ **మోహధూపం** - కవిత్వం - రఘు - పాలపిట్ట బుక్స్ ప్రచురణ - 84 పేజీలు, 1/8 డెమీ, రు. 100

పై రెండు ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట, హైదరాబాద్ - 500036, ఫోన్ : 040-27678430,



❖ **కళలు - సాహిత్యంపై మార్క్స్, ఎంగెల్స్‌ల భావనలు** - కారల్‌మార్క్స్ ద్విశత జయంతి సందర్భంగా - అనువాదం: కొత్తపల్లి రవిబాబు - జనసాహితి ప్రచురణ - 24 పేజీలు, 1/8 డెమీ, రు. 5



❖ **అక్రమ సంతానం** - శరణకుమార్ లింబాళె - అనువాదం: రంగనాథ రామచంద్రరావు - జనసాహితి ప్రచురణ - 128 పేజీలు, 1/8 డెమీ, రు. 60

పై రెండు ప్రతులకు: బి. అరుణ, జనసాహితి, ఇ.నెం.30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్, దుర్గాగ్రహారం, విజయవాడ - 520002



❖ **దిగులు వెన్నెల** - సినారెకు కవితా నివాళి - డా. రూప్‌కుమార్ డబ్బీకార్, డా. ఏనుగు నరసింహారెడ్డి - హైద్రాబాద్ కవుల వేదిక ప్రచురణ - 96 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: మందాల స్వామి: 9182365250, పరమాత్మ :9848552512



❖ **ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాగిఉన్న నిజాలు** - పౌరహక్కుల సంఘం (సిఎల్‌సి) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ - 62 పేజీలు, 1/4 క్రౌన్ డెమీ, రు. 100, ప్రతులకు: ఇ. నెం. 8-43/8/యు/17/ఇ, రోడ్ నెం. 3, లేన్ 8, రాజశేఖర కాలనీ, బాలాజీ హిల్స్, ఉప్పల్, హైదరాబాద్ - 500039, ఫోన్ : 9441181271,




❖ **నీళ్లు-నిప్పు : 1927లో రెండు మహా విస్ఫోటాలు** - రచన : 'విజయవిహారం' రమణమూర్తి - జైభారత్ పబ్లికేషన్స్ - 28 పేజీలు, 1/8 డెమీ, రు. 10,



❖ **పులి అడుగుల జాడలు** - (షహీద్ ఉద్ధమ్ సింగ్ అలియాస్ రామ్ మహమ్మద్ సింగ్ అజాద్ జీవిత విశేషాలు - రచన : 'విజయవిహారం' రమణమూర్తి - జైభారత్ పబ్లికేషన్స్ - 196 పేజీలు, 1/8 డెమీ, రు. 125



❖ **'సుల్తానా' కథ పైన 'విజయవిహారం'లో సంచలనం రేపిన 2 వ్యాసాలు** - రచన : 'విజయవిహారం' రమణమూర్తి - జైభారత్ పబ్లికేషన్స్ - 70 పేజీలు, 1/4 క్రౌన్, రు. 45



❖ **శ్రీ నారాయణ గురు** - అద్వైత రుషి, కుల నిర్మూలనా విప్లవ ప్రవక్త - రచన : 'విజయవిహారం' రమణమూర్తి - జైభారత్ పబ్లికేషన్స్ - 198 పేజీలు, 1/4 క్రౌన్, రు. 170

పై నాలుగు ప్రతులకు: జైభారత్ పబ్లికేషన్స్, ఇ.నెం. 3-8-347, మన్సూరాబాద్, చంద్రపురి కాలనీ, ఎల్.బి. నగర్, హైదరాబాద్-500074, ఫోన్: 9848019076,

కులోన్మాద హత్యలకు ముగింపు ఎప్పుడు?

ఉత్తర భారతానికే పరిమితమైన కుల ఉన్మాద హత్యలు ఇప్పుడు దక్షిణ భారతానికి వ్యాపించడం వెనుక బిజెపి అవలంబిస్తున్న మనువాద, భూస్వామ్య, పెత్తందారీ విధానాలే కారణమని, వీటిని ప్రజలు చైతన్యంతో ఎదుర్కోవాలని అంటున్నారు డా. లక్ష్మణ్ గడ్డం

గతంలో ఒక ఎన్‌కౌంటర్ హత్య గురించి రాస్తున్న సందర్భంలో రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట మరో ఎన్‌కౌంటర్ సమాచారం వెలువడేది. పెన్ను కదిలేదు కాదు. సరిగ్గా ఇప్పుడదే పరిస్థితి.

సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో జరిగిన ప్రణయ్ హత్యోదంతం రాయాలని మొదలు పెట్టగానే హైదరాబద్‌లో అదే తరహా హత్య సమాచారం ఎలాక్ట్రానిక్ మీడియా మోసుకొచ్చింది.

ఎర్రగడ్డలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన సందీప్ బోరబండ్‌లోని రాజ్‌నగర్‌కు చెందిన మాధవి ప్రేమించుకున్నారు. సెప్టెంబర్ 12న ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. మాధవి విశ్వ బ్రాహ్మణ కులానికి చెందినది కాగా, సందీప్ మాల సామాజిక వర్గానికి చెందినవాడు. మాధవి తల్లి, సోదరుడు ఆమోదించినా తండ్రి మనోహరాచారి వ్యతిరేకించాడు. పగ పెంచుకున్నాడు. పరువు పోయిందని రగిలిపోయాడు. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకుంటుందా! అంతం చేయాలనుకున్నాడు. మారుతీరావు లాగ మారాలనుకున్నాడు. తానే స్వయంగా నరికేయాలని పథకం వేసుకున్నాడు.

మాధవికి తండ్రి స్వభావం తెలుసు కనుక పెళ్లైన రోజే భర్తతో కలిసి సంజీవరెడ్డి నగర్ పోలీసులకు మా నాన్న నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరింది. బడా రాజకీయ నాయకులకు సెల్యూట్ కొట్టి ఈగ వాలనీయకుండా రక్షణ కల్పించే పోలీసులు పేద వర్గాలను పెడచెవిన పెట్టారు. కేవలం కౌన్సిలింగ్ ఇచ్చి గొప్ప ఘణకార్యం చేశామని చేతులు దులుపుకున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారికి ఆర్థిక సాయం కన్నా సరైన రక్షణ కల్పిస్తే ఈ హత్యలు ఆగిపోతాయి.

సెప్టెంబర్ 16న మనోహరాచారి సందీప్ ఇంటికి వెళ్లాడు. ఆ మట్టి మనుషులను, మట్టి ఇళ్లను చూసి తీవ్రంగా అసహ్యించుకున్నాడు. వీళ్లు నాకు వియ్యంకులా? ఇక లాభం లేదు, అంతం చేయాల్సిందేనని గట్టిగా నిర్ధారించుకుని 'బిడ్డా నిన్ను చూడాలని ఉందిరా! అయిందేదో అయిపోయింది, మీకు కొత్త బట్టలు పెడతాను ఎర్రగడ్డలోని గోకుల్ థియేటర్ వద్ద ఉన్న హ్యుండాయ్ షోరూం వద్దకు రమ్మని' సెప్టెంబర్ 19న ఫోన్ చేసి చెప్పాడు. కాళ్ల పారాని కూడా ఆరకముందే చంపాలనే పథకం వేశాడు.

మా నాన్న మారాడని నమ్మిన మాధవి భర్త సందీప్‌ను తీసుకుని వాహనంపై అక్కడికి సాయంత్రం మూడున్నర గంటలకు చేరుకుంది. వాహనం పార్కు చేసి దానిమీదే ఇద్దరు కూర్చుని ఉన్నారు. వెనుక నుంచి బైకు పైన వచ్చిన మనోహరాచారి వాహనాన్ని వీరి వెనుక పక్కనే పార్కు చేశాడు. వాహనం దిగి హెల్మెట్ బండికి తగిలించి తన భుజానికున్న బ్యాగులోంచి కొబ్బరి బోండాలు నరికే కత్తిని బయటికి తీసి చేతబూనాడు. ఇదంతా వారి వెనుక పక్కన జరుగుతుంది కనుక వారు గమనించలేదు.

కత్తి చేతబూనిన మనోహరాచారి రెండడుగులు ముందుకు వేసి వెనుక సీట్లో కూర్చున్న కూతురును వదిలి ముందు సీట్లో కూర్చున్న సందీప్ మెడపై ఒక్క వేటు వేశాడు. వెంటనే తేరుకున్న మాధవి తండ్రిపై కలియబడింది. ఎత్తిన కత్తిని చూసి గాని, భర్తను నరికిన విధానం చూసి గాని భయపడలేదు. వీరోచితంగా తండ్రి మీదకు దాడికి దిగి కింద పడేసింది. దీంతో మరింత రెచ్చిపోయిన మనోహరాచారి తిరిగి లేచి కత్తి ఎత్తి మాధవిని ఒక్క వేటు వేశాడు. మాధవి దవడలో లోతైన గాయమయ్యి కింద పడిపోయింది. అయినా మళ్లీ తిరిగి లేచి తిరగబడింది. మనోహరాచారి మరింత రెచ్చిపోయి మాధవి రెక్క నరికేశాడు. తెగిపడిన చేయి చర్మంతో వేలాడుతుంది. పులి చేతికి చిక్కిన లేడిలా ఉంది పరిస్థితి.

ఈలోగా సందీప్ రక్తమోడుతున్న గాయాలతో తప్పించుకున్నాడు. రక్తంమడుగులో మాధవి బోర్లా పడిపోయింది. కొద్ది నిమిషాల్లోనే తేరుకుని లేచి కూర్చున్నది. శక్తులన్నీ కూడగట్టుకుని లేచి ఎదుర్కోవాలనుకున్నది. కాని నిలబడే శక్తి ఒనకూడడం లేదు. జవజీవాలన్నీ కళ్లలోకి తెచ్చుకుని మిగిలిన చేత్తో రక్తం తుడుచుకుంటూ రాక్షస తండ్రి వైపు భీకరంగా చూసింది. భయపడిన తండ్రి పారిపోయాడు.

పట్టపగలు నడి రోడ్డుపైన మనోహరా చారి తన కూతురిని, అల్లుడిని చడామడా నరుకుతున్న దృశ్యాన్ని జనం వీక్షించారే గాని, ఒక్కరు కూడా అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. పైగా ఎవరైనా ముందుకు కదులుతుంటే మనోహరాచారి క్రూర మృగంలాగా కత్తి ఎక్కుపెట్టి బెదిరించాడు. అప్పటికీ ధైర్యం చేసి ఓ యువకుడు అమాంతం ఎగిరి రెండు కాళ్లతో మనోహరాచారిని వెనక నుంచి వీపులో తన్నాడు. బలంగా తగలక పోవడంతో మనిషి కింద పడలేదు. ఈ అజ్ఞాత యువకున్ని అభినందించక తప్పదు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఇతను చూపిన ధైర్యం అందరికీ ఆదర్శం కావాలి.

మనోహరాచారి మరింత ముందుకు కదిలాడు. పని అయిపోయిందనుకున్న తర్వాత అక్కడి నుండి పారిపోయాడు. అయితే దాడి జరుగుతున్నంతసేపు వాహనాలు, బస్సులు కదిలిపోతున్నాయి. మనుషులు కదులుతున్నారు. ఏ ఒక్కరైనా బైకుతో గాని, కారుతో గాని గట్టిగా ఢీకొట్టితే మనిషి పడిపోయేవాడు. నరకడం ఆగిపోయేది. ఎవ్వరూ ఆ పని చేయకపోవడం దురదృష్టకరం. మాధవి రక్తం దారలై

కారిపోతుండగా దాదాపు పది నిమిషాలు కూర్చునే ఉంది. ఒక్కరు కూడా తమ వాహనంపై ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయలేదు.

కొంతమంది యువకులు ముందుకు వచ్చి వాహనాలను ఆపినా ఆపకుండా వెళ్లిపోయారు. మానవత్వం మంటగలిసింది. చివరికి ఓ ఆటోడ్రైవర్‌ను గట్టిగా పట్టుకుని అతడి ఆటోలో హాస్పిటల్‌కు తరలించారు. సందీప్‌కు ప్రమాదకర పరిస్థితి తప్పిపోయినా మాధవి మాత్రం ఇది రాస్తున్నప్పుడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. మిర్యాలగూడ ఘటన రాయాలనుకుంటే ఎర్రగడ్డ ఘటన ముందుకొచ్చినట్టుగానే ముగించక ముందే ఇదే తరహాకు చెందిన సంతోష్‌నగర్ ఘటన మీడియా మళ్లీ ముందుకు తెచ్చింది.

నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ముత్తయ్య, సుజాతలు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరి కుమారుడు శ్రీకాంత్ శణ్ముకచారి కూతురు శ్రీహర్షలు ప్రేమించి ఆర్య సమాజ్‌లో 2015 డిసెంబర్‌లో కులాంతర వివాహం చేసుకున్నారు. వీరిద్దరు పాఠశాల దశ నుంచి క్లాస్‌మెట్స్. శ్రీకాంత్ ఇంట్లోనే కాపురం పెట్టారు. మూడు నెలల కింద శ్రీహర్ష గర్భం దాల్చింది. అయితే శ్రీహర్ష తండ్రి శ్రీకాంత్‌ను బెదిరించి ఆమెను పుట్టింటికి తీసుకెళ్లి అబార్షన్ చేయించాడు.

శణ్ముకచారి కానిస్టేబుల్‌గా పనిచేసిన పలుకుబడి, ప్రస్తుతం రియల్ ఎస్టేట్‌గా మారిన పలుకుబడితో శ్రీకాంత్ పైన, అతని కుటుంబ సభ్యుల పైన కేసులు పెట్టించి జైలుకు పంపించాడు. శణ్ముకచారి పెట్టే హింసలు భరించలేక, ఎప్పటికైనా అతని వల్ల ప్రాణహాని ఉందని కలత చెందిన శ్రీకాంత్ సెప్టెంబర్ 20న సంతోష్‌నగర్ చౌరస్తాలో పెట్రోల్ సోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేవలం కులం తక్కువనే నెపంతో శ్రీకాంత్‌ను మానసిక వేదింపులకు గురిచేసి ఆత్మహత్యకు పురికొల్పిన శణ్ముకచారిని కఠినంగా శిక్షించాలి. పరువు హత్య నేరం, భ్రూణ హత్యా కేసులు నమోదు చేసి శిక్షించాల్సి ఉంది.

రాష్ట్రంలో కులోన్మాద హత్యలకు భయంకర రూపంలో తెరలేపింది మిర్యాలగూడలో మారుతీరావు. కోమటి కులానికి చెందిన మారుతీరావు చిరు కిరోసిన్ వ్యాపారిగా జీవితం మొదలు పెట్టాడు. పూట గడవడమే కష్టంగా జీవితాన్ని ఆరంభించి కోట్లకు పైగా ఆస్తులను పోగేశాడు. కొద్దికాలంలోనే కోట్లకు పడగలెత్తే స్థాయికి ఎదిగే అక్రమదారులున్న దేశం మనది. కావాల్సిందల్లా విలువలు పక్కకు పెట్టి అనైతిక మార్గాలను అనుసరించడం.

ఇప్పుడు దేశంలో పరిశోధనలు జరగాల్సింది అనతి కాలంలో ఐశ్వర్యవంతులైన వారు అనుసరిస్తున్న వక్రమార్గాల పైన. మారుతీరావు భూ దందాలు, ఆస్తుల పైన, అక్రమ వ్యాపారాల పైన కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరుపుతామని ఎస్‌పి రంగనాథ్ ప్రకటించారు. కాని కలెక్టర్ ఇప్పటివరకు ఆ మేరకు ప్రకటన వెలువరించలేదు. మారుతీరావు ఆస్తులను జప్తుచేసుకుని బాధితులకు పంచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అక్రమ సంపద సంపాదించుకున్న సంపన్నులందరు దాన్ని కాపాడుకోవడానికి రాజకీయ రంగప్రవేశం చేస్తారు. మారుతీరావు కూడా అదే పని చేశాడు. చిరువ్యాపారం మొదలు పెట్టి భూకబ్జాల వరకు ఎదిగిన తర్వాత రాజకీయ రంగం పైన కూడా పూర్తి నమ్మకం కుదరదు. అందుకని ప్రైవేట్ సైన్యం, హంతక ముఠాల, మాఫియా గ్యాంగుల సంబంధాలుండాలి గనుక నయీం హంతక ముఠాలతో, ఇతర మాఫియా గ్యాంగుతో మారుతీరావు సంబంధాలు కొనసాగించాడు. తన నేరపూరిత వ్యవహారాలకు కావాల్సిన చీకటి ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అధికార పక్షం శాసన సభ్యులు సైతం ఊడిగం చేసే తొత్తులుగా మార్చుకున్నాడు.

తనొక అగ్ర కులస్థుడననే అహం, భావం, భూస్వామ్య భావజాలం, అణచివేత తత్వం, సామాజిక అంతరాల హోదా, రాజకీయ అండదండలు మారుతీరావు మిర్యాలగూడలో తిరుగులేని మహారాజుననుకున్నాడు. సామాజిక చట్రంలోని కింది వర్గాల ప్రజలు, అణగారిన కులాల జనాలు ఎందుకూ పనికిరాని పురుగుల్లా కనబడ్డారు.

అంతా అందంగా, ఆనందంగా ఉందనుకున్న మారుతీరావుకు సైతం చుక్కెదురైంది. కుల మదం మస్తిష్కం నిండా ఎక్కిన మారుతీరావు ఏకైక కూతురు ఆ పురుగుల్లోని ఓ పురుగును ప్రేమించింది. ఈ పరిణామం తెలిసిన మారుతీరావుకు మిన్ను విరిగి మీద పడ్డంత పనైంది. తాను నిల్చున్న భూమి బద్దలైపోతున్నట్లుగా అనిపించింది. ఏమిటీ విపరీత పరిణామం అనుకున్నాడు. నిప్పుల్లో పడ్డట్టు చిటపటలాడాడు.

మిర్యాలగూడ తన సామ్రాజ్యంలోని జనమంతా తన చెప్పు చేతల్లో ఉంటుంది. కనుక నీవు కూడా నా మాట తూచా తప్పకుండా వినాలన్నాడు తన కూతురితో.ఆ పురుగును మర్చిపో అన్నాడు. ఏ మాట అయినా వింటాను కాని ఈ ఒక్క మాట వినను డాడీ అని వినమ్రంగా చెప్పింది కూతురు. నన్ను ప్రేమించినట్లే నా ప్రేమను ప్రేమించమన్నది. అగ్రహోదగ్రుడైన నయా శ్రీమంతుడు మారుతీరావు నీవు అపురూపంగా ప్రేమించిన ఆ పురుగుపైన విషం చిమ్మి చంపుతానన్నాడు.

తండ్రీ కూతుళ్ల అన్యోన్యమైన బంధం కళ్లెదుటే తెగిపోయిందని భావించింది. ఇంతటి విషనాగు కడుపులో పుట్టినందుకు విచారపడింది. ఇంతటి సంకుచిత భావాల తండ్రి, కుటుంబం, కట్టుబాట్ల బందుర జీవితం, అణచివేత, హింసకు పునాదిగా నిలిచిన అగ్రకుల హోదా, అక్రమంగా ప్రజల పొట్టగొట్టి సమకూర్చుకున్న కోట్ల సంపద తృణ ప్రాయంగా వదులుకోవాలని నిర్ణయించుకుని మారుతీరావు గడప దాటింది. ఒక్కసారిగా గుండెనిండా స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంది.

వైశ్య కులానికి చెందిన మారుతీరావు కూతురు అమృత వర్షిణి చట్టం దృష్టిలో మేజర్. తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తనే తీసుకునే హక్కు కలిగి ఉంది. భారత రాజ్యాంగం నిర్ణీత వయసున్న యువతీ యువకులు తమకు నచ్చిన వారిని వివాహమాడే స్వేచ్ఛను కల్పించింది. సామాజిక కట్టుబాట్లను, మూఢ విశ్వాసాలను, నిర్హేతుక సాంప్రదాయ ఆచారాలను తొలగించి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే బాధ్యతను ప్రభుత్వాల పైన పెట్టింది. భారత ప్రభుత్వం కులరహిత సామాజాన్ని క్రమంగా నెలకొల్పాలి. పుట్టుకను బట్టి ఎవరిపైనా వివక్ష చూపరాదని చెబుతుంది. ఈ బాధ్యత ననుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి.

కట్టుబాట్ల సంకెళ్ల నుంచి బయటికి వచ్చిన అమృత వర్షిణికి రాజ్యాంగం కనబడింది. చట్టాలు కనబడ్డాయి. ప్రజాస్వామ్య

యంత్రాంగం, స్వేచ్ఛాయుత సమాజం, ప్రాణమిచ్చి ప్రాణం కాపాడే దళిత సామాజం కనబడింది. తను ప్రాణప్రదంగా ప్రేమించిన మాల సామాజిక వర్గానికి చెందిన పెరుమాళ్ల ప్రణయ్‌ను చేరుకున్నది. ఎనలేని డబ్బు, విలాసవంతమైన జీవితం, సామాజిక హోదా చుట్టూ తిరుగుతున్నా నేటి యువతకు భిన్నంగా అమృత వర్షిణి మట్టి మనుషుల్లో కలిసిపోయింది.

2018 జనవరి 30న అమృత, ప్రణయ్‌లు హైదరాబాద్ చేరుకుని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. ఆకాశమంత పందిరి, కళ్లుచెదిరే అలంకరణ, అట్టహాసంగా, గొప్ప గొప్ప రాజకీయ నాయకులతో అహంభావ పూరిత కరచలనాలు వీటిని ఏవీ ఆశించలేదు. తండ్రిని ఆయనతో వచ్చే వాటన్నింటినీ తృణీకరించింది. అనంతమైన హైదరాబాద్‌లో ఓ మూలన కాపురం పెట్టారు.

కాని పగబట్టిన నాన్న తమ కోసం జల్లెడ పడుతున్నాడని తెలుసుకుంది. ఈ జనారణ్యంలో రక్షణ దొరకదని గ్రహించారు. తిరిగి మిర్యాలగూడలోని ప్రణయ్ ఇంటికి చేరుకున్నారు. మారుతీరావు వల్ల తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మారుతీరావు తన చేతులకు రక్తం అంటకుండా హంతక మూఠాలను ఏర్పాటు చేసుకుంటాడని, వాళ్లను గుర్తించడానికి ఇంటి చుట్టూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. బయటికెళ్లడానికి కారు ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులు రక్షణ కల్పిస్తారని ఆశించారు. కాని మన పోలీసులు రాజకీయ బాసులకు గులాంగిరి చేయడంలోనే తమ వృత్తి నైపుణ్యాలను పెంచుకున్నారు కదా! దళిత జంట రక్షణ అనేది తమ బాధ్యతగా భావించనే లేదు. అంతా అయిపోయాక మాత్రం విచారణ వ్యక్తపరిచారు. పోలీసులు రక్షణ కల్పిస్తే ప్రణయ్ బతికేవాడు.

మారుతీరావు తన బిడ్డను తీసుకెళ్లడానికి ప్రణయ్ తండ్రి బాలస్వామికి మూడు కోట్లు ఇస్తానన్నాడు. అమృతను కడుపులో పెట్టుకుంటాం కాని పంపించమన్నాడు. దీంతో స్థానిక శాసనసభ్యుడు వేముల వీరేశాన్ని రంగంలోకి దింపాడు. వీరేశం ప్రణయ్‌కి ఫోన్ చేసి గొప్పోళ్లతో పెట్టుకోకు, ప్రాణం మీదకు తెచ్చుకోకు, అమృతను తిరిగి పంపించేయ్ అని చెప్పాడు. దళితుల పక్షాన నిలవాల్సిన దళిత నాయకులు పెత్తందార్లకు 'పప్పెట్స్'గా మారుతున్నారు.

ప్రణయ్‌ను చంపడానికి మారుతీరావు ఇంకో మార్గంలో హంతక ముఠాలతో, ఏకంగా ఉగ్రవాద మూలాలతో సంబంధమున్న వారితో ఒప్పందం చేసుకున్నాడు. కోట్లు కుమ్మరించాడు. ప్రణయ్ తక్కువ కులం వాడన్న ఒకే ఒక కారణం చేత చంపాలనుకున్నాడు. విషయం తెల్సిన ప్రణయ్ తల్లిదండ్రులు అమృత, ప్రణయ్‌ను కెనడా పంపాలనుకున్నారు. ఇంతలో అమృత గర్భం దాల్చడంతో విరమించుకున్నారు.

గర్భం దాల్చిన విషయం తెలుసుకున్న మారుతీరావు మరింత కోపంతో ఊగిపోయాడు. స్థానిక హంతక ముఠాతో కలిసి బీహార్ నుంచి ప్రొఫెషనల్ కిల్లర్ సుభాష్ శర్మను రప్పించాడు. ఆగస్టు 22న సుభాష్ శర్మ నేరుగా ప్రణయ్ ఇంటికి వచ్చి కారు అద్దెకిస్తావా అని బాలస్వామిని హిందీలో అడిగాడు. ప్రణయ్ బయటికి వస్తే గుమ్మంలోనే చంపాలనుకున్నాడు. ఇలా నాలుగు ప్రయత్నాలు చేసి విఫలమయ్యాడు. దీంతో మారుతీరావు కూతురు అమృతతో ప్రేమతో మాట్లాడే వ్యూహాన్ని అనుసరించాడు. సంభాషణలో సెప్టెంబర్ 14న జ్యోతి హాస్పిటల్‌కు మధ్యాహ్నం 12 గంటలకు వెళుతున్నానని తల్లితో చెప్పింది. వెంటనే మారుతీరావు హంతక ముఠాను హాస్పిటల్‌లోకి దించాడు. హాస్పిటల్‌లో చెకప్ చేయించుకుని ప్రణయ్, ప్రణయ్ తల్లి ప్రేమలత, అమృత తిరిగి వెళుతుండగా హాస్పిటల్‌లోనే మాటుగాసిన సుభాష్ శర్మ వెనుక నుంచి ఒక్కసారిగా మెడ నరికేశాడు. కుప్పకూలిన ప్రణయ్‌పై మరొక్క వేటు మళ్లీ మెడమీద వేయగా ప్రణయ్ ప్రాణాలు విడిచాడు.

సమాజంలో కులం రక్త చరిత్ర సృష్టిస్తూనే ఉంది. కుల హింస వివిధ రూపాల్లో కొనసాగుతుంది. కాళ్లకింద చెప్పులాగా బతికినంత కాలం అంతా సల్లంగానే ఉంటుంది. విద్యా వంతులు, చైతన్య వంతులు అవుతున్న కాలం పొడుగునా రక్తం చిందించాల్సే వస్తుంది.

బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాజ్యాంగం ఛాయలు మసకబారుతున్నాయి. మనువాదం ముంచుకొస్తుంది. సమాజాన్ని కుల ప్రాతిపదికన మరింత విడదీస్తుంది. ఉత్తర భారతానికి పరిమితమైన ఈ హత్యలు దక్షిణ భారతానికి పాకడం ఆందోళన కలిగిస్తుంది. కన్నబిడ్డల ఆనందాన్ని మింగేయడం అనాగరికం, అమానుషం. అందుకే సుప్రీంకోర్టు 'హేయంగా, దారుణంగా, ఘోరంగా, అమానుషంగా చేసే హత్యల వెనక రాక్షసత్వం, భూస్వామ్య ఆధిపత్య మనస్తత్వం తప్ప ఇంకోటి లేదు. హత్య చేయడంలో పరువెక్కడుంది? ఇలాంటి చర్యలకు ఒడిగట్టే వాళ్లు కఠిన శిక్షకు అర్హులు' అని తీర్పునిచ్చింది.

ఈ ఘటనలు తెలంగాణలో కరుడుగట్టిన పెత్తందారీ, భూస్వామ్య, అహంకారాలు నిగూఢంగా ఉన్నాయని గుర్తు చేస్తున్నాయి. దేశంలో బలమైన ప్రజా పోరాటాల ఆవశ్యకతను ఆవిష్కరిస్తున్నాయి.

(రచయిత అధ్యక్షుడు, పౌరహక్కుల సంఘం) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

కులాంతర వివాహాలు - అంబేద్కర్ దృక్పథం

కులం పేరు మీద అణచివేత, నిర్బంధాలు, హత్యలు అన్ని కుల్లాల్లోనూ ఈ ఉన్మాదం ఉన్నదనీ, దీని పుట్టుక, పునాది బలహీనమైనదనే అంబేద్కర్ దృక్పథాన్ని గుర్తించి కుల దురహంకారాన్ని రూపుమాపాలనీ అంటున్నారు **డా. కత్తి పద్మారావు**

కమ్యూనిస్టు ఉద్యమానికి కంచుకోటైన నల్గొండ జిల్లా మిర్యాలగూడ లో దళిత యువకుడు ప్రణయ్ ప్రేమించి వైశ్య యువతి అమృతను పెండ్లి చేసుకున్నాడు. ఈ పెండ్లి ఇష్టంలేని కుమార్తె తండ్రి తిరునగర్ మారుతీరావు కోటి రూపాయలు వెచ్చించి హత్య చేయించిన ఘటన సామాజిక తరగతులందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ హత్య ద్వారా కులాంతర వివాహాలు ఆగుతాయి, ప్రేమించే వాళ్ల ఇక ప్రేమించడం మానివేస్తారు, పెండ్లిళ్లు చేసుకోవడం మానేస్తారు అనుకోవడం ఒక చారిత్రక తప్పిదమే అవుతుంది.

కులం అనేది ఒకనాడు పుట్టింది ఒకనాడు మళ్లీ పోతుందని అంబేద్కర్ స్పష్టంగా చెప్పాడు. కులం అనేది కొన్ని మత విశ్వాసాల కారణంగా ఏర్పడిన వ్యవస్థ. ఆ మత విశ్వాసాలకు శాస్త్రాల మద్దతు ఉంది. ఆ శాస్త్రాలు దైవ సమానులైన ఋషులచే ప్రతిపాదించినవనే ప్రతీతి ఉంది. ఈ ఋషులు మానవాతీత శక్తులు కలవారని, మహాజ్ఞానులని, అట్టి వారి ఆదేశాలను ధిక్కరించడం మహా పాపమని, ప్రజలకు ఒక నమ్మకం ఉంది. అందువల్ల-కుల వ్యవస్థను వదులుకొమ్మని ప్రజలను కోరడం వారి ప్రాథమిక మత భావాలకు విరుద్ధంగా వారిని నడుచుకోమనడమే. మొదటి రెండు రకాల సంస్కరణలు సులభమే కావచ్చు. కాని, ఈ తరహా సంస్కరణ – కుల నిర్మూలనా చాలా మహత్తరమైన పని. చాలా వరకు అసాధ్యమైన పని కూడ కావచ్చు. హిందువులు తమ సామాజిక వ్యవస్థను పరమ పవిత్రంగా భావిస్తారు. కులానికి దైవిక ప్రాతిపదికను ఆపాదిస్తారు. అందువల్ల మీరు కులాన్ని నిర్మూలించాలంటే దానికి ఆధారంగా కల్పించబడ్డ దైవికతను, పవిత్రతను ముందు నిర్మూలించవలసి ఉంది. అంటే శాస్త్రాల, వేదాల అధికారాన్ని నిర్మూలించవలసి ఉన్నదన్నమాట. (కుల నిర్మూలన) వర్ణ వ్యవస్థ ఏ రోజు ఏర్పడిందో వర్ణాంతర వివాహాలు అప్పుడే ఏర్పడ్డాయి. ఆ వర్ణాంతర వివాహాలను ఆపలేక పోయారు.

ఏయే వర్ణాలు ఏయే వర్ణాలను చేసుకుంటే కొత్త వర్ణాలు ఎలా ఏర్పడతాయి అనే విషయం మీద ఇలా చెప్పారు. బ్రాహ్మణునకు+క్షత్రియ స్త్రీ యందు పుట్టిన వాడిని మూర్ధాభిషిక్తుడు అందురు. బ్రాహ్మణునకు+వైశ్య స్త్రీ యందు పుట్టిన వాడిని అంబష్ఠుడు అందురు. బ్రాహ్మణునకు+శూద్ర స్త్రీ యందు పుట్టిన వాడిని నిషాదుడు అందురు. క్షత్రియునకు+వైశ్య స్త్రీ యందు పుట్టిన వాడిని మహిష్యుడు అందురు. క్షత్రియునకు+శూద్ర స్త్రీ యందు పుట్టిన వాడిని వుగ్రుడు అందురు. వైశ్య పురుషునకు+శూద్ర స్త్రీ యందు పుట్టిన వాడిని కరుణుడు అందురు. బ్రాహ్మణ స్త్రీ+క్షత్రియుడునకు పుట్టిన వాడిని సూతుడు అందురు. బ్రాహ్మణ స్త్రీ+వైశ్యుడునకు పుట్టిన వాడిని వైదేహకుడు అందురు. బ్రాహ్మణ స్త్రీ+శూద్రుడునకు పుట్టిన వాడిని చండాలుడు అందురు. క్షత్రియ స్త్రీ+వైశ్యుడునకు పుట్టిన వాడిని మాగదుడు అందురు. క్షత్రియ స్త్రీ+శూద్రుడునకు పుట్టిన వాడిని క్షత్త అందురు. వైశ్య స్త్రీ+శూద్రుడునకు పుట్టిన వాడిని అయోగవుడు అందురు. మనువు వర్ణాంతరం చేసుకో గూడదని వర్ణాంతరాన్ని నిషేధించాడు. తరువాత తప్పక వర్ణాంతరాలకు కొత్త పేర్లు సృష్టించాడు.

మానవ పరిణామ శాస్త్రాన్ని కులాన్ని అడ్డుపెట్టి ఎలా ఆపగలరు. కులాంతర వివాహాన్ని డా. బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ బద్ధం చేశారు.

ఇక్కడ అమృత తండ్రి తిరునగరి మారుతీరావు తన కుమార్తెను ప్రేమించి పెండ్లి చేసుకొన్న దళిత యువకుడు ప్రణయ్‌ను క్రూరంగా కిరాయి గూండాలతో హత్య చేయించాడు. ఇది రాజ్యాంగేతరమైన చర్య. సామాజిక మార్పు పై గొడ్డలి వేటు వేసిన చర్య. మరి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఎందుకు స్పందించలేదు. తనకు బృహత్తరంగా చందాలిచ్చే వైశ్యుల ఓట్లు పోతాయనా? రెండు తెలుగు రాష్ట్రాల్లో కులాంతర సంస్కృతి విస్తరించడానికి ఆయా ప్రభుత్వ అధినేతలు ఎందుకు ప్రయత్నం చేయడం లేదు? వారు కులానికి పునాదైన హిందూ వాదాన్ని ఆ మతం వేరులైన వర్ణవ్యవస్థను కాపాడుతున్నారా!

ఇద్దరు తమ పిల్లల్ని ఇతర దేశాల్లో చదివించారు. కాని తీసుకొచ్చి కులం పెళ్లిళ్లు, మేనరికాలు చేశారు. లౌకిక భావనం లేని కులాధిపత్య భావనలో వీళ్లు రాజ్యం పాలిస్తున్నారు. ఒక ప్రక్క విద్యావంతులైన పిల్లలు కులం పట్టింపు లేకుండా ప్రేమించుకొంటున్నారు. తల్లిదండ్రులు కులం ఊబిలోనే కూరుకుపోయారని తెలిసి కులాంతర వివాహాలు చేసుకొంటున్నారు.

ఈ పరిణామాన్ని ఆహ్వానించే చైతన్యాన్ని కమ్యూనిస్టులకు కంచుకోటైన నల్లగొండ జిల్లాలో ఎందుకు లేదు? నక్సలైట్ ఉద్యమానికి పెట్టని కోట అయిన కరీంనగర్ జిల్లాలో కుల నిర్మూలనా చైతన్యం ఎందుకు లేదు? కమ్యూనిస్టులు ఇప్పటికైనా కుల నిర్మూలనను ముఖ్యమైన ఎజెండాగా ఎందుకు స్వీకరించడం లేదు?

కులం మీరెంత పట్టుకు వేలాడినా నిలవదు. దాని పునాది బలహీనమైందని అంబేద్కర్ పరిశోధించి చెప్పారు. అంబేద్కర్ ఈ విషయంగా ఒక కులం ఒక వృత్తి చేయాలనేది చాలా తప్పు అని చెప్పారు. ఆయా వృత్తులను, కులాలను బట్టికాక వారి అభిరుచులను బట్టే చేయాల్సివుంది. హిందూమతం ఆ వృత్తులకు ఆపాదించిన నీచత్వం, న్యూనత కారణంగా వాటి అవలంబకులలో కలిగే నైరాశ్యం, నిస్పృహ

ఈ పరిస్థితికి కారణం. పనిచేసేవాళ్ల మనస్సులు, హృదయాలు ఆయా పనులలో లగ్నం కాకపోయినప్పుడు ఒక సామర్థ్యం ఎక్కడ నుంచి వస్తుంది? అందువల్ల ఒక ఆర్థిక వ్యవస్థగా కుల వ్యవస్థ ఎంతో హానికరమైన సంస్థ అని చెప్పాలి. ఎందుకంటే అది మానవుని సహజ శక్తులను, అభిలాషలను అణచివేసి సంఘ సూత్రాల వెర్రితలలకు లోను చేస్తున్నది కనుక, కుల వ్యవస్థ రక్షణార్థం కొందరు జీవ శాస్త్రాధారమైన ఒక మహా కందకాన్ని నిర్మించారు. వాళ్లు చెప్పేదేమిటంటే –జాతి రక్తం స్వచ్ఛతను కాపాడడం కోసం కుల వ్యవస్థ ఏర్పాటు చేయబడిందని. ఈ వాదం ఎంత హాస్యాస్పదమో ఎత్నాలజిస్టులు (నరసంతతి శాస్త్రజ్ఞులు) చెప్పేదాన్ని గమనిస్తే తెలుస్తుంది.

ప్రపంచంలో ఎక్కడా కూడ స్వచ్ఛమైన జాతికి (రేసుకు) చెందిన మనుష్యులు లేరనీ, ప్రపంచంలో ఏ మూల చూసినా అన్ని జాతులలోనూ సాంకర్యం జరుగుతూనే వచ్చిందనీ ఈ శాస్త్రజ్ఞులు చెప్తుతున్నారు. ముఖ్యంగా ఇండియాలోని ప్రజల విషయంలో ఇది పరమయథార్థం. డి.ఆర్. భండార్కర్ తన 'హిందూ జనాభాలో విదేశీ బీజాలు' వ్యాసంలో అన్నారు. ఇండియాలో విదేశీ రక్త సంమిశ్రమం లేని కులంగాని, వర్గంగాని ఉన్నట్టు లేదు. క్షత్రియులైన యోధవర్గానికి చెందిన రాజపుత్రులలోను, మహారాష్ట్రులలోను మాత్రమే కాక–విదేశీ సంమిశ్రమ సంబంధం ఏమీ లేకుండా ఉన్నామని భ్రమపడుతున్న బ్రాహ్మణులలో కూడ విదేశీ రక్త సాంకర్యం ఉంది. (కుల నిర్మూలన). అంబేద్కర్ ఇంకో మాట కూడా చెప్పారు. ఒకవేళ ఏ వర్ణంవాడు ఆ వృత్తే చెయ్యాలంటే మహాత్మాగాంధీ స్వాతంత్రోద్యమాన్ని నడిపే అవకాశం ఉండేది కాదు అన్నారు.

రాజ్యాంగం విద్యావకాశం అందరికి ఎప్పుడు కల్పించిందో, సమాజంలో తెలియకుండానే ఒక అంతర్గతమైన మార్పు కొనసాగుతుంది. విద్యకు ఉన్న శక్తి సామాన్యమైంది కాదు.

ఇక దళితుల దగ్గరకు వస్తే మెయిన్‌స్ట్రీమ్ సమాజంలోకి వారు విద్యా వాహిక ద్వారా వేగంగా వస్తున్నారు. రూపం, భాష, ఆహార్యం, ప్రవర్తన మారే కొలది ప్రేమకు వారి పుట్టుక అడ్డురావడం లేదనేది ఒక చారిత్రక సత్యం. చార్వాకులు, బౌద్ధులు, జైనులు, మహాత్మాపూలే, అంబేద్కర్, పెరియార్ రామస్వామి ఎందరో ఈ పరిణామానికి దోహద కర్తలయ్యారు. పరిణామం వేగానికి అడ్డుపడుతుంది. హిందువులు ఛాందస వాదులు.

మైనార్టీ మతాలు కూడా కులం ఊబిలోనే కూరుకుపోయి ఉన్నారు. ఒక పక్క సామాజిక వైజ్ఞానిక సాంకేతిక విప్లవాలు అంతరాలను తొలగించే పనిలో ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఓ.బి.సి. కులాలు, దళితులు తమ కుమార్తెలను ప్రేమించి పెండ్లి చేసుకోవడాన్ని అడ్డుకొంటున్నాయి. అక్కడ కుల రాజకీయ నాయకులు కులం పునాదిని గట్టిపర్చాలని చూస్తున్నారు. మరి వారు రాజ్యాధికారం కోసం ఎందుకు పోరాడుతున్నారు. రాజ్యాధికారం వారి కులం వృత్తి కాదు కదా? ఈ వివేచన వారికి లేదు. పెరియార్ రామస్వామి బ్రాహ్మణ రాజ్యాధికారాన్ని నెట్టివేసి బి.సి.లకు తెచ్చిన రాజ్యాధికారం వారికి గుర్తులేదా. అంబేద్కర్ అందుకే కమ్యూనిస్టులకు, సోషలిస్టులకు కులాన్ని నిర్మూలించడమే సరైన ఎజెండా అని చెప్పారు.

ఇండియాలో సాంఘిక వ్యవస్థను సోషలిస్టులు ఎదుర్కొనక తప్పదు. అలా ఎదుర్కొనకుండా విప్లవం సాధ్యం కాదు. ఒకవేళ ఏ పరిస్థితుల వల్లనో అది సాధ్యమైనా వారి ఆశయాలు నెరవేరాలంటే – సదరు సాంఘిక వ్యవస్థతో సోషలిస్టులు కుస్తీ పట్టక తప్పదు. ఇది నా దృష్టిలో నిర్వివాదమైన సత్యం. విప్లవానికి ముందే కుల వ్యవస్థతో సోషలిస్టులు ఢీకొనకపోతే విప్లవం తరువాత అయినా వారు దానితో తలపడడం తప్పదు. మరొక విధంగా చెప్పాలంటే – నీవు ఏ దిక్కుకు తిరిగినా సరే దారికడ్డంగా నిలబడే పెనుభూతం కుల వ్యవస్థ. ఈ భూతాన్ని చంపిపారేస్తే తప్ప నీవు రాజకీయ సంస్కరణ గానీ, ఆర్థిక సంస్కరణ గానీ సాధించలేవు. కులానికి ఏ రకంగా చూసినా ఉనికిలేదు. కొన్ని పార్టీలు కులాన్ని బతికించాలని చూసినా అది నిలవదు.

అంబేద్కర్ ఆలోచనా విధానం చాలా తీవ్రమైంది. అది భారతదేశాన్ని పునర్నిర్మిస్తూ వెళుతుంది. అంబేద్కర్ వాదులు కూడా కులాలను వదిలి పెట్టాలి. కుల నిర్మూలనా వేదికలు నిర్మూలించడమే గాక, కులనిర్మూలనా వాదాచరణలోకి రావాలి. కులం పునాదుల మీద ఒక జాతిని నిర్మించలేం. ఒక నీతిని నిర్మించలేం అనే అంబేద్కర్ సూక్తిని ఆచరణలో పెట్టాలి. ఇప్పుడు అమృత కుల నిర్మూలనా ఉద్యమానికి కేక వేస్తుంది. ఆ కేకలో ఆర్తి ఉంది, ఆవేదన ఉంది, సామాజిక సమత ఉంది. తండ్రినే నేరస్తుడిగా నిలబెట్టి, తండ్రినే ఉరి తీయమన్న సామాజిక నీతి అందరికీ ఆదర్శ ప్రాయం కావల్సి ఉంది. బాధితురాలు ఒంటరికాదు. భారత రాజ్యాంగం, రాజ్యాంగ శక్తులన్నీ ఆమెకు తోడున్నాయి. కులాంతర వివాహితుల గురించిన రక్షణలు బలపడటమేగాక వారి కోసం ప్రత్యేక కోర్టులు పెట్టించ గలిగిన స్థాయికి మనం వెళ్లాల్సి ఉంది.

ప్రేమించే హక్కును కాపాడాలి, పెండ్లి హక్కునూ కాపాడాలి. అందుకని రోడ్ రోమియోల్లాగా యువకులు మారకూడదు. విద్యాజ్ఞానం, వ్యక్తిత్వ నిర్మాణంతోనే ప్రేమను సాధించవలసి ఉంది. ప్రణయ్‌ను భౌతికంగా హత్య చేయగలరేమో కాని ఆయన ప్రేమను, ఆయన ఆచరించిన కులాంతర సంస్కృతిని బలివ్వలేరు. సామాజిక శాస్త్రం ఇందుకు అంగీకరించదు. ప్రేమ, ఆత్మీయత, సామాజిక సమత రాజ్యం కంటే గొప్పవి. అవి కులాల హద్దులనే కాదు దేశాల హద్దులను దాటి ప్రపంచాన్ని ఏకం చేయగలవు. అంబేద్కర్ ఆలోచనలతో ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లడమే ఈనాడు మన కర్తవ్యం..

(రచయిత సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ)

వీ

పాఠకులు ఫిర్యాదులు, సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 6.00 గంటలలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. మిగతా సమయాల్లో ఫోన్ చేస్తే అది ఫ్యాక్స్‌లోకి వెళ్లి మీకు జవాబు రాదు. అప్పుడు మీరు ఫోన్ ఎత్తికూడా మాట్లడడంలేదని అనుకునే అవకాశం ఉంది. ఇది గమనించగలరు. – సం.

మరోక ఎమర్జెన్సీ దిశగా ప్రయాణిస్తున్న భారత్?

ప్రజల, హక్కుల నేతల, మేధావుల, రచయితల వ్యక్తిగత స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ పాలకులు దేశంలో మరోమారు ఎమర్జెన్సీ పరిస్థితులను అమలు చేస్తున్నారని అంటున్నారు మార్కండేయ కట్జూ

1975లో ఇందిరాగాంధీ విధించిన 'ఎమర్జెన్సీ' స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. పౌరుల ప్రాథమిక హక్కులన్నీ రద్దు చేయబడిన, ప్రచార మాధ్యమాలన్నిటి గొంతు నొక్కబడిన, దేశ ప్రజలందరిపై తీవ్ర అణిచివేత అమలయిన కాలమది. ఇప్పుడు కూడా మళ్లీ అవే పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్న నిరుద్యోగం, రైతులు పీకల్లోతు కూరుకుపోయిన సంక్షోభ స్థితి, అంతం లేకుండా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, ఫలితంగా ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు–వంటి వాటి ఫలితంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు వెల్లువెత్తుతున్నాయి, అవి మరింత పెరగక తప్పదు.

ఈ మధ్య ఢిల్లీలో జరిగిన రైతాంగ మహాయాత్ర లాగా, దేశమంతటా పండిస్తున్న పంటకు గిట్టుబాటు ధర కావాలని, పంట రుణమాఫీ అమలు చేయాలని నినదిస్తున్నారు. పెట్రోధరల పెంపుకు వ్యతిరేకంగా వామపక్షాలే కాక ఆర్‌జెడి, ఎన్‌సిపి, డిఎంకె వంటి అన్ని ప్రతిపక్ష పార్టీల మద్దతుతో దేశవ్యాప్త బంద్ నిర్వహించాయి. పెట్రోల్ ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఈ ప్రజాగ్రహ ఆందోళనలు మరింత పెరగనున్నాయి. అప్పుడు మన పాలకులు ఏంచేస్తారు?

మన ముందున్న చరిత్ర చెపుతోంది, ప్రజాందోళన, ప్రజా ఉద్యమాలు విస్తృతం అవుతున్న కాలంలో, పాలకులపై ప్రజాగ్రహాన్ని కట్టడి చేయలేని స్థితిలో సమాజం కల్లోలభరితంగా ఉన్న కాలంలో, వాళ్ల ఉనికే ప్రమాదంలో పడుతుందను కున్నప్పుడల్లా పాలకులు ప్రజలపై అణిచివేతనే ఆయుధంగా ఎంచుకుంటారు. ప్రజల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై నిర్బంధం, ప్రజాస్వామిక హక్కుల అణిచివేత, పౌర సమాచార సాధనాల పై తీవ్ర నిర్బంధం అమలు చేయడాన్నే పాలకులు ఎంచుకుంటారు.

జర్మనీ, ఇటలీలలో కూడా ఇలాగే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిన స్థితిలో విస్తృతంగా ముందుకు వచ్చిన ప్రజా ఉద్యమాలను అణచివేసే క్రమంలో హిట్లర్, ముస్సోలినీల ఫాసిస్ట్ ప్రభుత్వాలు ముందుకు తీసుకురాబడ్డాయి. ప్రజలపై దుర్మార్గమైన అణచివేత అమలైంది. అట్లాగే 1975లో, ఇందిరాగాంధీ ఎన్నికలలో అక్రమాలకు పాల్పడ్డారని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పినప్పుడు, దేశమంతా ఉన్న ప్రజాగ్రహం నుండి తనను తాను కాపాడుకోవడానికి, ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించింది.

ప్రస్తుతం అధికారంలో ఉన్న బి.జె.పి. ప్రభుత్వం కూడా 2014లో ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేస్తూ, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతానని, 'సబ్ కా వికాస్' నినాదంతో ముందుకు వచ్చింది. ఆనాడు మోడీ యువతకు సంవత్సరానికి రెండువేల ఉద్యోగాలు ఇస్తామని, రైతులకు వారి ఉత్పత్తి వ్యయానికి రెండురెట్లు అధికంగా 'కనీస మద్దతు ధర' కల్పిస్తాననే నినాదంతో అధికారంలోకి వచ్చి 4 ఏండ్లు గడిచాయి.

వాస్తవంలో రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం ఇంకా తీవ్రమయ్యాయి. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయి. రూపాయి మారకం విలువ మరింత పతనమైంది. ఎంతో ఉచ్ఛస్వరంలో, ఆడంబరంగా వినిపించిన 'సబ్ కా వికాస్' నినాదం వట్టి ఎండమావి అని, ప్రజలు మరింత బికారులు అయ్యారని వాస్తవాలు నిరూపిస్తున్నాయి. కనుక ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు విస్తృతస్థాయిలో వ్యక్తమవుతున్నాయి. రానున్న కాలంలో అవి మరింత విస్తృతిని, మరింత లోతునూ సంతరించుకునే స్థితి ఉంది.

ప్రజల ఆగ్రహం అనేది పాలకులు అనుమతించగలిగిన స్థాయిని దాటినప్పుడు, ప్రభుత్వాలు తమ మనుగడకు ప్రమాదం ఉందని భావించి నప్పుడు ప్రభుత్వాలు ఏం చేస్తాయి? దానికి ఎక్కువ సంభావ్యత ఉన్న సమాధానం, పాలకులు 'ఎమర్జెన్సీ'ని ఎంచుకుంటారు అన్నదే. అయితే రాజ్యాంగ 44వ సవరణ తర్వాత, ప్రభుత్వాలు దేశంలో ఎమర్జెన్సీ విధించడం పాతరూపంలో సాధ్యం కాదు. గతంలో రాజ్యాంగంలో ఎమర్జెన్సీ విధించగలిగే పరిస్థితుల నిర్వచనంలో ఉన్న ఆర్టికల్ 352 ప్రకారం 'దేశంలో కల్లోల స్థితి ఉండడం' అనే పదాల స్థానంలో 'రాజ్యంపై ఆయుధాలతో కూడిన తిరుగుబాటు'గా సవరణ చేయడం జరిగింది. అట్లాగే, ఎమర్జెన్సీ విధించిన కాలంలో కూడా ఆర్టికల్ 20,21(మనిషి జీవించే హక్కు, స్వేచ్ఛను కలిగి ఉండే హక్కు)లను రద్దు చేయజాలవు. అందువల్ల గతకాలపు పద్ధతుల్లో చట్టబద్ధంగా ఎమర్జెన్సీని విధించడం, ప్రజల ప్రాథమిక హక్కులు రద్దుచేయడం అనేవి ఇప్పుడు సాధ్యంకావు. అయితే ప్రకటించకుండానే ఎమర్జెన్సీని అమలు చేయడం మన పాలకులకు సులభమే.

ఈమధ్య కాలంలో దేశంలోని హక్కుల కార్యకర్తలను, లాయర్లను, రచయితలను, బుద్ధిజీవులను అరెస్ట్ చేయడం ఆ విధంగానే చూడాలి. మన రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ప్రభుత్వాలు ప్రకటించకుండానే, అనేక పద్ధతుల్లో రద్దు చేయగలవు. ఉదాహరణకు పోలీసులు ఒక హక్కుల నేతనో, రచయితనో, లాయర్‌నో తప్పుడు సాక్ష్యాలు సృష్టించి, అతను నక్సలైట్ అనో, 'లష్కరే తోయిబా' లేదా హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన లేదా సంబంధాలు కలిగిన వాడనో చెప్పి వారిని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చెప్పి యు.ఎ.పి.ఎ, 1967 చట్టం కింద నమోదు చేసి, ఏండ్ల తరబడి నిర్బందించవచ్చు, అతని ప్రాథమిక హక్కులను రద్దు చేయవచ్చు. అంతే

హిందుత్వ హింసను, రాజ్యహింసను సమర్థిస్తారా?

కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తరువాత హిందుత్వ, ప్రజావ్యతిరేక దాడులు అధికమయ్యాయనీ, వీటిని అరికట్టడానికి ప్రజలు మరింత సమైక్యంగా పోరాడాలనీ అంటున్నారు **స్వామి అగ్నివేశ్, సందీప్ పాండే**

2018 ఆగస్టు 28న సుధ భరద్వాజ్, గౌతమ్ నవ్లాఖా, వరవరరావు, వెర్నన్ గోంజాల్వెజ్, అరుణ్ ఫెరేరాలపై పెద్ద ఎత్తున పోలీసు చర్య చేపట్టారు. దీనికంటే ముందు ఆచార్య షోమా సేన్, న్యాయవాది సుధీర్ గాడ్లింగ్, సుధీర్ ధావ్లే, మహేష్ రౌత్, రోనా విల్సన్‌లను జూన్ 6న పోలీసులు అరెస్టు చేశారు. దీనికంటే కూడా ముందు డా. బినాయక్ సేన్, సోనీ సోరీ, అజయ్ టి.జి., ఆచార్య జి.ఎన్. సాయిబాబా, ప్రశాంత్ రాహీలను అరెస్టు చేశారు. ఈ కార్యకర్తలందరికీ మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాన్ని కూల్చడానికి పన్నాగం పన్నుతున్నారు కాబట్టి మావోయిస్టులను ప్రమాదకరమైన వాళ్లుగా భావిస్తారు. ఇటీవల అరెస్టు చేసిన అయిదుగురు కూడా ప్రధాన మంత్రి మోడీని చంపడానికి ప్రణాళిక రూపొందించారని ఆరోపించారు. సమాజంలో అంచులకు నెట్టివేయబడ్డ వర్గాల హక్కుల కోసం నిబద్ధతతో పనిచేసే ఈ కార్యకర్తలపై ఇటువంటి అభియోగం చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఒక హత్యకు ప్రణాళిక తయారు చేసేటంత సమయం వీళ్లకి లేదు. పోలీసు చర్యను సమర్థించుకోవడానికి ఈ కల్పిత ఆరోపరణ చేశారు.

హింసను సమర్థిస్తారు కాబట్టి మావోయిస్టులను చట్టవిరుద్ధమైన వాళ్లుగా పరిగణిస్తారు. ప్రజాస్వామ్యంలో ఏ రకమైన హింసనూ సమర్థించలేం. అయితే, ఇక్కడ ఒక ప్రశ్న పుడుతుంది – హింస చెడ్డదైతే మావోయిస్టుల హింసకు లేని చట్టబద్ధత ఇతర హింసలకు ఎలా వస్తుంది?

మితవాద పక్ష చరిత్ర అంతా హింసాత్మక ఘటనలతో నిండి ఉంది. అహింసా సూత్రాన్ని జీవించిన వ్యక్తిని, ప్రపంచవ్యాప్తంగా భారతదేశమంటే గుర్తొచ్చే వ్యక్తిని హిందుత్వ సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి హత్య చేశాడన్న విషయాన్ని ఎలా మరిచిపోతాం? హిందుత్వ సిద్ధాంత మూల పురుషులైన హెగ్డెవార్, గోల్వాల్కర్, సావార్కర్‌లకు బదులు నరేంద్ర మోదీ మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్, డా. బి. ఆర్. అంబేద్కర్‌ల పేర్లు వాడుకోడానికి ఎంతగా ప్రయత్నించినా ఈ పాపం నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విముక్తం కాలేదు.

1992 డిసెంబరు 6న బాబ్రీ మసీద్‌ని కూల్చివేయడం ద్వారా ఆర్.ఎస్.ఎస్., భారతీయ జనతా పార్టీ, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్‌లు 1947 దేశ విభజన తరువాత దేశంలో మళ్లీ మతకల్లోలాల జ్వాలలను రాజేశాయి. తమ రాజకీయ లబ్ధికోసం హిందూ ముస్లింల మధ్య అఘాతాన్ని సృష్టించాయి. దేశ రాజకీయాలకు, సామాజికతకు ఈ ఘటన తీరని నష్టం చేసింది. బాబ్రీ మసీద్ కూల్చివేత సమయంలో 17 మంది ముస్లింలను సజీవంగా దహనం చేశారు, ఆ తరువాత చోటు చేసుకున్న మతకలహాలలో చాలా మంది చనిపోయారు.

భారతదేశంలో ఉగ్రవాదం ప్రవేశించడానికి బాబ్రీ మసీద్ కూల్చివేతే కారణం. భారతదేశంలో మొదటి ఉగ్రవాద దాడి, అప్పట్లో వాటిని సీరియల్ బాంబు దాడులు అనేవాళ్లు, బాబ్రీ మసీద్ కూల్చివేతకి ప్రతీకారంగా 1993లో ముంబైలో జరిగింది. హిందుత్వ సిద్ధాంతాన్ని అనుసరించేవాళ్లు కూడా బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఆర్.ఎస్.ఎస్., హిందుత్వ సిద్ధాంతాల ప్రేరణతో పనిచేస్తున్న అభినవ భారత్‌తో సంబంధం ఉన్న పదవీ విరమణ చేసిన మేజర్ రమేష్ ఉపాధ్యాయ, సైన్యంలో పనిచేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్‌లు తమ దేశంలోనే బాంబు పేలుళ్ల కుట్రలో భాగస్వాములయ్యారంటే ఇంతకంటే పిరికిపందల చర్య మరొకటి ఏముంటుంది? 2006 సెప్టెంబర్ 8న మహారాష్ట్రలోని మాలేగావ్‌లో జరిగిన పేలుళ్లలో 38 మంది చనిపోయారు, 2008 సెప్టెంబర్ 29న గుజరాత్‌లోని మాలేగావ్,

---

కాదు, మీడియా–ప్రసార సాధనాలను కూడా ఈ ప్రభుత్వాలు అనేక విధాలుగా నిరోధించగలవు.

రాజ్యాంగంలోని ఆర్టికల్19 ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛలకు పరిమితులను విధించే క్లాజ్2 నుండి క్లాజ్6 వరకు ఉపయోగించగలవు. అంటే ఒక చేత్తో హక్కులను ఇస్తూ, మరొకచేత్తో తీసుకోగలిగే ఏర్పాటు ఉందన్నమాట. ఈ హక్కులకు పరిమితులు విధించే 'సకారణమైన పరిస్థితులు' ఏమిటో నిర్ణయించగలిగినవి కోర్టులు మాత్రమే. అయితే ప్రభుత్వాలే తమకు ఇబ్బందిగా ఉన్న వ్యక్తులను నక్సలైట్ అనో, మరో నిషేధిత సంస్థ సభ్యుడనో లేదా వాటితో సంబంధాలు కలిగి ఉన్నాడనో ఆరోపణ తీసుకువస్తే కోర్టులు ఏం చేస్తాయన్నదే కీలకం. అయితే గోరక్షకులమనే పేరుతో ముస్లింలను కొట్టి చంపిన మూకలను, వాటి నాయకులను పూలమాలలు వేసి అభినందించిన మంత్రులు ఉన్నారు. అదే సమయంలో దాదాపు లాటిన్ అమెరికాలో చిలీలో, నియంత 'పినోచెట్' హయాంలో జరిగినట్లు లాకప్ మరణాలు, బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్న మన పోలీసులు ఉన్నారు. ఇవన్నీ చెపుతున్నదేమిటంటే, ఈ దేశంలో ప్రజాస్వామ్యం, అది కల్పించిన మాట్లాడే స్వేచ్ఛ వంటి హక్కులు అనేవాటి శకం ముగిసిపోయిందని. ఇప్పుడు ఈదేశంలో ఫాసిజం, అప్రకటిత ఎమర్జెన్సీలే అమలవ్వబోతున్నాయని!

(రచయిత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి)

(అనువాదం ఉదయ)

వీ

మొదాసాలో జరిగిన పేలుళ్లలో 10 మంది చనిపోయారు. ఈ రెండు ఘటనలలో అభినవ్ భారత్ సంస్థలో పనిచేస్తున్న వాళ్లని నిందితులుగా చేర్చారు. 2007 ఫిబ్రవరి 18న జరిగిన బాంబు పేలుడులో సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లో 68 మంది చనిపోయారు. అదే సంవత్సరం మే 18న హైదరాబాదులోని మక్కా మసీద్ బయట జరిగిన బాంబు పేలుడులో 9 మంది చనిపోయారు, పోలీసుల కాల్పుల్లో మరో 5 మంది చనిపోయారు. ఈ పేలుళ్లలో కూడా అభినవ్ భారత్ పాత్ర ఉందని భావిస్తున్నారు. 2017 అక్టోబర్ 11న అజ్మేర్‌లోని ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీ దర్గావద్ద జరిగిన బాంబు పేలుడులో 19 మంది చనిపోయారు. ఆర్.ఎస్.ఎస్.తో సంబంధాలు ఉన్న భవేష్ పటేల్, దేవేంద్ర గుప్తాలకు ఈ ఘటనలో నేరస్తులుగా జీవిత ఖైదు పడింది.

2002లో గోద్రా రైల్వే స్టేషను బయట సబర్‌మతీ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీలో మంటలకు ప్రతీకారంగా చెలరేగిన మతకల్లోలాలలో దాదాపు రెండు వేల మంది చనిపోయారు, వీళ్లల్లో అధిక సంఖ్యాకులు ముస్లింలు. బిజెపి, విహెచ్‌పి, భజరంగ్ దళ్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఇందులో బహిరంగంగా పాల్గొని హింసను ప్రేరేపించారు. గుజరాత్‌లో అప్పుడు అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇందులో ప్రత్యక్ష లేదా పరోక్ష పాత్ర ఉందని నమ్మారు. హింసను ఆపడానికి పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నది నిజం. పాలనలో ధర్మ సూత్రాలను పాటించాలని అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి నరేంద్ర మోదీని అభిశంసించారు. ఈ హింసలో నరేంద్ర మోదీ అనుమానాస్పద పాత్ర కారణంగా అతడు ప్రధాన మంత్రి అయ్యేవరకు అమెరికా అతడికి వీసా ఇవ్వలేదు.

2013-17 మధ్య సనాతన్ సంస్థతో సంబంధాలు ఉన్నవాళ్లు చేసిన దాడులలో డా. నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, ఆచార్య ఎం.ఎం. కల్బుర్గి, పాత్రికేయురాలు గౌరీ లంకేశ్‌లు చనిపోయారు. హిందుత్వ సిద్ధాంతాలను విమర్శించినందుకు వీళ్లందరు హత్యలకు గురయ్యారు.

నరేంద్ర మోదీ కొత్త ఢిల్లీలో అధికారానికి వచ్చిన తరువాత హింసలో ఒక కొత్త ధోరణి చోటు చేసుకుంది. ఆవులను చంపారన్న అనుమానంతో, లేదా ఆవులను రవాణా చేస్తున్నందుకో ముస్లింలను మూకదాడిలో చంపడం మొదలయ్యింది. దాద్రి దగ్గర బిసద అన్న గ్రామంలో ఆవుని దొంగిలించి, చంపాడన్న అనుమానంతో మొహమ్మద్ అఖ్లాఖ్‌ని 2015 సెప్టెంబర్ 28న చంపేశారు. ఈ దాడికి ముందు ఒక గుడిలోని మైకు ద్వారా ప్రజలను సమావేశపరిచారు. జార్ఖండ్‌లోని లతేహర్‌లో 2016 మార్చి 18న 32 ఏళ్ల మజ్లుం అన్సారి, 15 ఏళ్ల ఇంతియాజ్ ఖాన్ 8 ఎడ్లను తోలుకుని వెళుతుండగా గోసంరక్షక దళానికి చెందినవాళ్లు దాడిచేసి, చంపేసి వాళ్ల శవాలను చెట్టుకి వేలాడదీశారు.

2017 ఏప్రిల్ 1న హర్యానాలోని మేవత్‌కి చెందిన 55 ఏళ్ల పెహ్లు ఖాన్ మరో ఐదుగురితో కలిసి రాజస్తాన్‌లో ఆవులు, దూడలు కొనుక్కుని వస్తుండగా ఆల్వార్ దగ్గర హిందుత్వ వాదులు అతడిని వాహనంలోంచి బయటకు లాగి అతడి కొడుకు కళ్లముందే కొట్టి చంపేశారు. ఆవులను కొన్న రశీదు, పాడి కోసం వాటిని తీసుకెళుతున్నట్లు పెహ్లు ఖాన్ వద్ద పత్రాలు ఉన్నాయి.

2018 జూలై 20న హర్యానాకే చెందిన రక్బర్ ఖాన్ రెండు ఆవులను తీసుకెళుతుండగా అల్వార్ దగ్గర ఒక గుంపు అతడిపై దాడి చేసింది, ఆసుపత్రికి వచ్చేసరికే అతడు చనిపోయాడని ప్రకటించారు. రక్బర్‌ని ఆసుపత్రికి తీసుకెళ్లడానికంటే ముందు ఆ ఆవులను గోశాలకు చేర్చడం ముఖ్యమని పోలీసులు అనుకున్నారు.

నరేంద్ర మోదీ ఢిల్లీలో అధికారం చేపట్టిన తరువాత కొత్త తరహా ఘటనలు మొదలయ్యాయి. హిందుత్వ వాదులైన యువత మోటరుసైకిళ్లకు కాషాయ, జాతీయ జెండాలు పెట్టుకుని ముస్లిం, దళిత ప్రాంతాల గుండా ఊరేగింపుగా వెళ్లడానికి పట్టుపట్టి, హింసను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తారు. 2017 మే 5న దళిత ప్రాంతంలో ఉన్న మహరాణా ప్రతాప్ విగ్రహానికి దండ వేసే మిషతో మోటారుసైకిల్ ఊరేగింపు తీశారు, ఆ తరువాత జరిగిన హింసలో ఒక రాజ్‌పుత్, ఒక దళిత యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో సంబంధం ఉందనే జాతీయ భద్రతా చట్టం కింద దళిత యువ నాయకుడైన చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌ని ఒక సంవత్సరానికి పైగా జైలులో ఉంచారు. ప్రతి సంవత్సరం ముస్లిం యువత గణతంత్ర దినోత్సవం జరుపుకునే కాస్‌గంజ్‌లోని అబ్దుల్ హమీద్ చౌక్ గుండా 2018 జనవరి 26న హిందుత్వవాదులైన యువత మోటరుసైకిల్ ఊరేగింపు తీయడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంగా జరిగిన హింసలో చందన్ గుప్తా అనే యువకుడు చనిపోయాడు. బరేలీ జిల్లా మ్యాజిస్ట్రేటు అయిన రాఘవేంద్ర ప్రతాప్ సింగ్ ట్విట్టర్‌లో ఇలా పెర్కొన్నారు, 'ఒక వింత సాంప్రదాయం చోటు చేసుకుంటోంది. ముస్లింలు నివసిస్తున్న ప్రాంతం గుండా బలవంతంగా ఊరేగింపు తీసి పాకిస్తాన్ ముర్దాబాద్ అన్న నినాదాలు చేస్తున్నారు. వాళ్లు పాకిస్తాన్ వాసులా?'

ఇవన్నీ ముందుస్తు ప్రణాళిక ప్రకారం జరిగిన సంఘటనలే అన్నదాంట్లో అనుమానం లేకుండా ఉండడానికి కేంద్ర మంత్రి అయిన జయంత్ సిన్హా 2018 జులై 7న మూక హత్యలో నిందితులై, బెయిలు మీద బయటకు వచ్చిన గోసంరక్షక దళంలోని 8 మందికి దండలు వేసి సత్కరించారు. పెహ్లు ఖాన్ హత్యలో నిందితుడైన విపిన్ యాదవ్‌ని 2017 ఏప్రిల్ 19న సాధ్వి కమల్ దీది సన్మానించి అతడిని భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుఖదేవ్‌లతో పోల్చింది. తమ సభ్యుల హింసను సంఘ్ పరివారం సమర్థించడమే కాకుండా దానిని ఘనకార్యంగా పొగుడుతోందని అర్థమౌతోంది.

ఈ ఘటనలకి తోడు రాజ్యహింస ఉండనే ఉంది. 2004 జులై 11న మణిపూర్‌లో 34 సంవత్సరాల తంగజం మనోరమని అస్సాం రైఫిల్స్‌కి చెందిన పారామిలటరీ దళసభ్యులు అత్యాచారం చేసి, చంపేశారు. మణిపూర్‌లో భద్రతా దళాలు సాగించిన బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ చేపట్టాలని సిబిఐని 2017 జులై 15న సుప్రీం కోర్టు ఆదేశించింది. 2018 మే 22న తమిళనాడులోని తూత్తుకుడిలో వేదాంత కంపెనీ అయిన స్టెర్‌లైట్ వల్ల కలుగుతున్న కాలుష్యానికి వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న 20,000 మంది ప్రజలపై పోలీసులు కాల్పులు జరపగా 13 మంది చనిపోయారు. హింస చట్టవిరుద్ధమని పౌర సమాజం భావిస్తుంటే అన్ని రకాల హింసలను ఖండించాలి, ఈ అన్ని రకాల హింసను అరికట్టడానికి ప్రభుత్వం పూనుకోవాలి.

(రచయితలు సామాజిక కార్యకర్తలు)

(అనువాదం కె. సురేశ్)

వీ

ఆగస్ట్ 28 అరెస్టుల ముందూ తర్వాతా

ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న రచయితల మీద, సామాజిక కార్యకర్తల మీద దేశవ్యాప్తంగా పోలీసులు జరిపిన దాడుల, అరెస్టుల నేపథ్యంలో ఈ నిర్బంధకాండ మూలాలనూ, పద్ధతినీ వివరిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

మహారాష్ట్రలోని పుణె పోలీసులు హర్యానా, ఢిల్లీ, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసుల సహకారంతో ఆయా రాష్ట్రాలలోను, మహారాష్ట్రలోని ముంబైలోను ఆగస్ట్ 28 ఉదయం ఒకేసారి ప్రారంభించిన దాడులు, సోదాలు, అరెస్టులతో దేశంలో కొనసాగుతున్న నిర్బంధకాండలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. భీమా కోరేగాం హింసాకాండ కేసులో తమకు దొరికిన ఆధారాల ప్రకారం కొందరిని అరెస్టు చేయడానికి, మరిన్ని ఆధారాలు సంపాదించడానికి ఈ ఏకకాల దాడులు చేశామని పుణె పోలీసులు చెప్పుకున్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో న్యాయవాది సుధా భరద్వాజ్, దక్షిణ ఢిల్లీలో హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్లాఖా, ముంబైలో న్యాయవాది అరుణ్ ఫరేరా, సామాజిక కార్యకర్త వర్నన్ గోంజాల్వెజ్ – న్యాయవాది సుసాన్ అబ్రహాం, జార్ఖండ్‌లోని రాంచిలో క్రైస్తవ ఫాదర్ స్టాన్ స్వామి, గోవాలో ప్రొఫెసర్ ఆనంద్ తేల్ తుంబ్డే, తెలంగాణలో హైదరాబాద్‌లో కవి వరవరరావు, జర్నలిస్టు క్రాంతి, ప్రొఫెసర్ కె సత్యనారాయణ–పవన, జర్నలిస్టు కె వి కూర్మనాథ్–అనలల ఇళ్ల మీద ఈ దాడులు జరిగాయి. వీరందరూ దశాబ్దాలుగా ప్రజా జీవితంలో బహిరంగంగా ప్రజా ఉద్యమాల సమర్థకులుగా, రచయితలుగా, హక్కుల కార్యకర్తలుగా సుప్రసిద్ధులే.

ఒక్కొక్కరి ఇంట్లో దాదాపు ఇరవై మంది మఫ్టీ దుస్తుల్లో పోలీసులు ప్రవేశించి, చట్టబద్ధమైన సర్చ్ వారంట్ లాంటిదేమీ చూపకుండా, లోపలికి అడుగు పెట్టిన వెంటనే ఇంట్లో వాళ్ల సెల్‌ఫోన్లు లాగేసుకుని, లాండ్‌లైన్ ఫోన్ తొలగించి వారికి బైటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేశారు. ఒక్కొక్కరి ఇంట్లో ఐదు నుంచి ఎనిమిది గంటల వరకు సోదాలు జరిపి, ఆ కుటుంబాలను మానసికంగా వేధించి, చివరికి ఫోన్లు, లాప్‌టాప్‌లు, పెన్‌డ్రైవ్‌లు, సిడిలు, పుస్తకాలు, ఫొటోలు లాంటి ఎన్నో వస్తువులు ఎత్తుకుపోయారు. ఏమేమి తీసుకుపోతున్నారో చట్టబద్ధంగా పంచనామా చేసి జాబితా ఇవ్వవలసి ఉండగా, వీరికెవ్వరికీ తెలియని మరాఠీలో ఒక కాగితం రాసి, తామే పుణె నుంచి తెచ్చుకున్న సాక్షులతో సంతకాలు పెట్టించి ఇచ్చారు. ఆ మరాఠీలో రాసిన పత్రంలో ఈ ఇళ్ల నుంచి తీసుకుపోయిన వస్తువుల జాబితానే ఉందో, పోలీసులు ఆరోపించ దలచుకున్న జాబితా ఉందో తెలియదు. గోవాలోనైతే పోలీసులు దాడి చేసిన సమయానికి ఆనంద్ తేల్ తుంబ్డే, ఆయన సహచరి ముంబైలో ఉండగా, వాచ్‌మన్‌ను బెదిరించి ఇల్లు తాళంచెవి తీసుకుని, లోపలికి వెళ్లి ఐదారు గంటల పాటు సర్ది, పంచనామా చేయకుండానే, ఎవరికీ ఏ జాబితా ఇవ్వకుండానే కొన్ని మూటలు బైటికి తీసుకుపోయారని ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. ఎనభై ఐదు సంవత్సరాల వృద్ధుడు స్టాన్‌స్వామి ఇంట్లోనూ, సుధా భరద్వాజ్, గౌతమ్ నవ్లాఖా ఇంట్లోనూ కూడ పోలీసులు ఇలాగే దౌర్జన్యపూరితంగా ప్రవర్తించారు.

ఆయా ఇళ్లలో ఫోన్లు గుంజుకుని, సమాచార సంబంధాలన్నీ తెగగొట్టడంతో, వేకువజామున మొదలైన ఈ దాడుల వార్తలు రెండు మూడు గంటల దాకా బైటి ప్రపంచానికి తెలియలేదు. ఈ సమాచారం బైటికి పొక్కిన వెంటనే దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. హైదరాబాద్‌లో సోదాలు జరుగుతున్న ఇళ్ల ముందు, ముఖ్యంగా వరవరరావు, సత్యనారాయణల ఇళ్ల ముందు పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు, మీడియా ప్రచారం మొదలయ్యాయి. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం మూడింటి దాకా సోదాల తర్వాత వరవరరావును అరెస్టు చేసి, మొదట నాంపల్లి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచి, ట్రాన్సిట్ రిమాండ్ (ఖైదీ ప్రయాణ అనుమతి) తీసుకుని పుణెకు తీసుకువెళ్లారు. ముంబైలో సోదాలు జరిపిన ఇళ్ల నుంచి అరుణ్ ఫరేరాను, వర్నన్ గోంజాల్వెజ్ ను పుణెకు తరలించారు.

మరొకవైపు ఫరీదాబాద్‌లో సోదాల తర్వాత అరెస్టు చేసిన సుధా భరద్వాజ్‌ను పుణె తరలించడానికి తీసుకున్న ట్రాన్సిట్ రిమాండ్ చెల్లదని న్యాయవాదులు పంజాబ్–హర్యానా హైకోర్టును కదిలించగా, ఆమెను పుణె తీసుకు వెళ్లడానికి వీలులేదని హైకోర్టు తీర్పు చెప్పింది. అలాగే ఢిల్లీలో అరెస్టు చేసిన గౌతమ్ నవ్లాఖాను కూడ పుణె తరలించడానికి వీలు లేదని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. వారిద్దరినీ ఇళ్ల నుంచి బైటికి వెళ్లకుండా పోలీసులు దిగ్బంధం చేసి, దానికి గృహనిర్బంధం అని పేరు పెట్టారు.

ఈలోగా ఈ అరెస్టులను, సోదాలను సవాల్ చేస్తూ రొమిలా థాపర్, దేవకీ జైన్, ప్రభాత్ పట్నాయక్, సతీష్ దేశ్ పాండే, మాయా దారూవాలాలు సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై స్పందిస్తూ, తాము ఆ పిటిషన్‌ను విచారించేవరకూ ఈ ఐదుగురినీ అరెస్టు చేయగూడదని, గృహనిర్బంధంలో ఉంచవచ్చునని సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వుల ప్రకారం సుధా భరద్వాజ్, గౌతమ్ నవ్లాఖాల గృహ నిర్బంధం కొనసాగగా, అప్పటికే పుణె తీసుకుపోయి అక్కడి కోర్టులో హాజరు పరచిన వరవరరావు, అరుణ్ ఫరేరా, వర్నన్ గోంజాల్వెజ్‌లను వారి ఇళ్లకు తీసుకువచ్చి గృహ నిర్బంధంలో ఉంచారు. ఆ తర్వాత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ ఎ ఎం ఖాన్విల్కర్, జస్టిస్ డి వై చంద్రచూడ్ లతో కూడిన బెంచి సెప్టెంబర్ 6న, 17న, 19న, 20న ఈ పిటిషన్ మీద వాదనలు విని, తీర్పు 28కి వాయిదా వేసింది.

డా. అభిషేక్ మను సింఘ్వి, ఇందిరా జైసింగ్, దుష్యంత్ దవే, హుజేఫా అహ్మది, రాజీవ్ ధావన్, చందర్ ఉదయ్ సింగ్, రాజూ రామచంద్రన్, సంజయ్ హెగ్డే వంటి సుప్రసిద్ధ సీనియర్ న్యాయవాదులు, అమిత్ భండారీ, ప్రశాంత్ భూషణ్, బృందా గ్రోవర్, రత్నా అప్పెందర్, సౌతిక్ బెనర్జీ, చెరిల్ డిసౌజా వంటి అనేక మంది న్యాయవాదుల సహకారంతో ఈ కేసు వాదించారు. ఈ వాదనాక్రమంలో అసలు ఈ

కేసులో ఎఫ్ఐఆర్ దగ్గరి నుంచీ, మొత్తం దర్యాప్తు క్రమమంతటిలోనూ పోలీసులు అమలు చేసిన చట్టవ్యతిరేకమైన పద్ధతులు, చెప్పిన అబద్ధాలు, సృష్టించిన తప్పుడు సాక్ష్యాధారాలు చర్చకు వచ్చాయి. పోలీసుల అక్రమ పద్ధతులు పూర్తిగా తేటతెల్లమయ్యాయి.

అయితే, ఈ ఆగస్ట్ 28 అరెస్టులను, సోదాలను, తదనంతర పరిణామాలను విడిగా వాటికవిగా చూస్తే వాటిని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ప్రభుత్వమే చెపుతున్నట్టు ఈ నిర్బంధమంతా భీమా కోరేగాం కేసులో భాగంగా జరుగుతున్నది గనుక అసలు ఆ భీమా కోరేగాం కేసు ఏమిటో, దానిలో ప్రభుత్వమూ, పుణె పోలీసులూ ఏ అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవాలి. అంతమాత్రమే కాదు, ఈ కేసులోనే జూన్ 6న అరెస్టు చేసిన సుధీర్ ధావ్లే, సురేంద్ర గాడ్లింగ్, షోమా సేన్, రోనా విల్సన్, మహేశ్ రౌత్‌లలో కనీసం ఇద్దరు సాయిబాబాకు విధించిన యావజ్జీవశిక్షకు వ్యతిరేకంగా క్రియాశీలంగా పని చేస్తున్నారు, సురేంద్ర గాడ్లింగ్ సాయిబాబా కేసు వాదించిన, వాదిస్తున్న న్యాయవాది, రోనా విల్సన్ రాజకీయ ఖైదీల విడుదల కమిటీకీ, సాయిబాబా, తదితర నిర్బంధితుల న్యాయవ్యవహారాలు చూసే కమిటీకీ బాధ్యుడు. కనుక ఈ ఆగస్ట్ 28 అరెస్టుల సందర్భంగా, జూన్ 6 అరెస్టుల గురించీ, సాయిబాబా కేసు గురించీ కూడ పరిశీలించాలి. సాయిబాబా మీద పాలకవర్గాలు కక్ష కట్టడానికి ప్రధాన కారణం ఆయన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ప్రచారాన్ని సమన్వయం చేస్తున్నాడనేదే, వ్యతిరేకతను సమీకరిస్తున్నాడనేదే. అందువల్ల ఆపరేషన్ గ్రీన్‌హంట్ గురించి కూడ తెలుసుకోవాలి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ గురించి తెలుసుకోవడమంటే దానికి ముందరి పాలకవర్గ విఫల ప్రయత్నాలలో ప్రధానమైన సాల్వా జుడుం గురించీ, దానికి మూలమైన సామ్రాజ్యవాదుల, వారి దళారీల ఖనిజ నిలువల దాహం గురించీ తెలుసుకోవాలి. అంటే ఆగస్ట్ 28 అరెస్టులు, సోదాలు అనే తీగలాగితే కదిలే డొంక చాల ఉంది. ఈ దేశ ప్రజల, ఆదివాసుల ప్రయోజనాలు, వనరులు ఒక పక్కనా, సామ్రాజ్యవాదుల, వారి దళారీ పాలకుల ప్రయోజనాలు మరొక పక్కనా ఉన్న సుదీర్ఘమైన వర్గపోరాట క్రమంలో ఆగస్ట్ 28 సోదాలు, అరెస్టులు ఒకానొక సన్నివేశం మాత్రమే.

మరీ వెనక్కి వెళ్లకపోయినా, ఈ క్రమాన్ని కనీసం 2004-05 నుంచి గుర్తించవలసి ఉంది. మధ్య భారత అరణ్యాలలో, దండకారణ్యంలో ఉన్న అపారమైన ఖనిజ నిలువలను తవ్వడానికి, శుద్ధి చేయడానికి, తరలించడానికి, ఇనుము, ఉక్కు కర్మాగారాలు, అల్యూమినియం శుద్ధి కర్మాగారాలు స్థాపించడానికి, ఆ ఖనిజాలను, అక్కడి జలవనరులను ఉపయోగించి విద్యుదుత్పత్తి చేయడానికి, ఆనకట్టలు కట్టడానికి, రహదారులు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ ప్రభుత్వాలు బహుళజాతి కార్పొరేట్ సంస్థలతో వందలాది ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అప్పటికి ఇరవై ఐదు సంవత్సరాలుగా దండకారణ్యపు ఆదివాసుల మధ్య పనిచేస్తున్న విప్లవోద్యమం సరిగ్గా ఆ సమయానికే నిర్మాణాత్మకంగా ఒక ముందడుగు వేసి జనతన రాజ్యాన్ని స్థాపించింది. అప్పుడే దేశవ్యాపిత విప్లవశక్తుల ఐక్యత సాధించి మావోయిస్టు పార్టీగా మారింది. కార్పొరేట్లతో కుదిరిన దేశ వ్యతిరేక, ఆదివాసి వ్యతిరేక ఒప్పందాలను అమలు చేయడానికి పాలకవర్గాలు అర్ధసైనిక బలగాలను విపరీతంగా మోహరించినా, ఆదివాసుల మీద, వారికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టుల మీద తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసినా, ప్రజాశక్తి ముందు ప్రభుత్వ సాయుధ బలగాలు నిలవలేదు. ఆ స్థితిలో కార్పొరేట్లతో కుదిరిన ఒప్పందాలను అమలు చేయడానికి, దండకారణ్య ఖనిజ నిలువలను వారికి దోచిపెట్టడానికి, మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయడానికి ఆదివాసి సమాజంలోనే అంతర్యుద్ధాన్ని ప్రారంభించాలని పాలకవర్గాలు దురాలోచన చేశాయి. ఆ దురాలోచన ఫలితంగానే చత్తీస్‌గఢ్‌లో 2005 జూన్‌లో పాలకవర్గాలు సాల్వాజుడుంను ప్రారంభించాయి. ఆదివాసులలోనుంచే సంఘవ్యతిరేక శక్తులను, యువకులను ఆకర్షించి, వారికి స్పెషల్ పోలీస్ ఆఫీసర్ అని పేరు పెట్టి, ఆయుధాలు ఇచ్చి, ఆదివాసి సమాజంలో భయభీతావహం నింపడానికి ప్రయత్నించారు. ఈ గూండా మూకలు ఆదివాసి గూడాల మీద దాడులు చేస్తూ, ఇళ్లు తగులబెట్టడం, స్త్రీల మీద అత్యాచారాలు చేయడం, విప్లవోద్యమ సానుభూతిపరులైన, సంఘనాయకులైన ఆదివాసులను చంపివేయడం, చిత్రహింసలు పెట్టడం వంటి దుర్మార్గాలకు పాల్పడ్డాయి. విప్లవోద్యమానికి అనుకూలంగా ఉన్న ఆదివాసి గూడాలను ఖాళీ చేయించి, పోలీసుల, సాల్వాజుడుం ఎస్‌పివోల పర్యవేక్షణలో నిర్బంధ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ దారుణ దమనకాండలో లక్షలాది ఆదివాసులు తమ గ్రామాలు వదిలి ఇంకా లోపలి అడవుల్లోకో, సరిహద్దు దాటి అప్పటి ఆంధ్రప్రదేశ్‌లోకో వలస వెళ్లవలసి వచ్చింది.

ఈ దుర్మార్గాల వార్తలు బైటికి వస్తున్నకొద్దీ పౌరసమాజంలో ప్రభుత్వ విధానం పట్ల పెద్ద ఎత్తున వ్యతిరేకత, నిరసన చెలరేగడం మొదలయింది. ఢిల్లీ విశ్వవిద్యాలయ సోషియాలజీ ప్రొఫెసర్ నందిని సుందర్, చరిత్రకారుడు రామచంద్ర గుహ తదితరులు ఈ చట్టవ్యతిరేక గూండా బలగాన్ని రద్దు చేయాలని కోరుతూ 2007లో సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేశారు. ఆదివాసులను అణచివేసి, ఖనిజ నిలువలను కార్పొరేట్లకు అప్పగించడానికి ఈ మార్గం సాధ్యం కాదని రెండు సంవత్సరాల సాల్వాజుడుం అనుభవంతో తెలుసుకున్న చత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు కూడ సాల్వా జుడుం తన లక్ష్యాన్ని సాధించలేక పోయిందని అనడం ప్రారంభించారు. ఆ క్రమంలో 2011 లో సుప్రీం కోర్టు కూడ సాల్వాజుడుం చట్టవ్యతిరేక శక్తి అని, దాన్ని రద్దు చేయాలని తీర్పు ఇచ్చింది. ఇక 2009 నుంచీ అర్ధసైనిక బలగాలతో దమనకాండ సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం, చత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర రాష్ట్ర సాయుధ బలగాలు ఆ దమనకాండకు ఆపరేషన్ గ్రీన్‌హంట్ అనే కొత్త పేరు తొడిగాయి.

ఈ నేపథ్యంలో దండకారణ్యం మీదికి ఆపరేషన్ గ్రీన్‌హంట్ రూపంలో, ఆపరేషన్ హాకా, ఆపరేషన్ విజయ్, మిషన్ 2016 వంటి ఎన్నో రూపాలలో వేలాదిగా ప్రభుత్వ సాయుధ బలగాలను, అర్ధసైనిక బలగాలను, కొన్ని చోట్ల సైనిక బలగాలను పంపించడం, సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడం మొదలయింది. దండకారణ్య వనరుల మీద, ప్రజల మీద, వారికి అండగా నిలుస్తున్న మావోయిస్టు ఉద్యమం మీద ముప్పేట దాడి సాగించడానికి, యుద్ధం చేయడానికి పాలకవర్గాలు సకల ప్రయత్నాలు ప్రారంభించాయి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రజల మీద యుద్ధంగా వస్తున్న ఈ దాడి గురించి ప్రచారం చేయడం, ఈ దాడిని అడ్డుకోవడానికి విభిన్న శక్తులను సమీకరించడం దేశంలోని బుద్ధిజీవుల బాధ్యత అయింది. దేశ రాజధానిలో ఉన్నందువల్ల, అప్పటికే ప్రజా ఉద్యమ సమర్థకుడిగా ప్రసిద్ధుడైన ప్రొ. జి ఎన్ సాయిబాబా మీద ఆ బాధ్యత మరింత ఎక్కువగా పడింది. ఆయన ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక ప్రచారానికి నాయకత్వం వహించడం, వివిధ దేశాల ప్రజా ఉద్యమాలకు ఈ సమాచారం అందించడం, ఆపరేషన్ గ్రీన్‌హంట్ పట్ల నిరసనను సమీకరించడం తన బాధ్యతగా తీసుకున్నాడు. అందువల్ల సాయిబాబా మీద పాలకవర్గాలు

కత్తిగట్టాయి. స్వయంగా అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం సాయిబాబా పేరు ఎన్నోసార్లు ప్రస్తావించాడు.

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఒక మారుమూల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక దొంగతనం కేసులో దొంగసొమ్ము స్వాధీనం చేసుకోవడానికనే సాకుతో 2013 సెప్టెంబర్‌లో ఢిల్లీలో సాయిబాబా ఇంటిమీద దాడి చేసి, కంప్యూటర్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌లు, పుస్తకాలు ఎత్తుకుపోయారు. మూడు నెలల్లోనే 2014 జనవరిలో మళ్లీ ఆయన ఇంటి మీద దాడి చేసి, ఇంట్లోనే గంటల తరబడి ఇంటారాగేట్ చేశారు. చివరికి 2014 మేలో ఆయనను అరెస్టు చేసి చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టం కింద కేసు పెట్టారు. ఆ కేసులో 2017 మార్చ్‌లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పులో సాయిబాబాతో పాటు ప్రశాంత్ రాహీ, హేమ్ మిశ్రా, మహేశ్ టిర్కి, పాండు నరోటెలకు యావజ్జీవ శిక్ష, విజయ్ టిర్కికి పది సంవత్సరాల శిక్ష విధించారు.

ఈ కేసులో సాయిబాబా తరపున, నిందితులందరి తరపున వాదించిన నాగపూర్ న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్‌ను, ఈ ఐదుగురి విడుదల కోసం ప్రత్యేకంగా కమిటీ ఫర్ ది డిఫెన్స్ అండ్ రిలీజ్ ఆఫ్ జి ఎన్ సాయిబాబా పేరుతో, రాజకీయ ఖైదీలందరి విడుదల కోసం కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ పేరుతో పని చేస్తున్న రోనా విల్సన్‌ను కూడ ఏదో ఒక కేసులో జైలు పాలు చేస్తే ఇటు సాయిబాబా, తదితర నిర్బంధితుల గురించి గాని, మొత్తంగా రాజకీయ ఖైదీలందరి గురించి గాని, ప్రధానంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ గురించి గాని నిరసనస్వరాలు వినిపించకుండా చేయగలమని పాలకులు భావించారు.

ఈ పరిణామాల క్రమంలోనే, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడి, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, మొత్తంగా సంఘ్ పరివార్ విద్వేష రాజకీయాలకు అనుకూల, భయానక స్థితి ఏర్పడింది. ఆ భయానక స్థితిలో అప్పటివరకూ ఆదివాసులను, ముస్లింలను బెదిరింపులకు గురిచేస్తున్న పాలకులు, దళితులను కూడ బెదిరింపులకు గురి చేయాలంటే వారికి మావోయిస్టులతో సంబంధం అంటగట్టాలని అనుకున్నారు. మహారాష్ట్రలో 2018 జనవరిలో జరిగిన భీమా కోరేగాం శౌర్య దివస్ ఉత్సవాలు, ఆ తర్వాత జరిగిన హింసాకాండ సంఘ్ పరివార్ పాలకవర్గాలకు కలిసివచ్చాయి.

అత్యంత దుర్మార్గంగా మనువాదాన్ని అమలు చేసిన, దళితుల పట్ల దారుణమైన వివక్షను పాటించిన పీష్వాల పాలనను ఓడించి, దళితుల శౌర్యాన్ని ప్రకటించిన యుద్ధంగా భీమా కోరేగాం యుద్ధాన్ని స్మరించుకోవాలనీ, ఆ యుద్ధంలో అసువులు బాసిన మహర్ సైనికుల స్మృతి చిహ్నం దగ్గర ఆ శౌర్య దినం జరుపుకోవాలనీ డా. బి.ఆర్. అంబేడ్కర్ 1927లో చేసిన సూచన మేరకు ప్రతి సంవత్సరం జనవరి 1న అక్కడ ఉత్సవాలు జరుగుతాయి. 2018 జనవరి 1 కి ఆ యుద్ధం జరిగి 200 సంవత్సరాలు అయిన సందర్భంగా ఈసారి ఆ ఉత్సవాలకు మరింత ప్రాధాన్యత వచ్చింది. దళితులు మాత్రమే కాక విభిన్న ప్రజాస్వామిక శక్తులు కూడ ఆ ఉత్సవంలో పాల్గొన్నాయి. ఆ ఉత్సవానికి ముందురోజు పుణెలో శనివార్ వాడలో భీమా కోరేగాం శౌర్య దివస్ ఉత్సవ సమితి ఎల్గార్ పరిషద్ అనే బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఇద్దరు న్యాయమూర్తులు, జిగ్నేష్ మేవాని, రాధిక వేముల వంటి దళిత నాయకులు, ఉమర్ ఖాలిద్ వంటి విద్యార్థి నాయకులు పాల్గొన్న ఈ సభ మర్నాడు భీమా కోరేగాంకు యాత్రగా మారింది. ఆ యాత్రమీద సంఘ్ పరివార్ సంస్థలైన శివ ప్రతిష్ఠాన్ హిందుస్తాన్ నాయకుడు శంభాజీ భిడే, ధరమ్ వీర్ శంభాజీ మహరాజ్ ప్రతిష్ఠాన్ నాయకుడు మిళింద్ ఎక్బోటేల నాయకత్వంలో గూండాలు దాడి చేసి ముగ్గురు దళితులను హత్య చేశారు, ఇళ్లు తగులబెట్టారు, రెండు వందల సంవత్సరాల కింది దళిత నాయకుడి సమాధి ధ్వంసం చేశారు.

ఈ హింసాకాండ మీద జనవరి 2న స్థానిక దళిత కార్యకర్తల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ దాఖలయింది. ఆ ఎఫ్ఐఆర్ లో నిందితులుగా పేర్కొన్న శంభాజీ భిడే మీద ఇప్పటికి పోలీసులు ఏ చర్యా తీసుకోలేదు. మిళింద్ ఎక్బోటేను అరెస్టు చేశారు గాని బెయిల్ మీద విడుదలయ్యాడు. ఆ హింసాకాండ మీద జనవరి 2న నమోదైన ఎఫ్ఐఆర్ మీద చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేసిన పోలీసులు జనవరి 8న మరొక దొంగ ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్నారు. ఈ కొత్త ఎఫ్ఐఆర్‌లో భీమా కోరేగాం హింసాకాండకు కారణం ఎల్గార్ పరిషద్‌లో వక్తలు ఇచ్చిన రెచ్చగొట్టే ఉపన్యాసాలనీ, ఎల్గార్ పరిషద్‌ను మావోయిస్టులు ఏర్పాటు చేశారనీ అబద్ధపు ఆరోపణలు మొదలయ్యాయి. ఈ ఎఫ్ఐఆర్ మీద మాత్రం వెంటనే కదిలిన పోలీసులు ఏప్రిల్ 17న ముంబైలో సుధీర్ ధావ్లె, నాగపూర్‌లో సురేంద్ర గాడ్లింగ్, ఢిల్లీలో రోనా విల్సన్‌ల ఇళ్ల మీద, పుణెలో, నాగపూర్‌లలో దళిత, రిపబ్లికన్ పాంథర్స్, కబీర్ కళా మంచ్ కార్యకర్తల ఇళ్ల మీద దాడి చేశారు.

జూన్ 6న సుధీర్ ధావ్లె, సురేంద్ర గాడ్లింగ్, రోనా విల్సన్‌లతో పాటు నాగపూర్‌లో ప్రొ. షోమా సేన్‌ను, మహేశ్ రౌత్‌ను భీమా కోరేగాం హింసాకాండ కేసులో అరెస్టు చేశారు. వీరిలో సుధీర్ ధావ్లె మినహా మరెవరికీ ఎల్గార్ పరిషద్‌తో సంబంధమూ లేదు, ఆరోజు అక్కడికి వెళ్లనూ లేదు. అరెస్టు మాత్రమే కాక, రోనా విల్సన్ లాప్‌టాప్‌లో దొరికాయంటూ పోలీసులు రెండు ఇంగ్లిష్ ఉత్తరాలు, ఒక హిందీ ఉత్తరం ప్రచార సాధనాలకు విడుదల చేశారు. ఆ ఇంగ్లిష్ ఉత్తరాల్లో ఒకటి "కామ్రేడ్ ప్రకాశ్" కు "ఆర్" రాసినదనీ, ఆర్ అంటే రోనా విల్సన్ అనీ, మరొకటి "కామ్రేడ్ రోనా" కు "ఎం" రాసినదనీ, ఎం అంటే మహారాష్ట్ర మావోయిస్టు పార్టీ మహారాష్ట్ర కమిటీ కార్యదర్శి మిళింద్ తేల్ తుంబ్డే అనీ, హిందీ ఉత్తరం "ప్రియ కామ్రేడ్" అనే సంబోధనతో "కా. మిలింద్" రాసినదనీ పోలీసులు చెప్పారు. ఈ ఉత్తరాలలో ఒకదానిలో నరేంద్ర మోడీ పై "రాజీవ్ గాంధీ తరహా చర్య" జరపాలని ఉన్నదని అన్నారు. ఈ ఉత్తరాల్లో ప్రస్తావనకు వచ్చాయని చెపుతూ ప్రకాశ్ అంబేడ్కర్, జిగ్నేష్ మేవాని, ఉమర్ ఖాలిద్, ఆనంద్ తేల్ తుంబ్డే, సురేంద్ర గాడ్లింగ్, వరవరరావు, రాధా డిసౌజా, ఆజాద్ హోషియార్ పురి వంటి ఎందరి పేర్లో పోలీసులు బైటపెట్టారు.

నిజానికి ఈ మూడు ఉత్తరాలు, ప్రత్యేకించి మోడీ హత్యా ప్రయత్నపు కుట్ర ఉత్తరం, ఎంతో హాస్యాన్ని పండించాయి. ఈ ఉత్తరం కేవలం పడిపోతున్న మోడీ ప్రతిష్ఠను తిరిగి పైకి ఎత్తడానికి, సానుభూతి సంపాదించడానికి వేసిన ఎత్తుగడ అని శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపి నాయకులు ఖండించారు. ఆ ఉత్తరాల్లో ఉన్న భాష, సంబోధన, సంతకం, పూర్తి పేర్లు రాయడం, సూక్ష్మ వివరాలు ఇవ్వడం వంటివి మావోయిస్టులు ఎప్పుడూ చేయరని, అందువల్ల ఈ ఉత్తరాలు కల్పితమైనవని మాజీ పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, ముప్పై ఏళ్లుగా విప్లవోద్యమాన్ని పరిశీలిస్తున్న జర్నలిస్టులు ఎందరో సవివరంగా, హేతుబద్ధంగా విమర్శించారు.

ఈ ఉత్తరాల్లో దొరికిన ఆధారాలతోనే తాము ఆగస్ట్ 28 సోదాలు, అరెస్టులు జరిపామని పోలీసులు చెపుతున్నారు. నిర్బంధితులందరినీ గృహ నిర్బంధంలో ఉంచమని, వారిని అరెస్టు చేయడానికి ఉన్న ఆధారాలేమిటో సెప్టెంబర్ 6న తనకు సమర్పించమని సుప్రీం కోర్టు

ఆగస్ట్ 29న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత, ఆగస్ట్ 31న ముంబైలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ పరమ్‌బీర్ సింగ్ ఒక పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మరికొన్ని ఉత్తరాలు ప్రచార సాధనాలకు విడుదల చేశాడు, కొన్ని భాగాలు చదివి వినిపించాడు. కోర్టు ముందర సమర్పించవలసిన "ఆధారాలను" ప్రచార సాధనాలకు ముందే ఇవ్వడం ద్వారా ప్రజలలో అనుమాన బీజాలు నాటడం ఈ పత్రికా సమావేశపు లక్ష్యం. ఈ చట్టవ్యతిరేక, అనైతిక ప్రవర్తనను సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది. ఇంతకూ, కొత్తగా విడుదల చేసిన మరొక పది ఉత్తరాలు కూడ నిందితులు, నిర్బంధితులు, లేదా మావోయిస్టు పార్టీ నాయకులు రాసుకున్నవి కాదని, అవి కూడ పోలీసులు సృష్టించిన అబద్ధపు ఉత్తరాలేనని రుజువులు చూపుతూ పత్రికల్లో, ప్రచార సాధనాల్లో ఎన్నో కథనాలు వెలువడ్డాయి. ఇలా అబద్ధపు ఉత్తరాలను, ఇమెయిల్ లను సృష్టించడం ద్వారా సాయిబాబా, తదితరులకు శిక్ష విధించేలా కింది కోర్టును ప్రభావితం చేయగలిగామని, అలాగే ఇప్పుడు కూడ విప్లవ సానుభూతిపరులను, ప్రజా ఉద్యమాల సమర్థకులను ఈ ఉత్తరాలలో ఇరికించి శిక్షలు విధించగలమని మహారాష్ట్ర పోలీసులు భావించారు. కాని ఈసారికి ఆ ప్రయత్నం విఫలం కావడం మాత్రమే కాక పోలీసులు కుటిలత్వం, అబద్ధాలు బైటపడ్డాయి.

ఈ సందర్భంలోనే ఆగస్ట్ 28 అరెస్టులను ఇంత విశాల దృశ్యంలో భాగంగా చూడకుండా, కేవలం వాటికవిగా చూసి, ఇంకా దారుణంగా అంతకు ముందరి నిర్బంధ ఘటనలతో పోటీపెట్టి వెలువడిన కుతర్కాలను, దురుద్దేశపూరిత వాదనలను కూడ అర్థం చేసుకోవలసి ఉంది. ఈ అరెస్టుల మీద పెల్లుబికిన నిరసన మీద అసూయతో, తమకు ఎప్పటి నుంచో అలవాటైన ఆవు వ్యాసంతో, విప్లవోద్యమం మీద, కొందరు వ్యక్తుల మీద మరొకసారి రాయి విసరడానికి అవకాశం వచ్చిందనే శునకానందంతో కొందరు పత్రికల్లో, సోషల్ మీడియాలో నోరు పారేసుకున్నారు. అనవసరంగా సాయిబాబాకూ ప్రస్తుత నిర్బంధితులకూ పోటీపెట్టి, ప్రస్తుతం బ్రాహ్మణులు అరెస్టయ్యారు గనుకనే ఇంత రభస జరిగిందనీ, గతంలో ఎప్పుడూ ఇటువంటి ప్రయత్నాలు జరగలేదనీ, నిర్బంధానికి కూడ కుల కోణం ఉన్నదనీ అవాకులూ చవాకులూ రాశారు.

మన సామాజిక జీవితంలో, స్పందనలలో కులం పాత్ర లేదని ఎవరూ అనలేరు గాని, అయినచోటా కానిచోటా అదే ఆవు వ్యాసం కుదరదు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కులంలో పుట్టక తప్పని సమాజంలో ఉన్నాం గాని, ఏ వ్యక్తినైనా అంచనా వేసేటప్పుడు పుట్టిన కులం ఒక్కటే ప్రమాణం కావడం మనువాదాన్ని పాటించడమే అవుతుంది. పుట్టుక వహించే పాత్రను గుర్తించవలసిందే గాని, దానితోపాటు, లేదా దానికన్న మిన్నగా ఆ మనిషి అధ్యయనం, ఆలోచన, వ్యక్తీకరణ, ఆచరణ, విలువలు కూడ ఆ మనిషి పట్ల ఇతర మనుషుల స్పందనలకు కారణమవుతాయని గుర్తించాలి. ఆగస్ట్ 28 నిర్బంధితులందరూ ముప్పై ఏళ్ల నుంచి యాభై ఏళ్లుగా ప్రజాజీవితాచరణలో, బహిరంగ ప్రజాజీవిత వ్యక్తీకరణల్లో ఉన్నవారు. వారిమీద నిర్బంధానికి కారణమైనదీ, ఆ నిర్బంధం పట్ల స్పందనకు కారణమైనదీ ఆ కృషే. అలాగే అందరు కార్యకర్తలూ సమానమే అనే ఆదర్శం ఎంతగా ఉన్నా ఒక్కొక్క కార్యకర్త మీద నిర్బంధానికి ఒక్కొక్కరకమైన స్పందన ఉండడానికి కూడ అవకాశం ఉంది. స్థలకాల వ్యక్తి పరిమితులు, అవకాశాలు ఉంటాయి.

ఇవాళ ఆగస్ట్ 28 అరెస్టుల మీద నిరసనలను ఖండించడానికి, లేదా ఈ నిర్బంధితుల అరెస్టును గత అరెస్టులతో, సాయిబాబా అరెస్టుతో పోటీపెట్టి, అప్పుడెందుకు ఇంత స్పందన రాలేదు అని ప్రశ్నిస్తున్నవాళ్లు, ఉద్దేశపూర్వకంగానే కొన్ని వాస్తవాల పట్ల గుడ్డితనం నటిస్తున్నారు. సాయిబాబా విషయంలో కూడ చాల స్పందన వచ్చింది. సాయిబాబాతో పాటు మరొక నలుగురికి కూడ యావజ్జీవ శిక్ష పడినప్పటికీ, ఒక్క సాయిబాబా పేరుతో ఒక జాతీయస్థాయి డిఫెన్స్ కమిటీ ఏర్పడింది. అది ఒక కింది కోర్టు తీర్పు అయినందువల్ల దాని మీద న్యాయపరంగా జరగవలసిన చర్యలు జరుగుతున్నాయి. ఇంతకూ ఇవాళ సాయిబాబా పేరును తమ అవసరం కొద్దీ వాడుకుంటున్నవాళ్లు, ఈ నాలుగు సంవత్సరాలుగా సాయిబాబా మీద అమలైన నిర్బంధం గురించి తాము స్వయంగా చేయగలిగిన పని వీసమెత్తు కూడ చేయలేదు. అంటే, వాళ్లు సాయిబాబా మీద నటిస్తున్న ప్రేమ నిజమైనది కాదనీ, అది కేవలం మరొకరి మీద నింద వేయడానికి అంది పుచ్చుకుంటున్న సాకు మాత్రమేనని తేటతెల్లమవుతున్నది.

ఇంతకూ ఈ ఆవు వ్యాసకర్తలు లేవనెత్తుతున్న అబద్ధపు అనుమానాలకు కూడ వాస్తవంగా జవాబులున్నాయి. ఆగస్ట్ 28 నిర్బంధితులు ఐదుగురూ ఎన్నడూ కులాన్ని, కులం వల్ల వచ్చే అవకాశాలను ఆమోదించినవారు కాదు. అయినా వారి తల్లిదండ్రుల, వారు పుట్టిన కులాన్ని బట్టి చూసినా ఆ ఐదుగురిలో ఇద్దరు మాత్రమే బ్రాహ్మణులు, ఇద్దరు క్రైస్తవులు, ఒకరు బహుశా బనియా. ప్రస్తుతం పెద్దఎత్తున పెల్లుబికిన స్పందనకు వారి కులం కన్న ముఖ్యంగా రెండు ప్రధాన కారణాలున్నాయి. ఒకటి, సుధా భరద్వాజ్, గౌతమ్ నవ్లాఖా ఇద్దరూ మావోయిస్టు రాజకీయాలకు దూరంగా ఉన్నవారని అందరికీ తెలిసినవారు. ఇద్దరూ ఢిల్లీలోని ప్రగతిశీల, ప్రజాస్వామిక మేధావులకు, మావోయిస్టులను విమర్శించే మేధావులకు కూడ తెలిసినవారు. సుధా భరద్వాజ్ తల్లి కృష్ణా భరద్వాజ్ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం స్థాపించినప్పుడు అక్కడ అర్థశాస్త్ర ప్రొఫెసర్ గా పని చేసిన వ్యక్తి గనుక ఆ విశ్వవిద్యాలయంలోనే చరిత్ర శాఖలో ఆమెతో పాటే చేరిన రొమిలా థాపర్, అర్థశాస్త్ర శాఖలోనే ఆమెకు సహోద్యోగిగా చేరిన ప్రభాత్ పట్నాయక్ వంటి పెద్దలు సుధా భరద్వాజ్ అరెస్టు మీద ఆందోళనతో సుప్రీంకోర్టు తలుపులు తట్టారు. అంత పెద్దలు రావడం వల్ల సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. రెండు, ఢిల్లీలో, ముఖ్యంగా సుప్రీంకోర్టులో స్పందించినవారు ఈ అరెస్టులను, సోదాలను, దాడులను ఎమర్జెన్సీ దాడులతో పోల్చుకున్నారు. న్యాయవాదులను కూడ అరెస్టు చేయడం మొదలుపెడితే ఇక దేశంలో హక్కుల గురించి, ప్రజా ఉద్యమాల గురించి మాట్లాడే అవకాశాలు మృగ్యమైపోతాయని, అందువల్ల ఇప్పుడు జోక్యం చేసుకోకపోతే ఇక మరొక అవకాశం రాదని ఆలోచించారు. వారిలో కొందరు ఈ అభిప్రాయాన్ని బహిరంగంగానే ప్రకటించారు కూడ.

అందువల్ల కుతర్కాలు, వ్యక్తిగత విభేదాలు, అసూయలు మాని తరుముకొస్తున్న ఫాసిజం ప్రమాదానికి వ్యతిరేకంగా విశాల ఐక్య ప్రతిఘటనను నిర్మించడం ఇవాళ్టి అవసరం. రొమిలా థాపర్, ప్రభాత్ పట్నాయక్ వంటి పెద్దలు, సుప్రీం కోర్టు న్యాయవాదులలో సుప్రసిద్ధులు ప్రదర్శించిన ఉదార, ప్రజాస్వామిక సంస్కృతిని మరింత విస్తరించడం, అన్ని ప్రాంతాలలోనూ నిర్బంధ వ్యతిరేక వేదికల నిర్మాణానికి పూనుకోవడం ఇవాళ చరిత్ర మనకు ఇస్తున్న ఆదేశం. ఇది కేవలం బుద్ధిజీవుల మీద నిర్బంధకాండను అడ్డుకోవడానికి మాత్రమే కాదు, ఇంతకన్న ఎక్కువ నిర్బంధానికి గురవుతున్న విశాల ప్రజారాశుల, దళితుల, ఆదివాసుల, మైనారిటీల, స్త్రీల హక్కులను, ప్రజాస్వామిక స్ఫూర్తిని పరిరక్షించడానికి ఇది చాల అవసరం.

(రచయిత వీక్షణం సంపాదకుడు) వీ

అరెస్టులు - పత్రికల సంపాదకీయాలు

***పౌరహక్కుల కార్యకర్తలను, మేధావులను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేయడంపై తమ సంపాదకీయాల ద్వారా జాతీయ పత్రికలు తెలిపిన స్పందనలను తెలియజేస్తున్నారు* అర్విణి రాజేంద్రబాబు**

భారతదేశంలో భిన్నాభిప్రాయ ప్రకటన నేరమా?

వివిధ రంగాలలో క్రియాశీలంగా పనిచేస్తున్న మేధావులపై, కార్యకర్తలపై కల్పిత నేరాలు మోపి అరెస్టు చేయడాన్ని, వారి ఇళ్లపై దాడులు చేసి సోదాలు నిర్వహించడాన్ని నిరసిస్తూ పలు వార్తా పత్రికలు సంపాదకీయాలు రాశాయి. ప్రభుత్వ దాడులను ఎండగడుతూ, రాజ్యాంగ సూత్రాలను తూ.చ. తప్పకుండా పాటించే వాతావరణం దేశంలో విలసిల్లేలా ఏర్పాట్లు చేయాలని, పరిపాలన న్యాయబద్ధంగా, చట్టరీత్యా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరాయి.

2018 ఆగస్టు 28న పూణె పోలీసులు వివిధ రాష్ట్రాలలోని హక్కుల నేతల ఇళ్లపై ఏకకాలంలో దాడిచేసి, అయిదుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వరవరరావు, సుధా భరద్వాజ్, గౌతం నవ్లాఖా, వెర్నన్ గోంజాల్వెజ్, అరుణ్ ఫెరీరాలపై తీవ్రవాదాన్ని అదుపు చేయడం కోసం ఉద్దేశించిన వాటితో సహా వివిధ సెక్షన్ల కింద అభాండాలు మోపారు.

వరవరరావు, అరుణ్ ఫెరీరా, గోంజాల్వెజ్‌లను పూణెలోని జిల్లా కోర్టులో హాజరుపరిచి, ప్రభుత్వంలో ఉన్నత స్థాయి వ్యక్తులను హత మార్చేందుకు పథకం రూపకల్పన చేశారని, కశ్మీరి విభజనవాదులతో సంబంధాలు కలిగి ఉన్నారని, ఈ సంవత్సరం ప్రారంభంలో పూణెలో జరిగిన అల్లర్లకు వీరే బాధ్యులని పలు ఆరోపణలు గుప్పించారు.

వారి అరెస్టులను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆ అయిదుగురిని తాత్కాలికంగా గృహ నిర్బంధంలో ఉంచమని ఆదేశిస్తూ 'భిన్నాభిప్రాయం కలిగి ఉండడం ప్రజాస్వామ్యానికి రక్షణ కవాటం లాంటిది – వ్యతిరేక అభిప్రాయాల్ని అనుమతించకపోతే కవాటం పేలిపోతుంది' అని అభిప్రాయం వెలిబుచ్చింది. విశ్రాంత ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు, విద్యార్థులు, చరిత్రకారులు, మేధావులు మహారాష్ట్ర పోలీసులు చేపట్టిన దుందుడుకు చర్యను తీవ్రమైన తప్పిదంగా పేర్కొంటూ, ప్రభుత్వానికి వ్యతిరేకమైన భావజాలాన్ని తుడిచిపెట్టే ప్రయత్నంలో భాగమే ఈ అరెస్టులు అని వ్యాఖ్యానించగా, దాదాపు అన్ని ప్రముఖ జాతీయ వార్తా పత్రికలు తమ పదునైన కలాలను ఝుళిపిస్తూ ఘాటైన తమ సంపాదకీయాలతో ప్రభుత్వ చర్యను తీవ్ర పదజాలంతో దుయ్యబట్టాయి. ఆయా పత్రికలు ఏమన్నాయో సంక్షిప్తంగా ఈ కింది వాక్యాలలో చదవండి.

టైమ్స్ ఆఫ్ ఇండియా

టైమ్స్ ఆఫ్ ఇండియా 'మెకార్థి తరహా వ్యాజ్యం' అన్న శీర్షికతో రాసిన సంపాదకీయంలో 'వామపక్ష మేధావులపై మహారాష్ట్ర పోలీసులు దేశవ్యాప్తంగా చేసిన ఆకస్మిక దాడి తీవ్ర కలకలం రేపింది. తప్పనిసరిగా ఇది న్యాయస్థానంలో ప్రశ్నించబడుతుంది' అని వ్యాఖ్యానించింది. 'ఒక భావజాలాన్ని వ్యతిరేకించాలంటే, దానికంటే మరింత మెరుగైన భావజాలంతో ఎదుర్కోవాలి, బలప్రయోగంతోనో లేక అణచివేత విధానాలతోనో కాదు. ప్రజాస్వామ్యానికి, ఆధిపత్య ధోరణి కలిగిన రాజ్యానికి మధ్య తేడా ఇదే' అని హెచ్చరించింది. 'భారతదేశం 1950లోనే ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని స్వీకరించి మావోయిజంపై సగం మేరకు యుద్ధం గెలిచింది. ఆ తర్వాత 1991లో సరళీకృత ఆర్థిక విధానం అమలులోకి తెచ్చి ఒక గొప్ప ముందడుగు వేసింది. ఇటీవలి కాలంలో మారుమూల గిరిజన ప్రాంతాలలో కూడా నక్సల్ భావజాలం తన పట్టును కోల్పోతున్నది. ఇప్పుడు దళితులనో, గిరిజనులనో లేదా కార్మిక సంఘ నాయకులనో లక్ష్యంగా పెట్టుకొని 'అర్బన్ నక్సల్స్' అన్న భావనను తిరిగి తోడాల్సిన అవసరం లేదు' అని తన అభిప్రాయం ప్రకటించింది.

'అయినా, రగులుకుంటున్న భయానక వాతావరణాన్ని విస్మరించలేం. ఎందుకంటే, అమెరికాలో మెకార్థి కాలంగా ప్రసిద్ధి గాంచిన 1950లలో వామపక్ష కార్యకర్తలను హింసించిన సంఘటన భారతదేశంలో పునరావృతమవుతుందా అన్న అనుమానం కలుగుతున్నది.'

ఇండియన్ ఎక్స్‌ప్రెస్

'రక్షక కవాటం' (సేఫ్టీ వాల్వ్) అన్న శీర్షికతో సంపాదకీయం రాసిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక 'గౌరవనీయులైన హక్కుల నేతలు, ఒక పూజారి, ఒక వకీలు, మరి ఒక కవి' ని ప్రభుత్వం ఎందుకు ఉగ్రవాదులుగా, కరుడుగట్టిన నేరస్థులుగా పరిగణించింది' అని ప్రశ్నించింది. 'వక్రబుద్ధితో చేసే ఏ పనైనా, న్యాయాన్ని పక్కదారి పట్టించేందుకు నిసిగ్గుగా చేసే ఏ విద్రోహకర చర్యయైనా ప్రభుత్వాన్ని బాధ్యురాలిని చేసే కర్తవ్యం సుప్రీం కోర్టుదే. చట్టం కిరాతకంగా రూపొందించబడినప్పుడు, రాజకీయం అసహనాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత సుప్రీంకోర్టుదే' అని బాధ్యతను అత్యున్నత న్యాయస్థానం మీదే ఉందని ఆ సంపాదకీయం.

ది హిందు

'నిశ్చేష్టులను చేసిన అరెస్టు'లు అన్న సంపాదకీయంలో ది హిందూ పత్రిక తాము చేసినపని సరైనదా అని నిరూపించుకోవాల్సిన బాధ్యత మహారాష్ట్ర పోలీసులదే అని వ్యాఖ్యానించింది. 'మానవ హక్కుల మేధావులపై చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని విస్తారంగా చేసిన అభియోగాలను, ఉన్నత స్థానాలలో ఉన్నవారిని హత్య గావించాలని కుట్రపన్నారని ఆధారాలు లేని ఆరోపణలను పోలీసులు రుజువు పరచలేకపోతే ప్రభుత్వ వ్యతిరేక స్వరాలను నిర్మూలించే ఉద్దేశ్యంతో చట్టాన్ని తమకనుకూలంగా మార్చుకుంటున్నారన్న అనుమానం నిజమవుతుంది' అని రాసింది.

'హక్కుల కార్యకర్తలు గాని, మేధావులు గాని చట్టానికి అతీతమైన వాళ్లేం కాదు. కానీ ఈ సంవత్సరం మొదట్లో పూణె సమీపంలోని భీమా – కోరేగాంవ్ వద్ద చెలరేగిన హింసను ప్రేరేపించారని, రాజద్రోహానికి పాల్పడ్డారని మహారాష్ట్ర పోలీసులు హక్కుల నేతలపై చేసిన ఆరోపణలను నిరూపించుకోవాల్సిన బాధ్యత మహారాష్ట్ర పోలీసులదే. స్ఫూర్తివంతమైన ఓ యుద్ధం జరిగి 200 ఏండ్లయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఉత్సవం జరుపుకునేందుకు గుమిగూడిన దళితుల సమూహాన్ని ఉద్దేశించి రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారన్న అభియోగంతో మొదలైన వివాదం సిపిఐ (మావోయిస్టు) పార్టీని ఇందులోకి లాగి ఒక పెద్ద కుట్రగా చిత్రీకరించే ప్రయత్నిం చేశారు.'

ది ఏషియన్ ఏజ్

'ది ఏషియన్ ఏజ్' పత్రిక మహారాష్ట్ర పోలీసుల వైపరీత్యాన్ని తీవ్రంగా ఎండగట్టింది. 'హక్కుల కోసం కృషి చేసే వాళ్లను అరెస్టు చేయడం న్యాయ సమ్మతం కాదు. ప్రధానమంత్రికి ప్రాణహాని తలపెట్టే పన్నాగం పన్నారన్నది తీవ్రమైన విషయం. ఈ ఆరోపణలోని నిజానిజాలు తేల్చడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. అంతేగాని, ఇప్పుడు జరుగుతున్నట్టుగా ఏదో పుకారు సృష్టించి రాజకీయ లబ్ది పొందుదామనుకునేంత చిన్న విషయం కాదు.'

'స్నేహపూర్వక' టి.వి ఛానళ్లు ప్రధానమంత్రి మోదీని హత్య చేయడానికి కుట్రపన్నారని అన్యాపదేశంగా ప్రకటిస్తున్నప్పటికీ, అరెస్టయిన ఈ అయిదుగురు 'అసమ్మతి వాదుల'కు ఆ కుట్రతో సంబంధం ఉందని ఆరోపించడం అర్థరహితం. వారందరికీ మన దేశంలోని పేద ప్రజలతో కలగలిసిపోయి వారి ప్రయోజనాల కోసం బహుకాలం పనిచేసిన చరిత్ర ఉన్నది' అని ఆ సంపాదకీయం వ్యాఖ్యానించింది.

'కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న వారి కార్యకలాపాలలో హింసతో కూడుకున్నవిగాని, ప్రజాందోళనకు దారితీసేవిగాని ఉన్నట్లుగా ఆధారాలేమీ లేవు. అందుకని, వారిని అరెస్టు చెయ్యడం అంటే 'థాట్ పోలీస్' (తమకు ఇష్టంలేని ఆలోచనలపై అణచివేత చర్యలకు పూనుకోవడం)కు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇలా చేస్తే, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారికి బలమైన హెచ్చరిక జారీ చేసినట్లుగా ఉంటుందని వారి ఉద్దేశ్యం కావచ్చు.'

డిఎన్ఎ

'జరగకూడని పెద్ద పొరపాటు'గా పేర్కొంది డిఎన్ఎ పత్రిక. చేసిన ఆరోపణలు చాలా తీవ్రమైనవని చెపుతూ ఆగస్ట్ 30 నాటి తన సంపాదకీయంలో పెరుగుతున్న నక్సల్స్ కార్యకలాపాలపై కూడా దృష్టి సారించింది. 'పూణె పోలీసులు ముందే కొంత కృషిచేసి ఉండ వలసింది. రూఢి అయిన ఆధారాలు సిద్ధపరిచి ఉండాల్సింది. అలా కాకుండా అరెస్టులు చెయ్యాలన్న తొందరలో విపత్కర పరిమాణాలకు దారితీసేలా చర్యలకు ఒడిగట్టారు.'

భారత ప్రభుత్వం హోంశాఖ వారు 2014లో విడుదల చేసిన గణాంకాలను ఉదహరిస్తూ, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో నక్సల్స్ చేతిలో సెక్యూరిటీ బలగాలు 1200 మంది హతమయ్యారని ఆ సంపాదకీయం పేర్కొంది. అయితే, 'అర్బన్ నక్సలిజం' ఆవిర్భవించిందన్న ఆరోపణకు ఏ రకమైన ఆధారాలు లేవు కాని, కొన్ని చోట్ల స్లీపర్ సెల్స్ ఉన్నాయని, ఆయుధాలు ధరించమని, హింసాత్మక చర్యల ద్వారా ప్రభుత్వాన్ని ఎదుర్కోవాలని మావోయిస్టు మేధావులు యువతను ప్రేరేపిస్తున్నారని అప్పుడప్పుడూ పుకార్లు వినిపిస్తుంటాయి అని ఆ సంపాదకీయం పేర్కొంది.

'అరెస్టయిన వారు ప్రశస్తమైన చరిత్రగల హక్కుల నేతలు, ప్రొఫెసర్లు, న్యాయవాదులని, చిల్లర నేరాలు చేసే నేరస్థులు కాదని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. పోలీసులు జాగ్రత్తగా లేకపోతే ఈ విషయం దేశవ్యాప్తంగా రాజకీయ సవాలును ఎదుర్కోవలసి వస్తుంది' అని హెచ్చరించిందా సంపాదకీయం.

ది టెలిగ్రాఫ్

'ది టెలిగ్రాఫ్' పత్రిక తన సంపాదకీయం 'పొద్దున్నే పోలీసు దాడి'లో 'అసలు, శాసనం ఉన్నదెక్కడ?' అని ప్రశ్నించింది. 'తొలిపొద్దు పొడిచే లోపలే దాడులు, ఆ తర్వాత అరెస్టులు చేసిన పద్ధతి పోలీసులు ఏకపక్షంగా చొరవ తీసుకున్నారని అర్థమవుతున్నది.

ఈ చొరవ జనవరి 1న భీమా–కోరేగావ్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలకు కారకులని చెప్పబడుతున్న అగ్రవర్ణ నాయకులను, లేదా మూకదాడులకు పాల్పడుతున్న 'గోరక్షకు'లను అదుపు చేయడంలో ప్రదర్శించలేదు. హేతువాద పాత్రికేయులు చంపబడుతున్నప్పుడు ఉపేక్ష ప్రదర్శించలేదు. బహుశా 'సనాతన సంస్థ' లాంటి ముఠాలు చేసిన హత్యా ఘటనలు వెల్లడి అవుతాయన్న భావనతో హక్కుల నేతల అరెస్టుకు తొందరపడి ఉండవచ్చు.

'అర్బన్ నక్సల్స్' అన్న ముద్ర 1969లో బ్రెజిలియన్ కార్లోస్ మేరి ఫెల్లా అర్బన్ గెరిల్లాకు నిర్వచనాన్ని స్ఫురణకు తెస్తున్నది' అని ఒక చారిత్రాత్మకాంశాన్ని గుర్తు చేసిందా సంపాదకీయం.

ది ట్రిబ్యూన్

నికచ్చితమైన ఆధారాలేమీ లేకుండానే అయిదుగురు హక్కుల నేతలపై తీవ్రమైన అభియోగాలు మోపారు అని 'వామపక్ష హక్కుల నేతలపై ఆకస్మిక దాడి' అన్న శీర్షికతో రాసిన 'ది ట్రిబ్యూన్' పత్రిక సంపాదకీయం పేర్కొంది. 'వాస్తవంగా ఇది ఎమర్జెన్సీ కాలాన్ని మరిపిస్తున్నది అన్న ప్రతిపక్షాల వారి ఆరోపణకు బలం చేకూర్చేట్టుగా చట్టాన్ని అమలుపరిచే కార్యనిర్వహణా సంస్థలు, రాజ్యవ్యవస్థ వ్యవహరించాల్సిన తీరు పలు అనుమానాలకు తావిస్తున్నది.

సావధానంగా ఆలోచించాల్సిన ఆవశ్యకత ఉన్నది. ఒక పద్ధతి ప్రకారం భిన్నాభిప్రాయాన్ని నిర్మూలిస్తూ ఉంటే, అలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిది. నిజాలు ఎంత అసౌకర్యంగా ఉన్నా, ఎంత చేదుగా ఉన్నా కల్బుర్గీలు, దభోల్కర్లు, గౌరీ లంకేశ్‌లు మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలి, గౌరవప్రదమైన జీవితం గడిపే అవకాశం వారికి ఉండవలసిందే. చివరి వ్యక్తి తాను భావించినది నిర్భయంగా వ్యక్తపరిచేంతవరకు, అందరికీ వినబడేలా ఆ వ్యక్తి చెప్పేంతవరకు మనం ప్రజాస్వామ్య వ్యవస్థగా మనగలుగుతూనే ఉంటాం."

అమర్ ఉజాలా

'అమర్ ఉకాలా' అన్న హిందీ పత్రిక 'కుట్రలు-అరెస్టులు' అన్న శీర్షికతో హక్కుల నేతల ఇళ్లపై దాడుల గురించి రాస్తూ మహారాష్ట్ర పోలీసులు తాము చేసిన ఆరోపణలను సుప్రీం కోర్టులో సమర్పించు కోవాల్సిన అవసరం ఉందని, ఇది వారికి పెద్ద సవాలు లాంటిదని వ్యాఖ్యానించింది.

దైనిక్ భాస్కర్

'భావాల సంఘర్షణలో హింసకు చోటులేదు' అన్న శీర్షికతో 'దైనిక్ భాస్కర్' పత్రిక 'ప్రభుత్వంలోని ప్రముఖుల హత్యకు నిజంగానే హక్కుల నేతలు ప్రణాళిక సిద్ధం చేసుకొని ఉంటే వారిని శిక్షించాల్సిందే. అలా కాని పక్షంలో అవి తప్పుడు ఆరోపణలు అని రుజువయితే ప్రభుత్వం దానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. అందుకు బాధ్యులయిన వారిని తగు విధంగా శిక్షించాలి' అని వ్యాఖ్యానించింది.

'రాబోతున్న ఎన్నికల ముందు అరెస్టుల ద్వారా, కోర్టు విచారణ ద్వారా రాజకీయ సంచలనాన్ని సృష్టించి తద్వారా లాభం పొందుదామని ప్రభుత్వ పెద్దలు భావిస్తే, ప్రతిపక్షాలు, హక్కుల నేతలు కలిసికట్టుగా ఉద్యమించి మానవ హక్కులను పరిరక్షించుకోవాలి.'

నవభారత్ టైమ్స్

అయిదుగురి హక్కుల నేతల అరెస్టు, మరికొంతమంది ఇళ్లపై దాడులు జరిపి సోదా చేయడానికి సంబంధించిన విషయాలను సమీక్షిస్తూ 'నవ భారత్ టైమ్స్' పత్రిక నక్సల్స్ హింసను అరికట్టడం ప్రభుత్వ బాధ్యత అయినప్పటికీ, పోలీసులు అత్యుత్సాహంతో భయానక వాతావరణం సృష్టించకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే అని పేర్కొంది. 'ఎమర్జెన్సీ కాలంలో పౌరహక్కులను కాపాడుకోవడానికి ఈ దేశం సుదీర్ఘ ఉద్యమం నిర్మించింది. దేశ జిడిపి పెంచడం ఎంత ముఖ్యమో, పౌరహక్కులను కాపాడడం కూడా అంతే ముఖ్యం' అని వ్యాఖ్యానించింది.

దైనిక్ జాగరన్

పైన పేర్కొన్న పత్రికలన్నింటికంటే భిన్నమైన అభిప్రాయం వ్యక్తపరిచింది దైనిక్ జాగరన్ పత్రిక. 'నక్సల్స్ సమర్థకులు' అన్న శీర్షికతో రాసిన ఆ పత్రిక సంపాదకీయంలో అరెస్టయిన వారిలో కొందరు నక్సల్స్ ఉద్యమాన్ని సమర్థించకపోయినా, దేశంలోని పట్టణ ప్రాంతాలలో అలాంటి వారు కొందరున్నారని వ్యాఖ్యానించింది.

'రేపు సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇచ్చినా, గ్రామీణ ప్రాంతాలలోని నక్సలైట్లు పూణె పోలీసులు అరెస్టు చేసిన వాళ్ల లాంటి వారి నుండి మద్దతు పొందుతున్నారన్నదాంట్లో అనుమానం లేదు. ఇది భిన్నాభిప్రాయం మీద దాడి అని, ఎమెర్జెన్సీ లాంటి పరిస్థితి ఇప్పుడు దేశంలో నెలకొన్నదని మేధావులు, మీడియా ప్రతిపక్షాలు ఎంతగా చెపుతున్నప్పటికీ దేశంలోని పట్టణ ప్రాంతాలలో అక్షరాస్యులయిన కొన్ని బృందాలు నక్సల్స్ పట్ల సానుభూతి వ్యక్తపరుస్తున్నారన్నది వాస్తవం."

ఇలా వ్యాఖ్యానిస్తూనే ఆ పత్రిక అరెస్టులను విమర్శించిన కాంగ్రెస్ పార్టీని తూర్పారబట్టింది. ఆ పార్టీకి పట్టణ ప్రాంతాలలో నక్సల్స్ మద్దతుదారులున్నట్టు బాగా తెలిసినప్పటికీ బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఏ అవకాశాన్ని వదిలి పెట్టడం లేదని దుయ్యబట్టింది.

ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ

'నక్సల్స్ అని నామకరణం చేసి రాజకీయం చేయడం' అన్న పేరుతో సంపాదకీయం రాసిన ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ మేధావులను, హక్కుల నేతలను అరెస్టు చేయడంలో ప్రభుత్వం విధానపరంగా గొప్ప తప్పిదం చేసిందని, నైతికంగా అమర్యాదకరమైన ప్రవర్తన కనబరిచిందని వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్య ప్రియుల దృష్టిలో ఇది భిన్నాభిప్రాయాన్ని కలిగి ఉండడమనే ప్రజాస్వామిక హక్కును అణిచివేయడమేనని ప్రకటించింది. ఇటీవలి కాలంలో దేశంలో జరిగన హేతువాదుల హత్యకు పాల్పడిన హంతకులకు హిందూత్వ శక్తులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న విషయం ప్రజా బాహుళ్యంలో వెళ్లిపోయిన సందర్భంలో ఆ పరిస్థితిని తటస్థం చేసే ఉద్దేశంతో ఈ పనికి ఒడిగట్టారని తన అభిప్రాయం వెలిబుచ్చింది. దేశంలో ఉద్యోగ సంబంధమైన ప్రక్రియ కులం అనే కుళ్లును పోలీసు వ్యవస్థ నుండి ఏరిపారేయడంలో విఫలమైందని ఎత్తిచూపుతూ, దానికి ఉదాహరణగా హైదరాబాద్‌లోని దళిత ప్రొఫెసర్ ఇంట్లో సోదా సందర్భంగా ఆయన్ను, ఆయన కుటుంబ సభ్యులను అవమానకరమైన ప్రశ్నలతో వేధించడాన్ని ప్రస్తావించింది. 'ఈ రకమైన నైతికంగా అసహ్యకరమైన, రాజకీయ భయాందోళనలకు గురిచేసే చర్యల ద్వారా హక్కుల రక్షణకు కృషిచేస్తున్న నేతలను దుర్బలులకు బాసటగా నిలవడాన్నించి దూరం చేస్తుంది. ఎవరి హక్కుల కోసం ప్రభుత్వం బాసటగా ఉండాలో, ఆ బాధ్యత సక్రమంగా నిర్వర్తించక పోగా, వారికోసం కృషిచేసే వాళ్ల కృషిని కూడా కొనసాగనివ్వడం లేదు.

ది వైర్

'ది వైర్' పోర్టల్ పత్రిక న్యాయవాదుల, కార్మిక సంఘ నాయకుల, రచయితల, హక్కుల నేతల ఇళ్లపై, ఆఫీసులపై పోలీసు దాడులు, ఆ తర్వాత అయిదుగురు మేధావుల అరెస్టు భారతదేశంలో ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న ఆందోళనకరమైన పరిస్థితికి అద్దం పడుతుందని తన సంపాదకీయం 'అర్ధరాత్రి ప్రజాస్వామ్యం తలుపులు తట్టిన పోలీసులు'లో పేర్కొన్నది.

'కేసును తప్పు దోవ పట్టిస్తున్న పూణె పోలీసులు: భీడే, ఎక్బోటేలను కాపాడడమే లక్ష్యం' - పూణె డిప్యూటి మేయర్ సిద్ధార్థ ధెండే.

జనవరి 7, 2018న భీమా-కోరేగాం హింసాత్మక ఘటనల తర్వాత మహారాష్ట్రలోని అన్ని జిల్లాలలో అంబేద్కరిస్టు గ్రూపులు పెద్ద ఎత్తున ఉద్యమించిన సందర్భంగా కొల్హాపూర్ ప్రాంత ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నింగ్రే పాటిల్ దళిత ఉద్యమ నాయకులతో ఒక మిటింగ్ ఏర్పాటు చేశాడు. ఆ సమావేశంలో దాదాపు 250 మంది దళిత ఉద్యమ సంస్థలు పాల్గొన్నాయి. పూణె డిప్యూటి మేయర్ సిద్ధార్థ ధెండే కూడా ఆ సమావేశానికి హాజరయ్యాడు. ఆ సమావేశంలో హిందూత్వ భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్న భిడే, ఎక్బోటేలే ఈ హింసకు కారణమని, వారిని వెంటనే అరెస్టు చెయ్యాలని సమావేశంలో పాల్గొన్న వారందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. వారి ఆవేశాన్ని చల్లార్చే ఉద్దేశ్యంతో ఆ పోలీసు అధికారి 'మీరే విచారించి ఒక నివేదిక పోలీసు శాఖకు సమర్పించండి. ఆ ప్రకారం చర్య తీసుకుంటాం' అని పది మందితో ఒక నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశాడు. ఆ కమిటీకి నాయకుడుగా పూణె డిప్యూటీ మేయర్ సిద్ధార్థ ధెండేను నియమించాడు. ఆ కమిటీ సభ్యులు సమస్యాత్మక గ్రామాలన్నీ కలియతిరిగారు. కార్యకర్తలను, ప్రెస్ రిపోర్టర్లను, గ్రామ పంచాయితీ

సభ్యులను, పోలీసు అధికారులను – పోలీసు సిబ్బందిని, దళితులను, దళితేతరులను కలిశారు. దాదాపు 400 మంది ప్రత్యక్ష సాక్ష్యులతో మాట్లాడారు. 250కి పైగా ఫొటోలు, విడియోలు, ఆడియో క్యాసెట్లు తమ రిపోర్టుతో సహా పోలీసులకు సమర్పించారు.

భీమా కోరేగాం సంఘటనలో నక్సల్స్ పాత్ర ఉందని పోలీసులు చేస్తున్న వాదనను ఆ నివేదిక నిర్ద్వందంగా తోసి పుచ్చింది. ఆ నిజనిర్ధారణ కమిటీకి నాయకత్వం వహించిన థెండే హిందుత్వవాదులు జనవరి 7 (2018) కంటె ముందు నుండే ఆ ప్రాంతంలో కుల ఉద్రిక్తతలను రేకెత్తించేందుకు ప్రయత్నించారని విస్పష్ట ప్రకటన చేశాడు. థెండే బిజెపి టికెట్టు మీదే పూణె డిప్యూటి మేయర్‌గా ఎన్నిక కావడం గమనార్హం.

ఆ దాడికి ప్రధాన కుట్రదారులు మిలింద్ ఎక్బోటే, మనోహర్ భిడే లని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఆ మరునాడే (జనవరి 2 నాడు) అనితా సవాల్ అన్న పూణె వాస్తవ్యుడు, హింసాత్మక ఘటనలకు ప్రత్యక్ష సాక్షి కూడా. ఆ ఇద్దరే దళితులపై జరిగిన దాడికి కారణమని, వారే హింసను ప్రేరేపించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజు ఆ ఫిర్యాదు ఆధారంగా పూణె పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తూ ఎక్బోటే, భిడేలు జరిగిన హింసకు కారకులని పేర్కొన్నారు.

ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పిన దాని ఆధారంగా, వాటర్ ట్యాంకర్‌లలో కిరోసిన్ నింపి తీసుకువచ్చారని, అంతకు క్రితం రోజు రాత్రే అక్కడి టీ కొట్టులో కర్రలు, కత్తులు దాచిపెట్టారని ఆ నివేదిక పేర్కొంది. ఆ దాడిలో పాల్గొన్న వారి పేర్లను కూడా పేర్కొంటూ స్థానికులు సహాయం కోసం చేసిన విజ్ఞప్తులు పోలీసులు, అధికారులు నిర్లక్ష్యం చేసిన వైనాన్ని కూడా ప్రస్తావించారు. మహారాష్ట్ర ప్రభుత్వంలో సామాజిక న్యాయశాఖను పర్యవేక్షిస్తున్న మంత్రి దిలీప్ కాంబ్లే కూడా చాలా ఆందోళనతో పోలీసులకు ఫోన్ చేసి దళితులపై దాడి జరుగుతుందని, వెంటనే చర్య తీసుకోండని చెప్పినా కూడా పోలీసులు పెడచెవిన పెట్టారని నివేదిక వెల్లడించింది.

అనిత సాల్వే ఇచ్చిన ఫిర్యాదును బలపరుస్తూ నిజనిర్ధారణ కమిటీ ఎన్నో సాక్ష్యాధారాలను సమర్పించినప్పటికీ పోలీసులు వాటి మీద దృష్టి సారించలేదు. కాని, హింసాత్మక ఘటనలు జరిగిన వారం రోజుల తర్వాత (జనవరి 9న) శంభాజి భిడే అనుచరుడు దాంగూడె (ఒక వ్యాపారస్థుడు) మరో రకమయిన ఫిర్యాదు పోలీసులకు ఇస్తే, దాని మీద చర్యలకు వెంటనే ఉపక్రమించారు. 31 జనవరి 2017 నాటి ఎల్గార్ పరిషత్ బహిరంగ సభలో వక్తలు రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చారని, వాటి కారణంగానే భీమా–కోరేగాం అల్లర్లు జరిగాయని దాంగూడె ఇచ్చిన ఫిర్యాదు సారాంశం. పోలీసులు సాల్వే ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోకుండా దాంగూడె ఇచ్చిన ఫిర్యాదు పైనే దృష్టి సారించారు.

భీమా కోరేగాం హింసకు కారకులుగా చెప్పబడుతున్న మిలింద్ ఎక్బోటే బెయిల్‌పై ఉన్నాడు. భిడేపై వచ్చిన ఫిర్యాదును పట్టించుకోమని పోలీసులు తేల్చి చెప్పారు. ఎక్బోటే మాజీ బిజెపి కార్పొరేటర్. శివజాగర్ ప్రతిష్ఠాన్ అనే సంస్థను స్థాపించినవాడు. భిడే ఆర్ఎస్ఎస్ కార్యకర్త. హిందూ జాగరణ సమితి అన్న పేరుతో ఒక హిందుత్వ సంస్థను స్థాపించాడు. ఆయన్ను ఆయన అనుచరులు, ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో సహా, 'గురూజీ' అని పిలుస్తారు.

'ఉద్దేశ్యపూర్వకంగానే పోలీసులు హింసను అదుపు చెయ్యడంలో ఉపేక్ష వహించారని' నిజనిర్ధారణ కమిటీ పేర్కొంది. కొంతమంది పోలీసులు సివిల్ దుస్తుల్లో కాషాయ జెండాలు పట్టుకొని హిందుత్వవాదుల గుంపులో ఉన్నారని, ఆ గుంపు విజయ స్థంబ్ చేరుకుంటున్న సమయంలో 'ఏం భయపడకండి. పోలీసులు మనవైపే ఉన్నారు,' అని అరుపులు వినిపించాయని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపినట్టుగా నిజనిర్ధారణ కమిటి తెలియపర్చింది. అందుకని, ఆ హింస గురించి విచారణకు మహారాష్ట్ర పోలీసులను నియమించవద్దని, దానికోసం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయమని నిజనిర్ధారణ కమిటీ సిఫారసు చేసింది.

సిద్ధార్థ థెండే మాటల్లో భీమా – కోరేగాం సంఘటనకు కారణం

సంఘటనకు కొద్దిరోజుల ముందు భీమా కోరేగాంకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నివాదుగాంమ్ వద్ద మహర్ కులానికి సంబంధించి వారి చరిత్రను ఉల్లేకిస్తూ ఒక బ్యానర్ వెలిసింది. 'వాదు ఖుర్ద్ గ్రామంలో శంభాజి భోస్లే, గోవింద గయక్వాడ్ సమాధులు ఉన్నాయి. (శంభాజి భోస్లే మరాఠా మహారాజు శివాజి కుమారుడు. యుద్ధంలో శంభాజి మరణిస్తే, ఆయన అంత్యక్రియలు గోవింద గయక్వాడ్ అన్న మహర్ కులస్థుడని మహర్ కులస్థులు నమ్ముతారు). ఆ బ్యానర్‌ను హిందూత్వవాదులు చించివేశారు. దాంతో ఆగ్రహించిన మహర్లు పోలీసులకు ఫిర్యాదు చేస్తే, పోలీసులు 49 మంది మిద ఎస్.సి, ఎస్.టి కేసు నమోదు చేశారు. దీంతో సవర్ణ హిందువులు రగిలిపోయారు. వారు దళితులకు వ్యతిరేకంగా కుట్ర పన్ని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. అంతేగాని ఎల్గార్ పరిషద్‌కు జనవరి 1న జరిగిన హింసకు ఎలాంటి సంబంధం లేదని నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. డిసెంబర్ 25 నుండి అంతకు ముందు నుండి కూడా వాట్సాప్‌లోను, ఫేస్‌బుక్‌లోను 'దళితులకు వ్యతిరేకంగా మనం కూడా ఏదో చర్య తీసుకోవాలి. అందరూ వాడుగాం్‌కు రండి. వారికి బుద్ది చెప్పాలి. మనం ప్రతీకారం తీర్చుకోవాలి' అని సందేశాలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఆధారాలను నిజనిర్ధారణ కమిటీ పోలీసులకు సమర్పించింది. ఆ తర్వాత, భీమా కోరేగాంలో గుమిగూడుతున్న లక్షలాదిమంది దళితులకు ఆహారం, నీరు ఏదీ అందకుండా చెయ్యాలన్న ఉద్దేశ్యంతో ఆ రోజు హిందూత్వవాదులు బంద్ పిలుపు ఇచ్చారు. అన్ని ఏర్పాట్లు ఇంత బహాటంగా జరుగుతున్నప్పటికీ, పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు ఏమి తీసుకోలేదు. భిడే, ఎక్బోటేతో పాటు ఆ గ్రామానికి చెందిన ఇద్దరు శివసేన నాయకులు రాహుల్ హార్ గుడె, దత్త హరగూర్‌లు కూడా ఈ అరాచకానికి నాయకత్వం వహించారు. శివసేన, ఎన్‌సిపిలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు కూడా దళితులకు వ్యతిరేకంగా జరిగిన హింసాకాండలో భాగస్వాములయ్యాయని నివేదికను విడుదల చేస్తూ థెండే పేర్కొన్నాడు.

బి.జె.పి, శివసేనలు ప్రత్యక్షంగా, కాంగ్రెసు, ఎన్‌సిపిలు పరోక్షంగా పాత్ర వహించాయి. ఆనాడు జరిగిన హింసలో నక్సలైట్ల పాత్ర ఉందనడానికి ఆధారాలు ఏమి లేవని కమిటీ నిర్ద్వందంగా తేల్చి చెప్పింది. మొత్తం దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకే పోలీసులు నక్సలైట్ల ప్రస్థావన తెస్తున్నారని కమిటీ అనుమానం వ్యక్తపరిచింది. వారు నక్సలైట్ గ్రూపులతో ఎల్గార్ పరిషద్‌ను జోడిస్తున్నారు. ఇది ఖండించవలసిన విషయం, ఈ ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదు అని కమిటీ విస్పష్టంగా ప్రకటించింది.

('కారవాన్' పత్రికలో ఆ పత్రిక అసిస్టెంట్ ఎడిటర్ తుషార్ మిట్టల్ రాసిన వ్యాసం ఆధారంగా ...)

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

అసలు కుట్రదారులెవరు?

ప్రజల పక్షాన గొంతు విప్పుతున్న ప్రజాస్వామికవాదుల అరెస్టు వెనుక అసలు కథ పాలకులు భీమా-కోరేగాంలో దాడికి పాల్పడిన సంఘ్ పరివార్ శక్తులను కాపాడడానికేనని అంటున్నారు ప్రొ. కె.పి. సుబ్బారావు

2014లో అధికారానికి వచ్చిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) దేశంలో రెండవ పెద్ద పార్టీగా అవతరించింది. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీయే ఏకైక పెద్ద పార్టీగా పాలన కొనసాగించింది. బిజెపి ప్రభుత్వం 'అభివృద్ధి' అనే నినాదానికి హిందుత్వ సిద్ధాంతాన్ని, జాతీయ వాదాన్ని ముడిపెట్టి ఎక్కువ రాష్ట్రాలలో అధికారానికి వచ్చింది. ఆర్థిక విధానాలలో ఆశ్రిత పెట్టుబడిదారీ పద్ధతులను, సామాజికంగా సాంస్కృతిక జాతీయ వాదాన్ని ఉపయోగించుకొని అంతిమంగా ప్రజలను హిందూ భావజాలం వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంది. గడిచిన నాలుగు సంవత్సరాలలో తన ద్వేష ప్రసంగాలతో ప్రజలను రెచ్చగొట్టడం, గో సంరక్షణ పేరిట దళితులను, ముస్లింలను చంపడం వారి చర్యగా మారింది. అధికార మదంతో, పెత్తందారి పోకడలకు పోవడంలోనే ఫాసిజానికి పునాదులున్నాయి. పేరుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యమైనా దాని విలువలను వమ్ముచేస్తూ అధ్యక్ష తరహా ప్రభుత్వంగా మార్చడానికి ప్రయత్నాలు చేసే సంకేతాలనిస్తూనే ఉంది. రాజ్యాంగ ప్రతులను తగలబెట్టడం దీనికి తార్కాణం. కొన్ని రాష్ట్రాలలో పేరుకు సంకీర్ణ ప్రభుత్వాలైనా పాలన సాగించేది ఒకటి, రెండు పార్టీలు, ఆ పార్టీలలోని అగ్రకుల బ్రాహ్మణ బనియా కులీన పాలనే కొనసాగుతున్నది. గుజరాత్ రాష్ట్రంలోనైతే పూర్తిగా ఒకే వ్యాపార కులం రాజ్యమేలుతున్నది.

బిజెపి ప్రభుత్వంలోని వర్గ పొందికను చూస్తే అధికారంలో ఉన్న అన్ని చోట్లా దళితులు అతి ముఖ్యంగా ముస్లింలను మినహాయించి అగ్రకుల, అగ్రవర్ణాలకే అధికారం కట్టబెడుతుంది. ఫెడరల్ విధానాన్ని కొనసాగిస్తున్నామని చెబుతూ యూనిటరీ విధానాన్ని అమలు పరుస్తుంది. తన అధికారంలో లేని దక్షిణాది రాష్ట్రాలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుంది. తనను విమర్శించే గొంతులను నొక్కివేసే ప్రయత్నంలో భాగంగా అసమ్మతి గళాలను, కలాలను స్తంభింపచేయాలని చూస్తుంది. ధిక్కరించే ప్రజా సముదాయాలను నిరంకుశ చట్టాలను ఉపయోగిస్తూ ఫాసిస్టు పద్ధతులతో పాలన కొనసాగిస్తుంది. ఎదుగుతున్న దళిత చైతన్యాన్ని, దళిత – మైనార్టీల ఐక్యతకు బయపడి దళిత నాయకులైన చంద్రశేఖర్ అజాద్ రావన్‌ను, జిగ్నేష్ మేవానీలపై అక్రమ కేసులు బనాయించి వారి కార్యకలాపాలను మొగ్గలోనే తుంచివేయాలని ప్రయత్నం చేస్తున్న వైనం చూస్తూనే ఉన్నాం. ఆగస్టు 28న ప్రజాస్వామ్య వాదులపై చేసిన అరెస్టులు, ఇళ్లపై చేసిన సోదాలు ఆ నేపథ్యంలో చూడాలి.

ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యం నిలదొక్కుకుందంటే అది ప్రజలు వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పుకొనే స్థితిలో ఉందని అర్థం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయడం, భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రకటించుకొనే హక్కుకు భంగం కలగరాదు. ఆగస్టు 28న ప్రజా క్షేత్రంలో పనిచేస్తున్న ప్రముఖులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమైన చర్య. అరెస్టు అయినవారంతా వివిధ రంగాలలో పేరుమోసినవారు. యావత్తు భారతదేశానికి పరిచయమున్న మేధావులు, రచయితలు, హక్కుల కార్యకర్తలు, దశబ్దాల నుండి ప్రజలలో పనిచేస్తున్న ప్రజల మనుషులు. వీరిలో తెలుగు రాష్ట్రానికి చెందిన విప్లవ రచయిత వరవరరావు, ఆదివాసి జీవితంతో పెనవేసుకొని వారి హక్కుల కోసం పనిచేస్తున్న సుధా భరద్వాజ్, హక్కుల నేతలు గౌతమ్ నవ్లాఖా, వర్నన్ గోంజాల్వెజ్, న్యాయవాది అరుణ్ ఫరేరాల అరెస్టులు, స్టాన్ స్వామి, క్రాంతి టేకుల, నసీమ్, ఆనంద్ తేల్‌తుంబ్డే, సత్యనారాయణ, కూర్మనాథ్‌ల ఇళ్లపై చేసిన దాడులు రాజ్యా ఫాసిస్టు ధోరణికి అద్దం పడుతున్నాయి. వారిని మానసికంగా హింసించిన తీరు వారి గోప్యతా హక్కుకు వ్యతిరేకమైంది.

ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్, ప్రభాత్ పట్నాయక్ లాంటి మేధావులు ఆ అరెస్టులపై వెంటనే స్పందించడంతో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పుతో కొంత ఉపశమనం జరిగింది. వారిని గృహ నిర్బంధంలో ఉంచాలని, నిరసన ఒక సేఫ్టీ వాల్వ్ లాంటిదని, దానిని అదిమిపడితే ప్రెషర్ ఎక్కువై కుక్కర్ పేలుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ పరిణామం ఆహ్వానించదగ్గదే. కాని ప్రభుత్వం ఈ తరహా నియంత్రణ, అణచివేతలను నిలిపివేస్తుందనే భరోసా లేదు.

మహారాష్ట్ర పోలీసులు ఈ అరెస్టులకు చెప్పే కారణాలు నమ్మశక్యంగా లేవు. వారు చేసే మొదటి ఆరోపణ 2018 జనవరి 1న భీమా కోరేగాంలో జరిగిన అల్లర్ల వెనుక వీరంతా ఉన్నారని, రెండవది వారు మావోయిస్టులతో కుట్రచేసి దేశ ప్రధాని నరేంద్రమోడీని చంపాలనుకుంటున్నారని. కొబ్బరి చెట్టు ఎందుకెక్కావంటే దూడ గడ్డికోసం అన్న చందంగా ఉంది ఈ ఆరోపణ. ఈ ఆరోపణలన్నీ ఒక పథకం ప్రకారం కల్పించినవని అందరికీ తెలుసు. అసలు భీమా కోరేగావ్ సంఘటనకు ఆరోపణలు చేయబడ్డ వారికి ఏ రకమైన సంబంధం లేదని ఎల్గార్ పరిషద్ నాయకుడు జస్టిస్ సావంత్ ఒక ఇంటర్వ్యూలో తేల్చి చెప్పాడు.

అసలు భీమా కోరేగాంలో ఏం జరిగింది? 1818 జనవరి 1న అప్పటి మహారాష్ట్ర పీష్వా రాజైన రెండవ భాజీరావ్‌కు బ్రిటిష్ సైన్యాలకు మధ్య యుద్ధం జరిగింది. భాజీరావు ఓడిపోయాడు. బ్రిటిష్ సేనలు విజయం పొందాయి. ఆ యుద్ధంలో మరణించిన 49 మంది సైనికులలో 22 మంది మహర్ కులానికి చెందినవారు. అప్పటి వరకు పీష్వాల రాజ్యంలో అమానవీయమైన అస్పృశ్యతకు గురైన మహర్లు భీమా కోరేగాంలో స్మారక స్థూపాన్ని నిర్మించి ప్రతి ఏటా జనవరి 1న ఒక వేడుకగా జరుపుకుంటారు. డా. అంబేద్కర్ 1927లో మొదటి సారిగా భీమా కోరేగాంలోని స్థూపాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం మహర్లు వేల సంఖ్యలో భీమా కోరేగాం

పసలేని ప్రగతి నివేదన సభ

***ప్రచార హోరుతో ప్రగతి నివేదన సభ అయినా, ముందస్తు ఎన్నికల ప్రకటనైనా ప్రజల దృష్టిని మళ్లించి మళ్లీ అధికారంలోకి వచ్చే కుతంత్రంలో భాగమేనని అంటున్నారు* బైరెడ్డి సతీష్**

దేన్నైనా ఆర్భాటంగా, అట్టహాసంగా ప్రదర్శన చేయడం తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు గారికి అలవాటు. ఆయన వేటినైనా 'బ్రహ్మాండం'గా, 'అద్భుతం'గా, 'గొప్ప'గా చేస్తారు కదా! సెప్టెంబర్ 2న ప్రగతి నివేదన సభ పేరుతో రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్‌లో నిర్వహించిన సభను కూడా 25 లక్షల మందితో నభూతో నభవిష్యత్ అన్న చందంగా నిర్వహించాలని తె.రా.స నాయకత్వం చాలా రోజుల ముందుగానే భారీ కసరత్తును చేపట్టింది. ఇది ఎంతగా జరిగిందంటే నిజంగా అంత భారీ బహిరంగ సభ జరుగబోతుందని దేశంలో ఎక్కడా ఇటువంటి స్థాయిలో జరగలేదని, జరగదనే స్థాయిలో అన్ని పత్రికలు, ఛానళ్లు కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రచారం కల్పించాయి.

అంత స్థాయిలో సభ జరిగిందా? లేదా? అనే విషయాన్ని పక్కన పెడితే జరుగబోతుందనే నమ్మకాన్ని కలిగించి దేశం దృష్టిని ఆకర్షించేలా చేయడంలో మీడియా 'సహాయం' తో తెరాస నాయకత్వం సఫలమైందనే చెప్పాలి.

ముందస్తు ముచ్చటకు తెరలేపేందుకు, ప్రజా బలప్రదర్శన చేసి తనకు తిరుగులేదని చెప్పేందుకు ముఖ్యమంత్రి ప్రతిపక్షాలు తేరుకునేలోపే చాలా దూరం పరుగెత్తి విజయానికి చేరువవ్వాలనే ఈ భారీ ప్రణాళికను వేశారు. గతంలో ఇలాంటి సభలు జరుగలేదని కాదు గానీ ఇవాళ ప్రభుత్వంలో ఉన్న పార్టీయే మొత్తం యంత్రాంగాన్నంతా ఉపయోగించి 3 వందల కోట్లతో ఈ 'భారీ' సభను నిర్వహించిందని మీడియాలో బాగానే ప్రచారం జరిగింది.

1990లలో ఆనాటి పీపుల్స్ వార్ పార్టీ ఆధ్వర్యంలో రైతు–కూలీ మహాసభలు వరంగల్‌లో జరిగినప్పుడు తరలివచ్చిన జనవాహిని తరువాత తెలంగాణ ఉద్యమ సందర్భంలో అటువంటి సభలే జరిగినాయి. అధికార పార్టీల సభలన్నీ జనాన్ని తరలించిన సభలుగానే మిగిలిపోతాయి. కాల క్రమంలో తరలివచ్చే జనాల స్థానంలో అన్ని వనరులతో తరలించబడే సభలే జరుగుతున్నాయి. ఇది మరీ ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ సభ కాబట్టి ఏ లోటు లేకుండా ప్రభుత్వ యంత్రాంగమంతా బాగానే పనిచేసింది.

ప్రజలను ఏ చిన్న మీటింగు పెట్టుకోనివ్వని పాలకపార్టీ మాత్రం అన్ని నిబంధనలను తుంగలోతొక్కి 20వేల పోలీసు యంత్రాంగంతో భద్రంగా సభను జరుపుకున్నది.

చేరుకుంటారు. ఈ సంవత్సరం జనవరి ఒకటితో ఆ యుద్ధం జరిగి 200 సంవత్సరాలైంది. ఈ ద్విశతాబ్దిని పురస్కరించుకొని మాజీ సుప్రీంకోర్టు జడ్జి పి.బి. సావంత్ నాయకత్వంలోని 'ఎల్గార్ పరిషద్' ఆధ్వర్యంలో డిసెంబర్ 31న ఒక బహిరంగ సభ జరిగింది. ఆ సభలో ప్రకాశ్ అంబేద్కర్, జిగ్నేష్ మేవాని, రాధిక వేముల మొదలగు వారు పాల్గొని ప్రసంగించారు. ఇది మింగుడు పడని సంఘ్ పరివార్ జనవరి 1న అక్కడికి చేరుకొని జన సమూహంపై బాంబులు వేసి అల్లర్లు సృష్టించారు. ఆ అల్లర్లపై మహారాష్ట్ర ప్రభుత్వం ఒక విచారణ కమిటీని నియమించింది. ఆ కమిటీ అల్లర్లు జరిగిన ప్రదేశాలను సందర్శించినప్పుడు బాంబులు తయారు చేసే కొన్ని ప్రాంతాలను గుర్తించింది. దీనికి మాజీ కార్పొరేటర్ మిలింద్ ఎక్బోటే, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త శంభాజీ భిడేలు కారణమని పోలీసులు వారిని అరెస్టు చేసి వెంటనే వదిలేశారు. ఈ అపవాదం నుండి తప్పించుకోవడానికి సంఘ్ పరివార్, బిజెపి ప్రభుత్వం జరిగిన సంఘటనలకు ఎల్గార్ పరిషద్ నిర్వహించిన సభలో మాట్లాడిన శక్తులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, దానివల్లనే అల్లర్లు జరిగాయని, అది పోలీసు కాల్పులకు దారితీసిందని ఎదురుదాడి చేయడం మొదలు పెట్టారు. దానిలో భాగంగానే జూన్‌లో సురేంద్ర గాడ్లింగ్ లాంటి వారిని అరెస్టు చేశారు. దాని పరంపరలోనే ఆగస్టులో జరిగిన అరెస్టులు, సోదాలు.

అరెస్టు చేసిన వారిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) మోపారు. ఈ అరెస్టులు చేయడానికి రుజువుగా చూపిన ఒక అజ్ఞాత లేఖను సైతం ప్రభుత్వం వెల్లడించలేకపోయింది. రాజద్రోహం పేరిట అణచివేసే చర్యలను ప్రభుత్వం చేపడుతుంది. ప్రజలకు విమర్శించే హక్కు ఉందని పాలకులు గ్రహించాలి. ఎలాగూ రాజకీయ ప్రత్యర్థులపై ఐపిసి సెక్షన్ 124–ఎ ను ఒక ఆయుధంగా ఉపయోగిస్తుంది ప్రభుత్వం. ఇప్పుడు కొత్తగా అర్బన్ నక్సలైట్లనే నినాదాన్ని తెరమీదకు తీసుకొచ్చింది కేంద్ర ప్రభుత్వం. దీన్ని భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఒక సాకుగా తీసుకొని ఉద్యమకారుల నోళ్లు నొక్కవచ్చు. అలాంటప్పుడు ప్రశ్నించే ప్రతీవ్యక్తి అర్బన్ నక్సలైట్‌గా మారిపోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి వస్తుంది. భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కులలో విడదీయరాని భాగం. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ విశ్వాసం కలిగి ఉండడం, అసమ్మతిని తెలియజేయడం భావప్రకటనలో అంతర్భాగమేనని ప్రభుత్వాలు గుర్తించాలి. అరెస్టు చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని ప్రజాస్వామిక వాదులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ఇంతవరకూ భీమా కోరేగావ్ పోరాటాన్ని మహర్లు తప్ప మిగిలినవారు మరిచిపోయారు. కాని కుట్రదారులు పాత గాయాలను కెలికి భారత రాజకీయాలను మరింత భ్రష్టు పట్టిస్తున్నారు.

(రచయిత విశ్రాంత ఆచార్యులు, ఆంధ్ర యూనివర్సిటీ) వీ

సాధారణ సమయంలో ట్రాక్టర్లలో ప్రజలు ప్రయాణం చేయడం నేరం కానీ ఇక్కడ నిర్వహిస్తున్నది అధికార పార్టీ కదా ఏదీ నేరం కాదు, ఏ నిబంధన అడ్డు రాదు.

14 వందల ఎకరాలలో పార్కింగ్, 600 ఎకరాలలో ప్రజలు కూర్చునేలా ఏర్పాటు, 10,500 ఆర్టీసీ బస్సులు, 15,000 విద్యుత్తు దీపాలతో దేదీప్యమానంగా సభను నిర్వహించారు. సభకు ఎంత మంది వచ్చారు? అనే విషయంలో ఎవ్వరి లెక్క వారికుంది. ఎవరి లెక్క ఎంత ఉన్నా వచ్చింది మాత్రం అనుకున్న 25 లక్షలలో సగం కాదు కదా పావు వంతే అనేది ఆ పార్టీ నాయకులే కాకుండా అన్ని పత్రికలు, ఛానళ్లు దాదాపుగా అదే విషయాన్ని చెప్పాయి.

మీటింగ్‌కు ముందు కనపర్చిన ఉత్సాహాన్ని, ఉబలాటాన్ని ప్రభుత్వ పార్టీ పెద్దలు ఆ తరువాత ప్రదర్శించలేక పోయారన్నది వాస్తవం. సహజంగా తెరాస మీటింగ్‌లన్నీ ఫార్మాలిటీ కొద్దీ ఎవరో కొందరు నాయకులు మాట్లాడినా మొత్తంగా వన్‌మ్యాన్ షోలే.

45 నిమిషాల పాటు కొనసాగిన ముఖ్యమంత్రి ప్రగతి నివేదన ప్రసంగంలో నాలుగున్నర ఏళ్లలో సాధించిన 'ప్రగతి'ని ఏకరువు పెట్టారు. తమ మొదటి క్యాబినెట్ సమావేశంలోనే 45 నిర్ణయాలు తీసుకున్నామని మొత్తం నేటివరకు 465 కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టిందని మ్యానిఫెస్టోలో పేర్కొనని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపట్టిందని ఆ ప్రగతి చక్రం ఆగిపోకూడదంటే మళ్లీ మాకు ముందస్తుగా అధికారాన్ని రెన్యువల్ చేయండనేలా ముఖ్యమంత్రి నివేదన కొనసాగింది.

మ్యానిఫెస్టోలో చెప్పని కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుభీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి 76 ప్రభుత్వ కార్యక్రమాలు అమలవుతున్నాయని ఈ అభివృద్ధి అంతా గత ప్రభుత్వాల మొత్తం అభివృద్ధి కంటే ఎక్కువ అని తమ ఘనతను చెప్పుకొచ్చారు. పేదలకు పెళ్లిళ్లు భారం కాకూడదని కళ్యాణలక్ష్మితో సంతోషంగా పెళ్లిళ్లు జరుగుతున్నాయని, బతుకమ్మకు బట్టలు, రంజాన్, క్రిస్‌మస్ పండుగలకు ఆయా వర్గాలకు అందిస్తున్న సహాయాన్ని గొప్పగా చెప్పాడు. ప్రభుత్వం అందించిన గొర్రెలు, బర్రెలతో సాఫ్ట్‌వేర్ రంగంలో గడించిన లాభాలవలే 1500 వందల కోట్ల సంపద సృష్టించబడ్డదన్నారు.

పాడి రైతులకు లీటరుకు 4 రూపాయల ప్రోత్సాహకాన్ని, వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటును సరఫరా చేస్తున్నామన్నారు. కల్లుగీత కార్మికులకు చెట్టుపై పన్ను రద్దు, జంటనగరాల్లో అమ్మకాల పునరుద్ధరణ, నాయీ బ్రాహ్మణుల క్షవరశాలకు అందిస్తున్న విద్యుత్ కనెక్షన్లను వ్యాపార పరిధి నుండి తొలగించినట్టు పేర్కొన్నారు.

రైతులకు మేలు చేసేలా భూ రికార్డుల ప్రక్షాళనతో పాటు 5500 కోట్లతో రైతుబంధు పథకం కింద చేతుల్లో చెక్కులు పెట్టినట్టు, 22 వేల గ్రామాలకు శుద్ధ జలం ఇప్పటికే మిషన్ భగీరథ కింద ప్రారంభించినట్టు, మరో 1300 గ్రామాలు మిగిలి ఉన్నాయని వాటన్నింటికి త్వరలో అందిస్తామని ఈ పథకాన్ని నీతి అయోగ్ కూడా ప్రశంసించిందని ప్రకటించారు.

ఆర్థిక ప్రగతిలో తెలంగాణ దేశంలో నెం.1 అని 17.17 శాతం వృద్ధి రేటుతో నాలుగేళ్లలో ప్రగతి పథంలో దూసుకుపోతున్నదని, రాజకీయ అవినీతిని సంపూర్ణంగా నిర్మూలించామని తమకు తాము సర్టిఫికేటు ఇచ్చుకున్నారు. కేజి టు పిజి ఉచిత విద్యా హామీని నెరవేర్చే క్రమంలో అనేక గురుకులాలు స్థాపించామని, దేశమంతా మైనార్టీలకు నాలుగు కోట్లు కేటాయిస్తే ఒక్క తెలంగాణలోనే 2 వేల కోట్లు కేటాయించిన ఘనత తమదే అని చెప్పుకొచ్చారు.

ఇసుక మీద విమర్శలు చేస్తున్నారంటూ గత 10 సంవత్సరాలల్లో ఇసుకపైన 9 కోట్ల 60 లక్షల రూపాయల ఆదాయం వస్తే నాలుగున్నర ఏళ్లలో రు. 1980 కోట్ల ఆదాయం వచ్చిందని, అది తాము సాధించిన గొప్ప అని కీర్తించుకున్నారు.

గిరిజన తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చామని గత పాలకులు చేయలేనిది తాము చేసామని చెప్పారు. తక్షణ ఉపశమన చర్యలు, సంక్షేమ పథకాలు, శాశ్వత అభివృద్ధి ప్రణాళికలుగా తమ విధానాలు కొనసాగుతున్నాయని ప్రగతి నివేదిక సారాంశంగా వెల్లడించారు.

నియోజకవర్గానికి లక్ష ఎకరాలు, రాష్ట్రమంతటా కోటి ఎకరాలకు నీళ్లు అందించి ఆకుపచ్చని తెలంగాణను రూపొందించడమే తమ లక్ష్యం అని వారు చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి అవి ఏయే దశలలో ఉన్నాయని వివరించారు.

ముఖ్యమంత్రి ప్రసంగం, వారు పంచిన ప్రగతి నివేదన పత్రాలను టిఆర్ఎస్ మ్యానిఫెస్టోలోను, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సందర్భంలోను, ఎన్నికల నేపథ్యంలోను ఎన్ని హామీలను ఎన్నిసార్లు ఇచ్చారో తెలుసుకుంటే వీళ్లు చెప్పే ప్రగతిలో ఎంత ప్రగతి ఉందో తెలుస్తుంది.

ఉద్యమ సందర్భంలో నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు, రాష్ట్రమంతా కోటి ఎకరాలకు సాగునీరు అంటూ ప్రాజెక్టుల రీడిజైనింగ్‌తో సాగదీసి సాగదీసి నత్తనడకను తలపించేలా చేయడమే కాకుండా ప్రాణహిత - చేవెళ్లను కాళేశ్వరంగా ఆకృతి మార్చి తన ప్రాజెక్టే అని ప్రచారంతో హోరెత్తిస్తున్నది. 70 శాతానికి పైగా తాగునీరు అందుతున్న ప్రాంతాలతో పాటు మరో 30 శాతం ప్రాంతాలకు తాగునీరు ఏర్పరచాల్సిన ప్రభుత్వం ఉన్న పైపుల్ని ఊడబీకి మిషన్ భగీరథ పేరుతో తానే కొత్తగా ఇప్పుడే తాగునీరు అందిస్తున్నట్లు ప్రచార ఆర్భాటానికి పాల్పడుతున్నది. మిషన్ కాకతీయలో చెరువుల మాటేమో గాని కాంట్రాక్టర్‌లకు దండిగానే దక్కింది.

నిధులకు కొరతలేదంటూ కోతలు కోస్తూ బడ్జెట్‌ను లక్ష కోట్లకు పరిగెత్తించి కాగితాల్లో కేటాయింపుల్ని కోట్లకు కోట్లు చూపించి నికరంగా విడుదలైన నిధులెన్నో ఖర్చు అయ్యింది ఎంతో ఏనాడూ లెక్క చెప్పలేదు.

అప్పులు లేనిదే అభివృద్ధి జరగదు అంటూ దేశంలో ఏ రాష్ట్రంలో తేని అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని ఋణ ఊబిలో కూరుకుపోయేలా చేసింది. ఉద్యోగుల్ని, నిరుద్యోగుల్ని నిలువునా ముంచి ప్రగతి నివేదనలంటూ ప్రగల్భాలు పలుకుతున్నది. రైతుల ఆత్మహత్యలు నిలువరించలేక, రైతు రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయకుండానే రైతుబంధు పేరుతో అభివృద్ధి, పని చేయకుండా పైసలు పంచే పనిలో పడింది. దళితులకు ముఖ్యమంత్రి ఏమోగాని మూడు ఎకరాల మాట మూన్నాళ్లముచ్చటే అయిపోయింది. పాత ప్రభుత్వాల పించన్‌ల కొనసాగింపు, గొర్రెలు, బర్రెల పేరుతో ఓటు బ్యాంకును తయారు చేసుకునే పనిలో పడిందే తప్ప సబ్బండ వర్గాల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందించలేక పోయింది.

ఏవో కొన్ని గురుకులాలను నెలకొల్పి కేజి టు పిజి ఉచిత విద్య హామి సంపూర్ణంగా అమలైందనట్టు చేతులు దులుపుకుంటున్నారు.

నియామకాల కథ ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. లక్ష 7 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అసెంబ్లీలో అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం నికరంగా నింపింది 15 వేలు కూడా దాటలేదు. గ్రూప్-2, ఉపాధ్యాయ నియామకాల ప్రకటనలు అతికష్టంగా వెలువరించి నియామక పత్రాలు ఇవ్వకుండానే అటకెక్కించింది. ఇదిగో అదిగో అంటున్న ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది నిరుద్యోగులు నిరాశ, నిస్పృహల్లోకి జారుకుంటున్నారు. అనేక చోట్ల ఆత్మహత్యలు చేసుకోవడము ఆందోళన కలిగిస్తున్నది.

కొత్త జోన్ల వ్యవస్థ గురించి గొప్పగా చెప్పుకోవడమే తప్ప ఉద్యోగాలు నింపిందిలేదు, స్థానికులకు అవకాశాలు కల్పించిందీ లేదు. ఒక్క పోస్టును కూడా నింపకుండా, తాత్కాలిక అధ్యాపకులతో కాలం నెట్టుకొస్తూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రమాణాలు పడిపోవడానికి, విద్యా వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వసనీయత దెబ్బ తినడానికి ప్రభుత్వమే ప్రథమ ముద్దాయిగా నిలిచింది.

గత ప్రభుత్వాలు కట్టించిన ఇండ్లు అగ్గిపెట్టెల్లా ఉన్నాయని, బ్రహ్మాండమైన డబుల్ బెడ్రూం ఇళ్లు మూడు లక్షలు కట్టిస్తామన్న ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో పట్టుమని 10 వేల ఇళ్లను కూడా పూర్తి చేయలేకపోయింది. ప్రతి నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి, ప్రతి జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తామనే మ్యానిఫెస్టో హామీ ప్రగతి నివేదికలో మచ్చుకైన కానరాలేదు.

ఉద్యోగులకు అందిస్తామన్న నగదు రహిత చికిత్స, హెల్త్‌కార్డులు దేనికి కొరగాకుండా పోయినవి. కేసీఆర్ కిట్ల పేరుతో గర్భిణీ స్త్రీలకు అందించిన కిట్లే గొప్ప వైద్య సేవ అయింది తెలంగాణ రాష్ట్రంలో.

ప్రగతి నివేదికలో ప్రస్తావనకు రాని అనేకం టిఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఉన్నాయి. ముస్లిం మైనార్టీలకు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు అందిస్తామని హామీ ఇచ్చి అనేక విషయాల్లో కేంద్రంతో అంటకాగిన తెరాస ప్రభుత్వం వాటిని అందించలేక పోయింది.

రాజ్యాంగ పరమైన చిక్కుముళ్లను చేదించాల్సిన బాధ్యతను విస్మరించి ముసాయిదాను కేంద్రానికి పంపించి చేతులు దులుపుకున్నది. క్రిష్టియన్ మైనార్టీలకు, వికలాంగులకు కల్పిస్తామన్న రిజర్వేషన్ల ఊసెత్తలేదు ప్రగతి నివేదన ప్రసంగంలో.

తెరాస ఎన్నికల ప్రణాళికలో ప్రజల న్యాయబద్ధమైన కోరికల సాధనకై ప్రజాస్వామికంగా ఉద్యమించే హక్కుల పరిరక్షణకై పాల్పడతామని హామీ ఇచ్చింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ప్రజాస్వామికమైన, రాజ్యాంగా బద్ధమైన హక్కుగా గుర్తించబడ్డప్పుడు ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాక పౌరస్వేచ్ఛ, హక్కులు మరింత పరిఢవిల్లాల్సిన చోట ఉద్యోగాలు ఇవ్వండని యువతరమంతా ప్రజాస్వామికంగా, చట్టబద్ధంగా ఉద్యమిస్తుంటే వారి హక్కుల్ని అణచివేసి యువతరం ఆకాంక్షల్ని తృంచివేసే దుర్మార్గానికి పూనుకున్నది ప్రభుత్వం.

తెలంగాణ తుదిపోరుకు వేదికగా, సాక్ష్యంగా నిలిచిన ధర్నాచౌక్‌ను ఎత్తివేసి తన అప్రజాస్వామిక స్వభావాన్ని భయటపెట్టుకున్నది. కనీస నిరసన హక్కును కూడా సహించకుండా నియంతృత్వ పోకడలకు దిగుతున్నది.

పాలనలోనూ, ప్రజా వ్యవహారాల్లోనూ ప్రజలకు ఏమాత్రం భాగస్వామ్యం లేకుండా ఒంటెద్దుపోకడలనే అనుసరించింది. ఆనాటి ఉద్యమ ద్రోహుల్ని, అణచివేత దారుల్ని పదవులిచ్చి ప్రజలనెత్తిన రుద్దింది. మరోవైపు ప్రజాపక్షం వహించి తెలంగాణ కోసం పోరాడిన నిజమైన తెలంగాణ వాదులపై నిర్బంధాన్ని ప్రయోగించింది.

భారీ బహిరంగ సభలు పెట్టుకోవడానికి అన్ని నిబంధనలను తుంగలోతొక్కే అధికార పార్టీకి చిన్న నిరసన సభను కూడా జరుపు కోనివ్వకుండా అడ్డుకున్నది. బంగారు తెలంగాణ, ఆకుపచ్చని తెలంగాణలో హక్కులుండవేమో! అసెంబ్లీనీ రద్దుచేసి ముందస్తుగా ఎన్నికలకు వెళ్లడంలో అధికార దాహం తప్ప ప్రజా ప్రయోజనాలేమిలేవు.

2019లో ముఖ్యమంత్రి గారి జాతకం బాగా లేదనో, జమిలి ఎన్నికలు కలిసిరాక పోవచ్చనే నెపంతోనో ముందస్తు ముహూర్తం తప్ప తెలంగాణకు అదనంగా ఒనగూడె ప్రయోజనాలేమి ఉండవు. దేశమంతటా లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్నా బిజెపి ప్రతిపాదనను బలంగా సమర్ధించి తన సమ్మతిని సైతం తెలిపిన పార్టీ సడన్‌గా 'ముందు'కెందుకెళ్తున్నదో?

తాను చేపట్టిన 'అభివృద్ధి' ఆగిపోకూడదంటే గడువు సమీపించేదాక ఆగడం వల్ల అదనంగా సమయాన్ని పొందవచ్చు మరోసారి గెలిస్తే ఈ అభివృద్ధినే మరింతగా కొనసాగించవచ్చు. ప్రజా జీవితాల్లోకి కొత్త అభివృద్ధి అనుభవం వచ్చిచేరితే ప్రజలే గుర్తిస్తారు. వేదికలెక్కి అభివృద్ధిని చూడండహో అని ఆడంబరంగా అరవాల్సిన అవసరం రాదు. అయినా ముందుస్తు మురిపం మున్ముందు మోదాన్నిస్తుందో? ఖేదాన్నిస్తుందో? సమీప భవిష్యత్తులో ప్రజలే తేలుస్తారు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

వచ్చే సంచికలలో...

- పాలకవర్గం అణచివేతలో స్త్రీ లోకం - డా. కత్తి పద్మారావు
- కేంద్రం నీరు కారుస్తున్న సమాచార హక్కు చట్టం - చిమ్మె జాన్ బర్నబాస్
- చైతన్యంతోనే సురక్షితమైన భవిష్యత్తు - ఆర్. లక్ష్మి
- విద్య ద్వారానే విప్లవాత్మక మార్పులు - బోరెడ్డి మధుసూదన్ రెడ్డి

కొండగట్టు ప్రమాదం - ప్రభుత్వ వైఫల్యం

ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టపరచకుండా బలహీనం చేస్తూ, అరకొర ఉద్యోగులపై అధిక భారం వేస్తూ, ప్రయాణికుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని అంటున్నారు జి. శ్రీనివాస్

తెలుగు రాష్ట్రాల ఆర్‌టిసిల్లో భద్రత, రక్షణ అంతా బూటకం. మానవునికి ప్రపంచంలో కెల్లా అత్యంత విలువైనది ప్రాణం. ఆ ప్రాణానికి తగిన రక్షణ, భద్రత కోసం మనిషి అన్వేషణ నిరంతరం కొనసాగుతూనే ఉన్నది. ప్రకృతి నుండి వాటిల్లే ప్రమాదాల నుండి తనను తాను కాపాడుకోవడానికి మనిషి ఎన్నో రక్షణలు ఏర్పాటు చేసుకున్నాడు. సంఘ జీవితంలో ప్రాణ రక్షణకు తగిన ఏర్పాట్లను నిరంతరం పేర్చుకుంటూ మానవ నాగరికతా వికాసం వైపు పయనం సాగిస్తూనే ఉన్నాడు. తన మేధస్సును అభివృద్ధి చేసుకుంటూ సాంకేతిక జ్ఞానాన్ని సాధిస్తూ మరింతగా సౌకర్యవంతమైన జీవితం పొందుతూ అంతిమంగా జీవనం భద్రంగా ఉండే ఏర్పాట్లను పొందు పరచుకున్నాడు. తాను ఏర్పాటు చేసుకొన్న సౌకర్యాలలో వేగవంతమైన రవాణా ఒకటి. వేగవంతమైన రవాణా వల్లనే ప్రపంచదేశాల మధ్య, ఆయాదేశాల ప్రజల మధ్య సామాజిక, వాణిజ్య సంబంధాలు దగ్గరయ్యాయి. అటువంటి రవాణా వ్యవస్థ పట్ల ప్రపంచ వ్యాప్తంగా భద్రత పై చేపట్టవలసిన చర్యల గురించి నిరంతరం సమీక్షలు, చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రోడ్డు రవాణాలో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కరంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా రోడ్డు ద్వారా ప్రజారవాణాలో ప్రమాదాల వల్ల మరణాలరేటు పెరుగుతూనే ఉన్నది. భారతదేశంలో ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్లుగానీ, ప్రజారవాణా వాహనాలు గానీ పెరగకపోవడమే. ప్రజలకు సౌకర్యవంతమైన, రక్షణాత్మకమైన రవాణాను అందించడం రోడ్డు రవాణా చట్టం 1950 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యత ఉన్నది. ఆ బాధ్యతను స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేషన్‌లుగా ఆర్‌టిసిలను ఏర్పాటు చేయడమైనది. కానీ ఆర్‌టిసిలు ప్రజల రవాణా అవసరాలను పూర్తిగా తీర్చలేని స్థితిలో ఉన్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులను పెంచుకోవలసిన ఆర్‌టిసిలు ఉన్న బస్సులను కూడా తగ్గించుకునే పరిస్థితి నేడు నడుస్తోంది. ఈ పరిస్థితికి కారణం ఆటో మొబైల్ కంపెనీలు తమ అమ్మకాలను పెంచుకునేందుకు ప్రభుత్వం చేత ఆర్‌టిసిలను నిర్వీర్యం చేయించే కుట్రకు పాల్పడుతున్నాయి.ఫలితంగా వ్యక్తిగత వాహనాలు పెరుగుతున్నాయి. సామూహిక ప్రజా రవాణా వాహనాలు కుదించబడుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ఆర్‌టిసిల నందు దశాబ్దకాలంగా ఒక్క ఆర్డినరీ బస్సు కూడా పెంచబడలేదు. ఉన్న బస్సులను తగ్గించారు. ఇందుకు నష్టాలను కారణంగా చూపెడుతున్నారు. ముఖ్యంగా ఆర్డినరీ బస్సుల్లో ఈ నష్టాల లెక్కలు మరింత ఎక్కువగా చూపెడుతున్నారు. 1988లో కేంద్ర ప్రభుత్వం ఆర్‌టిసిలపై ఒక్క సారిగా 15 శాతం మోటారు వాహనాల పన్నును విధించడంతో ఆర్‌టిసి సేవలకు పన్నుపోటు మొదలయ్యింది. మోటరు వాహనాల పన్నుకు తోడు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, వికలాంగులకు ప్రయాణ రాయితీ యిప్పించి సకాలంలో రాయితీ సొమ్ము చెల్లించకపోవడంతో ఆర్‌టిసిలకు నష్టాలు తీవ్రమయ్యాయి. వీటికితోడు స్పేరుపార్టులు, డీజిల్‌పై వ్యాట్, సేల్‌ట్యాక్స్‌ను విపరీతంగా పెంచడంతో పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఉమ్మడి ఆర్‌టిసి విడిపోయే నాటికి సుమారు అయిదువేలకోట్లు అప్పుల్లో ఉండిపోయింది. విడిపోయిన తర్వాత ఆ అప్పులు తెలంగాణా, ఎపిఎస్‌ఆర్‌టిసిలకు సర్దుబాటు అయ్యాయి. రోడ్డు రవాణా చట్టం 1950 ప్రకారం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 1:2 నిష్పత్తిలో నిధులను ఆర్‌టిసిలకు సాలీనా సమకూర్చాలి. నిధులు సమకూర్చడం లేదుగానీ పన్నుల రూపంలో ఆర్‌టిసిలు ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారాయి. పెరుగుతున్న నష్టాలు, అప్పులను ఆర్‌టిసి యాజమాన్యం తీసుకెళ్లి ప్రభుత్వం ముందు పెడితే అంతర్గత సామర్థ్యం పెంచుకుని, మీ తిప్పలు మీరు పడండంటూ ప్రభుత్వం ఉచిత సలహా విదిలించింది. ఈ ఉచిత సలహా ఆర్‌టిసి యాజమాన్యానికి సర్వరోగనివారిణి అయిపోయింది. అక్కడ నుండి ఆర్‌టిసి విధానాలు భద్రతకు గొడ్డలిపెట్టులా తయారయ్యాయి.

ఆర్‌టిసికి ప్రధాన ఖర్చులు ఒకటి డీజిల్ ఖర్చు, రెండు జీతాల ఖర్చు. అంతర్గత సామర్థ్యం పెంచుకోవడంలో భాగంగా మొదటగా ఆయిల్ వాడకం తగ్గించుకోవడంలో డ్రైవర్లకు శిక్షణ మొదలు పెట్టారు. లీటరు డీజిల్‌కు తక్కువ కిలోమీటర్లు (కె.ఎం.పి.ఎల్) త్రిప్పిన డ్రైవర్లను వేధించడం తీవ్రతరం చేశారు. ఎక్కువ కె.ఎం.పి.ఎల్ తేవడం కోసం డ్రైవర్లు తమ సహజసిద్ధమైన డ్రైవింగ్ అలవాట్లను వదులుకోవలసి వచ్చింది. ఎంతదూరం వీలయితే అంతదూరం న్యూట్రల్ గేరుతో బస్సును నడపడానికి డ్రైవర్లు నెట్టబడుతున్నారు. బ్రేకు వేస్తే ఆయిల్ పడిపోతుందనే మానసిక స్థితికి నెట్టబడ్డారు. చివరకు దాని పర్యవసావం ఘాట్ రోడ్డులో కూడా ప్రాణాలకు తెగించి విన్యాసం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఆయిల్ వినియోగం తగ్గించడంలో భాగంగా యాజమాన్యం ఆర్డినరీ బస్సులకు వెనుక, ముందు కూడా డోర్లు లేకుండా ద్వారాలు (ఎంట్రన్స్)ను ప్రవేశపెట్టింది. ఈ డబల్ డోర్ల బస్సులలో (డోర్లు ఉండవు) ప్రయాణీకులు త్వరగా ఎక్కుతారు, త్వరగా దిగుతారు, త ద్వారా ఆయిల్ వినియోగం తగ్గించేందుకు ఉపయోగపడుతుందని యాజమాన్యం భావించింది. ఆయిల్ వినియోగం తగ్గిందా, పెరిగిందా అనే లెక్కల నిర్ధారణ

చూపించలేదు గానీ ఈ డోర్లు లేకపోవడం వల్ల ప్రయాణీకులు బస్సు రన్నింగ్‌లో ఉండగానే ఎక్కబోతూ దిగబోతూ జారి పడి మరణిస్తున్నారు. దాంతో యాజమాన్యం వెనుక, ముందు ఉన్న రెండు డోర్లను కలిపి బస్సుకు మధ్యలో "వైడర్ డోరు" పేరిట సుమారు నాలుగు అడుగుల ప్రవేశ ద్వారం పెట్టింది. దీనికి డోరు ఉండదు. దాంతో వర్షం, చలి, వేడిగాలుల నుండి లోపలి ప్రయాణీకులకు రక్షణ మరింతగా కరువయ్యింది. వర్షం వస్తే బస్సు లోపల నాలుగు వరుస సీట్లలో ప్రయాణీకులు తడిసిపోవలసిందే. ద్వారం మరింత వెడల్పుగా ఉండడంతో ప్రయాణికులు జారిపడి పోయే ప్రమాదాలు మరింతగా పెరిగాయి. వాస్తవానికి మోటారు వాహనాల చట్టం 1989 రూలు 128(3), ఎ.పి. మోటారు వాహనాల చట్టం 1989 రూలు నెం.340ల ప్రకారం ప్రజారవాణా వాహనాలకు తగిన కొలతలు, పరికరాలతో ప్రజా రవాణా వాహనాలకు డోర్లు ఉండాలి. కానీ యాజమాన్యం చట్టాన్ని ఉల్లంఘించి బస్సులకు డోర్లు లేకుండా నిర్వహిస్తోంది. ముఖ్యంగా విద్యార్థులకు పాసులు అమ్మి డబ్బు దండుకుంటున్న ఆర్‌టిసి యాజమాన్యం పాసుల సంఖ్యకు సరిపడు బస్సులు నడపడంలో చిత్తశుద్ధి గానీ, బాధ్యత గానీ వహించడంలేదు. దాంతో కాలేజీ సమయాలలో విద్యార్థులు ఉన్న బస్సుల్లోనే డోర్ల వద్ద గబ్బిలాల్లా వ్రేలాడుతూ ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. డోర్లు లేని బస్సుల నుండి అనేక మంది జారిపడి మరణించారు, వికలాంగులు అయ్యారు. ఈ డోర్లు లేని బస్సుల నుండి జారిపడిన ప్రమాదాలన్నీ జరగవలసినవి కావు. ఇవన్నీ అదనపు ప్రమాదాలే.

ఆర్‌టిసి యాజమాన్యం ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా మరమ్మత్తుకు వచ్చిన బస్సులక సరైన స్పేరు పార్టులు / టైర్లు వేయడంలో తీవ్రమైన పొదుపు పాటిస్తున్నారు. గ్యారేజీలో ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా రెగ్యులర్ సిబ్బంది తగ్గించబడ్డారు. దాంతో రిపేరు చేయడానికి తగిన సిబ్బంది లేని పరిస్థితి నెలకొని ఉంది. బస్సులకు ఫలానా రిపేరు చేయాలని డ్రైవర్లు సూచిస్తుంటే గ్యారేజీ అధికారులు ఆ డ్రైవర్ల మీ అసహనం ప్రదర్శిస్తున్నారు. కొన్ని సార్లు మరమ్మత్తు చేయకుండానే జీతాల ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా డ్రైవర్ల రిక్రూట్‌మెంట్‌ను ఖాళీల మేరకు నిర్వహించడంలేదు. ఉన్న డ్రైవర్లనే డ్యూటీ దిగిన వెంటనే నిర్బంధంగా డబల్ డ్యూటీకి పంపిస్తున్నారు. డ్యూటీ షెడ్యూల్స్ నందు చట్టానికి విరుద్ధంగా పనిగంటలు పెంచి వేశారు. రోజుకు 16 గం॥ల వరకు నిరవధికంగా పనిచేయిస్తున్నారు. దూరప్రాంత సర్వీసుల్లో వరుసగా నాలుగైదు రాత్రులు సరైన విశ్రాంతి లేకుండా పనిచేయిస్తున్నారు. పునరుత్తేజం పొందడానికి ఉన్న శెలవులను కనీసంగా ఇవ్వడం లేదు. డిపోలలో, నైట్ హాల్ట్ సర్వీసుల్లో సరైన విశ్రాంతి గదులు డ్రైవర్లకు ఏర్పాటు చేయడం లేదు. డ్రైవరు చేతనే డ్రైవింగ్‌తో పాటు టిక్కెట్టు మిషను ఇచ్చి కండక్టరు విధులను ఒంటరిగా (సింగిల్ టిమ్ డ్రైవర్) చేయిస్తున్నారు. మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల చట్టం1961 సెక్షన్లు 9,13,15,16,17,18,26లను ఉల్లంఘించి డ్రైవర్ల చేత అధిక పనిగంటలు పనిచేయిస్తూ, డ్రైవర్ల ఏకాగ్రత, సృజనాత్మకతను దెబ్బతీస్తూ విధి నిర్వహణలో అలసట, వత్తిడి పెంచుతూ ప్రమాదసంభావ్యతకు ఆస్కారం కల్పిస్తున్నారు. మరోపక్క ఈ పనిభారాల వల్ల డ్రైవర్లు తీవ్ర అనారోగ్యం పాలయ్యి స్టీరింగ్ వద్దనే మరణిస్తున్నారు.

ఖర్చు తగ్గించుకోవడంతో పాటు ఉన్న బస్సులతో ఆదాయాన్ని పెంచుకొనే చర్యల్లో భాగంగా బస్సుల్లో విపరీతమైన ఓవర్‌లోడింగ్ ఆర్‌టిసి యాజమాన్యం చేయిస్తోంది. బస్సులో 100మంది ప్రయాణికులు దాటి ఉన్నా ఇంకా ప్రయాణికులు ఎక్కించుకోకపోతే కండక్టర్లు, డ్రైవర్లపై శిక్షలకొరడా ఝులిపిస్తోంది. కండక్టరును కిలోమీటరుకు 30 రూ॥లకు పైబడి ఆదాయం తేవాలని వత్తిడిచేస్తోంది. దాంతో ప్రయాణికులను వస్తువుల్లా బస్సులో సర్దే / కుక్కే పనిలో కండక్టరు ప్రావీణ్యం రోజు రోజుకూ పెంచుకోవలసివస్తున్నది. ఓవర్‌లోడింగ్ వల్ల డోర్లులేని బస్సులలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాలు అనేకం నమోదుకాని స్థితిలో రాజీచేయబడి మాఫీ అవుతున్నాయి. మోటారు రవాణా కార్మికుల పనిగంటలను పర్యవేక్షించవలసిన కార్మిక శాఖ, వాహనాల కండీషన్‌ను పర్యవేక్షించవలసిన రవాణ శాఖ, రోడ్డు భద్రతా చర్యలు చేపట్టవలసిన రోడ్డు భద్రతా కమిటీల వైఫల్యమే ప్రమాదాలకు ప్రధాన కారణం.

ప్రభుత్వ చేయూత కరువయ్యి అంతర్గత సామర్థ్యం పెంపుదల పేరుతో తెలుగు ఆర్‌టిసి యాజమాన్యాలు చేపడుతున్న చర్యలు ప్రయాణికుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రస్తుత యాంత్రిక సామాజిక నిర్లప్త స్థితిలో ఒకటి, రెండు మరణాలు ప్రభుత్వాలను / యాజమాన్యాలను కదలించ లేకపోతున్నాయి. ప్రస్తుతం జరిగిన కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది, రాజమండ్రి, అవనిగడ్డ, విజయవాడ డిపో బస్సుల ప్రమాదాల వంటి మూకుమ్మడి మరణాలు మాత్రమే ప్రభుత్వాలను / యాజమాన్యాలను స్పందింపచేయడం విచారకరం. డోర్లు లేని బస్సుల్లోను, చట్టవిరుద్ధ విధానాల వల్ల జరుగుతున్న ప్రమాదాలను సాలీనా లెక్కిస్తుంటే ఈ ఘోరప్రమాదం కంటే అనేక రెట్లు మరణాలు ఉంటున్నాయి. ఆ మరణాలకు గల కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకుని ఉంటే కొండగట్టు ప్రమాదం జరిగేదికాదు. ఆ ప్రమాదంలో బస్సు నిర్దేశిత కిలోమీటర్లు అయిపోయిన తుక్కుబస్సు. డ్రైవరు చేత నిరవధికంగా మూడు రోజులు డబల్‌డ్యూటీ చేయించారు. ఆయిల్ పొదుపుకోసం నిషేధిత మార్గంలో బస్సును యాజమ్యాం పంపించింది. ఆయిల్ పొదుపుకోసం డ్రైవరుపై ఒత్తిడి ఉంది. ప్రమాదం జరగడానికి యాజమాన్య ప్రేరేపితచర్యలు స్పష్టంగా ఉన్నాయి. ఆ ప్రేరేపిత చర్యల వెనుక, ప్రజారవాణాపట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి, బాధ్యతా రాహిత్యం ఉన్నాయి.

చట్ట ఉల్లంఘనలతో ప్రమాదాలకు ఆస్కారం కల్పిస్తున్న తెలుగు ఆర్‌టిసి యాజమాన్యాలు ఆర్‌టిసిలో భద్రత, రక్షణ ఉన్నాయంటూ ప్రజలను నమ్మించడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఇటువంటి ప్రమాదం జరిగినప్పుడల్లా తెలుగు రాష్ట్రాల ఆర్‌టిసిల్లో, భద్రత, రక్షణ అంతా బూటకమేనని, ఉత్తుత్తి ప్రకటనలేనని ఋజువవుతూనే ఉన్నది. ప్రజల రవాణా బాధ్యతను ప్రభుత్వం గాలికొదిలేసి ప్రైవేటు మరియు ఆర్‌టిసిలో ప్రజల ప్రయాణాన్ని ప్రమాదపుటంచున నిర్వహిస్తోంది.

సామూహిక ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి పరచడం ద్వారా ప్రమాదాలను, కాలుష్యాన్ని అదుపులో ఉంచుకోగలమని ప్రపంచ మేధావివర్గం సూచిస్తున్నా పట్టని ప్రభుత్వాలు ఉన్నంత కాలం ప్రజలు బలిపశువులే.

(రచయిత అధ్యక్షులు, ఎపిఎస్ఆర్‌టిసి యునైటెడ్ వర్కర్స్ యూనియన్) వీ

పాతాళంలోకి రూపాయి పయనం

పాలకులు అవలంబిస్తున్న రాజకీయ, ఆర్థిక విధానాలే రూపాయి విలువ పతనానికి ప్రధాన కారణమనీ, స్థానిక అవసరాలకు అనుగుణంగా స్వావలంబనను అమలుచేయడం ద్వారా ఈ పతనానికి అడ్డుకట్ట వేయవచ్చనీ అంటున్నారు **ఎ. నర్సింంహారెడ్డి**

ఇవాళ మనదేశంలో ప్రమాదకర సన్నివేశం ఆవిష్కృతమవుతోంది. రూపాయి విలువ రోజురోజుకు దిగజారుతోంది. 'వర్ధమాన దేశాల కరెన్సీలన్నింటి కంటే మన రూపాయి బలహీనమైనదిగా భావించబడుతోంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం, ట్రంప్ రక్షిత విధానాలు, సుంకాల పెంపు రూపాయి విలువపై తీవ్ర ప్రభావం కనబరుస్తోంది. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ప్రారంభం కావడం, టర్కీ సమస్యకు అంతకంతకూ పీటముడులు పడుతుండడం ఆసియా మార్కెట్లను అతలాకుతలం చేస్తోంది. దేశ ఆర్థికాభివృద్ధికి కరెన్సీ మారకం విలువ అత్యంత కీలకం. డాలరు మారకం విలువ 73 రూపాయలకు క్షీణించింది. 1947 ఆగస్టులో అధికార మార్పిడి జరిగే నాటికి రూపాయి విలువ డాలరుతో సమానంగా ఉండేది. అంటే ఒక రూపాయి ఒక డాలరుతో సమానమన్న మాట! నేటి మారకం రేటు ప్రకారం, రూపాయి విలువ 73 రెట్లు కోసుకుపోయింది. పాలకుల అస్తవ్యస్త ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణమని నిర్ద్వందంగా చెప్పవచ్చు.

1947 ఆగస్టు 15న స్వాతంత్రమనబడే అధికార మార్పిడి జరిగి ఏడు దశాబ్దాలు గడిచిపోయింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం అని పాలకులు డాంభికంగా చెప్పుకుంటున్న మనదేశ ప్రజాస్వామ్య డొల్లతనం రోజురోజుకీ మరింత నగ్నంగా వెల్లడవుతోంది. పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల కారణంగా వరుసగా రూపాయి విలువ పడిపోవడమనే చెంప దెబ్బ. పెట్రో ధరలు మండిపోవడమనే గోడ దెబ్బలతో ప్రజలు అల్లాడి పోతున్నారు. చమురు దిగుమతి విలువ నిత్యం పెరిగిపోతోంది. దిగుమతి అవుతున్న చమురు ధరలో వస్తున్న పెరుగుదలను డీజిల్, పెట్రోల్ ధరలను పెంచి వినియోగదారులకు బదిలీ చేయడం నిత్యకృత్యంగా మారింది. వినియోగదారులు భరించలేనంతగా ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంది.

అంతర్జాతీయంగా నెలకొన్న వాణిజ్య యుద్ధాలు, సుంకాల పోట్లు, అంతర్జాతీయంగా పెట్రో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయనే సాకుతో 'రోజువారీ ధరల సమీక్షా విధానాన్ని' అమలు చేస్తూ కేంద్రం ప్రతిరోజూ పెట్రో ధరల వడ్డనకు పాల్పడుతోంది. ఈ ఏడాది కాలంలో పెట్రోల్ ధర లీటర్‌కు 15 రూపాయలు పెరగ్గా, డిజిల్ ధర 22 రూపాయలు పెరగడం దారుణం. నరేంద్రమోడీ ప్రభుత్వం గడువు ముగిసేనాటికి పెట్రోల్ ధర లీటర్‌కు వంద రూపాయలకు చేరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్లేషకుల అంచనా. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వినియోగదార్లకు పెనుభారంగా మారగా, ప్రభుత్వాలకు మాత్రం పన్నుల పంట పండుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలో సగం వరకూ ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులే ఉండడం తెలిసిన విషయమే.

ఇవాళ డాలర్ దెబ్బకి రూపాయి గింగిరాలు తిరుగుతోంది. మళ్లీ కోలుకుంటుందని అనుకోవడమే కాని, కుదుటపడుతుందన్న దాఖలాలు కనబడడం లేదు. వరుసగా 66, 67, 68, 69, 70, 71, 73 దరిదాపుల్లోకి వచ్చేసింది. త్వరలోనే 75 స్థాయికి చేరుకోవచ్చనేది నిపుణుల అంచనా. రూపాయి విలువ ఎందుకు ఇలా పతనం అవుతోంది? దీనికి కారణాలు ఏమిటి? ఇది ఇలాగే కొనసాగుతుందా? ఈ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి? అనే ప్రశ్నలు అందరిని కలవరపెడుతున్నాయి. ఏ దేశ కరెన్సీ విలువైనా అది ఎన్ని సరుకుల్ని కొనగలుగుతుందన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఒక రూపాయితో ఎక్కువ సరుకులు కొనగలిగితే రూపాయి బలంగా ఉన్నట్లు, అలా కాకుండా ఇంతకు ముందుతో పోల్చితే ఇప్పుడు తక్కువ సరుకులే వచ్చేటట్లయితే రూపాయి బలహీన పడినట్లు! ఇలా దేశీయంగా రూపాయి విలువ శక్తిని లెక్కిస్తాం. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకునేది అంతర్జాతీయ కరెన్సీ డాలర్‌తో పోల్చినప్పుడు పడిపోతున్న రూపాయి విలువ గురించి. అంతర్జాతీయ వర్తక వాణిజ్యాల చెల్లింపులకు ప్రపంచ దేశాలన్నీ అంగీకరించే కరెన్సీ డాలర్! ఆ డాలర్‌కు ఇవాళ డిమాండ్ పెరుగుతోంది.

ఏడు దశాబ్దాల కాలంలో స్వావలంబన కొరవడి పరాధీనత పెరగడంతో మన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటిపడే సామర్థ్యాన్ని కోల్పోయాయి. పర్యవసానంగా భారత కరెన్సీ రూపాయి మారకం రేటు డాలర్‌తో పోలిస్తే 73వ స్థాయికి పడిపోయింది. రూపాయి మారకపు విలువ రికార్డు స్థాయికి పతనం కావడం వివిధ వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. దేశీయంగా వ్యాపారులు, విద్యార్థులు, పర్యాటకులకు ఇది మింగుడు పడని పరిణామమే. గతంలో ఎన్నడూ లేని విధంగా 2018 ఆగస్టు 14న రూపాయి విలువ 70.71కి చేరింది. సెప్టెంబర్ 18న 72.98కి చేరి జీవనకాల పతనంను నమోదు చేసింది. అమెరికాలో వడ్డీరేట్ల పెరుగుదల, సంపన్న దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేయడం, చమురు ధరలు పెరగడం, వాణిజ్య యుద్ధాల కారణంగా ఇరాన్ లేదా టర్కీ ఆర్థిక/భౌగోళికార్థిక అభివృద్ధి క్షీణించడం, పర్యవసానంగా వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థల నుంచి మదుపరులు సురక్షిత కరెన్సీలుగా కొనసాగుతున్న అమెరికన్ డాలర్, స్విస్ ఫ్రాంక్‌ల వైపు మొగ్గడం వంటి పరిణామాలు రూపాయి పతనానికి ఉత్ప్రేరకాలుగా పనిచేశాయి.

ఆసియాలోనే అత్యంత నికృష్టంగా నిర్వహిస్తున్న కరెన్సీల్లో ఒకటిగా రూపాయి నిలవడం పాలకుల ద్రవ్య విధానాల లోపభూయిష్టతకు అద్దం పడుతుంది. 36 దేశాల కరెన్సీలతో అనుబంధితమైన రూపాయి వాస్తవ సమర్థమైన మారక విలువ (ఆర్ఇఇఆర్) 2014 మే నుంచి 2017 డిసెంబర్ వరకు 14.5 శాతం బలహీనపడింది. ఆసియాలోనే అత్యంత ఘోరమైన కరెన్సీగా రూపాయి తయారైంది. భారత్‌లో రూపాయి మారకపు రేటు పతనానికి దేశీయంగా పాలకులు అనుసరిస్తున్న రాజకీయార్థిక విధానాలే ప్రధాన కారణంగా గుర్తించాలి. ఫలితంగా భారతీయ ఉత్పత్తులు ఒక విషవలయంలో ఇరుక్కుపోయాయి. పెట్టుబడి బహిరంగ ప్రవాహాలు కరెన్సీని దెబ్బతీస్తుండడంతో, మదుపుల ప్రవాహం బాగా క్షీణించింది.

ప్రపంచ చమురు ధరల్లో ప్రతి 10 డాలర్ల పెరుగుదలతో ఇండియా ప్రస్తుత ఖాతా నిల్వలు స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 0.4 శాతం దెబ్బతింటున్నాయి. దాంతో ద్రవ్యోల్బణం 30-40 బేసిస్ పాయింట్లు పెరుగుతోంది. అమెరికన్ డాలర్‌తోనే కాకుండా సంక్షోభంలో చిక్కుకున్న యూరోపియన్ యూనియన్ (ఇయు) కరెన్సీ యూరో, పౌండ్, యెన్‌లతో పోల్చినా భారత కరెన్సీ విలువ పడిపోతుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రూపాయి విలువ పతనం అనేది కేవలం బ్యాంకింగ్, ఇతర ద్రవ్యరంగాలకు, ఎగుమతులు-దిగుమతులకు సంబంధించిన వ్యవహారంగానే పరిగణించకూడదు. మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ద్రవ్య పెట్టుబడి కబంధ హస్తాల్లో ఇరుక్కుపోయింది. అమెరికా, యూరప్ ఆర్థిక వ్యవస్థల వ్యవస్థాగత స్వభావం కారణంగా ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకోలేకపోవడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ తీసుకున్న విధానపరమైన చర్యలు, భారతదేశ ఆర్థిక కొలమానాల్లోని బలహీనతలు, దేశీయంగా వృద్ధిరేటు పతనం, కొనసాగుతున్న ద్రవ్యోల్బణం, భారీ స్థాయికి చేరిన ప్రస్తుత వాణిజ్యలోటు వంటి ఆర్థిక బలహీనతలు రూపాయి విలువ సంక్షోభానికి దోహదం చేస్తున్నాయి.

ఇతర దేశాల నుండి చేసుకునే దిగుమతులకు చెల్లించడానికి, మనం విదేశీ ఆర్థిక సంస్థల నుండి తెచ్చిన అప్పులపై అసలు, వడ్డీ చెల్లించడానికి, మన భారతీయులు విదేశాల్లో పర్యటించడానికి, చదువుకోవడానికి, వైద్యం చేయించుకోవడానికి డాలర్లు అవసరం. అలా అవసరమయ్యే డాలర్లు మనకు ముఖ్యంగా మనం చేసే ఎగుమతుల ద్వారా, మన వాళ్లు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ సంపాదించిన డబ్బును భారత్‌కు పంపడం ద్వారా వస్తాయి. చాలా కాలంగా మన దిగుమతులు పెరిగినంతగా మన ఎగుమతులు పెరగడం లేదు. అందువలన మనకొచ్చే డాలర్ల కన్నా చెల్లింపుల కోసం ఎక్కువ డాలర్లు అవసరమవుతున్నాయి. దీనినే వాణిజ్య లోటు అంటారు. 2018 మార్చిలో మన ఎగుమతుల విలువ 2,900 కోట్ల డాలర్లు కాగా చేసుకున్న దిగుమతుల విలువ 4,200 కోట్ల డాలర్లు. మనం సంపాదించిన డాలర్ల కన్నా 1300 కోట్లు అదనంగా చెల్లించాము. డాలర్‌తో పోల్చినపుడు రూపాయి విలువ పడిపోతే మనదేశంలోకి వచ్చే విదేశీ సరుకుల ఖరీదు రూపాయల్లో పెరిగి, ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఉదాహరణకు గతంలో 1 డాలర్ 50 రూపాలకు మారేటప్పుడు 1000 డాలర్ల ఖరీదు చేసే యంత్రాన్ని దిగుమతి చేసుకుంటే దాని ఖరీదు రు. 50,000. కానీ ఇప్పుడు 1 డాలర్ 73 రూపాయలకు మారితే అదే 1000 డాలర్ల యంత్రం ఖరీదు ఇప్పుడు 73,000 అవుతోంది.

ఇరాన్‌తో మనకు ద్వైపాక్షిక వాణిజ్యం ఎంతో ఎక్కువ. ఆ దేశం నుంచి ముడిచమురు భారీగా కొనుగోలు చేసే దేశాల్లో భారత్ ఒకటి. దీనికి బదులుగా మనం బియ్యం, తేయాకు ఇరాన్‌కు ఎగుమతి చేస్తున్నాం. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు అమల్లోకి రావడం మనదేశానికి నష్టదాయకంగా మారింది. అమెరికా ఆంక్షలతో ఇరాన్‌తో వాణిజ్యం సజావుగా సాగని పరిస్థితి ఏర్పడింది. ఇరాన్‌కు బియ్యం, తేయాకు ఎగుమతి చేసిన కంపెనీలకు తాజాగా చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. ఈ మార్పులు రూపాయి మారకం విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీనికి తోడు మనదేశానికి ఇటీవల కాలంలో వర్తకలోటు పెరిగిపోయింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఇది 156 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అంతకుముందు ఏడాది (2016-17)లో వర్తకలోటు 106 బిలియన్ డాలర్లు మాత్రమే. మనదేశానికి అధికంగా దిగుమతి అవుతున్న సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అదుపు చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తగినంతగా ఫలితాలు ఇవ్వకపోవడం తాజాగా రూపాయి మారకం విలువ క్షీణతకు చాలా వరకు కారణంగా చెప్పవచ్చును.

ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి వల్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి మళ్లుతున్నాయి. అంతర్జాతీయ చమురు ధరలు పెరగడంతో పాటు వర్ధమాన మార్కెట్ విక్రయాలతో దిగుమతిదారుల నుంచి విదేశీ మారక ద్రవ్యం, బ్యాంకుల నుంచి నెలవారీ డాలర్ల డిమాండ్ పెరిగిన కారణంగా రూపాయి బాగా బలహీనపడింది. ముడి చమురు ధరల పెరుగుదలతో కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరగడంతో రూపాయి విలువ ఘోరంగా దెబ్బతింది. నవంబర్ 4 నాటికి ఇరాన్ చమురు దిగుమతులన్నీ అంతం చేయడానికి అమెరికా, దాని మిత్ర రాజ్యాలు తీసుకున్న నిర్ణయం, లిబియా, కెనడాల్లో సరఫరాల అంతరాయాలపై ఆందోళనల కారణంగా చమురు ధరలు వేగంగా పెరిగాయి. ఇంధన అవసరాల్లో 81 శాతం దిగుమతులపై ఆధారపడిన ఇండియాకు ప్రపంచ చమురు ధరల పెరుగుదలతో దిగుమతుల భారం పెరిగి కరెంటు ఖాతా లోటు, ద్రవ్యలోటు మరింత పెరుగుతాయన్న ఆందోళనలు నెలకొన్నాయి.

మనదేశ స్టాక్ మార్కెట్‌లోకి వచ్చిన విదేశీ సంస్థాగత మదుపులు లాభాలను ఆర్జించి, తమ మాతృదేశ మార్కెట్లలో వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు లేదా అమెరికాలో వడ్డీరేట్లు పెరగడంతో ఇండియా నుంచి వెనక్కి మళ్లుతున్నాయి. ప్రస్తుత ఖాతాలోటు స్థూల దేశీయోత్పత్తిలో 5.3 శాతానికి పడిపోయింది. సాధారణంగా ఇది 3 శాతం దాటితేనే ప్రమాద సూచికగా ఆర్థికవేత్తలు భావిస్తారు. అదే సమయంలో వాణిజ్య లోటు జిడిపిలో 7 శాతానికి చేరింది. వీటికి తోడు అధిక ద్రవ్యలోటు, అధిక ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థను చిక్కుల్లోకి నెట్టాయి. పారిశ్రామిక ఉత్పత్తి రంగం వృద్ధి చెందకపోవడంతో ఎగుమతులు బాగా మందగించాయి. అదే సమయంలో రూపాయి విలువ క్షీణిస్తుండడం, రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్ వంటి ఆదాయాన్ని మిగుల్చుకునే రంగాల్లో నెలకొన్న తీవ్ర అనిశ్చితితో బంగారం కొనుగోలు డిమాండ్ భారీగా పెరగడం కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తోంది.

1947 ఆగస్టు - 2018 సెప్టెంబర్ 18 మధ్యకాలంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఇలా ఉంది. 1947 ఆగస్టులో 1 రూపాయికి 1 డాలర్, 1952లో రు. 4.75, 1966లో రు.7.10, 1973లో రు. 8.03, 1980లో రు. 7.89, 1990లో రు. 17.50, 2000లో రు. 45, 2010లో రు. 45.65, 2012లో రు. 53.44, 2013లో రు. 58.53, 2014లో మోడీ అధికారంలోకి వచ్చేనాటికి రు.61, 2015లో రు. 66.20, 2016లో రు. 67.67, 2017లో రు. 65.06, 2018 జనవరి నాటికి రు. 65.55, 2018 ఆగస్టు 14 నాటికి రు. 70.71, 2018 సెప్టెంబర్ 18 నాటికి రు. 72.98కు దిగజారింది.

మన ప్రభుత్వాలు షేర్ మార్కెట్ తలుపుల్ని బార్లా తెరిచిన తర్వాత సామ్రాజ్యవాద దేశాల నుండి ముఖ్యంగా అమెరికా నుండి సంస్థాగత మదుపరులు మన షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టారు. అప్పుడు అమెరికాలో బ్యాంకుల వడ్డీ రేటు చాలా తక్కువగా ఉండడంతో అక్కడి మదుపరులంతా డాలర్లు తెచ్చి మన షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టారు. సాధ్యమైనంత మేరకు లాభాలు జుర్రుకున్నారు. ఈ లాభాలతో తమ మాతృదేశ మార్కెట్లలో వచ్చిన నష్టాలను పూడ్చుకున్నారు. ఇటీవల అమెరికా ఫెడ్ బ్యాంక్ వడ్డీ రేట్లు, అమెరికన్ ట్రెజరీ బాండ్లపై చెల్లించే వడ్డీ రేట్లు పెంచడంతో ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న డాలర్లన్నీ అమెరికా బ్యాంకుల్లోకి చేరిపోతున్నాయి. మన షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టిన విదేశీ మదుపరులు కూడా తమ దగ్గరున్న షేర్లను, బాండ్లను అమ్మేస్తున్నారు. అలా అమ్మేటప్పుడు వారికి మన రూపాయలిస్తే తీసుకోరు. వారికి డాలర్లలోనే ఇవ్వాలి. ఈ కారణంగా డాలర్లకు డిమాండ్ పెరుగుతోంది. 2017-18 సంవత్సరం

మూడు త్రైమాసికాల్లో మన షేర్ మార్కెట్‌లోకి వచ్చిన డాలర్లు 530 కోట్లు కాగా, అదే కాలంలో మనదేశం నుండి వెళ్లిపోయిన డాలర్లు 1850 కోట్లు. రాబోయే కాలంలో అమెరికా వడ్డీ రేట్లు మరింత పెరగవచ్చని నిపుణుల అంచనా. అంటే మరిన్ని డాలర్లు మనదేశం నుండి వెళ్లిపోనున్నాయి.

2008లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడే ప్రయత్నంలో భాగంగా విచక్షణారహితమైన, ఆత్మహత్యా సదృశ్యమైన టారిఫ్‌ల పెంపు రూపంలో వాణిజ్య యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రారంభించడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రోజు రోజుకూ మరింత అస్తవ్యస్తంగా తయారైంది. అది వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలి పోయేందుకు దారితీస్తోంది. వర్ధమాన దేశాల కరెన్సీలు కుప్పకూలుతున్నాయి. భారత రూపాయి వేగంగా కృశిస్తోంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో టర్కీలో తాజాగా తలెత్తిన ద్రవ్య సంక్షోభం, చమురు రేట్లు పెరుగుదల ఇలాగే కొనసాగితే క్రూడ్ ఆయిల్, ఇతర ముడి సరుకులు ప్రియమై రిటైల్ ధరలు పెరుగుదలకు దారితీస్తుంది. విదేశీ వాణిజ్యలోటు మరింతగా పెరిగి మన విదేశీ మారక నిల్వలు తగ్గి ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడుతుంది. దేశీయంగా కరెంటు అకౌంట్ లోటు పెరిగి పతనానికి దారితీస్తుంది. దీంతో విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి బ్రేక్ పడుతుంది. పరిశ్రమల స్థాపన కుంటుపడి ఉపాధి కల్పన సంక్షోభం తలెత్తుతుంది. పర్యవసానంగా ఆర్థిక మాంద్యం మరింత తీవ్రమై అది దేశంలో అనేక రాజకీయ, సామాజిక దుష్పరిణామాలకు దారితీయక తప్పదన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మన దిగుమతులకు అవసరమయ్యే డాలర్లను ఎగుమతుల ద్వారా సంపాదించుకోగలిగితే డాలర్లకు కొరత ఉండదు. అయితే మనదేశ పారిశ్రామిక రంగం గత మూడు దశాబ్దాల కాలంలో వృద్ధి చెందకపోవడంతో ఎగుమతులు బాగా మందగించాయి. ఏడు దశాబ్దాల కాలంలో మనదేశంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెంచుకునే ప్రయత్నాలు పాలకులు చేయలేదు. పర్యవసానంగా టెక్నాలజీ కోసం లేదా యంత్రాల కోసం ఇతర దేశాలపై ఆధారపడడం పెరిగింది. మరోవైపు మోడీ ప్రవేశపెట్టిన వస్తుసేవల పన్ను, పెద్దనోట్ల రద్దు మూలానా తయారీ రంగం మరింత కుదేలయింది. అదే సమయంలో రూపాయి విలువ క్షీణిస్తుండడం, రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్ వంటి ఆదాయాన్ని మిగుల్చుకునే రంగాల్లో నెలకొన్న తీవ్ర అనిశ్చితితో బంగారం కొనుగోలు డిమాండ్ భారీగా పెరగడం కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తోంది. రూపాయి పతనం ప్రత్యక్షంగా, పరోక్షంగా సామాన్య ప్రజలపై అనేక రూపాల్లో ప్రతికూల ప్రభావం చూపుతుంది. రూపాయి పతనంతో దేశీయ ముడి అవసరాల్లో 76 శాతం, సహజవాయు అవసరాల్లో 19 శాతం, బొగ్గు అవసరాల్లో 20 శాతం చేసుకుంటున్న దిగుమతుల వ్యయం భారీగా పెరుగుతుంది. దాంతో ఇంధనంపై ప్రధానంగా ఆధారపడిన వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ఉత్పాదక వ్యయం విపరీతంగా పెరుగుతుంది. దాంతో నిత్యావసరాల ధరలు ప్రజలు భరించలేని స్థాయికి చేరుకుంటాయి. సామాన్యుని జీవన ప్రమాణాలు ఘోరంగా దెబ్బతింటాయి.

రూపాయి విలువ పతనం దిగుమతులకు ప్రతికూలంగా మారుతుంది. యంత్ర సామాగ్రి, ఎలక్ట్రానిక్స్, ఇతర వస్తువుల దిగుమతులు ఖరీదైపోతాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు క్షీణిస్తాయి. ఈ పరిస్థితులు దీర్ఘకాలం పాటు కొనసాగితే మాంద్యం ముప్పు ఎదురు కావచ్చును. ఉద్యోగాల కల్పన తగ్గుతుంది. దిగుమతుల కోసం పెద్ద ఎత్తున విదేశీ మారక నిల్వలు వినియోగిస్తున్న నేపథ్యంలో కరెంటు ఖాతాలోటు సైతం విస్తరిస్తోంది. రూపాయి విలువ క్షీణముఖం పట్టడంతో డాలరు రూపంలో రుణాలు తీసుకున్న కంపెనీల లాభాలు దెబ్బతింటాయి. దేశీయ బాండ్ల మార్కెట్‌పైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. రూపాయి పతనం వలన విదేశీ చదువులు, విదేశీ పర్యటనలు భారంగా మారతాయి. రూపాయి పతనం మూలంగా భారత్ దిగుమతి చేసుకునే వస్తువుల ధరలన్నీ ప్రియమవుతాయి. అలాగే వృద్ధిరేటు, ఉద్యోగావకాశాల్లో క్షీణత, ద్రవ్యోల్బణం, వాణిజ్యలోటు వంటివి దేశ ఆర్థికాభివృద్ధికి ప్రతికూలంగా ఉంటాయి.

రూపాయి క్షీణతను కట్టడి చేయాలంటే వీలైనంతవరకు బంగారం వంటి విలాసవంతమైన వస్తువులు దిగుమతులను నియంత్రించాలి. ఎగుమతులను కొత్త దేశాలకు విస్తరించి అవి పెరిగే మార్గాలను అన్వేషించాలి. మరోవైపు ఎప్పుడుపడితే అప్పుడు విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకోకుండా, తద్వారా పెట్టుబడి వాతావరణం దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం సహేతుక నిబంధనలు, ఆంక్షలతో ముందుకు రావల్సి ఉంటుంది. దేశీయంగా పొదుపు సంస్కృతిని విస్తరించడం, స్వదేశీ పెట్టుబడులకు చేయూతగా నిలవడం వంటివి భారతీయ ఆర్థిక మూలాలను పటిష్టంగా నిలుపుతాయి. ఇలాంటి పరిస్థితులలో దేశీయంగా ముడి చమురు ఉత్పత్తిని, ఎగుమతులను పెంచుకోవడం ద్వారా మూలాలను పటిష్ట పరుచుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఆర్థిక పునాదులను బలోపేతం చేసుకుంటేనే రూపాయి పతనానికి అడ్డుకట్ట పడుతుంది. ఆర్థిక వ్యవస్థను విదేశీ ప్రత్యక్ష మదుపులు (ఎఫ్‌డిఐ), ఎగుమతులు దిగుమతులపై ఆధారపడేలా చేసి దేశ, విదేశీ కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలను రూపొందించిన ప్రభుత్వాల వైఖరి మారకుండా రూపాయి మారకపు విలువను పటిష్టం చేయడం సాధ్యం కాదు. రూపాయి విలువ పతనం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. దీనివల్ల ఎన్నో రకాలుగా నష్టపోవలసి వస్తుంది. అన్ని వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడి నడ్డి విరుగుతుంది. ద్రవ్యోల్బణం అదుపుతప్పి పోతుంది. దీన్ని అదుపు చేయడానికి రిజర్వు బ్యాంకు త్వరలో వడ్డీరేట్లు పెంచవచ్చు. ప్రభుత్వానికి బడ్జెట్ లోటు పెరుగుతుంది. దానికి పరిష్కారంగా పన్నులు పెంచాల్సి రావచ్చు. ప్రభుత్వం వద్ద తగినంతగా నిధులు లేక అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు మందగిస్తాయి. ఆర్‌బిఐ ద్వారా ద్రవ్యరేట్ల సవరణతో మార్కెట్‌ను నియంత్రించడం, ఎగుమతుల దిగుమతుల సమతుల్యం చేసే ఆర్థిక విధానాల స్థానంలో ప్రజల కొనుగోలు శక్తిని పెంచే దేశీయ మార్కెట్ కేంద్రిత విధానాలను రూపొందించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించకపోతే ఆర్థిక వ్యవస్థ మరింత లోతైన సంక్షోభంలోకి జారుకుంటుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను సమన్వయిస్తూ దేశీయ మార్కెట్‌ను పరిపుష్టం చేసే విధానాలను రూపొందించాలి.

ఈ పూర్వ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఉత్పాదకతను పెంచే శాస్త్ర పరిశోధనలకు మన ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, ప్రోత్సహించినట్టయితే అగ్ర రాజ్యాల సరుకులతో పోటీపడి మనం కూడా నాణ్యత కల్గిన, చవకైన సరుకుల్ని ఎగుమతి చేయవచ్చు. దీనివలన మన ఎగుమతులు పెరుగుతాయి, దిగుమతులు తగ్గుతాయి. ఆ విధంగా రూపాయి మారక విలువను కాపాడుకోవచ్చు. భారత ప్రజలను బాధల నుండి రక్షించడానికి, మనదేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుంచి, ప్రపంచ ద్రవ్య మార్కెట్ ముందు సాగిలపడకుండా ఉంచడానికి విలాస వస్తువుల దిగుమతులను నియంత్రించాలి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల దుష్పరిణామాలు 2008 ఆర్థిక సంక్షోభం నాటి నుండి ఒక్కొక్కటే అనుభవంలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా భారత పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు మానుకోవాలి. స్వావలంబన, దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఆర్థిక విధానాల వైపు మళ్లాలి. అయితే అటు కాంగ్రెస్ ఇటు బిజెపి రెండూ ఆ వినాశకర విధానాలను విడనాడవు. ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసే రాజకీయ శక్తులన్నీ ఒక వేదిక పైకి రావాల్సిన అవసరం ఉందని ప్రస్తుత పరిస్థితి స్పష్టం చేస్తోంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ఉద్యోగ కల్పనను ఆశించవచ్చా?

అంతర్జాతీయ ప్రయోజనాన్ని చేకూర్చే మేక్ ఇన్ ఇండియాతో నిరుద్యోగం మరింత పెరుగుతుందనీ, యువత ఈ వ్యవస్థను మార్చుకునే పనిలో ఉండడమే ఈ సమస్యకు పరిష్కారమనీ అంటున్నారు బి.ఎస్. రాజు

1969 నాటి ముచ్చట. ఈ దేశంలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాల్లేక అల్లాడిన కాలం. ఇంజనీరింగ్ కోర్సు చేసిన వాళ్లపై పత్రికల్లో నిత్యం వెక్కిరింతలు. నాకు బాగా గుర్తున్న అప్పటి ఒక కార్టూన్: ఇద్దరు తండ్రులు మంచి చెడ్డ మాట్లాడుకుంటూ ఉంటారు. పిల్లల పెళ్లి ప్రస్తావన వస్తుంది. వారిలో, ఓ పెద్ద మనిషి రెండో పెద్ద మనిషిని అడుగుతాడు, 'ఏమోయ్! మీ పిల్ల పెళ్లి ఈ ఏడాదైనా చేస్తావా, చేయవా?' అని. దానికి అవతలి మనిషి చెబుతాడు 'పెళ్లి కుదిరింది, కాబోయే అల్లుడు ఇంజనీర్' అని. ఇది విన్న పెద్ద మనిషి 'నీకేమైనా పిచ్చి పట్టిందా! చూస్తూ చూస్తూ పిల్లను ఇంజనీరుకిచ్చి గొంతుకోస్తావా?' అని నోరెళ్లబెట్టి ఆశ్చర్యం ప్రకటిస్తాడు. ఇదీ అప్పటి ఇంజనీర్ల స్థితి. ఇంచుమించు అందరి ఉద్యోగార్థుల దుస్థితి కూడా! నేనూ ఆ కాలపు ఇంజనీర్నే! అప్పటి నిరుద్యోగ పర్వం చవిచూసిన వాణ్ణే! ఉద్యోగం లేక, ఇంటిలో ఉండలేక, వాట్ నెక్స్ట్? వాట్ నెక్స్ట్? ప్రశ్నలకు జవాబు చెప్పలేక సతమతమైన వాణ్ణే! బరువైనా, భారమైనా ఇంజనీరింగ్ చదివించిన తల్లిదండ్రుల వేదన, అయినవారి ఆవేదన, చుట్టూ సమాజపు చులకనా దృష్టి, ఇవన్నీ అనుభవించిన వాణ్ణే!

అవకాశముండి చదువుకున్న ప్రతి విద్యార్థి, అవకాశంలేక చదువుకు దూరమైన ప్రతి యువతీ, యువకుడు ఉద్యోగం కావాలని, అటువంటి ఉద్యోగ రాబడితో జీవనం కొనసాగించాలని, జీవితంలో స్థిరపడాలని కోరుకోవడం అతి సహజం. అయితే ఈ దేశపు యువత ఉద్యోగ ఆకాంక్ష నెరవేరుతున్నదా? పైన ఉదహరించిన 1969 నాటి మా పరిస్థితికన్నా, ఈనాటి యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడినవా? లేక మరింత దిగజారినవా? ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యానంతర భారతంలో 'ఉద్యోగిత' స్థితిగతులేమిటి? వీక్షించవలసిందే!

2016లో నేను 'భారత్‌లో తయారీ: ఎవరికోసం? ఎందుకోసం? (మేక్ ఇన్ ఇండియా – ఫర్ హూం? బై హూం?)' అనే పత్రం ఆంగ్లంలో రాశాను. ఈ పత్రం హిందీ భాషలోకి తర్జుమా అయింది. ఈ అంశంపై రాంచీలోనూ, నాగపూర్‌లోనూ రెండు సెమినార్లు చాలా విజయవంతంగా జరిగాయి కూడా! ఈ పత్రం రాసే క్రమంలో అప్పట్లో 'మోడీ' ఇంటా, బయటా ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్ట్‌పై విక్రమ్‌మన్ శరమాని అనే యువ ప్రవాస భారతీయుని విశ్లేషణ చదివాను. విక్రమ్ మన్ శరమాని హార్వార్డ్ డాక్టరేట్. 'బ్లూమ్ బస్టాలజీ' అనే పుస్తక రచన ద్వారా ఈయన ప్రాచుర్యం పొందాడు. అమెరికాలోని అన్ని ప్రముఖ పత్రికలకు విశ్లేషణాత్మక వ్యాసాలూ రాస్తాడు. అప్పట్లో, దేశ విదేశాల్లో మోడీ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న 'మేక్ ఇన్ ఇండియా' పై ఈయన విశ్లేషణ శాస్త్రీయంగానూ, చాలా నిజాయితీతోనూ కూడుకుని ఉండడం చూసి నేను రాసిన 'మేక్ ఇన్ ఇండియా'– ఫర్ హూం? బై హూం?' పత్రంలో ఆ విషయాలను పొందుపర్చాను. దీనిపై ఆయన ఏమి చెప్పాడో చూద్దాం!

మోడీ గారి 'మేక్ ఇన్ ఇండియా' బృహత్ ప్రణాళిక. చాలా డబ్బు మూటలను దేశంలోనికి తీసుకురావచ్చు గాని, సరిపడా ఉద్యోగాలను మట్టుకు తేలేదు. మోడీ గత (2016) అమెరికా పర్యటనలో 'మేక్ ఇన్ ఇండియా' గురించి చాలా ఆడంబరంగా ప్రకటించుకుంటూ, ఈ ఐడియా ఇండియాను చాలాపెద్ద తయారీ కేంద్రంగా (మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా) మార్చబోతోందని, రాబోయే ఆరేళ్ల కాలంలో తయారీ రంగంలోనే 100 మిలియన్ల (10 కోట్ల) ఉద్యోగాలు లభిస్తాయని, ఈ భారీ ఉద్యోగ కల్పనతో రాబోయే కాలంలో భారతదేశ మధ్యతరగతి విస్తరించి, దేశ ఆర్థిక ప్రగతికి దోహద పడుతుందని చెప్పుకున్నాడు.

ఎందరో మోడీ మాటలకు ముగ్ధులయ్యారు. వారిలో నేనైతే లేను. ఎందుకనంటే, తయారీ రంగాన్ని 'ఆటోమేషన్' శాసిస్తున్న ఈ తరుణంలో ఈ రంగం ద్వారా ఉద్యోగాభివృద్ధిని ఆకాంక్షించడమన్నది అటకెక్కిన పాతసరుకుగా నేను భావించాను. కాబట్టి మోడీ ప్రకటనకు నేను ముగ్ధుణ్ణి కాలేదు. ఈ వ్యూహం చైనాకు పనిచేసినట్టుగా భారత్‌కు పనిచేసే అవకాశం లేదు. ఆ బండి ఇండియాను దాటుకుని వెళ్లిపోయింది. ఇటువంటి వ్యూహం నుండి లబ్ధిపొందే అవకాశం ఇండియా నుంచి చేజారిపోయింది.

ఒక్కమాటలో చెప్పాలంటే, గత కొద్ది దశాబ్దాల్లో టెక్నాలజీ అభివృద్ధి ఉరకలెత్తడంతో, అత్యంత చవకగా లభించే వేతన శ్రమ మాత్రమే ఈ టెక్నాలజీ సష్టించిన మెరుగైన ఉత్పత్తి యంత్రాలతో పోటీ పడగలదు. తయారీ రంగంలో రోబోటిక్ టెక్నాలజీ ప్రవేశం తరువాత ఏ దేశమైనా పోటీలో నిలవాలంటే ఆ దేశంలో వేతనాలు కారుచవకగా లభ్యమవ్వడం ఒక్కటే మార్గం. అయితే ఇండియా ఆర్థిక వ్యవస్థ అవసరాలకు కావలసినది ఇదికాదు, దీనికి పూర్తిగా భిన్నమైనది.

మొదటి చూపులో 'మేక్ ఇన్ ఇండియా' వ్యూహంలో లొసుగులు అర్థం కాకపోవచ్చు. అది సొంపుగానే అగుపించవచ్చు. ఎందుకనంటే ఇది చాల పెట్టుబడులను దేశంలోకి రాబట్టింది. 5 బిలియన్ డాలర్ల ఫాక్స్ కాన్ ఫ్యాక్టరీ, ఒక బిలియన్ డాలర్ల జనరల్ మోటార్స్ పెట్టుబడి, ఎయిర్‌బస్, హ్యుండై వగైరా కంపెనీల ఇండియా తయారీ రంగంలో పెట్టుబడుల ప్రకటనలు చిన్నవేమీ కాదు. గత 18 నెలల్లో ఇండియా విదేశీ పెట్టుబడులకు నెంబర్ వన్ గమ్యంగా నిలిచిన మాట వాస్తవమే! ఇది ఇండియాకు సంతోషకర వార్తే!

అయితే, మోడీ గారి 100 మిలియన్ ఉద్యోగాల కల్పన అనే ఆశమట్టుకు దీని ద్వారా నెరవేరదు. 2010–14 మధ్య కాలంలో తయారీ రంగంలో 4 మిల్లియన్ (40 లక్షల) ఉద్యోగాలు వచ్చాయి. ఈ లెక్కన 2022 నాటికీ మరో 80 లక్షల ఉద్యోగాలు ఈ రంగంలో రావచ్చునెమో! ఈ సంఖ్య మోడీ ప్రకటించిన ఉద్యోగాల లెక్కలకైతే కడుదూరం.

మోడీ తన అమెరికా పర్యటనలో భాగంగా 2016, ఫిబ్రవరి 13న 'యుమి' అనే చాలా ప్రముఖమైన వ్యక్తిని కలిశాడు. ఇంతకీ ఆ ప్రముఖమైన వ్యక్తి ఎవరో కాదు, ఓ అత్యాధునిక రోబోట్. ఇప్పటివరకు చేయ సాధ్యంకాని నాజూకైన పనులను ఈ రోబోట్ చేయగలుగుతుంది. సూక్ష్మమైన విడిభాగాలను సైతం తానే గుర్తించి, చేతబుచ్చుకుని కూర్చిపెట్టే (సబ్ ఎసెంబ్లీ) పనులను సైతం అతి సునాయాసంగా నెరవేర్చగల్గుతుంది. అంటే ఈ యుమి వంటి రోబోట్లే ఇపుడు తయారీ రంగాన్ని శాసిస్తాయనడంలో ఏ సంకోచం ఉండనక్కర లేదు. వేగంగా పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానం (టెక్నాలజీ), ఆకాశం నుండి కిందికి దిగివచ్చిన రోబోట్ల ధరలు, తయారీ రంగాన్ని పూర్తి ఆటోమేషన్ పథం లోనికి నడిపిస్తున్నాయి. దీనితో తయారీ రంగ సంస్థలు త్వరితగతిన పరివర్తన దిశగా పరుగులెడుతున్నాయని, ఇప్పుడు ఈ పరివర్తన లాభదాయకమని, మానవ వనరును తొలగించుకుని ఆటోమేషన్ పథంలో నడవడం ఇపుడు మొట్టమొదటిసారి చాల లాభసాటి వ్యవహారమని ప్రముఖ అమెరికన్ సలహాదారు సంస్థ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ చెబుతోంది. ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఈ విషయాన్నే ధృవపరుస్తున్నాయి.

10 లక్షల పనివారితో, ఏపిల్ కంపెనీ ఐ-ఫోన్లు, ఐ-ప్యాడ్లను కూర్చు (ఎసెంబ్లీ) చేసే ఫాక్స్‌కాన్ సంస్థ రాబోయే 2-3 ఏళ్లలో తన ఉత్పత్తి సామర్థ్యంలో 70 శాతం యాంత్రీకరణ (ఆటోమేషన్) చేయనుంది. అంటే ప్రపంచ తయారీ రంగపు భవిష్యత్తు - ఎక్కువ రోబోట్లు, తక్కువ పనివారు. దీనర్థం ఉత్పత్తి పెంపుదలలో చవకగా లభ్యమయ్యే శ్రమకు ఉండే పోటీ, అనుకూలతను కోల్పోయినట్టే! ఇకముందు తయారీ రంగం ఇదివరలా ఉద్యోగాల కల్పతరువు కాదు.

ఉత్పత్తి రంగం ఉద్యోగ కల్పనకు దోహదపడని స్థితిలో, మోడీ, మేక్ ఇన్ ఇండియాకు అర్థమేముంది? నిలకడగల దేశాభివృద్ధికి అదేమి తోడ్పడుతుంది? ఒకవేళ నిజంగానే ఇండియా ప్రపంచ తయారీ రంగపు కూడలిగా ఎదిగినా దాని నుండి ఒనగూరే ఫలితాలు గుప్పెడు మందికే గాని శ్రామిక బాహుళ్యానికి కాదు. ఇండియాను ఆర్థిక వెల్లువ ముంచెత్తు తుందని అనుకున్నా, అందులో అందరికి పయనించే నావ ఉండదు.

ఉత్పత్తి రంగంలో యుమి వంటి రోబోట్ల ప్రవేశం నూతనాంశ మైనప్పటికీ, పెట్టుబడికి పారిశ్రామికీకరణ వలన ఒనగూరే లాభాల తరుగుదల అన్నది గత కొన్ని దశాబ్దాలుగా చోటుచేసుకుంటున్న వ్యవహారమే! పరిశోధకులు ఈ విషయంపై దృష్టిసారించి నిగ్గుతేల్చిన దేమంటే, పారిశ్రామికీకరణ చెందే ఆర్థిక వ్యవస్థల్లో ఉత్పత్తిరంగ ఉద్యోగాల వాటా అగ్రస్థానం చేరడం అన్నది వ్యవస్థలో సగటు జీతాల స్థితి తక్కువగ ఉన్నప్పుడే సాధ్యపడింది. సగటు జీతం పెరిగి ఒక దశకు చేరిన తరువాత స్థితి మారిపోతుంది. సగటు తలసరి జీతం అమెరికాలో 17,700 డాలర్లు ఉన్నప్పుడు, దీనికి కొన్ని దశాబ్దాల తరువాత దక్షిణ కొరియాలో 12,700 డాలర్లు, బ్రెజిల్‌లో 8700 డాలర్లు ఉన్నప్పుడు ఉత్పత్తిరంగ ఉద్యోగిత పెరిగింది. ఈ మధ్యకాలంలో కొన్ని ఆఫ్రికా దేశాల్లో ఇది 2000 డాలర్లుగా ఉన్నపుడు తయారీ రంగంలో ఉద్యోగాలు కనిపిస్తున్నాయి.

ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ఎకానమిస్ట్' అన్నట్లు 'ఇప్పుడు వేగవంతమౌతున్న సాంకేతిక పరిజ్ఞాన పరిణామం అభివృద్ధి ఆర్థిక సూత్రాలను మార్చివేస్తుంది. పారిశ్రామికీకరణ ద్వారా మధ్యతరగతి ఆదాయాలను సృష్టించగలిగిన ఆర్థిక వ్యవస్థల్లో చైనాయే ఆఖరి దేశం కావచ్చు'.

గుర్తుపెట్టుకోవలసిన మరో విషయమేమంటే 2022 నాటికి ఇండియా ప్రపంచంలోనే అతి పెద్ద జనాభాగల దేశమౌతుంది. తలసరి ఆదాయం, జనసంఖ్యపై ఆధారపడి ఉండే అంశమని మనకి తెలుసు. దేశంలో ప్రజలకు ఉద్యోగాల, ఆదాయాల కల్పనా అవసరాలు, వాటి కల్పనకై ఒత్తిడి పెరగడం సహజం. రాబోయే 15 ఏళ్లలో ఇప్పుడున్న ఉద్యోగావసరాల సంఖ్యకి ఇంకో 15 కోట్లు వచ్చి చేరుతుంది. మరి ఈ కొత్తగా వచ్చి చేరే ఉద్యోగార్థులకు ఉద్యోగాలు దొరుకుతాయా? దొరికే ఉద్యోగాలకైనా దొరికే వేతనాలు ఏపాటివి? ఆలోచించాల్సిందే!

నిజమేమిటంటే, ఉత్పత్తిని వేగవంతం చేసే సాంకేతిక పరిజ్ఞానం... ఆర్థిక వ్యవస్థలకు తక్కువతో ఎక్కువ ఉత్పత్తిని ఒనగూరుస్తుంది. అయితే ఇండియాకు ఎక్కువ (మంది)తో ఎక్కువ ఉత్పత్తి చేయడం అవసరం. అధికోత్పత్తిని సాధించే రోబోట్స్ పనివారి కొరత తీర్చడానికి ఉపయోగ పడతాయి. అయితే పనికోసం ఎదురు చూసే శ్రమశక్తి ఇండియాకు పుష్కలంగా ఉంది. అంచేత ఇండియాకు కావలిసింది ఉద్యోగాలు. అవీ ఇబ్బడి ముబ్బడిగా కావాలి.

దేశంలో ఉద్యోగార్థుల సమూహం ప్రతినెల 10 లక్షలుగా పెరుగుతోంది. హెచ్చు జనాభాతో ముడిపడి ఉన్న సమస్యలను 'ఉత్పాదకత' మరింత జటిలం చేస్తుంది. 'యాంత్రీకరణ'ను మరోలా నిర్వచించాలంటే, ఇప్పటికే నిండి ఉన్న ఉద్యోగార్థుల తటాకానికి మరింత నీరును తోడి నింపడమే! నిజానికి, దీనికి వ్యతిరేకమైనది ఇండియాకు అవసరం. మింగుడుపడడం కష్టమైనా - ఇక్కడైనా, ప్రపంచంలో ఇంకెక్కడైనా ఒకసారి ఎదిగి వచ్చిన 'ఉత్పాదకత' అనే జన్యువును తిరిగి సీసాకెక్కించి బిరడా పెట్టడం కష్టసాధ్యం. ఇప్పుడు మనం 'చైనా నమూనా'పై దృష్టి కేంద్రీకరించి ఇండియాకి అన్వయించాలనుకోవడం కావాలని తిప్పలు కొనితెచ్చుకోవడమే! అలా చేయడంవల్ల మనకు మిగిలేది నిరాశేనని గ్రహించడం మంచిది.

'మేక్ ఇన్ ఇండియా' ఆలోచనను పూర్తిగా పునర్నిర్వచించుకోవాల్సిన సమయమిది. ఇది అవశ్యం జరగాల్సిన పని. ఇండియాకు తనదైన, స్వతంత్రమైన కొత్త ఉద్యోగ కల్పనా వ్యూహం లేకుండా మోడీ నిత్యం జపించే ఇండియాలో తయారీ మంత్రం కోట్లాది దేశ ప్రజలకు అశాంతిని మిగల్చడం ఖాయం. దీని అర్థం ఇండియా ఎప్పటికీ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగలేదని కూడా!

ఉత్పత్తి రంగంలో చోటుచేసుకుంటున్న కొత్త సాంకేతిక మార్పులను పైన చెప్పుకున్నాం. 'ప్రపంచ ఆర్థిక వేదిక' (వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్- డబ్ల్యు.ఇ.ఎఫ్) తాజాగా విడుదల చేసిన 'ఉద్యోగాల భవిష్యత్తు' (ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్) అనే నివేదికలో పైవిషయాలను నిర్ధారించడమే గాక ఇండియాకు కొత్త సమాచారం సమకూరుస్తూ అప్రమత్తం చేసింది. ఈ నివేదిక ప్రకారం 2025 నాటికీ పనిస్థలాన్ని యంత్రాలు పరిపాలిస్తాయి (మెషిన్స్ విల్ రూల్ వర్క్‌ప్లేస్).

రాబోయే నాలుగేళ్లలో, ప్రపంచ స్థాయిలో యాంత్రీకరణ ప్రవేశ పెట్టడం ద్వారా పలు 'ఉత్పత్తి - వ్యాపార' సంస్థలు, ప్రస్తుతం వారికున్న ఉద్యోగుల సంఖ్యను సగానికి సగం తగ్గించుకునే పనిలో ఉన్నాయి. ఊడిపోయే ఉద్యోగాలు ఊడిపోగా, కొత్త నైపుణ్యతా ఉద్యోగాలకు దారులు తెరుచుకుంటాయి. కొత్త నైపుణ్యాలకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఇండియా సందర్భానికి వచ్చేసరికి తయారీ, సేవా, హైటెక్ రంగాల్లో పనిచేస్తున్న 54 శాతం ఉద్యోగులకు నైపుణ్య ప్రమాణాల స్థాయి పెంచాల్సి ఉంటుందని ఈ నివేదిక చెబుతు న్నది. 2018-22 మధ్య కాలంలో ఉద్యోగ క్షేత్రంలో అనూహ్యమైన మార్పులు తథ్యం. అతివేగపు మొబైల్

అంతర్జాలం, క్లౌడ్ టెక్నాలజీ, కృత్రిమ జ్ఞానం (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్), రోబోట్స్, స్వయంచాలక యంత్ర విధానం (ఆటోమేషన్) ద్వారా నిర్వహించబడే పని పద్ధతులు పనివారికి, యంత్రాలకు మధ్యనున్న ఇప్పటి సరిహద్దులను పునర్నిర్ణయిస్తాయి.

12 రకాల తయారీ, సేవా, హైటెక్ రంగాల్లో 2018 నాటికి 71 శాతం పనులు మనుషులు చేస్తుంటే 2025 నాటికి ఈ శాతం 48కి పడిపోతుంది. అంటే 52 శాతం పనులు యాంత్రీకరణ చెందుతాయి. ఈ లెక్కలు అభివృద్ధి చెందిన, చెందుతున్న 20 దేశాల్లో 15 మిలియన్‌ల పనివారిపై జరిపిన సర్వేపై ఆధారపడినవని 'ప్రపంచ ఆర్థిక వేదిక' చెబుతోంది. ఈ నివేదిక రెండురకాల చిత్రాలను ఊహించింది. యంత్రాలకు, పనివారికి, అల్గోరిథమ్స్‌కు మధ్య జరిగే పునర్విభజన మూలంగా 75 మిలియన్ ఉద్యోగాల విస్థాపన చెందే దృశ్యం ఒకటైతే, కొత్త నైపుణ్యతతో కూడుకున్న పనులకు 133 మిలియన్ ఉద్యోగాలకు అవకాశం ఏర్పడడం అనేది రెండవ దృశ్యం అని ఈ నివేదిక చెబుతున్నది.

మొత్తానికి చూస్తే ప్రపంచ ఉద్యోగ క్షేత్రంలో అరాచక పరిస్థితి ఇప్పటికే చోటుచేసుకున్నది. రాబోయే కాలంలో అది మరింత జటిలమై తీరుతుంది. ఇండియాలో నైపుణ్యాల లేమి, పునర్ నైపుణ్యత నింపుకోవడం పేరున స్కిల్–ఇండియా పథకం తెరమీదకు వచ్చింది. ఈ పథకం పేరు చెప్పి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, వారి తైనాతీ సంస్థలు కోట్లకు కోట్లు కాజేసి జేబులు నింపుకుంటున్నాయి. స్కిల్ ఇండియా పథకం ఉద్యోగ కల్పనకు దోహదపడలేదు. ప్రభుత్వాల దగాకోరు విధానాల వలన ఇప్పటికే వేనవేల కోట్ల ప్రజాధనం నల్లబజారుపాలై ఉద్యోగకల్పన అభాసు పాలైయింది. నిజానికి, దేశ ఆర్థికవ్యవస్థ దొంగల బారినపడి ఉద్యోగ కల్పన కుప్పకూలిపోయింది.

ఇపుడు ప్రపంచ దేశాల్లోకెల్లా ఇండియాలో యువశక్తి అత్యంత అధికంగా ఉంది. 15–24 మధ్య వయస్సు కలిగిన యువత సుమారు 19.2 శాతం అంటే 231.9 మిలియన్లు. పనిచేసే (15–59 ఏళ్ల) వయస్సు గలవారు 62.5 శాతంగా అంటే 756.62 మిలియన్లు. జూలై 2017–ఏప్రిల్ 2018 మధ్యకాలంలో దేశ నిరుద్యోగం రెండింతలైందని సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తెలియ చేస్తోంది. 2016–17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగాల సంఖ్య 406.7 మిలియన్ల నుండి 406 మిలియన్లకు పడిపోయింది. గడచిన పది నెలల్లో నిరుద్యోగం 3.9 శాతం నుండి 6.75 శాతానికి చేరింది. బహుశా ఇప్పటికి 7 శాతం దాటినా ఆశ్చర్యం లేదు.

దేశంలో, పలు ఆర్థిక నిపుణులు పెరిగిపోతున్న నిరుద్యోగంపై తమ ఆందోళనను వ్యక్తం చేస్తే, కేంద్ర ప్రభుత్వం ఈ లెక్కలు నిజం కాదని కొట్టిపారేస్తోంది. ఉద్యోగ కల్పనా గణాంక సేకరణ సజావుగా జరగలేదని అందుకనే ఈ తప్పుడు లెక్కలు కాగితాలకు ఎక్కాయని బుకాయిస్తోంది. నీతీ ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ ప్రభుత్వ బాకారాయుడి పాత్ర పోషిస్తూ ప్రభుత్వంలోని పెద్ద బుర్రలు ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేస్తున్నాయని, తీవ్రతతో పని చేస్తున్నాయని, సరైన గణాంకాల తీపి కబురు తొందరలోనే తెలియచేస్తామన్నాడు. కాని, ఆ తీపికబురు కాస్తా నిజానికి 'వగరే'నని తేలిందో ఏమో ఇంతవరకు ఎక్కడా దాని జాడలేదు.

గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఈ విషయంపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తే, దానికి మోడీ ఇచ్చిన జవాబు వింటే కొమ్ములు తిరిగిన ఆర్థిక శాస్త్రవేత్తలు సైతం తాము ఇప్పటివరకు నేర్చుకున్న అర్థశాస్త్రాన్ని తిరిగ రాసుకోవాలి. బహుశా వారంతా ఈ దేశంలో ఆ పనే చేస్తున్నారేమో!

మోడీ తన ప్రభుత్వం ఇప్పటికే కోటి ఉద్యోగాలు కల్పించిందని, అదెలాగో వివరించాడు. రాష్ట్రాల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతుంటే దానర్థం కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు కాదా? ప్రభుత్వం రహదారులు, రైలు మార్గాలు నిర్మిస్తుంటే అది ఉద్యోగ కల్పన కాదా? కొత్త రైళ్లు, మోటారు వాహనాలు తయారు చేస్తుంటే అది ఉద్యోగ కల్పనా కాదా? పెరుగుతున్న సరుకుల అమ్మకాలు, వాటి రవాణా, పంపిణీ ఇదంతా ఉద్యోగ కల్పన కాదా? ఒక కొత్త ట్రక్కు రోడ్డెక్కితే కనీసం పది మందికి ఉద్యోగ కల్పన జరిగినట్టే కదా! ట్రక్కు నడిపేవాడు, తుడిచేవాడు, డీజెల్ కొట్టేవాడు, గాలికొట్టేవాడు, వీళ్లకు దారిపొడుగునా పకోడీ, రోటి, చాయ్, చుట్ట, బీడీ సిగరెట్ వగైరా అందించేవారి సంఖ్యా పెరిగినట్టా? కాదా? ఈ లెక్కలు వేయడంమాని తన రాజకీయ ప్రత్యర్థులు తెలివిమాలిన దుష్ప్రచారానికి దిగుతున్నారని మోడీ ఎద్దేవా చేస్తున్నాడు.

మోడీ ఓ సంగతి చెప్పడం మరిచినట్లున్నాడు! 2014లో ఆయన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ రోజు వరకు దేశంలో పెరిగిన జనాభా 6 కోట్లైతే అందులో మూడో వంతు జనాభా పనిచేసే వయస్సు వాళ్లై ఉండాలి. అంటే 2 కోట్ల మంది జనాభాను తన ప్రభుత్వం పనిలోకి దింపినట్టే కదా! అంటే తన ప్రభుత్వం చెప్పిన కోటి ఉద్యోగాలకు డబుల్ ఉద్యోగాలు కల్పించినట్టా? కాదా? అందుచేత జనాభా పెరుగుతోం దంటేనే ఉద్యోగాల సంఖ్య కూడా పెరుగుతున్నట్టే!

ఇది చెప్పడం ఆయన మిస్సయ్యాడు గాని, మనకు ఆయన నీతిని అర్థం చేసుకునే తెలివితేటలుండాలి మరి! మబ్బు మెదళ్లతో వెనకబడి మనం ఆయనపై నిందారోపణలు చేయడం అన్యాయం కదూ?

పెరుగుతున్న జనాభా, వేగవంతమవుతున్న పనుల యాంత్రీకరణ, తరిగిపోతున్న ఉద్యోగాలు, ముంచుకొచ్చే నిరుద్యోగపర్వం వీటి గురించి ఇప్పటివరకు చెప్పుకున్నాం. ఇపుడు 'ఈ వ్యవస్థ నుండి ఉద్యోగ కల్పన ఆశించవచ్చా?' అనే అసలు విషయానికొద్దాం!

పనుల్లేకుండానే జనం బతుకుతున్నారా? ఏదో ఒక పనిచేసుకు బతకబట్టే కదా మనిషి జీవనం గడుస్తోంది! పనిచెయ్యాలనుకొనే వాడికి ఏదో పని దొరకకుండా పోతుందా? అందరికీ కలెక్టరు పదవులే, ఆర్డర్లు ఇచ్చే పదవులే కావాలంటే ఎక్కడ నుంచి వస్తాయి? ఏ పని దొరికితే ఆ పని చేసుకుంటూ పోవడమే జీవన ధర్మం కదా! వంటి వాదనలు చాలానే వింటూంటాం! అంతేకాక 'జీరో టు హీరో' కథనాలు, సక్సెస్ స్టోరీలు, రోల్ మోడల్ వర్ణనలు కూడా చాలానే చదువుతూ ఉంటాం! కానీ, ప్రతి మనిషి ఒక 'రోల్ మోడల్'గా ఉన్న వ్యవస్థల గురించి అసలు పట్టించుకోం సరికదా, వాటిని తృణీకరిస్తాం! గేలీ చేస్తాం! ఏహ్య భావంతో చూస్తాం! దీనికి మూలకారణం హేతుబద్ధ వ్యతిరేక మూఢాలోచనతో మూసపోసి ముద్రకొట్టి అమర్చిన మెదళ్ల సముదాయ సమాజం మనది కనుక.

పనులనేవి ఏ వ్యవస్థలోనైనా ఉంటాయి. పనుల్లేకుండా ఏ వ్యవస్థ నడవదు. పనులుండడం వేరు, ఉద్యోగాలుండడం వేరు. ఉద్యోగాలుండడ మంటే అర్థం నిలకడగల ఆదాయం, ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్ర మైన నివాసం, గౌరవప్రద జీవనం, అందుబాటులో మంచి విద్య, ఆరోగ్యాలు, వృద్ధాప్య సంరక్షణ, ఇత్యాది సౌకర్యాలను గ్యారంటీ చేయడం. ఇదొక ఎత్తు. ఒక పార్శ్వం.

రెండవ పార్శ్వమేమంటే సమానత్వం. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమానత్వం ఉండే సమాజంలోనే అందరికీ ఉద్యోగాలు ఉండే గ్యారంటీ ఉంటుంది. మనం చేసే పనుల్లో వ్యత్యాసముండవచ్చు. సామాజిక

అందరికి సమాన విద్య నేటి అవసరం

ప్రభుత్వాలు విద్యను వ్యాపార సరుకుగా మార్చి కొనగలవారికే విద్యను పరిమితం చేశాయనీ, దీన్ని వ్యతిరేకిస్తూ అందరికీ సమాన విద్య విధానం కోసం డిమాండ్ చేస్తున్న విద్యావేత్తలపై అణచివేత ధోరణిని ప్రదర్శిస్తున్నాయనీ అంటున్నారు **మద్దిలేటి**

విద్య అందరికి అందించాలని భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా చేర్చి 70 ఏళ్లు గడుస్తున్నా ఇంకా విద్యకై పోరాటాలు చేయడం అంటే పాలకవర్గాల వైఫల్యానికి నిదర్శనం. విద్యను సేవారంగంలో నుండి తొలగించి మార్కెట్లో అమ్మకానికి ఉంచిన పాలకులు అట్టడుగు వర్గాల ప్రజలకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మనువు ఆనాడు బహిరంగంగానే విద్యను అందరికి ఇవ్వనని చెప్పి ఆచరణలో పెట్టాడు. ఈనాటి మనువు వారసులు మనువును ఆధునీకరించి డబ్బున్న వారికే విద్య అని మళ్లీ దళిత బహుజనులకు విద్యను దూరం చేస్తున్నారు.

ఈ క్రమంలో 1987లో విద్యాపరిరక్షణ కమిటీ ఏర్పడి అందరికి సమాన విద్య అనే నినాదంతో అనేక ఉద్యమాలు చేపట్టింది. విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాల భాగస్వామ్యంతో తమ ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నది. ఈ కమిటీకి నాయకత్వం వహిస్తున్న ప్రొ. హరగోపాల్, ప్రొ. చక్రధరరావు, ప్రొ. లక్ష్మినారాయణలు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని అందరికి ఒకే బడి ఒకే చదువు అనే నినాదాన్ని బలంగా వినిపించడంలో ప్రధానపాత్ర వహించారు. తెలంగాణ వస్తే అందరికి నాణ్యమైన చదువులు అందుతాయని ఆశించాం. కాని మనువు వారసులు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారు.

తెలంగాణ వస్తే కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య అన్న కెసిఆర్ ఇప్పటి వరకు ప్రణాళిక కూడా లేదు. 4637 ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని జిఓలు జారీచేసి వందలాది పాఠశాలలను ఎవరికి తెలియకుండానే మూసివేశారు. పేద పిల్లలు చదువుకునే పాఠశాలల్లో అనేక రకాల సమస్యలు తిష్టవేశాయి. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు లాంటి మౌలిక సమస్యలు కూడా పరిష్కరించలేని దుస్థితి నెలకొని ఉంది. పగలంతా విద్యార్థులకు, రాత్రి సమయంలో పందులకు, పశువులకు నిలయంగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయి. గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో పట్టించుకున్న నాధుడే లేడు. గురుకులాల పేరుతో నాణ్యమైన విద్య అని నమ్మబలికి మోసం చేశాడు. కనీస సౌకర్యాలు, పర్మనెంట్ టీచర్లు లేని దుస్థితి ఉన్నది. గెస్ట్, కాంట్రాక్ట్ టీచర్లను నియమించిన చరిత్ర కెసిఆర్ ప్రభుత్వానికే దక్కింది. సొంత భవనాలు లేవు. అరకొర సౌకర్యాలు ఉన్న భవనాలు అద్దెకు తీసుకున్నా వీటిలో రాత్రి వేళలో నిద్రలోంచి జారిపడి చనిపోయిన విద్యార్థులు ఉన్నారు. ఇందులో కూడా చదువుకుంటా అన్న విద్యార్థికి అడ్మిషన్ ఇవ్వకుండా, ఎంట్రన్స్‌ల పేరుతో ర్యాంకులు వచ్చిన వారికే విద్యను అందిస్తున్నారు, రాష్ట్రంలో 64 లక్షల మంది పిల్లలు చదువుకుంటుంటే కేవలం 2 లక్షల మంది విద్యార్థులకే గురుకుల విద్య అందిస్తుంది ప్రభుత్వం. మిగతా వారి సంగతి ఏంటని అంటే సమాధానం లేదు.

అభివృద్ధి అవసరాలను బట్టి పనుల మార్పిడి, నైపుణ్యాల మెరుగుదల ఉండవచ్చు. ఉద్యోగ కల్పనా వ్యవస్థ అంటే అటువంటి వ్యవస్థ నూటికి నూరుపాళ్లు 'మేన్ ఎండ్ ప్లాన్' అంటే 'మనిషి-ప్రణాళిక' సమాజాన్ని నడిపించే మూలసూత్రంగా ఉండాలి. సమాజానికి 'శ్రమ-శ్రామికుడు' కేంద్ర బిందువుగా ఉండాలి. అరాచక విపణి (అనార్కిస్ట్ మార్కెట్) సమాజాన్ని శాసించే ఏ వ్యవస్థలోనైనా ఉద్యోగాల నిజకల్పన జరగడమనేది భ్రమ. దోపిడీ, పీడన, లాభాపేక్ష, పెట్టుబడి పోగువేత కేంద్రంగా గల వ్యవస్థలు అరాచకంగా తప్ప వేరేవిధంగా ఉండే ఆస్కారం లేదని చరిత్ర తేల్చి చెప్పిన సత్యం.

ఎకనామిస్ట్ పత్రికైనా, ప్రపంచ ఆర్థిక వేదికైనా, ప్రపంచ బ్యాంకైనా, చిత్రికబట్టి సానబెట్టిన పదజాలంతో చెప్పే వాటి మర్మం వాటి కుంటుంది. మార్క్స్ దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థ పొట్ట చీల్చి చూపించిన నిజాయితీ పరుడైన ప్రజాపక్ష మేధావి. కాబట్టి శ్రామిక మానవాళి విముక్తి శాస్త్రాన్ని శోధించి, రచించి, ఒక అస్త్రంగా మలచి మానవాళికి అందించాడు. ఇప్పుడు భారత దేశ యువత ఒంట బట్టించుకోవాల్సిందిదే! అన్ని దేశాల్లో నడుస్తున్న వ్యవస్థలు కొంచెం అటూఇటుగా దోపిడీ దుర్మార్గ వ్యవస్థలే! మనిషి, పర్యావరణం పట్టని అశాస్త్రీయ, ప్రణాళికారహిత అరాచక వ్యవస్థలే! అందుకే ఉద్యోగం, నిరుద్యోగం అనే సమస్యలు నిరంతరం నానుతూ ఉంటాయి. ఆట నడుస్తూ ఉంటుంది. మార్కెట్ ప్రజలను వెర్రివెంగళప్పలను చేస్తూనే ఉంటుంది. మనిషి ఉద్యోగం ఉండడం ఊడడం మధ్య గడియారపు పెండ్యులంలా కొట్టుమిట్టాడుతూ ఉంటాడు. భారత దేశ యువత ముందు ఇప్పుడో గొప్ప సదవకాశం వచ్చి వాలింది. అదే నిరుద్యోగం. వారు తమ గుండె తలుపులను, మెదళ్ల గేట్లను విప్పి, ఆలోచనలను తట్టి లేపితే ఈ నిరుద్యోగపు మూలాల్లోనికి చొచ్చుకుని వెళ్లగల్గుతారు. అంటే కొత్త ఉద్యాగాలకు నూతన విముక్తి మార్గాలను తామే వేసుకుంటారు.

ఇప్పుడున్న వ్యవస్థను సమూలంగా నిర్మూలించే అన్నిరకాల పనులే ఈ నాటి యువతకు సంపూర్ణ ఉద్యోగాలు. ఇది ఇప్పటి చారిత్రక సత్యం. నడుస్తున్న చరిత్ర, ఈ తరం యువత ముందుంచిన అవకాశం ఇదే. వారు నిర్వర్తించాల్సిన బాధ్యత కూడా ఇదే! నిరుద్యోగ రహిత నూతన సమాజ నిర్మాణానికి కంకణం కట్టుకుని పనిచేయడమే ఇప్పుడు దేశ యువత ముందున్న పెద్దపని. ఈ పని వదిలిపెట్టి ఇంకే పనిచేసినా గమ్యం అగమ్య గోచరమే!

(రచయిత శ్రామిక నేస్తం సంపాదకులు) వీ

విద్యారంగాన్ని సేవారంగంలో ఉంచాలని భారత రాజ్యాంగం చెబుతుంటే పాలకులు మాత్రం అంగట్లో సరుకుగా మార్చి ఎంత ఎక్కువ డబ్బులు పెడితే అంత మంచి చదువులు అనే సంస్కృతిని కొనసాగిస్తున్నారు. పదివేలు పెట్టినవారికి ఒక రకమైన చదువు, లక్షలు పెట్టిన వారికి ఒక రకమైన చదువు, డబ్బులు పెట్టలేని వారికి ప్రభుత్వ పాఠశాలలు మిగిలిపోయాయి. ఎంఎల్ఏల, మంత్రుల, పిల్లలు మాత్రం కార్పొరేట్ పాఠశాలల్లో ఎసి గదులు, మినరల్ వాటర్, ఎల్‌కెజి విద్యార్థికి 5 మంది టీచర్లు, సబ్జెక్ట్‌కో టీచర్, వ్యాయామ టీచర్, పిల్లలకు తక్షణ వైద్య సౌకర్యం కోసం పాఠశాలలోనే ఎంబిబిఎస్ డాక్టర్ ఉంటాడు. వీరి పిల్లలు పలక, బలపం వాడడం మరిచిపోయి ఐప్యాడ్స్ వాడడం వీరికి తెలిసిన విద్య. మనం ఓట్లేస్తే గెలిచిన నాయకుల పిల్లలకు సకల సౌకర్యాలు ఉంటాయి, కాని ఓట్లేసిన ప్రజల పిల్లలు పాత గోడలు, పాములు, తేళ్ల మధ్య పిల్లలు చదువు నేర్చుకుంటున్నారు. ఏనాడు కూడా పిల్లల చదువులను పట్టించుకున్న పాలకులు లేరు.

అట్టడుగు వర్గాలైన ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనార్టీ వర్గాలు ఎంతో కష్టపడి యూనివర్సిటీలో సీటు సంపాదించుకొని చదువుతున్న సందర్భంలో పాఠాలు చెప్పడానికి టీచర్లు, కనీస సౌకర్యలు లేని పరిస్థితి ఉంది. తెలంగాణ ఉద్యమానికి గుండెకాయలా పని చేసిన ఉస్మానియా యూనివర్సిటీకి రాష్ట్రం ఏర్పడ్డ తరువాత ఒక్క ప్రొఫెసర్‌ని కూడా నియమించలేదు. ఒక్క రూపాయి కూడ ఎక్కువ కేటాయించలేదు. రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీల పరిస్థితి దినదినగండంగా ఉన్నది. వేలాది రూపాయల మెస్ ఫీజులు కట్టలేక చదువుకున్న సర్టిఫికెట్స్‌ను వదులుకొని వెళుతున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను బాగు చేయాల్సింది పోయి ప్రైవేట్ యూనివర్సిటీలను రాష్ట్రానికి ఆహ్వానించారు. ఇవి గనుక ప్రారంభమైతే అట్టడుగు వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కావాల్సిందే. ఎందుకంటే ఒక్క సంవత్సరానికి అక్షరాల 8 లక్షల రూపాయల ఫీజు, అంటే పిజి పూర్తి చేయాలంటే 16 లక్షలు ఉండాల్సిందే. లక్షలాది రూపాయలు కట్టుకునే పరిస్థితి ప్రజలకు ఉందా? ఒకసారి ఆలోచించండి. ఇదిలా ఉండగా ఈ యూనివర్సిటీలలో రిజర్వేషన్లు ఉండవని స్వయాన మంత్రులు ప్రకటించారు. మరి ఈ యూనివర్సిటీలు ఎవరి కోసం? దీనివలన ప్రభుత్వ యూనివర్సిటీ లను సమస్యలోకి నెట్టి విద్యార్థులే వద్దనుకొని తిరస్కరించేలా చేసి అనివార్యంగా విద్యార్థులు ప్రైవేట్ యూనివర్సిటీలకు వెళ్లడం లేకపోతే విద్యకు దూరం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

ఇప్పటివరకు టిఎస్‌పిఎస్‌సిలో పేరు నమోదు చేసుకున్న వారు 19 లక్షల పైచిలుకు ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2 లక్షల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి. విద్యా, వైద్యరంగాలతో పాటు వ్యవసాయం, సింగరేణి లాంటి ఇతర రంగాలను కలుపుకొని మూసివేయబడ్డ పరిశ్రమలను తెరిపించడం ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉన్నప్పటికి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. తెరాస 2014 ఎన్నికల్లో మూసివేయబడ్డ పరిశ్రమలను తెరిపిస్తామని నమ్మబలికి ప్రజలను, నిరుద్యోగులను మోసం చేసింది. ఇంటికో ఉద్యోగం అన్నారు మోసం చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం 64 వేల పోస్టులకు నోటిఫికేషన్స్ వేసి 27 వేల పోస్టులు మాత్రమే భర్తీ చేసింది. వైద్య, ఆరోగ్యశాఖలో 12,487, విద్యాశాఖలో 76 వేలు, ఏజెన్సీలో 54,724 పోస్టులు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు 10 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయి.

ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్స్ వేసి, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు డబ్బులు దండుకోవడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ వాటా పంచుకొని పూర్తి సహకారాన్ని అందిస్తుంది. కోచింగ్ సెంటర్లు తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న పట్టించుకునే నాథుడే లేడు. అప్పులు చేసి ఆస్తులు తాకట్టు పెట్టి ఉద్యోగంపై ఆశతో కోచింగ్ సెంటర్లకు వస్తున్న నిరుద్యోగులు ఉద్యోగాలు రాక, నోటిఫికేషన్లు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఇలాంటి ఒక ప్రత్యేక సందర్భంలో మళ్లీ విద్యా ఉద్యమాన్ని ప్రారంభించాల్సిన అనివార్యస్థితి ఏర్పడింది. 2014లోనే ప్రభుత్వ విద్యలో తీసుకురావాల్సిన మార్పులు వాటి నమూనాను విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుకు లిఖిత పూర్వకంగా ఇచ్చాం. ఈ లేఖలో ఉన్న ఏ ఒక్క అంశాన్ని కూడా ఆచరణలో పెట్టలేదు. 2014లో విద్యా పోరాట యాత్రను చేపట్టి ప్రజల దగ్గరకు వెళ్లడం జరిగింది. రెండవసారి 2016లో ప్రభుత్వ పాఠశాలల కళాశాలల మూసివేతకు వ్యతిరేకంగా యాత్రను చేపట్టడం జరిగింది. అఖిల భారత విద్యాహక్కుల వేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాలలో యాత్ర కొనసాగుతుంది. మన రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ప్రభుత్వ విద్యను సర్వనాశనం చేసి కార్పొరేట్ ప్రైవేట్ విద్యను ప్రోత్సహించిన తీరును ప్రజలకు వివరించడం కోసం ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను బతికించుకుందాం.

విశ్వవిద్యాలయాలను కాపాడుకుందాం, కార్పొరేట్ విద్యాలయాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్‌లతో ఈ సెప్టెంబర్ 14న అమరవీరుల స్థూపం (గన్‌పార్క్) హైదరాబాద్‌లో 100 రోజుల విద్య పోరాట యాత్రను అమరులకు నివాళి అర్పించి ప్రారంభిస్తున్న సందర్భంలో రాష్ట్ర పోలీసులు ప్రవర్తించిన తీరు ఇబ్బందికరంగా మారింది. యాభై ఏళ్లుగా విద్యా ఉద్యమంలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు హరగోపాల్, చక్రధర్‌రావు, ప్రొ. లక్ష్మినారాయణ, చుక్కా రామయ్య లాంటి వారి పట్ల దురుసుగా ప్రవర్తించి ప్రొ. హరగోపాల్‌ను కిందపడేసి నలుగురు పోలీసులు కలిసి జీపులో ఎత్తివేయడం, కర్కషంగా ప్రవర్తించడం, ఇదే మొదటిసారి.

విద్యార్థుల మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మాట్లాడడం చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నమా అనే సందేహం కలుగుతుంది. అక్కడికక్కడే యాత్రను అడ్డుకొని ప్రొఫెసర్లను, విద్యార్థులను, మహిళలను, ఉపాధ్యాయులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గతంలో చేపట్టిన యాత్రల్లో పోలీసులు వీడియోలు తీయడం, పర్మిషన్ల పేరుతో వేధించడం జరిగింది. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా విద్యా ఉద్యమానికి ప్రజలు, విద్యార్థుల మద్దతు ఉన్నంత కాలం విద్యాపరిరక్షణ కమిటీ లక్ష్యాలను పరిపూర్తి చేయడం కోసం ముందుకే కొనసాగుతుంది. కానిస్టేబుల్ పిల్లలైన – డిజిపి పిల్లలైనా, ముఖ్యమంత్రి పిల్లలైనా – మున్సిపల్ కార్మికుని పిల్లలైనా అందరికి ఒకే బడి – ఒకే చదువు అందేవరకు విద్యకై పోరాటం కొనసాగుతుంది.

(రచయిత తెలంగాణ విద్యార్థి వేదిక రాష్ట్ర అధ్యక్షులు) వీ

మైనారిటీలపై ఎందుకింత వివక్ష?

***దళిత, బడుగు, ముస్లిం మైనారిటీ ప్రజలపై దాడులు, నిర్బంధాలు, వివక్ష పెరిగిపోతున్నాయనీ, రాజకీయ లబ్ధి కోసమే మైనారిటీ ప్రజలపై పాలకులు విద్వేషాన్ని పెంచిపోషిస్తున్నారనీ అంటున్నారు* షేక్ కరిముల్లా**

నేను పుట్టక ముందే
దేశ ద్రోహుల జాబితాలో
నమోదై ఉంది నా పేరు
కన్నబిడ్డని సవతి కొడుకుగా చిత్రించింది చరిత్ర
అన్నదమ్ముల్నించి చీల్చి నన్ను ఒంటరివాణ్ని చేసింది చరిత్ర

- ఖాదర్ మొహియుద్దీన్

ఇటీవల రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే మనం ఎక్కడి నుండి ఎక్కడకు వెళ్తున్నాం? అనిపిస్తుంది. ఆగస్టు 28న తెలుగుదేశం ప్రభుత్వం గుంటూరులో పెట్టిన 'నారా హమారా' పేరుతో నిర్వహించిన భారీ బహిరంగ సభ తీరు పరిశీలిస్తే దేశంలో రాజకీయాలు ఇంతగా దిగజారి పోయాయా! అనిపించింది.

1999, 2004, 2014 లలో జరిగిన ఎన్నికలలో బిజెపితో పొత్తు పెట్టుకొని ముస్లింలను నిర్లక్ష్యం చేశారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు కేవలం ఒక్కటంటే ఒక్క ఎంఎల్ఏ సీటు ఇచ్చి మరింత నిర్లక్ష్యం చేశారు. వాస్తవానికి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముస్లింలను చంద్రబాబు అవమానించారు. అసలు రాష్ట్ర జనాభాలో 9 శాతం ఉన్న ఒక సమూహాన్ని గుర్తించని ప్రభుత్వం ఇదే. దేశచరిత్రలోనే ముస్లింలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించని ప్రభుత్వం ఇదే.

ప్రతిపక్ష వైసిపి పార్టీ 2014 ఎన్నికలలో నాలుగు ఎంఎల్ఏ సీట్లు ఇచ్చి నలుగుర్ని గెలిపించుకుంటే, అందులోని ఇద్దరిని లోపాయకారిగా పార్టీ ఫిరాయించేట్లు చేసి టిడిపిలోకి తీసుకున్నారు. విలువలు లేని రాజకీయాలు నడిపించారు. తమ పార్టీ నుంచి ముస్లింలు ఎంఎల్ఏగా నెగ్గలేదంటూ సాకులు చెప్పారే తప్ప ఒక్క ముస్లిం అభ్యర్థిని క్యాబినెట్‌లోకి తీసుకోలేదు. తన కుమారుడిని ఎంఎల్‌సిని చేసి మంత్రి పదవిని కట్టబెట్టిన బాబు, ముస్లిం ప్రజల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు.

ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎన్నికల్లో లబ్ధికోసం చంద్రబాబుకు ముస్లింలపై హఠాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చింది. ఏవో ఉత్త తాయిలాలు ప్రకటించి ముస్లింలపై ఓట్ల వల విసిరేందుకు సభా పెట్టారు. 'ముస్లింలపై మూకదాడులు జరగకుండా రక్షణ కల్పిస్తా, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకోస్తా, ముస్లిం సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటా, వారి జోలికి ఎవరు వచ్చినా సహించేది లేదు' ఇదీ గుంటూరు సదస్సులో చంద్రబాబు చేసిన ప్రకటన.

24 గంటలు కూడా గడవకముందే తనకు ముస్లింలపై ఉన్నది కపట ప్రేమేనని బాబు చాటారు. ఎన్నికల హామీలు నెరవేర్చాలని, అన్యాక్రాంతం అవుతున్న వక్ఫ్ ఆస్తులను కాపాడాలని, ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని శాంతియుతంగా ప్లకార్డులతో నినాదాలు ఇస్తూ నిరసన తెలిపిన నంద్యాలకు చెందిన ఎనిమిది మంది ముస్లిం యువకులపై పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకొని బయటకు లాక్కెళ్లారు. 30 గంటల పాటు ఎక్కడ ఉంచారో కూడా తెలియకుండా పోలీసులు నిర్బంధించి, చొక్కాలు విప్పిమరీ చితకబాదారు. స్టేషన్ల నుంచి స్టేషన్లకు తిప్పుతూ వారిని కొట్టి హింసించారు. అంతటితో ఊరుకోకుండా దేశద్రోహం లాంటి తప్పుడు కేసులు పెట్టిమరీ జైలుకు పంపించారు.

ప్రశ్నించడమే నేరమా? పాలకుల, పోలీసుల ఈ హింస ప్రవృత్తి, మొత్తం సమాజ జీవితంలో కనపడుతున్న హింస చూస్తుంటే మనం ఎక్కడి నుండి ఎక్కడకు వెళ్తున్నాం? అనిపిస్తుంది. మొత్తంగా ఈ సమాజం ఒక సామాజిక సంక్షోభంలో పూర్తిగా కూరుకుపోయిందనేది వాస్తవం. దీనికి విరుగుడు మొత్తం సమాజాన్ని మార్చుకోవాలి. అందుకు ప్రస్తుతం ఉన్న ఈ రాజకీయ వ్యవస్థను ప్రజలు తిరస్కరించాలి. అణగారిన ప్రజలు ఆలోచించాలి. ఒక్కతాటి మీదకు వచ్చి సామాజిక మార్పుకు కృషి చేయాలి.

ఏడు దశాబ్దాల పాలనా విధానాలు సామాన్య బడుగు వర్గాల ప్రజలకు మిగిల్చింది ఏమీ లేదు. రాజ్యాంగ ఆశయాలైన సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయంలు భ్రమలుగానే మిగిలిపోయాయి. ప్రపంచ దేశాలలో ఇండోనేషియా తర్వాత అత్యంత ముస్లిం జనాభా గల దేశం ఇండియా. దేశ జనాభాలో 14 శాతంగా ఉన్న ముస్లింలు (15 కోట్లు). స్వాతంత్ర్యం వచ్చి 71 సంవత్సరాలు అయినా కదు దారిద్ర్యంలో మగ్గిపోతున్నారు. జెండాలు, పార్టీలు ఎన్ని మారినా వారి జీవనంలో ఎటువంటి మార్పు లేదు. వారు ఏ స్థాయిలో ఉన్నారు? జీవన స్థితిగతులు ఎలా ఉన్నాయి? తదితర అంశాలను ఇంతవరకు పాలకులెవ్వరూ పట్టించుకోకపోవడం ఓ విషాదం.

ఒక పెద్ద సమూహాన్ని ప్రగతికి దూరంగా పెట్టి ఈ దేశం అభివృద్ధి చెందుతున్నదని ఎలా మాట్లాడుతున్నారు? అందుకే నేడు పాలకులు పదేపదే ఉపయోగిస్తున్న 'అభివృద్ధి' అనే పదాన్ని సామాన్య ప్రజలు 'విధ్వంసంగా' అర్థం చేసుకుంటున్నారు. అనేక విమర్శల అనంతరం మన్‌మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో సాంఘిక, ఆర్థిక, విద్యా రంగాలలో ముస్లిం స్థితిగతులను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రాజేందర్ సచార్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని వేశారు. ఈ కమిటీ దేశంలోని ముస్లింల స్థితిగతులపై అనేక చేదు నిజాలు వెల్లడించింది. కమిటీ నివేదిక అంశాలు - ముస్లింల జీవన ప్రమాణాలు ఎస్‌సి, ఎస్‌టిల

కంటే కొంచెం ఎక్కువగాను, బిసిల కంటే బాగా తక్కువగాను ఉన్నాయి. ముస్లిం జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. విద్యా విషయంలో ముస్లింలు ఎస్‌సిల కన్నా ఉపాధి, దారిద్ర్యం, భూముల విషయంలో బిసిల కన్నా వెనుకబడి ఉన్నారు.

దేశంలో 88.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే, అందులో ముస్లింలు 4.9 శాతం మాత్రమే. ముస్లిం బాలికలు 70 శాతం పాఠశాలల్లో చేరితే, హైస్కూల్ స్థాయికి 11.6 శాతం, డిగ్రీ స్థాయికి 3.6 శాతం మంది మాత్రమే మిగులుతున్నారు. ఈ వెనుకబాటు తనం ఏ ఒక్క రాష్ట్రానికి పరిమితం కాదు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. ముస్లిం కుటుంబాలు ఎక్కువ శాతం మురికివాడల్లోనే నివసిస్తున్నాయి.

అయితే 1992 నుంచి బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం కుటిల మత రాజకీయాల కారణంగా జైళ్లలో మాత్రం ముస్లిం వారి జనాభా నిష్పత్తికి మించి ఉన్నారు. ముస్లింలు అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో బాగా వెనుకబడి ఉన్నారని చెప్పింది. ఎంతోమంది భావిస్తున్నట్లుగా ఈ దేశంలో ముస్లిం జనాభా పెరగడం లేదని, సంతాన నియంత్రణ పాటిస్తున్నారని కమిటీ చెప్పింది. వీరి జనాభా తగ్గుతుందని ఈ నివేదిక వెల్లడించింది. ముస్లిం జనాభా విపరీతంగా పెరుగుతున్నదని పదేపదే హిందుత్వ వాదులు చేస్తున్న తప్పుడు ప్రచారానికి ఇది చెంపపెట్టు. కేవలం సమస్యలను ఎత్తి చూపడమే కాకుండా, వాటికి పరిష్కారాలను సూచించడం ఈ కమిటీ విశిష్టత.

రంగనాథ్ మిశ్ర కమిటీ కూడా దాదాపు ఇవే విషయాలను వెల్లడించింది. అయితే ఎన్నో ప్రయాసలతో సమర్పించిన ఈ నివేదికలను, సూచనలను పాలకులు అమలు చేయకుండా తుంగలో తొక్కారు.

దేశంలో ముస్లింలు ఇప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా బాగా వెనుకబడి ఉన్నారనేది కాదనలేని వాస్తవం. మొదటి నుండి చేతి వృత్తులు, చిన్న చితక పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆర్థిక స్థితి లేని కారణంగా పిల్లలను మంచి చదువులు చదివించలేక వివిధ రకాల వృత్తులలో చేరుస్తున్నారు. ఇలా విద్యకు దూరమైపోతున్నారు. మగపిల్లలు ఎక్కువగా ఆటో మొబైల్ కార్పెంటరీ, భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్‌లు, మెకానిక్‌లు, డ్రైవర్లు లాంటి వృత్తులలో స్థిరపడుతుండగా, ఆడ పిల్లలు పత్తి మిల్లులు, వ్యవసాయ కూలీలుగా పనుల్లోకి వెళుతున్నారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్ఆర్ హయాంలో కొద్దిగా కరుణించి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేసిన తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. అయితే ఈ రిజర్వేషన్ల శాతం సరిపోవడం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో 9 శాతం వరకు ముస్లిం జనాభా ఉండగా నాలుగు శాతం రిజర్వేషన్ల వలన ఎక్కువ మందికి అవకాశం దక్కడం లేదు. ఇకనైనా ఆయా జనాభా నిష్పత్తి ప్రకారం అందరికి రిజర్వేషన్లు వర్తింపచేయాలి. అలాగే ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలి. ముస్లిం అభ్యున్నతికి ఎంతో చేశామని చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు ఈ విధంగా ఉన్నాయి. (రు. కోట్లలో)

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు చేసింది
2015-16	724	217
2016-17	827	248
2017-18	1,102	280

ఇంత తక్కువ ఖర్చు పెట్టడం వలన ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలు ఎక్కువ మందికి దక్కడం లేదు. మొత్తంగా వీరి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కాబట్టి ముస్లింలకు స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్నట్లుగానే ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పాటు చేసి, వీరికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి.

భారతీయ సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వం, వివిధ మతాల సహజీవనం అని మన చరిత్ర చెబుతున్న వాస్తవం. జాతీయోద్యమం అందించిన వారసత్వం అదే. గాంధీని మతోన్మాదులు చంపడంతో హిందూ మతోన్మాదులను ప్రజలు ఈసడించుకున్నారు. అయితే చాపకింద నీరులా పనిచేసుకుంటూ వస్తున్న మతోన్మాదులు దేశ పెట్టుబడిదారులు, విదేశీ సామ్రాజ్యవాదులతో మిలాఖాతై వారి ప్రయోజనాలు కాపాడే పనిలో పడ్డారు. అందుకు మతాన్ని రాజకీయ అధికారం కోసం వాడుకోవడం వారికి అవసరమైంది.

1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలతో దేశం ప్రపంచ బ్యాంకుకు, విదేశీ గుత్త సంస్థలకు దాసోహమైంది. ఈ దోపిడి ప్రజలకు అర్థం కాకుండా, వారి మౌలిక సమస్యల గురించి పోరాటాలు చేయకుండా వారి ఆలోచనలను పక్కదారి పట్టించడానికి మతోన్మాదం అవసరం ఏర్పడింది. నేడు మతోన్మాదం పెచ్చరిల్లడానికి పునాది ఇదే. దీంట్లో భాగంగానే 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత మొదలు గుజరాత్ మారణకాండ, ముజఫర్‌నగర్ అల్లర్లవరకు జరిగిన మతపరమైన దాడుల వెనుక సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలున్నాయి.

1984 పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి కేవలం 2 సీట్లు 7.4 శాతం ఓట్లతో చావుదెబ్బతిన్నది. అదే 2014 పార్లమెంట్ ఎన్నికలలో 29శాతం ఓట్లతో పూర్తి మెజారిటీ సాధించి అధికారంలోకి రావడానికి పునాది మతోన్మాదమే. దేశంలో ఒక పథకం ప్రకారం మత జాతీయ వాదాన్ని వ్యాప్తిలోకి తెస్తున్నారు. సమస్యలన్నింటికీ ఫలానా మతం (ముస్లిం) వారే కారకులంటూ వారిపై విద్వేషాన్ని పురికొల్పుతూ మొత్తం సమాజాన్ని ముస్లింలకు వ్యతిరేకంగా తయారు చేసే ప్రయత్నం ఒక పథకం ప్రకారం జరుగుతుంది. ఈ కుట్రలో ముస్లింలు, దళితులు పావులైపోయారు.

ఎద్దు మాంసం కలిగి ఉన్నాడంటూ నెపం మోపి అక్లాఖ్ అనే ముస్లింని అతని ఇంట్లోనే దారుణంగా నరికి చంపేశారు. మూక దాడులు నిత్య కృత్యాలైపోయాయి. ఈ పరిణామాల వలన ఈ దేశ మూలవాసులైన ముస్లిం ప్రజలు తీవ్ర వివక్షకు గురవుతూ రెండవ తరగతి ప్రజలుగా కొనసాగుతూ ఉన్నారు. పెరిగిన ఈ వర్గ వైషమ్యాలు ఎన్నడూ లేనంతగా ముస్లిం ప్రజలను అభద్రతలోకి నెట్టివేశాయి. ముస్లిం సమాజం మాటల్లో చెప్పలేని అభద్రతకు, వేదనకు గురవుతుంది. ఈ పరిస్థితిలో నుంచి ముస్లిం సమాజం గుణపాఠాలు నేర్చుకోవాలి. చదువు, జ్ఞానం, సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలి. మిగతా అణగారిన వర్గాలను కలుపుకొని మొత్తం సమాజాన్ని మార్చుకోవాలి. భూమి, అన్నివనరులు అందరికీ దక్కాలి. సమసమాజాన్ని నిర్మించుకోవాలి. వీ

(రచయిత సామాజిక విశ్లేషకులు)

జాతీయ బిసి కమిషన్ - ఒబిసిలు

యాభై శాతంకు పైగా ఉన్న బిసిలకు విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో న్యాయమైన వాటా అందలేదనీ, రిజర్వేషన్‌లు మాత్రమే పరిష్కారం కాదు, రాజకీయ చైతన్యమే వారి ప్రయోజనాలను కాపాడుతుందనీ అంటున్నారు **డా. కంకట రాజారామ్**

జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్)కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పిస్తూ దేశ పార్లమెంట్ ఆగస్టులో చారిత్రాత్మక బిల్లు (123వ రాజ్యాంగ సవరణ)ను ఆమోదించింది. లోక్‌సభలో ఆగస్టు 2న ఈ బిల్లుకు అనుకూలంగా 406 మంది సభ్యులు, ఆగస్టు 6న 150 మంది సభ్యుల ఆమోదంతో రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదించారు. గత 60 సంవత్సరాలుగా వెనకబడిన తరగతుల వారు దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేస్తున్న నేపథ్యంలో ఈ కమిషన్‌కి రాజ్యాంగ ప్రతిపత్తి లభించడంతో వారిలో సమానత్వం, సమాన అవకాశాల దిశగా కొత్త ఆశలు రేకెత్తాయి. ఈ బిల్లు ఆమోదంతో బి.సి. కమిషన్‌కు కూడా జాతీయ ఎస్‌సి కమిషన్, జాతీయ ఎస్‌టి కమిషన్‌తో సమానంగా రాజ్యాంగ హోదా లభించినట్లయింది.

జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించాలని 1980 నుండి డిమాండ్ ఊపందుకుంది. అంతకుముందు 1950లోనే మహిళలకు సమాన హక్కులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో బి.ఆర్. అంబేద్కర్ హిందూ కోడ్ బిల్లుతో పాటు బి.సి.లకు అన్ని స్థాయిల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ, అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఏకీభవించకపోవడంతో దేశానికి తొలి న్యాయశాఖ మంత్రిగా ఉన్న అంబేద్కర్ తన పదవికి రాజీనామా చేశారు. తరువాత బి.సి.లకు దూరమవుతామన్న భయంతో ప్రభుత్వం 1953లో కాకా కాలేల్కర్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1955 మార్చిలో తన నివేదికను సమర్పించింది. దేశ వ్యాప్తంగా ఉన్న 2399 బి.సి. కులాలను వాటితో పాటు 837 అత్యంత వెనకబడిన కులాల స్థితిగతులను సమగ్రంగా పరిశీలించింది. వారి సమగ్రాభివృద్ధికి అనేక సూచనలు చేసింది. కానీ ప్రభుత్వాలు ఏ సూచనలను అమలు చేయలేదు. నివేదిక కోల్డ్ స్టోరేజీలోకి వెళ్లిపోయింది. 1977లో జనతాపార్టీ తన మానిఫెస్టోలో కాకా కాలేల్కర్ నివేదిక అమలు చేస్తామని పేర్కొంది. కానీ తర్వాత కాలంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా బి.సి.ల కోసం మరో కమిషన్ వేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 1978 డిసెంబర్ నెలలో బిహార్‌కు చెందిన బి.పి. మండల్ నేతృత్వంలో దేశంలో రెండవ బి.సి. కమిషన్ ఏర్పాటు చేశారు. మండల్ కమిషన్ దాదాపు 3800 బి.సి. కులాల స్థితిగతులను పరిశీలించి 11 ఇండికేటర్స్‌లో మొత్తం 40 నిర్దిష్టమైన సూచనలు చేసింది. దేశంలోని 52 శాతం పైగా ఉన్న వివిధ వెనకబడిన కులాల జనాభా సమగ్రాభివృద్ధికి ఆర్థిక, సామాజిక, విద్యారంగ, ఉద్యోగ తదితర అంశాల్లో చేయవలసిన పనులను సూచించింది. ఈ కమిటీ తన రిపోర్టును 1980 డిసెంబర్‌లో సమర్పించింది. మండల్ కమిషన్ నివేదిక అమల్లో తొలి అడుగుగా 1990లో అప్పటి ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ బి.సి.లకు 27 శాతం ఉద్యోగ రిజర్వేషన్‌లను ప్రకటించారు. ఇది దేశంలో కనీవిని ఎరుగని అలజడికి దారితీసింది. దేశమంతా మండల్ వ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలతో అట్టుడికింది. అయినప్పటికీ ఈ చర్యను దేశచరిత్రలో ఒక సైలెంట్ రివల్యూషన్‌గా అభివర్ణిస్తూ ఒబిసి రిజర్వేషన్ అమలుకు వి.పి. సింగ్ కట్టుబడినాడు. ఉత్తర భారతదేశం ఆధిపత్య అగ్రవర్ణాలు, ఒబిసి రిజర్వేషన్ అనుకూల వర్గాలుగా చీలిపోయింది. ఈ పరిణామంతో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాలలో ఒబిసిల రాజకీయ పట్టు కూడా పెరిగింది. వారు నిర్ణయాత్మక శక్తులుగా ఎదిగినారు.

ఒబిసిలకు విద్యా, ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్ అమలు జరుగుతూ దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఒబిసిల ప్రాతినిధ్యం కనీసం పదిశాతం కూడా దాటలేదన్నది చేదు నిజం. దీనికి తోడు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఒబిసి రిజర్వేషన్ మీద క్రిమిలేయర్ పరిమితి విధించడం ఈ రిజర్వేషన్ ఫలితాలు ఒబిసిలు పూర్తిగా వినియోగించుకోక పోవడానికి మరో కారణం. మండల్ కమిషన్ సూచించిన మిగతా 38 అంశాలపై ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. ఉదాహరణకి దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలలోని టీచింగ్ పోస్టులలో ఒబిసిలు మొత్తంగా కనీసం 7 శాతం కూడా లేరు అన్న నిజం ఒబిసి రిజర్వేషన్‌ల అమలు తీరులో ఉన్న లొసుగులను తెలియజేస్తున్నది. ఈ నేపథ్యంలో ఒబిసి సంఘాలు దేశంలోని అన్ని ఉద్యోగాలలో ఒబిసిల శాతం కనీసం 27 శాతం వచ్చేవరకైనా క్రిమిలేయర్ నిబంధనను తీసివేయాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. క్రిమిలేయర్ నిబంధనలపై అవగాహన లేని రెవెన్యూ అధికారుల తీరుతో అర్హులైన అనేక మందికి నాన్ క్రిమిలేయర్ ధృవపత్రాలు పొందలేక పోతున్నారు.

జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్‌కి 123వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడంపై దేశవ్యాప్తంగా ఉన్న ఒబిసిలకి కొత్త ఆశలు వచ్చాయి. కానీ ఇది కంటితుడుపు చర్యగా మాత్రమే మిగులుతుందా లేక ప్రభావంతమైన వ్యవస్థగా ఆవిర్భవిస్తుందా అన్నదే కీలకం. దీనిలో ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రోత్సహించే పార్టీలు వారి సప్రయోజనాలకే వాడుకుంటాయా లేక ఒక క్రియాశీలమైన వ్యవస్థను నిర్మించి దేశంలో 50 శాతంకు పైగా ఉన్న వెనకబడిన తరగతుల ప్రజలకు విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాలలో వారికి న్యాయమైన వాటా దక్కేలా ప్రయత్నం జరుగుతుందా అన్నది వారి చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది. అలాగే ఒబిసి క్రియాశీల చైతన్యంపై ఆధారపడి ఉంటుంది. 70 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో 50 శాతం పైగా ఉన్న జనాభా ఇప్పటికీ పార్లమెంటు, అసెంబ్లీ లాంటి ఉన్నతమైన చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లేకుండా ఉంది.

కొత్త డిమాండ్లు

హర్యానాలోని జాట్‌లు, మహారాష్ట్రలోని మరాఠాలు, రాజస్థాన్‌లోని గుజ్జర్లు, గుజరాత్‌లోని పాటీదార్లు (పటేల్లు) ఆంధ్రాలోని కాపులు లాంటి

డిటెన్షన్ విధానం ప్రమాణాలను పెంచుతుందా?

***డిటెన్షన్ విధానం అమలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల విద్యకు ఆటంకమని, ఈ విధానం ప్రమాణాల పెరుగుదలకు పరిష్కారం కాదని, ఇది ప్రైవేట్ విద్యా వ్యవస్థను ప్రోత్సహించడానికేనని అంటున్నారు* భైరి సత్యనారాయణ**

ఈ మధ్యే 2018 జూలై 18న, 2009-విద్యాహక్కు చట్టానికి సవరణ బిల్లు ఒకటి లోక్ సభలో ఆమోదం పొందింది. ఉన్నది ఉన్నట్లుగా అమలు చేస్తే, సమీప భవిష్యత్తులో, ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా అట్టడుగు వర్గాల పిల్లల పాఠశాల-విద్యావకాశాలను అది అత్యంత దారుణంగా ప్రభావితం చేయగలదు. దేశవ్యాప్తంగా, ఎనిమిదవ తరగతివరకు ఇప్పటివరకు అమలవుతున్న 'నాన్-డిటెన్షన్ పాలసీ'ని రద్దుచేస్తూ, వచ్చే విద్యా సంవత్సరం నుండే, ఐదవ, ఎనిమిదవ తరగతులలో డిటెన్షన్ విధానాన్ని అమలుచేయడం ఆ బిల్లు ఉద్దేశ్యం. అది ఇప్పుడు కేవలం లాంఛనప్రాయంగా మాత్రమే రాజ్యసభ అంగీకారంపొంది ఆయా రాష్ట్రాల నిర్ణయాలతో దేశంలోని అన్ని పాఠశాలలకు కొంచెం ముందో-వెనకో చేరాల్సి ఉంది.

ఈ చట్టం అమలులోకొస్తే, ఐదవ తరగతిలో, ఎనిమిదవ తరగతిలో వార్షిక బోర్డు పరీక్షలు పాస్ అయిన పిల్లలు మాత్రమే పై తరగతులలోనికి వెళ్తారు (ప్రమోట్ అవుతారు); ఫెయిల్ అయిన పిల్లలకు, రెండు నెలల వ్యవధిలోనే మరొకసారి పరీక్ష నిర్వహించి పాస్ కావడానికి అవకాశమిస్తారు. రెండవసారి కూడా ఫెయిల్ అయిన పిల్లలు తిరిగి అవే తరగతులలో కొనసాగుతారు (డిటేయిన్ అవుతారు). తన తోటి పిల్లలు పై తరగతులకు వెళ్తూంటే, తాను మాత్రం పాత తరగతిలోనే కొనసాగటాన్ని అవమానంగా భావించినా లేదా పాత తరగతిలో కొనసాగి రెండవ సంవత్సరం చివర వార్షిక బోర్డు పరీక్షలో మళ్లీ ఫెయిల్ అయినా, ఆ పిల్లలిక 'ఈ జన్మలో' మాత్రం చదువుకు శాశ్వతంగా స్వస్తిచెప్పి బడిబాట మాని, ఇంటిబాట పట్టాల్సిందే. ఈ అంశం ప్రస్తుతం అమలులో ఉన్న విద్యాహక్కు చట్టంలోని ప్రగతిశీల సెక్షన్-16కు పూర్తి ఉల్లంఘన. అందుకని, ఏకంగా ఆ చట్టంలోని సెక్షన్-16 స్థానంలోని 'ఐదవ తరగతిలో లేదా ఎనిమిదవ తరగతిలో లేదా రెండు తరగతులలో ఫెయిల్ అయిన విద్యార్థులను నిలిపివేయడమా (డిటేయిన్) లేదా ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు 'పాస్-ఫెయిల్'తో సంబంధం లేకుండా పై తరగతులకు అనుమతివ్వడమా (ప్రమోట్) అనే నిర్ణయం తీసుకోవడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అధికారము' ఇవ్వడానికి విద్యాహక్కు చట్టం-2009ని ఆ మేరకు సవరించే బిల్ ప్రస్తుతం లోక్ సభలో ఆమోదం పొందింది.

అసలు ఉన్నట్టుండి, 'నో డిటెన్షన్ పాలసీ'ని రద్దుచేయాలనే చర్చ ఎందుకు చేస్తున్నట్లు? దానివల్ల కలిగే అంతులేని నష్టం, వైపరీత్యాల మాటేమిటి? విద్యావ్యవస్థ అభివృద్ధి అంటే అన్నివర్గాల పిల్లలకు విద్యను అందకుండా చేసే ఆలోచన కాదు కదా! ఒక్కసారికో, రెండు సార్లకో చదువు ఒంటబట్టని పిల్లలను విద్యా వ్యవస్థ నుండి తప్పిస్తేగానీ విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందదా, లేదా అభివృద్ధి చెందినట్లు అవదా? ఈ పిల్లల్లో, సాధారణంగా, సామాజికంగా సాంస్కృతికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలైన ఆదివాసీ, దళిత, బహుజన, మైనారిటీ పిల్లలు, అంగవికలురు, స్త్రీలే ఎక్కువగా ఉంటారు. వారికి కూడా అందరితో సమానమైన, నాణ్యమైన, జీవించడానికవసరమైన విద్యనెట్లా

బలమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక నేపథ్యం ఉన్న కులాలు ఇప్పుడు తమను ఒబిసి జాబితాలో కలపాలని ఆందోళనలు చేస్తున్నాయి. వీరిని చూసి మరికొన్ని బలమైన కులాలకు కూడా తమకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలని, అందుకే తమను ఒబిసిలలో కలపాలని దేశవ్యాప్తంగా ఉద్యమాలకు తెరలేపాయి. అయితే ఒబిసి రిజర్వేషన్ పెంచకుండా ఇలాంటి బలమైన ఎదిగిన కులాలను ఆ జాబితాలో కలిపితే ఒబిసి రిజర్వేషన్ మరింత బలహీనం అవుతుందని ఒబిసిల వాదన. రాజకీయ అవసరాల కోసమే కులాలను ఒబిసి జాబితాలో కలుపుతూ పోతూ ఒబిసి రిజర్వేషన్ పెంచకుండా ఉంటే ఈ ఒబిసి రిజర్వేషన్ అనేది ఒక విఫల ప్రయోగంగానే మిగులుతుంది. అయితే దేశ జనాభాలో 50 శాతం పైగా ఉన్న వెనకబడిన తరగతుల వారికి ఒక్క ఒబిసి రిజర్వేషన్ మాత్రమే సర్వరోగ నివారిణి కాదు వారి రాజకీయ చైతన్యమే వారి ప్రయోజనాలను కాపాడుతుందనేది నిజం.

చేపట్టాల్సిన చర్యలు

ఈ 123వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ బి.సి. కమిషన్‌కు ఎస్‌సి కమిషన్, ఎస్‌టి కమిషన్‌తో సమానంగా అధికారాలు కల్పించడం హర్షణీయమే అయినప్పటికీ జాతీయ స్థాయిలో కుల గణన జరిగి కులాల వారిగా గణాంకాలు బయటకి వచ్చినప్పుడు వారి సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన చర్యలు చేపట్టినప్పుడే ఈ చర్యకు సార్థకత ఉంటుంది. అలాగే అసెంబ్లీ, పార్లమెంట్ లాంటి ఉన్నత స్థాయి చట్టసభల్లో ఒబిసిలకు కూడా రిజర్వేషన్ కల్పించినప్పుడే వారి రాజకీయ ప్రాతినిధ్యం నిర్ణాయక వ్యవస్థలో పెరుగుతుంది అనడంలో సందేహం లేదు. న్యాయ వ్యవస్థలోనూ రిజర్వేషన్ ఉన్నప్పుడే వారి సమస్యలకు సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. వారిపై జరిగే అత్యాచారాలను నిరోధించడానికి ఒక అత్యాచార నిరోధక చట్టం కూడా రావాలని ఒబిసిల చిరకాల డిమాండ్. ఒబిసిలలో అట్టడుగు వర్గాల ప్రజలకు కూడా ఈ ఫలాలు అందేలా ఈ కమిషన్ పని చేయాలని ఒక డిమాండ్. అయితే దేశ రాజకీయ వ్యవస్థలో అత్యధిక జనాభాతో ఉన్న ఒబిసిలు రాజకీయ చైతన్యంతో ఒక్కతాటిపై వచ్చినప్పుడే వారి సమగ్ర రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యారంగ తదితర హక్కులు కాపాడబడుతాయి. వారిలోని అనైక్యతే ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడే పార్టీలకు వరంగా మారింది. వారిలో క్రియాశీలమైన రాజకీయ చైతన్యం లేకపోవడం వల్లనే వారి హక్కులను వారు కోల్పోతున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

(రచయిత సహాయ ఆచార్యులు, మాస్ కమ్యూనికేషన్ విభాగం, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

అందించాలని ఆలోచించడానికి బదులు, వారిని వారి 'కర్మ'కు వదిలేసి, ఒక్కసారి మెరుగుపరుచుకొనే అవకాశం ఇచ్చినట్లు చేసి, 'డిటెన్షన' పేరుతో ఏకంగా వారిని విద్యావ్యవస్థ నుండి బహిష్కరించడమే సమంజసమా? ఇది, మనిషి హుందాగా జీవించే హక్కును పరిరక్షిస్తున్న రాజ్యాంగ నిబంధన-21 స్ఫూర్తికి లోబడే ఉంటుందా? విద్యావ్యవస్థ అభివృద్ధి అంటే ఇదేనా? విద్యావిధాన నిర్ణేతలు అర్థం చేసుకొన్న విద్యాతత్వజ్ఞానం ఇదేనా? అసలిది నిజమైన విద్యావేత్తల అభిప్రాయమేనా లేదా అధికారులదా లేదా మత చాందస వాదులదా? అణగారిన వర్గాల వారిని ఈ విధంగా తొక్కిపెడితే తప్ప, వారు చదువుకొని రాజ్యాధికారం, సామాజిక ప్రాబల్యం సంపాదించే అవకాశం ఉంటుందనే భయమేమో నన్న అనుమానం రాకమానదు.

'నో-డిటెన్షన్ పాలసీ' రద్దుకు నేపథ్యం

ఈ మధ్య కొన్ని రాష్ట్రాలు, 'నో-డిటెన్షన్ పాలసీ' వల్ల పిల్లల్లో విద్యా ప్రమాణాలు బాగా పడిపోయినాయనే వాదనను ముందుకు తెస్తున్నాయి. 'నో-డిటెన్షన్ పాలసీ', 'నిరంతర సమగ్ర మూల్యాంకనము'ల అమలుకు, పాఠశాల విద్యా నాణ్యతను ఘణంగా పెట్టాల్సివస్తుందని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు సైతం అభిప్రాయ పడుతున్నాయి. ప్రభుత్వ, ప్రభుత్వేతర (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, ప్రథమ నివేదిక మొదలైనవి) నివేదికలు ఎలిమెంటరీ స్థాయి విద్యార్థుల్లో తగినంతగా ప్రమాణాలు లేవని తెలిపాయి. అవి సూచించిన పరిష్కార మార్గాల్లో, 'నో-డిటెన్షన్ పాలసీ'ని పునఃస్సమీక్షించడం ఒకటి.

ఈ విషయాన్ని పరిశీలించడానికి, యు.పి.ఎ., ఎన్.డి.ఎ. ప్రభుత్వాల హయాంలలో సమావేశమైన సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆన్ ఎడ్యుకేషన్ (కేబ్) వేర్వేరు సబ్ కమిటీలను నియమించింది. 2012 జూన్ 6న యు.పి.ఎ. నియమించిన గీతాభుక్కల్ కమిటీ తన నివేదికను ఎన్.డి.ఎ. ప్రభుత్వమేర్పడిన వెంటనే 2014 ఆగస్టులో సమర్పించింది. ఆ కమిటీ 'పిల్లల అభ్యసన సామర్థ్యాలను నిరవధికంగా అంచనా వేయాలనీ; ప్రతిభ-ఆధారిత సంస్కృతిని నెలకొల్పాలనీ; నో-డిటెన్షన్ పాలసీ స్థానంలో తగిన భోధనా విధానాలను ప్రవేశపెట్టాలనీ; విద్యావ్యవస్థ భాగస్వాముల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తూ, వారిని కొత్త పాలసీలకు అనుగుణంగా సంసిద్ధం చేయాలనీ; నో-డిటెన్షన్ పాలసీని బలహీనం చేయాలనీ' పేర్కొంటుంది.

తర్వాత ఏర్పడిన ఎన్.డి.ఎ. ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో, రాజస్తాన్ విద్యామంత్రి, ప్రొఫెసర్ వాసుదేవ్ దేవనాని అధ్యక్షతన మరొక సబ్-కమిటీని నియమించింది. అది తన నివేదికను 2016 డిసెంబర్‌లో సమర్పించింది. ఆ కమిటీ ముఖ్య ప్రతిపాదనలు : 'అన్ని తరగతులలో అన్ని సబ్జెక్టులలో అభ్యసన సూచికలను నిర్దేశించడం, ప్రతి తరగతిలో పరీక్షలు నిర్వహించడం, అభ్యసన లక్ష్యాల సాధనకు టీచర్ని బాధ్యున్ని చేయడం, 6వ, 7వ తరగతులలో పాఠశాల స్థాయి పరీక్షలు నిర్వహించడం, 5వ, 8వ తరగతులలో బ్లాక్ లేదా జిల్లా లేదా రాష్ట్ర స్థాయి బోర్డు పరీక్షలు నిర్వహించడం, ఒకవేళ విద్యార్థి ఫెయిల్ అయితే అతనికి మళ్లీ అదనంగా బోధించి మెరుగు పరుచుకొనేందుకు అవకాశమిచ్చి, పరీక్ష రాయనివ్వడం, అతడు అప్పటికీ ఉత్తీర్ణుడు కాలేకపోతే అతన్ని తిరిగి అదే తరగతిలో కొనసాగించడం'.

కేంద్ర ప్రభుత్వం, నో-డిటెన్షన్ పాలసీ పైన తమ అభిప్రాయాలు తెలుపవల్సిందిగా రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలను కోరినప్పుడు పదిహేను రాష్ట్రాలు ఈ పాలసీని పునః సమీక్షించాల్సిందిగా కోరాయి. ఏడు రాష్ట్రాలు 'నో-డిటెన్షన్ పాలసీ'ని ఉపసంహరించాల్సిందిగా ప్రతిపాదించాయి. ఆరు రాష్ట్రాలు-తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, గోవా మాత్రం 'నో-డిటెన్షన్ పాలసీ'నే యథాతథంగా కొనసాగించాల్సిందిగా కోరాయి. మిగతా ఎనిమిది రాష్ట్రాలు తమ అభిప్రాయాన్ని చెప్పలేదు. జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి విద్యాహక్కు చట్టం-2009 వర్తించదు.

1. 'డిటెన్షన్ పాలసీ' నిజంగానే విద్యా ప్రమాణాలను పెంచుతుందని నమ్మేవాళ్లను రెండు రకాలుగా విభజించవచ్చు: మొదటి రకం-అమాయకులు, అజ్ఞానులు: 'భయం, శిక్షలు' లేకపోతే చదువు రాదనీ, పిల్లలు చెడిపోతారనీ, దేనికీ పనికిరాకుండా పోతారనీ అమాయకంగా విశ్వసిస్తారు వీళ్లు. కాబట్టి పిల్లలు క్రమశిక్షణగా పెరగాలన్నా, ఉత్తములుగా ఎదగాలన్నా వారిని నిరంతరం భయం గుప్పిట్లో బిగించాలి. ఎంత భయపెడితే అంత చదువు వస్తుంది. తప్పు చేసినవారికి 'కఠినశిక్ష'యే సరియైన శిక్షణా మార్గమని వీరు నమ్ముతారు. విషయాలను లోతుగా చూడకుండా, పైకి కనిపించే రోజూవారి సంఘటనలనే నిజమని నమ్మడం వల్ల వీరికి ఈ అభిప్రాయాలు ఏర్పడతాయి. రెండవ రకం-కుట్రదారులు: అభాగ్యుల అణగారిన వర్గాల ఎదుగుదల తమ సౌఖ్యాలకు, ఉనికికి, దోపిడీకి ప్రమాదం అని భావించేవారు. డిటెన్షన్ పేరిట ఆయా వర్గాల పిల్లలను ఆదిలోనే అభివృద్ధి మార్గం నుండి తప్పిస్తే వాళ్లు వాళ్లవాళ్ల కుల వృత్తులకో, మరో అల్పాదాయ శ్రమ పనులకో పరిమితం అవుతారు. తద్వారా వాళ్లు ఉన్నత విద్యకు దూరమై, ఉన్నత వర్గాలకు భవిష్యత్తులో పోటీ కాకుండా పోతారు, ప్రశ్నించే వాళ్లు లేకుండా పోతారు. సానుకూల వైఖరి ప్రమాదం: విద్యా లక్ష్యాలను గానీ, నాన్-డిటెన్షన్ పద్ధతి స్ఫూర్తిని గానీ, డిటెన్షన్ పద్ధతి పర్యవసానాలను గానీ సరిగ్గా అర్థం చేసుకోకుండానే, ఆయా రంగాల్లోని ప్రముఖ వ్యక్తులు గానీ, ప్రముఖ సంఘాలు గానీ ఈ విధానానికి సానుకూలంగా మాట్లాడడం వల్ల సగటు తల్లిదండ్రులు, విద్యార్థులు గందరగోళానికి గురియై గుడ్డిగా వాళ్లు చెప్పిందే నిజమని భావించే అవకాశముంది.

2. 'డిటెన్షన్' ప్రక్రియ వల్ల విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు, విద్యా నాణ్యత మెరుగవుతాయనుకునే వారు నమ్మే పరోక్ష సంబంధాల్లో మొదటిది, ముఖ్యమైనది: 'భయం' లేదా 'భయ సంబంధం'. డిటెన్షన్ పాలసీ అమలులో ఉన్న తరగతులలో ఉపాధ్యాయులు భయంతో కూడిన శ్రద్ధతో, బాధ్యతతో, జాగ్రత్తగా పాఠాలు చెబుతారనీ; దీనికి తోడు పిల్లల 'అనుత్తీర్ణత (ఫెయిల్యూర్)'కు క్రమంగా ఉపాధ్యాయుల్ని బాధ్యుల్ని చేసి, జీతాల్లో, ప్రమోషన్లలో కోతలు పెడుతూ వస్తే ఫలితాలు మరింత మెరుగై బోధనాభ్యసన ప్రక్రియల్లో గుణాత్మకత పెరుగు తుందనీ; డిటెన్షన్ పాలసీ అమలులో ఉంటే పిల్లలు ఫెయిల్ అవుతామనే లేదా డిటేయిన్ అవుతామనే భయంతో కష్టపడి చదివి తప్పక పాస్ అవ్వటమే గాక వాళ్ల అభ్యసన సామర్థ్యాలు అనూహ్యంగా పెరుగుతాయనీ; డిటెన్షన్ పాలసీ అమలులో ఉందని తెలిసి తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడ ఫెయిల్ అవుతారో, ఎక్కడ తమకు తలవంపులు తెస్తారో అనే అవమాన భారంతో ఇంటివద్ద భయంతో కూడిన బాధ్యతతో పాఠాలు చదివిస్తారని, హోమ్ వర్క్‌లు చేయిస్తారనీ తత్ఫలితంగా విద్యానాణ్యత దానికదే పెరుగుతుందని నమ్మకం. ఈ మొత్తంలో సారాంశమొక్కటే 'భయం' లేకపోతే ఏ పని సాఫల్యం చెందదని నమ్మే మెజారిటీ వ్యక్తుల అమాయక, సంకుచిత తత్వమిది.

విద్యా చారిత్రక పరిశోధనా క్రమాన్ని, విద్యా మనోవిజ్ఞాన శాస్త్రాన్ని సమగ్ర అధ్యయనం చేయకుండా కేవలం పరీక్షల కోసం లేదా పాఠాలు చెప్పడం కోసం వల్లె వేసిన విద్యావేత్తలు ఈ భావాలు కలిగి యుండటంలో ఆశ్చర్యమేమీ ఉండనక్కరలేదు. భయపెట్టి చదువు చెప్పాలని

అనుకోవటంలో పైశాచిక ప్రవృత్తి, అనాగరికత తప్ప ఏమీ కనపడదు. విద్యాభ్యసన ప్రక్రియ ఆసాంతం ఆహ్లాదంగా, ఆనందదాయకంగా మాత్రమే ఉండాలి కానీ, అత్యంత భయానకంగా దుఃఖదాయకంగా కాదు ('దండించకపోతే చదువెట్లా వస్తుంది మరి!' అనే కరుడు గట్టిన ప్రాచీన భావాలతో తలనిండిన వాళ్లకు ఓపిగ్గా బాధ్యతతో అవగాహన కల్పించాల్సిందే). రెండవది: డిటేయిన్ అయ్యి ఒక సంవత్సరం పాటు అదనంగా మళ్లీ అదే తరగతి చదవడం వల్ల కూడా విద్యార్థి చదువుకొనే సామర్థ్యాలు మెరుగవుతాయనుకోవడం. మళ్లీ పాత తరగతులలోనే పాత సార్లే పాత పద్ధతులలోనే బోధిస్తే పిల్లవాడు పాత పద్ధతులలోనే ఫెయిల్ అవుతాడు కదా! పిల్లవాడి బౌద్ధిక సామర్థ్యాలకు అనుకూలంగా బోధనలో నాణ్యత, విద్యా వసతులలో మార్పులు రాకుండా పిల్లవాడి అభ్యసన సామర్థ్యాలు పెరుగవు. వాళ్ల నమ్మకాల్లో మూడవది: 'వడబోత'. 'చదువబ్బని మొద్దులను వడబోస్తే బాగా చదివే మెరికలు మిగులుతారని'. అప్పుడు ఆ మెరికల్లాంటి పిల్లలకు ఏ పరీక్షలు పెట్టినా, వాళ్ల మీద ఏ సర్వేలు చేసినా అద్భుత ఫలితాలుంటాయని విద్యానాణ్యత శోభిల్లుతుందని వీరి ప్రగాఢ విశ్వాసం. వాళ్ల వాదనలలో నాలుగవది: 'నిరంతర సమగ్ర మూల్యాంకన' పద్ధతిని సరిగ్గా అమలు చేస్తే ఇంకా పిల్లలు ఫెయిల్ అయ్యే అవకాశమే లేదనే భావన. కాబట్టి, ఇంకా డిటెన్షన్ పాలసీ అమలులో ఉన్నా, దాన్ని ఉపయోగించే అవసరమే రాదంటారు వాళ్లు. ఉపయోగమేలేని ఆ పాలసీ ఉండి మాత్రం ఎవరికి లాభం అనేది డిటెన్షన్ పాలసీని వ్యతిరేకిస్తున్న వాళ్లను తొలుస్తున్న సందేహం.

దీనిలో ఎక్కడా ప్రభుత్వాల, సమాజాల బాధ్యత గానీ, వాటి ఆర్థిక రాజకీయ సాంస్కృతిక స్వభావం పాత్ర గానీ, వీటి ప్రభావంలోనే యున్న విద్యార్థి కుటుంబ స్థితిగతుల పాత్ర గానీ, విద్యార్థి వైయక్తిక శక్తిసామర్థ్యాల పాత్ర గానీ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపైనా చూపే అత్యంత తీవ్రమైన ప్రభావం గూర్చి ప్రస్తావన ఉండదు. 'ఉపాధ్యాయులు సరిగ్గా బోధిస్తే చాలు, పిల్లలు భయంతో నేర్చుకుంటే చాలు, వీళ్లకు బయట సమాజపు భౌతిక పరిస్థితులతో సంబంధమెందుకు?' అనే అజ్ఞానపు అభిప్రాయాలే సాధారణంగా ఈ ప్రపంచాన్నేలుతుంటాయి.

3. డిటెన్షన్ పాలసీ పర్యవసానాలు: లబ్ధిదారులు, ఇబ్బంది పడే వారు: 'నో–డిటెన్షన్ పాలసీ' రద్దు అంటే అరకొర విద్యాహక్కు చట్టాన్ని కూడా ఇంకా బలహీన పరచడమే. 'డిటేయిన్' చేయడమంటే, 'అనేక అవకాశాలిచ్చినా, నీవు చదువుకోలేక పోతున్నావు, నీకు చదువు రాదు, నీవు చదువు కొనసాగించడానికి వీలు లేదు, నీకు చదివే అర్హత లేదు, నీవు వేరే ఏదైనా పని చేసుకొని బ్రతుకు' అన్నట్లు కాదా? ఇది చట్టబద్ధమైన అవమానం, బహిష్కరణ అన్పించకమానదు. ఇది, చట్టమే అవమానిస్తున్నట్లు ధ్వనించదా? ఇది తప్పనిసరి విద్యాహక్కు చట్టానికి, దాని స్ఫూర్తికి వ్యతిరేకం కాదా? వ్యతిరేకమౌతుందని, ఏకంగా విద్యాహక్కు చట్టానికే అవసరమైన సవరణ చేసి, 'డిటెన్షన్' పేరిట ఆయా వర్గాలను చట్టబద్ధంగానే వెలివేయటం లేదా బహిష్కరించడం కంటే తక్కువేమీ కాదిది. ఫెయిల్ చేసి డిటేయిన్ చెయ్యడం అంటే వాళ్లదికాని వైఫల్యానికి పిల్లలను, వాళ్ల తల్లిదండ్రులను శిక్షించటమే.

ఏవో కారణాలవల్ల చిన్నప్పటినుండి బడికి పోలేని పిల్లల్ని, విద్యాహక్కు చట్టం ప్రకారం, వారి వయస్సుకు సమానమైన తరగతులలో నేరుగా చేర్చుకొంటున్నారు. 'నో–డిటెన్షన్ పాలసీ' రద్దు, ఈ పిల్లలపై అత్యధికంగా పడుతుంది. అణగారిన వర్గాల నుండి వస్తున్న మొదటితరం పిల్లలు, వారి తల్లిదండ్రులు ఇవ్వాళ ఆంగ్ల మాధ్యమం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వారికి అటు ఆంగ్లంపై పూర్తి పట్టు రాకముందే, ఇటు విషయ పరిజ్ఞానంపై సరియైన అవగాహన ఏర్పడకముందే 'డిటెన్షన్ పాలసీ' వారికి ఇంటి తోవ చూపించే అవకాశం లేకపోలేదు. ఇంకా 'డిటెన్షన్ పాలసీ' అమలుతో ఎక్కువ ఇబ్బందికి గురియయ్యేది ప్రభుత్వ పాఠశాలలకు వెళుతున్న పిల్లలే. అక్కడ చదివే పిల్లల్లో, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా వెనుకబడిన వర్గాల నుండి వచ్చిన వాళ్లే అత్యధికంగా ఉంటారు. కొంత స్తోమత కలిగిన కుటుంబాల నుండి వచ్చిన పిల్లలు ఎలాగూ ప్రైవేటు లేదా కార్పొరేటు విద్యాలయాల్లో చదువు తుంటారు. వారి ఉత్తీర్ణత భాధ్యతను ఆయా పాఠశాలలే చూసుకొంటాయి. కాబట్టి, అక్కడి పిల్లలు డిటేయిన్ అయ్యే శాతం చాలా చాలా తక్కువ. దీనికి మూడు ప్రధాన కారణాలు.

మొదటిది – విద్యలో వ్యాపార ధోరణి మితిమీరడం వల్ల, ఆయా ప్రైవేటు విద్యాలయాలు బాగా చదివే పిల్లలనే ఎరవేసి, రకరకాల పద్ధతిలో వడబోసి, మభ్యపెట్టి, ఊరించి, అనేక ఆకర్షణలతో చేర్చుకొంటున్నాయి. కాబట్టి సహజంగానే ఆ పిల్లలు డిటేయిన్ అయ్యే అవకాశం ఉండదు.

రెండవది – ఆ ప్రైవేటు విద్యాలయాల్లో సైతం వెనుకబడిన పిల్లలు కొంతమంది ఉండినా, డబ్బులు పెట్టి చదువుతున్నారు కాబట్టి, ఆ పిల్లలను డిటేయిన్ ఘట్టం నుండి రక్షించి, ఉత్తీర్ణులను చేయవలసిన బాధ్యత యాజమాన్యమే తీసుకోవడం సహజం. మూడవది: ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల పిల్లలు కూడా డిటేయిన్ కావడం విద్యా వ్యాపారా నికి గొడ్డలిపెట్టు. కాబట్టి, పరీక్ష విధానం, మూల్యాంకన విధానంలో ఉన్న లోటుపాట్లను తమకు అనుకూలంగా వినియోగించుకుని తమ పాఠశాలల పిల్లలను డిటేయిన్ కాకుండా శతవిధాల వాళ్ల తంటాలు వాళ్లు పడతారనడంలో అంతగా ఆశ్చర్యమేమీ ఉండనక్కరలేదు.

4. 'డిటెన్షన్ పాలసీ'ని అమలుచేస్తే ఏర్పడబోయే ప్రధాన ఫలితాలు: ఒకటి: బోధనా క్రమం, పద్ధతులు, వసతులను అభివృద్ధి పరచకుండానే యాంత్రికంగా అమలుచేసే డిటెన్షన్ పాలసీ వల్ల, పిల్లలు చట్టబద్ధంగానే విద్యా ప్రక్రియ నుండి బహిష్కరణకు గురవుతారు. (లేదా) రెండు: ఉపాధ్యాయులపైన ఉన్నతాధికారుల ఒత్తిడి వల్ల కావచ్చు, డిటేయిన్ కాకుండా ఉండడం కోసం పిల్లలు, వారి తల్లిదండ్రుల ఆతృత వల్ల కావచ్చు, మాల్ ప్రాక్టీస్‌కు అన్నివైపులనుండి గేట్లు తెరచుకొనే అవకాశ ముంటుంది. (లేదా) మూడు: 'డిటెన్షన్ పాలసీ' అమలు వల్ల మొదలు బలి అయ్యేది విద్యార్థులయితే, తర్వాత బలి అయ్యేది ఉపాధ్యాయులు. అనుత్తీర్ణులైనందుకు మొదటగా విద్యార్థులను డిటేయిన్ చేస్తారు. తర్వాత వాళ్ల డిటెన్షన్‌కు ఉపాధ్యాయులను బాధ్యులనుచేసి బలిచేస్తారు. వైఫల్యానికి కారణం నిజంగా ఉపాధ్యాయులని భావిస్తే, డిటెన్షన్ పేరిట శిక్ష మాత్రం విద్యార్థులకు వేయడం వింత. మరి ఉపాధ్యాయుల వైఫల్యాలకు బాధ్యులెవరని అడక్కూడదా? ఈ బాధ్యుల్ని చేసే పరంపర ఎక్కడదాకా పోతుందో పూర్తిగా చూడొద్దు! మన వాదనకు అవసరమైన మేరకే విస్తరించాలెమో! (లేదా) నాలుగు: 'డిటెన్షన్ విధానము'ను విధిగా అమలు చేయాల్సి వచ్చినప్పుడు, ఫెయిల్ అయ్యే విద్యార్థుల శాతం ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువ కాబట్టి తీవ్ర ఇబ్బందులకు గురియయ్యేది ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలలే. అప్పుడు, 'ప్రభుత్వ బడులల్లో చదివితే ఫెయిల్ అవుతాం. ఫెయిల్ అయితే డిటేయిన్ చేస్తారు. అప్పుడు ఉన్న చదువుకే మోసం. కాబట్టి, పాస్ కావాలంటే, డిటేయిన్ కావద్దంటే ప్రైవేటు పాఠశాలలే దిక్కు' అనే ప్రచారానికి బలం చేకూరుతుంది. ఇప్పటికే క్రమక్రమంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రభుత్వ విద్య, ఈ 'డిటెన్షన్ విధానం'తో దానికదే పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం వేగవంతమవుతుంది. ప్రైవేటు విద్యావ్యాపారం మరింత సిరిసంపదలతో విలసిల్లుతుంది. ప్రభుత్వానికి ఉచితంగా, నిర్బంధంగా విద్యనందించాల్సిన రాజ్యాంగ బాధ్యత తప్పుతుంది లేదా దాని అర్థం మారుతుంది.

ఈ నాలుగు ఫలితాలేవీ బడుగు వర్గాల పిల్లల విద్యలో నాణ్యతను, ఉత్తమ ప్రమాణాలను, అభ్యసన సామర్థ్యాలను హామీ ఇవ్వవు. మొత్తంగా సదరు మేధావులకు, ఈ చర్చ ఇంకో విధంగా అర్థమవుతుంది. 'చదువులో ఫెయిల్ అయితే పిల్లల్ని ఏమనొద్దు, పాఠాలు చెప్పకపోతే ఉపాధ్యాయుల్ని ఏమనొద్దు' అన్నట్లు అర్థం తీస్తారు. తమ జ్ఞానం అంతకంటే విశాలంగా, విస్తృతంగా, మానవీయంగా విస్తరీయనంత సంకుచితంగా గిరిగీసుకొన్న వాళ్లకు అంతకుమించి అంత తొందరగా అర్థం అయ్యేవీలులేదు. అనివార్యంగా, విద్యను ఐక్యరాజ్య సమితి మానవహక్కుగా, భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కుగా గుర్తించవలసిన నేపథ్యం, ఆవశ్యకత, ప్రాముఖ్యతను ఓపికతో, శ్రద్ధతో, బాధ్యతతో, నిష్పక్షపాతంగా అధ్యయనం చేసి, అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తే 'నో–డిటెన్షన్ పాలసీ రద్దు, దాని స్థానంలో డిటెన్షన్ పాలసీ అమలు' ఎంత అనాగరికమైనదో, అశాస్త్రీయ మైనదో, క్రూరమైనదో, పైగా కుట్రపూరితమో ఇట్టే అర్థమవుతుంది. ఈ నిర్ణయం పిల్లలపట్ల, వారి బాల్యంపట్ల, బాలల హక్కులపట్ల కర్కశంగా, నిర్దయగా, అమానవీయంగా ఉంటుంది. ఇది బాలల ప్రతికూల వైఖరే.

5. డిటెన్షన్ పాలసీ నిజంగానే విద్యా ప్రమాణాలను పెంచుతుందా?: ప్రపంచవ్యాప్తంగా చారిత్రాత్మకంగా ఈ డిటెన్షన్ ప్రయోగం చేసిన దాఖలా లున్నాయి. ఫెయిల్ అయిన పిల్లలను డిటేయిన్‌చేసి, తిరిగి అదే తరగతిలో కొనసాగించడంవల్ల పిల్లల అభ్యసన సామర్థ్యాలు, విద్యానాణ్యత పెరిగినట్లు ప్రపంచంలో ఎక్కడ అధ్యయనాలుగానీ, పరిశీలనలుగానీ, పరిశోధనా ఆధారాలు లేవని సాక్షాత్తు గీతాభుక్కల్ కమిటీయే సెలవిచ్చింది. పైగా ఈ పద్ధతి పిల్లలను అవమానాలకు గురిచేసి, నిరుత్సాహపరిచి, ఒత్తిడిని పెంచి నేర్చుకోవడంలో వెనుకబాటు తనానికి, మధ్యలోనే బడిమానివేతకు దారితీయవచ్చునని చూపే అంతర్జాతీయ అధ్యయనాలున్నాయి. ఇంకా అది, సహజ జీవన సరళితో కాకుండా పిల్లలు తీవ్ర మానసిక విచలనముతో, పెడధోరణులతో పెరిగేటట్లు చేయగలదని చూపే పరిశోధనాధారాలున్నాయి.

బోధనాభ్యసన ప్రక్రియలో అవలంబించే ఏ పద్ధతైనా విద్యార్థి సహజ జ్ఞానసముపార్జనా సామర్థ్యాలను పెంచడానికి ఉపయోగపడాలి. వాటి స్థాయిల్లో తేడాలున్న పిల్లల్ని గుర్తించి వారికి సహకరించే విధంగా ఉండాలి. మరి చదువులో వెనుకబడి, అంతగా రానించని పిల్లలపైన తీసుకునే 'డిటెన్షన్' చర్య వాళ్లు బాగా చదవడానికి, అభ్యసన సామర్థ్యాలను పెంచుకోవడానికి ఎలా ఉపయోగపడగలదు? డిటెన్షన్ ప్రక్రియకు, విద్యార్థి అభ్యసన సామర్థ్యాల మెరుగుదలకున్న ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధం ఏమిటి? 'విద్యార్థి అభ్యసన సామర్థ్యం' అనేది, 'డిటెన్షన్ పాలసీ' అనే పరామితి ప్రమేయం కాదు. వాటి మధ్య అనులోమ సంబంధం కానీ, ఇంకేరకమైన పెరుగుదల సంబంధం కానీ లేదు. ఉన్నదల్లా విలోమ సంబంధమే. 'డిటెన్షన్ అంటే నూతన బోధనోప కరణమూ కాదు, బోధనోపాయమూ కాదు. 'డిటెన్షన్' అంటే విద్యార్థి ఎందుకు ఫెయిల్ అయ్యిండో కారణాలతో సంబంధం లేకుండా, అతణ్ణి తిరిగి పాత తరగతిలోనే నిలిపి ఉంచడం మాత్రమే. అలా నిలిపి ఉంచడం వల్ల తన అభ్యసన సామర్థ్యాలు పెరుగుతాయా? డిటెన్షన్ ప్రక్రియ పిల్లల అభ్యసన సామర్థ్యాలను నిజంగా పెంచగలుగుతుందని నమ్మేవారు, ఆ ప్రక్రియను కేవలం, ఐదవ, ఎనిమిదవ తరగతులలో మాత్రమే ఎందుకు ప్రవేశపెట్టాలని అనుకుంటున్నట్లు? ఆ తరగతులలోనే ప్రవేశపెట్ట మనడంలో తర్కమేమిటి, హేతుబద్ధతేమిటి? అంత మంచి ప్రక్రియను మొత్తం పాఠశాలలోని అన్ని తరగతులలో ఎందుకు ప్రవేశపెట్ట మనగూడదు? అట్లా అడగటం బహుశా తర్కబద్ధం, హేతుబద్ధం కాదేమో!

6. విద్యా ప్రమాణాల క్షీణతకు నిజమైన కారణాలు, పరిష్కారాలు: చదువులో వెనుకబడిన పిల్లలను 'డిటెన్షన్ పాలసీ' పేరిట చదువుకు దూరం చేయడం తప్ప, ఈ పాలసీ వల్ల విద్యార్థులకు గానీ, విద్యావ్యవస్థకు గానీ, సమాజానికి గానీ, నికరంగా ఉపయోగమేమీ లేదు. సమానమైన, నాణ్యమైన అవకాశాలు అందని పిల్లలు మాత్రమే చదువులో సర్వసాధారణంగా వెనకబడుతారు. ఆదాయ వర్గాల పిల్లలకు చదువు కొనిపెట్టబడుతుంది, కాబట్టి ఆ వర్గాల పిల్లలు చదువులో వెనకబడి ఉండే అవకాశమే లేదు. కేవలం సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఈ విద్యావకాశాలను కొనుక్కునే ఆర్థిక సామర్థ్యం ఉండదు, కాబట్టి ఆ పిల్లలే డిటెన్షన్ పాలసీ వల్ల ఎక్కువ ఇబ్బందిని అవమానాన్ని అనుభవించాల్సి వస్తుంది.

వెనుకబడిన వర్గాల పిల్లల్లో మెరికల్లాంటి పిల్లలు లేరా, వాళ్లకు చదువు రాదా అని, అడ్డదిడ్డంగా మాట్లాడే మేధావులూ ఉంటారు. పనిగట్టుకొని చర్చను పక్కదారి పట్టియ్యడమే వీళ్లపని. బాగాచదివే పిరికెడు పిల్లల గురించి కాదుగదా చర్చంతా! చదువు త్వరితగతిన అబ్బని సగటు పిల్లల గూర్చికదా చర్చ! పాస్ అవ్వలేదని, వారికి ఒక అవకాశం ఇస్తున్నామని, అయినా పాస్ అవ్వలేదని, ఇక వారికి చదువు రాదని అవమానించి, చదువు నుండి దూరం చేయడమే న్యాయంగా ఉంటుందా? అట్లయితేగానీ మన విద్య విధానం ఉత్తమ ప్రమాణాలు కలది అవదా? అట్లాగని, చదువు రాకున్నా, ఆ పిల్లలను ఉత్తీర్ణులను చేసుకుంటూ పై తరగతులకు ప్రమోట్ చేసుకుంటూ పోవాలా అని ప్రశ్నిస్తారు మేధావులు. అట్లా కూడా చేయొద్దు. వాళ్లకు కూడా అవసరమైన ఒక మోస్తరు చదువు నేర్పే విధానాల పైన శ్రద్ధపెట్టాలి. వాళ్లకూ చదువు వచ్చేవరకూ ప్రయత్నించాలి. వాళ్లకు చదువు అబ్బక పోవడానికి కారణమైన విద్యావిధాన, విద్యావ్యవస్థ లోపాలను త్వరితగతిన అధిగమించాలి. విద్యార్థుల వైయక్తిక సామర్థ్యాల ఆధారంగానే చదువు చెప్పాలి. 'ఇంత ప్రయత్నించినా కూడా చదువు రాకపోతే ఎలా?', అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ప్రయత్నం చేయకుండానే, అవసరమైనవి కల్పించకుండానే వేసే వెర్రి ప్రశ్నలివి.

విద్యాభ్యసన ప్రక్రియ క్రమంలో పిల్లలను భౌతికంగా దండించరాదనీ, పరుష పదజాలంతో అవమానించరాదనీ ఈనాడు అందరూ గుర్తించిన సార్వజనీన సత్యం. విద్య పిల్లవాణ్ణి సంపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దగల అతిముఖ్యమైన, అనివార్యమైన ఒక సామాజిక కారకం. కాబట్టి, చదువు అబ్బని పిల్లలకు కూడా, ఒక మోస్తరు వరకు (ఎలిమెంటరీ స్థాయి వరకైనా), బలవంతంగానైనా, చదువు నేర్పే విధానమే ఉండాలి తప్ప పిల్లల్ని చదువు నుండి తప్పించే విధానము కాదు.

పలు సర్వేలలో బహిర్గతమైన విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల క్షీణతకు కారణాల్లో ముఖ్యమైనవి: (i) విద్యా వ్యవస్థ భాగస్వాము లందరికి 'నో–డిటెన్షన్ పాలసీ', 'నిరంతర సమగ్ర మూల్యాంకనము'ల నిజమైన స్ఫూర్తిని, తాత్వికతను, ఆవశ్యకతను సరిగ్గా అవగాహన కల్పించడంలో పూర్తిస్థాయి వైఫల్యం (ii) ఈ విధానాలను అమలు చేసే వాళ్లు కూడా ఎవరికి తోచినట్లు వాళ్లు వాటిని తమ ఇష్టానుసారం అర్థం చేసుకోవడం, అమలు చేయడం: 'నో–డిటెన్షన్' అంటే 'నో–అస్సైన్ మెంట్' కింద జమ కట్టడం (iii) నిరంతర సమగ్ర మూల్యాంకనము అమలు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సరియైన పద్ధతిలో సక్రమంగా అమలు కాకపోవటము (iv) 'ఫెయిల్ అవుతామనే భయం లేకపోవడం వల్ల లేదా చదివినా చదవకున్నా ప్రమోట్ అవుతామనే ధీమావల్ల పిల్లలు చదువరని' అటు ఉపాధ్యాయులు; 'పాస్–ఫెయిల్'

విధానమేలేదు కాబట్టి ఉపాధ్యాయులు బోధననంత బాధ్యతగా తీసుకోరని, ఇటు తల్లిదండ్రులు భ్రమపడడం (v) మౌలిక వసతులలేమి (vi) విద్యార్థి – ఉపాధ్యాయ నిష్పత్తికి తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు లేకపోవడం.

పై అన్ని కారణాల్లో దేనిలో కూడా ఫెయిల్ కావడానికి విద్యార్థి బాధ్యుడు కాదు. విద్యార్థి ఫెయిల్ కావడానికి విద్యా విధానం, విద్యా వ్యవస్థ మాత్రమే బాధ్యత వహించాలి. కానీ ఉల్టాగా విద్యార్థిని బాధ్యుణ్ణి చేసి, డిటేయిన్ చేసి బహిష్కరిస్తున్నాం.

7. అసంబద్ధంగా కనపడేవి: అసంబద్ధత–1: బడి–బయటి–పిల్లలనే బడిలో చేర్పించాలనే ప్రణాళికలు ఓవైపు తీవ్రం చేస్తున్నట్లు నటిస్తూనే, మరో వైపు, బడిలోపల ఉన్న పిల్లలను డిటెన్షన్ పేరిట బడి–బయటకు పంపించే ప్రణాళికలు (ఇది నటన కాదు, నిజంగానే) తీవ్రం చేయడం అర్థవంతమైన చర్యనేనా? ఔను ఇది అర్దవంతమైన చర్యే అని ఎవరైనా అంటే, ఈ అర్థం వెనుక దాగిఉన్న కుట్రను మూకుమ్మడిగా నిరసించాల్సిందే, వ్యతిరేకించాల్సిందే. అసంబద్ధత–2: ఏకరీతి విద్యా ప్రణాళికా: ఈ మధ్య పార్లమెంటరీ కమిటీలు, న్యాయస్థానాలు అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏకరీతి విద్యా ప్రణాళిక ఉండాలి అంటున్నాయి. డిటెన్షన్ విధానమైనా లేదా నాన్–డిటెన్షన్ విధానమైనా దేశమంతా ఒకేరీతిగా ఉండాలని వారి ఉద్దేశ్యం. పిల్లల ఆర్థిక, సామాజిక, మత, సాంస్కృతిక నేపథ్యంలో బేధాలనాధారంగా విద్యార్జన అవకాశాల్లో తేడాలుండరాదనేది వారి అభిప్రాయంగా చూపిస్తారు. నిజమే ఎంతమంచి ఆలోచన! కుల మత ప్రాంత ఆర్థిక సామాజిక సాంస్కృతిక లింగ వివక్షత లేకుండా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు ఒకే విద్యాప్రణాళికా (ఒకే పాఠ్య ప్రణాళిక కాదు. అది అసంబద్ధం)! ఇది కేవలం 'డిటెన్షన్ పాలసీ'ని దృష్టిలో ఉంచుకొని మాత్రమే మాట్లాడితే, దాని వెనక సంకుచిత వైఖరి సులభంగానే అర్థమవుతుంది. ఇప్పుడు లోక్‌సభలో పాస్ అయిన చట్టం ప్రకారం, నో–డిటెన్షన్ పాలసీని రద్దుచేశారు. కాబట్టి, దేశమంతా ఏకరీతి విద్య అంటే మెజారిటీ రాష్ట్రాల అభిప్రాయమే అనివార్యంగా మిగతా అన్ని రాష్ట్రాల్లో కూడా అమలు చేయాల్సి ఉంటుంది. అనగా డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఈ ఒక్క అంశమే ఏకరీతి విద్యను హామీ ఇస్తుందా? ఒకవైపేమో, నో–డిటెన్షన్ పాలసీ లేదా డిటెన్షన్ పాలసీ పాటించటం వారివారి పరిస్థితులను బట్టి, ఆయా రాష్ట్రాల ఇష్టమే అనడం, మరొకవైపేమో దేశవ్యాప్తంగా ఒకే విద్యాప్రణాళికా ఉండాలనడం పరస్పర విరుద్ధం.

పిల్లల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, కుల, మత, ప్రాంత, లింగ, అస్తిత్వానికి అతీతంగా ఏకరీతి విలువ–ఆధారిత విద్యను అందించాలనే సదాశయం కలవారు కొన్ని అడుగులు ముందుకు వేసి మరింత స్పష్టంగా, డబ్బున్న వారికి డబ్బు లేనివారికి కూడా తప్పనిసరిగా ఏకరీతి నాణ్యమైన ఉమ్మడి విద్య అని ఘోషించరేం? అలా చట్టం చేయరేం? కనీసం, ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రైవేటు విద్యాలయాల్లో తప్పనిసరిగా ఏకరీతి విద్యను అమలు చేయాలనరేం? అలంకార ప్రాయమైన, ఆకర్షణీయమైన 'విద్యలో ఏకరీతి తనం' డబ్బున్న వర్గాలకు వర్తించదన్నమాట. కనీసం అట్లాంటి ఆలోచన చేసినా, ధనికవర్గాలు భూమిని కంపింప చేయరామరి? చచ్చీ చెడీ సంపాదించి కూడబెట్టింది, తమపిల్లలను నిర్భాగ్యులు చదివించే ప్రభుత్వ విద్యాలయాల్లో, బడ్జెట్ విద్యాలయాల్లో చదివించడానికా?

ముగింపు

విద్యార్థి జ్ఞానాత్మక సృజనాత్మక ప్రతిభను, అతని ఆర్థిక సామాజిక సాంస్కృతిక నేపథ్యం అత్యధికంగా ప్రభావితం చేస్తుందని తెల్సిందే. విద్యార్థుల మధ్య అనేక వైయక్తిక బేధాలున్నప్పటికినీ, వాటిని అర్థం చేసుకొని, ఒకే రకపు నాణ్యతతో ఒకే పరిస్థితులలో సమాన అవకాశాలతో విద్యను బోధిస్తే, దాదాపుగా, అందరు పిల్లలు ఒక మోస్తరు (ఆశించిన మేరకు) ప్రతిభను తప్పక కనపరుస్తారనేది విద్యాత్మక సత్యం. ఈ పనిని సక్రమంగా బాధ్యతగా చిత్తశుద్ధితో తు.చ. తప్పక జరిగేటట్లు చూసే పర్యవేక్షణ పరిస్థితులు, నియంత్రణ లేకపోవడమే ఈనాటి విద్యా దైన్యతకు ప్రధాన కారణాల్లో ఒకటి.

విద్యా ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక, మాతృభాషా మాధ్యమం, విద్యార్థి–ఉపాధ్యాయుల నిష్పత్తి, ఉపాధ్యాయుల బోధనా నాణ్యత – శిక్షణ – అంకితభావం, మరుగుదొడ్లు – తాగునీరు–ఆటమైదానం– గ్రంథాలయం – ప్రయోగశాలలు – తరగతి గదుల వంటి మౌలిక వసతుల కల్పన, విద్యా విధానంలో శాస్త్రీయత–ప్రజాస్వామికత–లౌకిక స్వభావంలో గుణాత్మక పరివర్తన జరిగితేనే విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు పెరుగుతాయి. వీటి లేమికి విద్యార్థి బాధ్యుడు కాదు. వాటి లేమికి ప్రభుత్వాలు ఆయా సమాజాలు బాధ్యులు. డిటేయిన్ చేయడం అంటే ప్రభుత్వాల వైఫల్యానికి విద్యార్థికి శిక్ష వేయడం.

విద్యారంభ దశలో, ప్రత్యేకంగా ఎలిమెంటరీ స్థాయిలో, విద్యరాని వారికి, ఏదో ఒక పద్ధతిలో ఓ మోస్తరుగానైనా విద్యనందించడమే ఆ స్థాయి విద్యా వ్యవస్థ సార్వత్రిక లక్ష్యమై ఉండాలి. ఆ విద్యావిధాన ప్రాథమిక ఉద్దేశ్యమై ఉండాలి. అప్పుడే విద్యను హక్కుగా గుర్తించిన దానికి సార్థకత. అలా చేస్తేనే ఆయా రాజ్యాంగాల స్ఫూర్తి ఆయా ప్రభుత్వాల చిత్తశుద్ధి ప్రతిఫలిస్తుంది. దానర్థం, విద్యార్థులకు విద్య రాకపోతే రప్పియ్యాలికానీ, విద్య నుండి తప్పియ్యొద్దని మాత్రమే.

విద్యార్థికి విద్య అబ్బకపోతే అది విద్యార్థికి విద్యను బోధిస్తున్న విద్యా వ్యవస్థ వైఫల్యమే తప్ప, విద్యార్థి వైఫల్యమవ్వదు. విద్యార్థుల్లో విభిన్న శక్తి సామర్థ్యాలు కలవారు ఉంటారనే విషయం–విద్యా వ్యవస్థలో పనిచేసే ఉపాధ్యాయులందరికీ తెలుసు. నిర్దేశించిన కనీస లక్ష్యాలు సాధించే కృషిచేస్తే సాధారణ విద్యార్థులంతా ఆశించిన ఫలితాలు తప్పక సాధిస్తారనీ తెలుసు. అయినా సాధించకపోతే ఎట్లా అంటారు, మేధావులు? సాధించే వరకు ప్రయత్నం చేయడమే విద్యా వ్యవస్థ ఆదర్శం కావాలి. 'చదవడం నావల్ల కాదు, ఇక నేను చదవలేను', అని విద్యార్థి నిర్ణయించుకుంటే వేరే విషయం కానీ, విద్యావ్యవస్థనే విద్యార్థిని బలవంతంగా డిటేయిన్ చేయరాదు. అది పిల్లలు అవమానభారంతో పారిపోయేటట్లు చేసి, మరిన్ని విద్యార్థుల ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదముంది. లేదా అది పిల్లల్లో అనూహ్య, అసాధారణ పెడధోరణులకు, వైపరీత్యాలకు దారితీయవచ్చు.

చివరిమాట: 'నో–డిటెన్షన్ పాలసీ' రద్దు, 'డిటెన్షన్ పాలసీ' అమలు, అణగారిన వర్గాల పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు, మొత్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టు. ప్రైవేటు, కార్పొరేటు విద్యా వ్యాపారులకు, వాళ్ల వ్యాపారంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్న రాజకీయ నాయకులకు అధికారులకు అత్యంత లాభదాయకం. 'డిటెన్షన్ పాలసీ' అమలుకు విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల పెరుగుదలకు ఉన్నది నిరూపితమైన వాస్తవిక సంబంధం కాదు, రుజువుకు నిలవని మిథ్యా సంబంధం మాత్రమే. నిర్భాగ్యుల పిల్లలకు విద్యాహక్కు చట్టం–2009 కల్పిస్తున్న ఈ మాత్రం ప్రగతికరమైన అవకాశాన్ని మొగ్గలోనే నలిపివేయటమే 'డిటెన్షన్ పాలసీ' వెనక వ్యూహాన్నర్థం చేసుకొని చర్చించాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్, ఎస్.ఆర్.ఆర్. కళాశాల కరీంనగర్)

వీ

బోయలు షెడ్యూల్డ్ తెగ అవుతారా?

***కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయం తీసుకున్నారనీ, ఇది ఆదివాసుల మనుగడకే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందనీ అంటున్నారు* రామారావు దొర**

తీర్మానం మళ్లీ కేంద్రానికి వెళ్లకుండా అడ్డుకోవలసిన బాధ్యత ఎస్‌టి ఎమ్మెల్యేలు, టిఎసి సభ్యులదే! ఆదివాసీ రిజర్వేషన్లపై పాలకపక్షాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరశిస్తూ, బోయావాల్మికితో పాటు ఇతర కులాలను ఎస్‌టి జాభితాలోకి చేర్చడాన్ని వ్యతిరేకిద్దాం! ఆదివాసుల మనుగడను కాపాడుకొందాం!

2017 డిసెంబర్ 2న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా అదివాసిలకు మరో చారిత్రక అన్యాయానికి గురిచేసింది. రాయలసీమ జిల్లాల్లో బిసి–ఎ జాబితాలో ఉన్న దాదాపు 50 లక్షల మంది బోయావాల్మికి దాని ఉప కులాలను షెడ్యూల్డ్ తెగల(ఎస్‌టి) జాబితాలోకి చేర్చడానికి అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదింది. వెంటనే కేంద్ర ప్రభుత్వఅనుమతికోసంపంపింది. ఆదివాసులకు ఇప్పుడున్న ప్రత్యేక హక్కులు సుస్థిరం చేసుకోవడానికి ఆదివాసులు ఎన్నో తిరుగుబాట్లు చేసారు. స్వాతంత్ర్యం వచ్చి ఇరవై ఎనిమిదేళ్లు గడిచిన తరువాత 1975లో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐ.టి.డి.ఎ)లు ఏర్పాటు చేసారు. ఈ ప్రాజెక్టు ద్వారా అన్ని రంగాల్లో ఆదివాసీల సమగ్రాభివృద్ధికి కృషి చేయవలసిన ప్రభుత్వాలు తమస్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అభివృద్ధి చెందిన కులాలను ఎటువంటి సాంకేతిక ప్రమాణాలు పాటించకుండా ఎస్‌టి జాభితాలోకి చేర్చుతూ వస్తున్నారు.

ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో 39 కులాలు షెడ్యూల్డ్ తెగల జాబితాలో కలపాలని కోరుతున్నట్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ ఎడ్వైజరీ కౌన్సిల్ (టిఎసి) గుర్తించింది. పై కులాలను తెగల్లోకి చేర్చడానికి ఆ కులాలకు తగిన అర్హాతలు లేవని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ కేంద్రం (టిసిఆర్ & టిఐ) జరిపిన మానవ సామాజిక అధ్యయనం (ఎథెనోగ్రాఫిక్ స్టడీ) ద్వారా గిర్తించింది. అందులో 'బోయ వాల్మికి' కూడా ఒకటి. ఆ నివేదికల ఆధారంగా 2005న గిరిజన సలహా మండలి ఒక చారిత్రక నిర్ణయం తీసుకొంది. తగిన అర్హాత కలిగి లేరని నిర్ధారణ అయినప్పటికీ ఆయా కులాలు వారు తమని ఎస్‌టి జాబితాలో కలపమని పదేపదే విన్నవిస్తున్నందున, ఇక మీదట ఏ కులాలను తెగల్లోకి కలపమిని సిఫారసు చేయకూడద"ని తీర్మానించింది. రాజ్యాంగం నిర్దేశించిన ప్రమాణాలకు లోబడి పని చేసే ప్రభుత్వ సంస్థ టిసిఆర్ & టిఐ రిపోర్టును, టిఎసి తీర్మానాన్ని తుంగలో తొక్కిన ప్రభుత్వం ప్రొఫెసర్ పిడి సత్యపాల్ నివేదికనే ప్రామాణికంగా తీసుకొని బోయలను ఎస్‌టి జాభితాలో చేర్చడం వెనుక చంద్రబాబు నాయుడు మరోసారి అధికారంలోకి రావడం, ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం, తెలంగాణలో బోయవాల్మికి, కైతిలంబడాను ఎస్‌టి జాబితాలో చేర్చి కెసిఆర్‌కు తిరుగులేదనిపించుకోవడం ఎవరి రాజకీయ ఆకాంక్షలు వారు నెరవేర్చుకోవడానికి తప్పితే మరేదిలేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరీ దారుణంగా రాజ్యంగంపైన, చట్టాలపైన కనీస గౌరవం లేకుండా, కమిషన్ ఏమి వేయకుండా సరాసరి ఉభయ సభల్లో ఏకగ్రీవంగా తీర్మానం చేసేసి పొలిటికల్ మైలేజీ పొందాలని చూసింది. 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడా ఆంధ్రప్రదేశ్‌లో మూడు కులాలను కలిపి ఉమ్మడి రాష్ట్రం మెదక్ జిల్లా నుండి పోటీచేసి గెలుపొందారు.

రిజర్వేషన్లు ఆధిపత్య కులాల బ్లాక్మెయిలింగ్ రాజకీయాలకు వనరులుగా మార్చుకొన్నారు: బోయవాల్మికి కులాన్ని కలపడం సరికొత్త అంశంగా కనబడినా బలవంతులైన ఆధిపత్య కులాలు విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బలహీనులైన తెగలపైఅధిపత్యం కొనసాగిస్తూనే వస్తున్నారు. 1935 లో భారత ప్రభుత్వ చట్టం (బ్రిటీషు చట్టం) దేశంలో 212 తెగలను షెడ్యుల్డ్ తెగలుగా గుర్తించగా, రాజ్యాంగం అమల్లోకి వచ్చేనాటికి (1950)429 కి పెరిగింది. నేడు ఆ సంఖ్య ఏకంగా 790 కి చేరింది. అయినా ఇంకా చేరుస్తునే ఉన్నారు. అన్ని రంగాల్లో ఆదివాసీ తెగలకంటే ముందున్న కులాలనుకలుపుతూ! అందరిని ఒకే విధంగా పరిగణించడం వలన షెడ్యుల్డ్ తేగల అభివృద్ధికి తీవ్ర విగాతం కలుగుతుంది. వారికి కేటాయించిన రిజర్వేషన్ ఫలాలైన విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఆదివాసులకంటే ముందున్న కులాలను రాజకీయ అవసరాల కోసం కలపడం వల్ల, సాంకేతికంగా తరువాత చేర్చబడ్డ కులాలే ఎక్కువ ప్రయోజనం పొందుతుంది. దీని వల్ల ఆదివాసులకు విద్య, ఆర్థిక రంగాల్లో నిలదొక్కుకొనే అవకాశమే దొరకకుండా పోతుంది. అంతేకాకుండా ఆదివాసీలు, దళితులు, స్త్రీలు, వెనుకబడిన తగతులు, ముస్లిం మైనారిటిప్రజలు అందరితో సమాన స్థాయికి ఎదగడానికి ఉద్దేశించిన రిజర్వేషన్లు ఆధిపత్య కులాల బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు (తెలుగు రాష్ట్రాల్లో రెడ్డి, కమ్మ, వెలమ కులాలు, దేశంలో అగ్ర కులాలకు)వనరులుగా ఉపయోగపడుతుంది. తప్పితే ఆయా వర్గాల ప్రజలకు అనుకొన్నంత స్థాయిలో దోహాద పడలేదంటే అతిశయోక్తికాదు.

భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండ రాదనే నియమం ఉన్నప్పటికి, కాపులకు 'ఎఫ్' కేటగిరిలో ఇవ్వలననింది పాలక పక్షం. కానీబోయలను ఎస్టిల్లో చేర్చేటప్పుడుఅటువంటి నియమాలేవీ లేకుండా ఇప్పుడున్న 6 శాతాన్నే కలపబోయే 50 లక్షల మందికి కుడా

పంచిపెట్టాలని చూసింది. 1976 లో బిసి-ఎ జాబితాలో వున్నా లంబాడ, ఎరుకుల, యానాది కులాలను ఎస్టి జాబితాలోకి చేర్చింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. అప్పుడు కుడా ఆదివాసీ తెగలల్లో ఆవరించి ఉన్న అవిద్య, నిరుద్యోగం, పేదరికం, రాజకీయ నిరాసక్తత వంటి ఏ విదమైన సాంకేతిక ప్రమాణాలు పాటించకుండా తేగాల్లోకి కలిపేసింది.

రాజస్థాన్ లోఓసిలుగా, కర్ణాటకలో బిసిలుగా, మహరాష్ట్రలో ఎస్సిలుగా ఇలా వివిధ రాష్ట్రాల్లో వివిద సామాజిక హోదాల్లో ఉన్న లంబాడీలను ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే ఎస్టిలుగా గుర్తించం వల్ల విపరీతంగా వలసలు పెరిగినట్టు(1971 జనాభా లెక్కల ప్రకారం 1,32,464 మంది ఉండగా 1981 లెక్కల్లో ఆ సంఖ్య 11,58,342 లకు పెరిగింది) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పైమూడు కులాలను కలుపుతూ నాలుగు (4) శాతంగా ఉన్నఎస్టిరిజర్వేషన్ నుఆరు(6) శాతానికి పెంచడం జరిగింది. పెంచిన రిజర్వేషన్ కొంత మేరకైన అందుకోలేకపోగా! షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివచించే ఆదివాసీ తెగలు విద్యా, ఉద్యోగ రంగాల్లో వీరితో నేటికి అందుకోలేక పోతున్నారన్నది విస్పష్టంగా తెలుస్తుంది. అదే తెలంగాణాలో ఆదివాసులకు లంబడాలకు మద్య వైసామ్యలకు కారణమైందని చెప్పవచు. ఇది ఆధిపత్య కులాలు ఓట్ల రాజకీయాలకోసం అనుసరించిన కుటిల నీతికి నిదర్శనం. ఆదివాసీల కంటే అభివృద్ధిలో ముందున్న కులాలను తెగల్లోకికలుపుతూ వస్తున్నారే తప్ప! జరిగిన నష్టన్ని అంచమవేసి పచ్చత్తాపడి సరిదిద్దిన దాఖలాలు లేనేలేవు.

విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్ర ప్రభావం పడనుంది: అభివృద్ధికి అత్యంత చేరువలో ఉన్న బోయవాల్మికిని అదనంగా చేర్చడం వల్ల ఆంధ్రప్రదేశ్ ఆదివాసుల మనుగడకే ముప్పు వాటిల్లుతుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం ఆంధ్రప్రదేశ్ ఆదివాసి తేగలజనాభా 28,32,919 మంది మాత్రమే ఉండగా! ఆదివాసుల కంటే ఎక్కువ జనాభా కలిగి అభివృద్ధికి చేరువలో బోయాలను, ఇతర కులాలను కలపడం వల్ల రాబోయే విద్యార్థులు, నిరుద్యోగులు మరింత గడ్డుకాలం ఎదుర్కోవలసి వస్తుంది. ఎంబిబియస్, ఇంజనీరింగ్, ఐఐటి, అసెట్, నర్సింగ్, ఎపిఆర్జెసి, ఎపిఆర్డిసి, నవోదయ, ప్రతిభ పాటశాలలు వంటి ఉన్నత ప్రమాణాలతో కూడినచదువులుషెడ్యుల్ ప్రాంతా ఆదివాసులకు దక్కే అవకాశం లేదు. భవిష్యత్లో దక్కే అవకాశం ఉండబోదు. ఉద్యోగాలు విషయానికొస్తే జి.ఒ.నెం.3 ని అనుసరించి వచ్చిన ఉపాధ్యాయ ఉద్యోగాలు, జి.సి.సిలో సేల్స్ మేన్ ఉద్యోగాలు మినహాయిస్తే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే 6 శాతం ఉద్యోగాలు షెడ్యుల్డ్ ప్రాంత తెగలు పొందలేక పోతున్నారు. ఉప ప్రణాళికా నిధులతో చదువుకోసం విదేశాలకు వేల్లేవారుసైతం కొండ ప్రాంత తెగలకు దక్కడం లేదు. ఇవన్ని చూస్తుంటే తెగలపై పాలకులు ఎంత కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్డ్ను అనుసరించి ప్రత్యేక హక్కులు కలిగి ఉన్నప్పటికి ఆదివాసులపట్లాపాలకుల నిర్లక్ష్యం వల్లఅన్ని రంగాల్లో తీవ్రంగా వెనకబడేఉన్నారు. అదివాసేతరులు బోగస్ కుల ధృవీకరణ పత్రలతో విద్య, ఉద్యోగ, ఉపాది, రాజకీయ రంగాల్లో దొడ్డిదారిన ఎగరేసుకుపోతుంటే! మరోవైపు తమ రాజకీయ ప్రయోజనల కోసం అభివృద్ధి చెందిన కులాలను తెగల జాబితాలో కలుపుకొంటు వస్తున్నారు. దీని వలన ఆదివాసీలు మరింత దయనీయమైన స్థితికి నేట్టబడుతున్నారు.

అధికారం కోసం ఆదివాసులను బలి చేస్తున్నారు: 2014 ఎన్నికల్లో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ (జగన్)పార్టీలు బోయాలను, మత్యకారులను ఇతర కులాలను ఎస్టిజాభితాలో చేరుస్తామని హామీ ఇవ్వడమే కాకుండా తమ ఏన్నికల మేనిపేస్టోల్లో చేర్చింది. ఇవన్నితెలిసి కూడా వారినే ఓట్లుగుద్ది ఆపార్టీల అభ్యర్థులను గెలిపించడం నేడు ఆదివాసులు చేస్తున్న పెద్ద తప్పిదం. అసెంబ్లీలో బోయవాల్మీ కులాన్ని ఎస్టి జాభితాలోకి చేర్చుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు తీర్మానాన్నిసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా అమోదిస్తున్నప్పుడు సభలోనే ఉన్న ఆదివాసి శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి (పాడేరు), కిడారి సర్వేశ్వరరావు (అరుకువేలి), వంతాల రాజేశ్వరి (రంపచోడవరం), మొడియం శ్రీనివాసరావు (పోలవరం)లు సభలోనే ఉన్న కనీసం చిన్న అభ్యంతరం కుడా చెప్పే ప్రయత్నం చేయలేదు. పాలకపక్షం ఆ అవకాశం ఇవ్వకుండా ప్రలోభపెట్టి, బయపెట్టి నియంత్రించింది. ప్రతిపక్ష నాయకుడు పాదయాత్ర పేరుతో సభ్యులను సభలోకి రాకుండా చేసి పరోక్షంగా సంపూర్ణమైన మద్దతు పలికారు. బోయలను ఎస్టి జాబితాలో చేరుస్తూ చేసిన తీర్మానం వెలువడిన తరువాత ఉత్తరాంధ్ర జిల్లాల్లో మత్యకార కులాలు తమను కుడా ఎస్టి జాబితాలో చేర్చాలనే డిమాండ్ తో అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్ష శిబిరాలు వెలిశాయి. శ్రీకాకుళం జిల్లా కలెక్టరేటులో జరిగిన చిన్న పాటి సంఘటను సాకుగా చూపి జనసేన అధినేత పవన్ కళ్యాణ్అతిగా స్పందించిన తీరును చూసాం. విశాఖ శిబిరాన్ని సందర్శించిన వైఎస్ఆర్సిపి నాయకుడు విజయ సాయిరెడ్డి, మంత్రిలు మత్యకారులను ఎస్టిల్లో చేరుస్తామని హామీలు ఇచ్చివెళ్లగా, ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ప్రస్తావిస్తున్నారు.

విశాఖ ఏజెన్సీలో ఉన్నా తేగల్లో ఒకటైన వాల్మీకి తేగనుచూపించి రాజకీయ లబ్ధి కోసం ఎక్కడో మైధాన ప్రాంతాల్లో ఉన్న బోయవాల్మికి కులాల్ని ఎస్టిలుగా గుర్తించడం దుర్మార్గమైన చర్య. ఇక్కడ నివసించే వాల్మికి తెగకు ప్రత్యేక భాషా, సంస్కృతి, సాంప్రదాయాలుకలిగి, మిగత ఆదివాసీ తెగలతో అనుబంధాలు కలిగి ఉంటుంది. కానీ రాయలసీమ ఇతర జిల్లాల్లో ఉన్న బోయావాల్మికులకు, ఈ వాల్మికీ తేగాతో గాని ఇతర తెగలతో ఏ విధమైన సంబంధాలులేవు.

గిరిజన సంక్షేమ శాఖ, టిఎసి, ఎస్టి కమీషన్ లపై అదివాసేతరుల పెత్తనం: రాష్ట్రంలోగిరిజన సంక్షేమ శాఖ,ట్రైబల్ ఎడ్వైజరీ కౌన్సిల్ (టిఎసి) & ఎస్టి కమీషన్లపై ప్రభుత్వ అండతో అదివాసేతరుల పెత్తనం కోనసాగుతుంది. మంత్రి పదవి సహ టిఎసి చైర్మన్, ఎస్టి కమీషన్ చైర్మన్ పదవులు అదివాసేతరులకు కట్టబెట్టి, ఆదివాసీ ప్రజా ప్రతినిధులను నామమాత్ర సభ్యులుగా చేసి వారి మనోభావాలకు విరుద్ధంగా రాజ్యాంగపు హక్కులపై దాడిని కొనసాగిస్తున్నారు. బోయల అంశంతో పాటు 5వ షెడ్యుల్డ్ ప్రాంతంలో 1/70 భూబదలాయింపు చట్టం పరిధి నుంచి మినహాయించి అడివాసేతర బడా వ్యాపారులకు, కాంట్రాక్టర్లకు, టూరిజం, బాక్సైట్ మైనింగ్వంటిగుత్త సంస్థలకు కట్టబెట్టడానికి, ఆదివాసేతరులకు భూహక్కులు కల్పించడానికి, తిర్మనాల రూపంలో ప్రభుత్వ ఎజెండాను ముందుకుతేస్తున్నారు. వీటిని అడ్డుకోవలసిన బాధ్యత అడివాసులపై ఉంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి - శ్రమదోపిడీ - మార్కెట్ సంక్షోభం

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో శ్రమదోపిడీ జరిగే పద్ధతిని వివరిస్తున్నారు **రమేష్ పట్నాయిక్**

ప్రారంభానికి ముందు

జీవ పరిణామ క్రమంలో మానవజాతి రెండు లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిందని విజ్ఞాన శాస్త్రం చెపుతుంది. ఆఫ్రికా ఖండం తూర్పు తీరాన ఇథియోపియా దేశంలో పుట్టుకు వచ్చిన ఈ మానవజాతి ముప్పై వేల సంవత్సరాల క్రితం నాటికి సుమారు అన్ని భూ ఖండాలకు విస్తరించింది. దీర్ఘకాలం మానవులు ఆహార సేకరణ దశలోనే ఉన్నారు. గుంపులుగానూ, తెగలుగానూ, గణాలుగానూ జీవించారు. వారికి వ్యష్టి ఆస్తి లేదు. సమిష్టి ఆస్తి లేదు. అయితే సమిష్టిగానే జీవించారు. ప్రకృతి నుంచి, క్రూర మృగాల నుంచి వచ్చిన ప్రమాదాలను, ఆకలిని కలిసికట్టుగా ఎదుర్కొన్నారు. వీరు ప్రధానంగా ఆహార సేకరణ దశలో జీవించారు. ప్రకృతి సిద్ధంగా లభించిన పళ్లు, కాయలు, దుంపలు ఏరుకోవడం, చేపలు పట్టడం, మొరటు ఆయుధాలతో జంతువులను వేటాడ్డం వీరి ఆహార సేకరణ మార్గాలు.

చారిత్రక భౌతికవాదం అనే సిద్ధాంతం ఆనాటి సామాజిక వ్యవస్థకు ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థ అని పేరు పెట్టింది. మానవ సమాజం ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థ రూపంలో సుమారు రెండు లక్షల సంవత్సరాలు కొనసాగిన తరువాత 3,500 బిసి ప్రాంతంలో అంటే నేటికి 5,500 సంవత్సరాలకు కాస్త ముందు వెనుకలుగా యూఫ్రటిస్, నైలు, సింధ్ప్ర నదీలోయలలో మానవులు వ్యవసాయం, పశుపోషణ పద్ధతులను కనుకొని సుమేరియన్, ఈజిప్టు, సింధూ నాగరికతలను అభివృద్ధి చేశారు. చైనాలో పసుపునది నాగరికత, భారతదేశంలో గంగానది కూడా ముందు వెనుకలుగా వచ్చాయి. నాగలితోటిదే నాగరికత.

ఉత్పాదకతలో సాపేక్ష పెరుగుదల

నాగలి ఉత్పాదకతను సాపేక్షంగా పెంచింది. ఇది ఒక కొత్త పరిస్థితిని తీసుకువచ్చింది. ఉత్పాదకత తక్కువగా ఉన్నప్పుడు అందరూ కష్టపడి పనిచేసినా అందరికీ కనీస అవసరాలు తీరని పరిస్థితి ఉంటుంది. అక్కడ ఎవరూ కూర్చుని తినే అవకాశం ఉండదు. అటువంటి పరిస్థితిలో పనిచేయని పాలకవర్గం అంటూ ఏర్పడడం సాధ్యం కాదు. ఉత్పాదకత సాపేక్షంగా పెరిగిన అనంతరం ఒక వ్యక్తి ఉత్పాదకత ఆ వ్యక్తి బతికి బట్టకట్టడానికి కావలసిన తిండి తీర్థాలకంటే ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వ్యక్తిని లొంగదీసుకోగలిగితే, ఆ వ్యక్తిని బానిసగా చేసుకుని ఆ వ్యక్తితో ఉత్పాదక శ్రమ చేయించి, ఆ వ్యక్తికి కనీస తిండి తీర్థాలు మాత్రం ఇచ్చి మిగిలిన ఉత్పత్తిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ పరిస్థితే బానిస వ్యవస్థ ఏర్పాటుకు దారితీసింది.

బానిస వ్యవస్థ

ఇతర తెగలతో యుద్ధాలు జరిగినప్పుడు మొదట్లో అయితే లొంగిపోయిన వారిని తమ తెగలో సమాన సభ్యులుగా కలుపుకునేవారు. వ్యక్తి ఉత్పాదకత పెరిగిన తర్వాత యుద్ధంలో లొంగిపోయిన వారిని బానిసలుగా చేసుకోవడం ప్రారంభమయింది. ఒక తెగ వేరొక తెగ వ్యక్తికి యుద్ధంలో లొంగిపోతే బానిసగా మార్చబడేవాడు. లొంగదీసుకున్నవాడు యజమాని, లొంగిపోయిన వాడు బానిస. బానిసలను ఉత్పాదక శ్రమలో పెట్టి వారుచేసిన ఉత్పత్తిలో వారు బతికి బట్టకట్టడానికి అవసరమైన తిండి తీర్థాల మేరకు మాత్రమే వారికి ఇచ్చి మిగిలిన ఉత్పత్తిని స్వాధీనం చేసుకోవడం జరిగేది. దీర్ఘకాలంలో ప్రతి

తీర్మానం మళ్లీ కేంద్రం వద్ద వెళ్లకుండా అడ్డుకోవలసిన బాధ్యత ఎస్‌టి ఎమ్మెల్యేలు, టిఎసి సభ్యులదే. బోయవాల్మీకి కులాలను ఎస్‌టి జాభితాలో చేర్చుతూ తమ నిర్ణయాన్ని ప్రకటించిన నాటి నుండి రాష్ట్ర వ్యాప్తంగాఆదివాసులు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి తీవ్ర నిరసనలు వ్యక్తం చేసారు. ఆదివాసీ రిజర్వేషన్ పరిరక్షణ పోరాట కమిటి, ఇతర ఆదివాసీ సంఘాలు రాష్ట్రపతి రాంనాద్ కోవింద్ గారిని, జాతీయ షెడ్యుల్డ్ తెగల కమిషన్ (ఎన్ఎస్‌టిసి) చైర్మన్ నందకుమార్ సాయి గారిని పలుమార్లు కలసి బోయాలను ఎస్‌టి జాభితాలో చేర్చవద్దని కోరాయి. బోయ వాల్మికులను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానంపై గవర్నర్ జనరల్ అప్ ఇండియా ఏ విధమైన సిఫారసు చేయలేదు. అలాగే జాతీయ షెడ్యుల్డ్ తెగల కమిషన్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు తిప్పి పంపిస్తూ, బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుకొంటే రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అంశాలు మరియు ఏర్పాట్లకు సంబందించి మళ్లీ తీర్మానం పంపాలని అనింది. ఎన్నికలు దగ్గరపడుతున్నందున ఓట్లు దండుకోవడానికి పాలక, ప్రతిపక్షంతో పాటు మిగతా రాజకీయ పార్టీలు ఎన్ని కుయుక్తులైన పన్నవచ్చు.

కాబట్టి ఈ ప్రక్రియాను ఇంతటితో సరమగీతం పాడాలంటే ఎస్‌టి ఎమ్మెల్యేలంత కలసి ఈ తీర్మానం కేంద్రానికి పంపకుండా ఉండేందుకు టిఎసిలో తక్షణమే తీర్మానం చేయాల్సిఉంది. ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపి ఎంఎల్ఎలు, ఎంపిలు, టిఎసి సభ్యులు, తెలుగుదేశం పార్టీ త్రిసభ్య కమిటి సభ్యులదే బాధ్యత. లేదంటే వచ్చే 2019 ఎన్నికల్లో దోషులుగా నిలబడక తప్పదు.

(రచయిత కన్వీనర్ ఆదివాసీ రిజర్వేషన్ పరిరక్షణ పోరాట కమిటి) వీ

తెగలో బానిసల సంఖ్య పెరిగింది. వ్యక్తిగత ఆస్తి ఏర్పడింది. నిలువ ఉన్న పంట, పశువులు, బానిసలు మొదటి ఆస్తి రూపాలు కావచ్చు. క్రమంగా తెగలోనే ఆదాయంలో, ఆస్తిలో హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయి. అప్పులు తీర్చలేని స్వంత తెగవారు కూడా బానిసలయ్యారు. ఈ విధంగా ప్రతి తెగా బానిసలు బానిస యజమానులు అనే రెండు వర్గాలుగల వర్గ సమాజంగా మారిపోయింది. దీనినే బానిస వ్యవస్థ అంటారు. బానిస యజమానులు ఉత్పత్తి సాధనాలైన భూమి, పశువులు, బానిసలు, పనిముట్లకు యజమానులు అయ్యారు. కాగా, బానిసలు ఆ ఉత్పత్తి సాధనాలతో పనిచేసి పంటలు పండించేవారు, వస్తువులు తయారు చేసేవారు. ఈ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలపై గాని, ఉత్పత్తి ప్రక్రియ పైగా గాని బానిసలకు ఎటువంటి హక్కు ఉండేది కాదు. బానిస యజమానులు తమ పశువులకు గడ్డివేసి బతికించుకున్నట్లు, తమ బానిసలకు కొంత తిండి పెట్టి పనిచేయించుకునేవారు. ఈ వ్యవస్థలో బానిసలకు బతికి బట్టకట్టడానికి మాత్రం ఇచ్చి మిగిలిన ఉత్పత్తిని ఎటువంటి శ్రమచేయని బానిస యజమానులు వారి కుటుంబ సభ్యులు తమ అవసరాలను తీర్చుకోవడానికే గాక అనేక ఆడంబరాలకు ఉపయోగించేవారు. బానిస యజమానులంతా ఒక వర్గంగా ఏర్పడి బానిసలను అణిచి ఉంచేవారు. అందుకు సైన్యాన్ని మతాన్ని ఉపయోగించేవారు.

మొదటి వర్గ సమాజం పైన చెప్పుకున్న బానిస వ్యవస్థ. అనంతర కాలంలో భూస్వామ్య వర్గదోపిడీ వ్యవస్థ ఏర్పడింది. కొన్ని దేశాలలో వర్గరహిత గణ లేదా తెగ సమాజాలు నేరుగా భూస్వామ్య సమాజాలుగా పరిణామం చెందాయి. భూస్వామ్య సమాజాలు కూడా అన్ని దేశాలలో ఒకే రూపంలో ఏర్పడలేదు. అయితే కొన్ని సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. భారతదేశంలో ఆదిమ సమాజ రూపాలు, బానిస వ్యవస్థ రూపాలు, భూస్వామ్య వ్యవస్థ రూపాలు అర్థం చేసుకోవడానికి పూర్తి సమగ్రమైన చర్చ అవసరం అవుతుంది. ఆ చర్చ ఈ వ్యాస పరిధిలోనికి రాదు.

భూస్వామ్య వ్యవస్థ

ఇంగ్లాండ్ దేశం పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టినిల్లు. భూస్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ విధానం పుట్టుకువచ్చిన విధానాన్ని అర్థం చేసుకోవడానికి ఇంగ్లాండ్ మంచి ఉదాహరణగా ఉంటుంది. అంతేకాదు, భూస్వామ్య వ్యవస్థను అర్థం చేసుకోవడానికి కూడా ఇంగ్లాండ్ మంచి ఉదాహరణగా ఉంటుంది. అందుకే మనం ఇంగ్లాండ్ ఉదాహరణ తీసుకుని పరిశీలిద్దాం. ఇంగ్లాండులో బానిస వ్యవస్థ 1066లో చట్టబద్ధంగా రద్దయి భూస్వామ్య వ్యవస్థ ప్రారంభమైంది. ఇతర ఐరోపా దేశాలో ముందు వెనుకలుగా బానిస వ్యవస్థ రద్దయి భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. బానిస యజమానులు, బానిసలు అనే వర్గ వ్యవస్థ అనంతరం భూస్వాములు – భూదాసులు అనే వర్గ వ్యవస్థ రూపంలో వర్గ దోపిడీ కొనసాగింది. భూదాసులనే అర్ధ బానిసలు అని కూడా అంటారు. వీరు వారానికి రెండు దినాలు భూస్వాముల భూమిలో వెట్టి చేసేవారు. మిగిలిన దినాలలో తమకు దున్నుకోవడానికి మాత్రమే వారసత్వంగా లభించిన భూమిలో స్వంత వ్యవసాయం చేసుకునేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థ పెరుగుతున్న క్రమంలో వెట్టి మానివేసి తాము పండించిన పంటలో భూస్వాములకు కొంతభాగం కౌలు కొలిసేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత అభివృద్ధి చెందడంతో రైతులు తాము పండించిన పంటలో కొంతభాగం పట్టణాల్లో అమ్మి భూస్వామికి ధన రూపంలో కౌలు చెల్లించేవారు.

వెట్టి స్థానంలో పంట రూపంలో కౌలు, పంట స్థానంలో ధన రూపంలో కౌలు ఇంగ్లాండ్ భూస్వామ్య వ్యవస్థలో వచ్చిన మార్పులు. అనంతర కాలంలో ఇంగ్లాండులో వ్యవసాయ రంగంలో కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవేశించింది. రైతులలో కొద్దిమంది ధనిక రైతులయ్యారు. అనేక మంది రైతులు భూమిని కోల్పోయి వ్యవసాయ కూలీలయ్యారు, లేదా పొట్ట చేతపట్టుకుని పట్టణాలకు చేరారు. వృత్తికారులలో కొద్దిమంది పెట్టుబడిదారులయ్యారు, అత్యధికులు కార్మికులయ్యారు. భూస్వాములలో కొద్దిమంది పెట్టుబడిదారులు, బ్యాంకర్లు అయ్యారు. అత్యధికులు అదాయం కంటే ఎక్కువ జల్సాలు చేసి దివాళ తీశారు, బుక్కా ఫకీరులయ్యారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పట్టణ మార్కెట్‌తో సంధానమవడం, పెట్టుబడిదారీ పారిశ్రామిక వ్యవస్థ విస్తరించడం ఈ పరిణామాలకు ప్రధాన కారణంగా చెప్తారు. మొత్తంపై గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా పెట్టుబడిదారీ వ్యవస్థగా మారిపోయింది. అన్ని దేశాలలో ఈ ప్రక్రియ ఇలాగే జరగలేదు. మన దేశంలో కులం ఆర్థిక దోపిడీలో చాలా ప్రాముఖ్యత వహించింది. ప్రస్తుత మన చర్చ మేరకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రజా సమూహాలు వర్గాలు లేని, వర్గ దోపిడీలేని తెగలుగా లేదా గణాలుగా సుదీర్ఘకాలం కొనసాగిన తర్వాత సుమారుగా క్రీస్తుపూర్వం 3,500 నుంచి క్రీస్తు శకం 17వ శతాబ్దం వరకు బానిస, భూస్వామ్య వ్యవస్థలుగా కొనసాగాయని చెప్పవచ్చు. గత నాలుగు వందల సంవత్సరాల కాలాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుక కాలంగా చెప్పవచ్చు.

నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ వివిధ దేశాలలో వివిధ అభివృద్ధి స్థాయిలలో ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వర్గాలు, ఆర్థిక దోపిడీ, సంక్షోభం మన ప్రస్తుత పరిశీలనాంశం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలైన భూమి, పరిశ్రమలకు యజమానులు పెట్టుబడిదారులు, సర్వం కోల్పోయి, తమ శ్రమ శక్తిని అమ్ముకుని జీవనాధారాలు సంపాదించుకునేవారు కార్మికులు. ఉత్పత్తి సాధనాలపైన, ఉత్పత్తి ప్రక్రియపైన, ఉత్పత్తిపైన యాజమాన్యం, అజమాయిషీ ఉండేది పెట్టుబడిదారీ వర్గానికే. అయితే అసలు ఉత్పాదక శ్రమ చేసేది కార్మికులు. రెండు వర్గాలు ఒక వైరుధ్యంలో ఉంటాయి. ఈ రెండు వర్గాలు, ఈ రెండు వర్గాల మధ్య ఉన్న వైరుధ్యం పెట్టుబడిదారీ, కార్మిక వర్గాల మధ్య వైరుధ్యం ప్రధాన వైరుధ్యాలు.

బానిస సమాజంలో బానిస యజమానుల వర్గం పరిపాలించింది. రాజ్యాధికారం దాని చేతిలో ఉండింది. ఆనాటి రాజులు, మతాధికారులు బానిస యజమానుల వర్గం తరుపుననే పరిపాలించారు. భూస్వామ్య వర్గం తరుపునే రాజ్యం చేశారు, పరిపాలించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రభుత్వం పెట్టుబడిదారీ వర్గం తరుపుననే రాజ్యం చేస్తుంది, పరిపాలిస్తుంది. అందుకే కార్ల్ మార్క్స్ 'ఆధునిక రాజ్యం పాలనా యంత్రాంగం పెట్టుబడిదారుల సామాన్య ప్రయోజనాలను చక్కబెట్టే ఒక కమిటీ మాత్రమే' అని చెప్పాడు.

ప్రజాస్వామ్యం పేరుతో ఇప్పుడున్నది పెట్టుబడిదారీ రాజ్య వ్యవస్థ.

ఇంతకీ రాజ్యం అంటే ఏమిటి? ఒక వర్గం మరొక వర్గాన్ని అణిచిపెట్టి ఉంచే సాధనమే రాజ్యం అని వివరించాడు కార్ల్ మార్క్స్. పోలీసు శాఖతో సహా పాలనా యంత్రాంగం, న్యాయ వ్యవస్థ అన్నింటికంటే ప్రధానంగా సైన్యం రాజ్యంలో ప్రధాన అంగాలు. ఒకప్పుడు రాజుగారు, ఇప్పుడు ఎన్నుకున్న ప్రభుత్వం ఈ రాజ్యాంగ యంత్రాన్ని నడుపుతున్నట్లు కనిపిస్తుంది. వారసత్వంగా వచ్చిన రాజును గాని, ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని గాని నడిపించేది పాలకవర్గమే. బానిస యజమానుల వర్గం లేదా భూస్వాముల వర్గం లేదా పెట్టుబడిదారీ వర్గం ప్రభు వర్గం ద్వారా గాని, రాజు ద్వారా గాని, ఎన్నికైన ప్రభుత్వం ద్వారా గాని పైన చెప్పుకున్న రాజ్యాంగ యంత్రాన్ని నడిపిస్తారు. బానిసలను అణిచివేయడానికి బానిస యజమానుల వర్గం, భూదాసులను అణచివేయడానికి భూస్వామ్య వర్గం, కార్మికులను అణచివేయడానికి పెట్టుబడిదారీ వర్గం ఈ రాజ్య వ్యవస్థనే ఉపయోగించాయి, ఉపయోగిస్తున్నాయి. ఇటువంటి రాజ్య వ్యవస్థ లేకుండా ఒక పద్ధతిగా, పాలనా విధానంగా దోపిడీ వ్యవస్థీకృతం చేయడం సాధ్యం కాదు. దోపిడీని అంతం చేయాలంటే చివరికి ఈ రాజ్య వ్యవస్థను ఢీకొనవలసిందే, బద్దలు కొట్టవలసిందే. రాజ్య వ్యవస్థపై చర్చను మనం ఇప్పుడు చేపట్టడం లేదు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి

వ్యవసాయదారులు, వృత్తికారులు ఉత్పత్తి చేసే విధానం అనగా వ్యష్టి ఉత్పత్తి విధానం పోయి క్రమంగా పరిశ్రమలు వచ్చాయి. పరిశ్రమ ప్రధాన లక్షణం ఆవరణలోనే శ్రమవిభజన. గతితార్కిక నియమాలు వివరించినట్లు ఈ పరిశ్రమలతో పాటు పెట్టుబడిదారులు, కార్మికులు అనే రెండు పరస్పర విరుద్ధ శక్తులు ఒకేసారి పుట్టుకు వచ్చాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ మౌలిక లక్షణాలన్నీ క్రమ క్రమంగా పుట్టుకు వచ్చాయి. పెట్టుబడిదారీ వ్యవస్థను స్థూలంగా పరిశీలించడానికి మనం ఒక ఉదాహరణ తీసుకుందాం. ఒక పెట్టుబడిదారుడు కోటి రూపాయల పెట్టుబడితో ఒక స్థలంలో ఒక భవనం కట్టి మరమగ్గాల పరిశ్రమ స్థాపించాడు. భవన నిర్మాణానికి, మరమగ్గాల కొనుగోలుకు, స్థాపనకు 50 లక్షల రూపాయలు ఖర్చయ్యాయనుకుందాం. తరువాత ఒక నెల కాలానికి అవసరమైన ముడి సరుకులకు, విద్యుత్, బొగ్గు, నీరు, రవాణా వంటి సహాయక వస్తు సేవలకు 44.5 లక్షల రూపాయలు వ్యయం చేశాడు. వీటన్నింటిని కలిపి ముడి సరుకులు అందాం. భవనాలలో, యంత్రాలలో తరుగుదల పూరించడానికి ప్రతినెల 0.5 లక్షలు కేటాయించుకున్నాడు. (ఇది సంవత్సరానికి 6 లక్షలు అవుతుంది.) తరుగుదల పూరించడానికి అవసరమైన అవసరమైన సరుకులు, సేవలను తరుగుదల పరిహార విలువలు అందాం. కార్మికులకు నెలవారీ వేతనంగా 5 లక్షల రూపాయలు చెల్లించాడు. మొత్తం కోటి రూపాయలు ఖర్చయింది. అయితే భూములు, యంత్రాలు, స్థావర పెట్టుబడి అని సంవత్సరం పొడుగుఎనా అన్ని నెలలు అలాగే ఉంటాయి. భవనాలలో, యంత్రాలలో వచ్చిన తరుగుదల ప్రతినెలా 50 వేల రూపాయలు (0.5 లక్షలు) పెట్టి పూరిస్తున్నాడు. కాబట్టి స్థావర పెట్టుబడిలో మార్పు ఉండదు. ఒక నెల కాలంలో 44.5 లక్షల ముడి సరుకులు, సహాయ వస్తు సేవలు, ఇంకా 50 వేల రూపాయల భవనాలు, యంత్రాల తరుగుదల ఖర్చయిపోతాయి. 5 లక్షల రూపాయలు వేతనాలకు ఖర్చయిపోతాయి. అంటే ఒక నెలలో ఈ పెట్టుబడిదారుడు 50 లక్షల రూపాయలు ఖర్చు చేస్తాడు. తయారైన బట్ట 55 లక్షల రూపాయలకు అమ్ముడు పోయిందనుకుందాం. ఇప్పుడు ఆర్థిక లావాదేవాలను పరిశీలిద్దాం. ఈ లెక్కను మనం ముందుగా పెట్టుబడిదారుల దృష్ట్యా లేదా సాధారణ పాఠ్య పుస్తకాల పద్ధతిలో పరిశీలిద్దాం. తరువాత మర్క్సిస్టు విశ్లేషణను గమనిద్దాం.

పెట్టుబడిదారుడు ఇలా అంటాడు

'నేను ఒక కోటి రూపాయలు పెట్టుబడి పెట్టాను. అందులో 50 లక్షలు స్థావర పెట్టుబడి, 50 లక్షలు టర్నోవర్ పెట్టుబడి. నెల కాలంలో ఉత్పత్తి క్రమంలో ముడి సరుకులు, సహాయ సరుకులు 44.5 లక్షలు, భవనాల, యంత్రాల తరుగుదలకు 0.5 లక్షలు ఖర్చు చేశాను. కార్మికులకు 5 లక్షల రూపాయలు వేతనాలు చెల్లించాను. నెలాఖరు నాటికి నా స్థావర పెట్టుబడి యథాతథంగా ఉందని ఒప్పుకుంటాను. అయితే 50 లక్షల రూపాయల టర్నోవర్ పెట్టుబడి పూర్తిగా ఖర్చయిపోయింది. 55 లక్షల రూపాయల ఉత్పత్తి చేతికి వచ్చింది. ఇది అమ్మితే 5 లక్షల రూపాయలు నాకు స్థూల లాభం. నేను లెక్కలన్నీ సరిగానే రాశాను. ముడి సరుకులు, సహాయ సరుకులు మార్కెట్ ధర ప్రకారమే కొన్నాను. తరుగుదల, మరమత్తులు మార్కెట్ ధరల ప్రకారమే గణించాను. తయారైన సరుకులను కూడా మార్కెట్ ధరల ప్రకారమే అమ్ముతున్నాను. కార్మికులకు కూడా మార్కెట్ ధరల ప్రకారమే వేతనాలు చెల్లించాను. వారిని నేనేమీ నిర్బంధించి బానిస యజమాని లాగ, భూస్వామిలాగా పనిచేయించుకోలేదు. కార్మికులకు వేతనాల చెల్లింపుతో సహా అన్ని కొనుగోళ్లు, తయారైన సరుకుల అమ్మకాలు మార్కెట్ ధరల ప్రకారమే నిర్వహించాను. నాకు ఐదు లక్షల రూపాయల స్థూల లాభం వచ్చింది. నాకు వచ్చిన స్థూల లాభంలో నేను బ్యాంకుకు వడ్డీ, భూమికి భాటకం, ప్రభుత్వానికి పన్ను కడతాను. మిగిలినదే నాకు నికర లాభం. అందులో కూడా నేను మత, ధార్మిక కార్యక్రమాలకు కొంత ఖర్చు చేస్తాను. నేను ఈ వ్యవహారాన్నంతా సమర్థవంతంగా నిర్వహించాను కాబట్టి లాభం వచ్చింది. నేను పెట్టుబడిని రిస్క్ చేశాను, అందుకే నాకు లాభాన్ని స్వంతం చేసుకునే హక్కుంది' అంటాడు.

ఒక సరాసరి సమర్థత ఉన్న పెట్టుబడిదారుడు మార్కెట్‌లో సరాసరి కొనుగోలు, అమ్మకాలు చేస్తాడు. కనీస సమర్థతలేని పెట్టుబడిదారుడు మార్కెట్‌లో నిలబడలేడు, వర్గచ్యుతి పొందుతాడు. మన విశ్లేషణ పెట్టుబడి మార్కెట్‌లో నిలబడగలిగే వారి గురించి మాత్రమే. మార్కెట్‌లో లాభాలకు మౌలిక కారణం సమర్థత కాదు. వ్యష్టి పెట్టుబడిదారులు, వ్యష్టి బ్యాంకర్లు, వ్యష్టి వ్యాపారస్థులు సాపేక్ష సమర్థతలపై ఆధారపడి వారి మధ్య లాభాల పునఃపంపిణీ జరుగుతూ ఉంటుంది. పెట్టుబడిదారులను, వ్యాపారులను, బ్యాంకర్లను కలిపి ఒక వర్గంగా తీసుకుంటే గత నాలుగు వందల సంవత్సరాల కాలంలో వారి ఆస్తులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతూనే ఉన్నాయి. రైతులు, వృత్తికారులు, తమ భూములను, వృత్తులను కోల్పోయి రోజు కూలీలుగా తయారయ్యారు. రెక్కాడితేగాని డొక్కాడే స్థితి లేదు. కాబట్టి పెట్టుబడిదారుల సాపేక్ష సామర్థ్యాలు వ్యష్టి పెట్టుబడిదారుల లాభాలను వివరించగలవే గాని, పెట్టుబడిదారీ వర్గం మొత్తం లాభాలను వివరించలేవు. పెట్టుబడిదారీ వ్యవస్థను మనం విశ్లేషించదలచుకుంటే

మనం ఒర సరాసరి సమర్థతున్న పెట్టుబడిదారున్నే ఉదాహరణగా తీసుకోవాలి. ఈ పెట్టుబడిదారుడు కొనుగోళ్లు, అమ్మకాలు, రుణాలు అన్నీ కూడా మార్కెట్ సరాసరి ధరలలోనే నిర్వహిస్తాడు. అటువంటి పెట్టుబడిదారుడే విశ్లేషణకు పనికివస్తాడు. సరాసరి సమర్థత ఉన్న పెట్టుబడిదారుడే మన విశ్లేషణకు అవసరమైన నమూనా పెట్టుబడిదారుడవుతాడు.

తిరిగి మన ఉదాహరణకు వస్తే మౌలికంగా లాభం రావడానికి కారణం పెట్టుబడిదారులు చేసే అవినీతి లేదా మోసం కాదు, వారి సాపేక్ష సమర్థతలు కూడా కాదు. లాభాలకు కారణం మరింత లోతుగా అధ్యయనం చేయాలి. సమర్థవంతంగా నిర్వహించిన కారణంగా లాభం వచ్చింది. సమర్థత లేనివారు నష్టపోతారు. నా సమర్థతే నాకు లాభాలు తెచ్చిపెట్టింది. నేను లాభం తీసుకోవడం న్యాయబద్ధమైనదే. ఇందులో ఎటువంటి అవినీతి, మోసం, దోపిడీ లేవు అంటాడు పెట్టుబడిదారుడు. ఎటువంటి అవినీతి, మోసం చేయకపోయినా, సరాసరి సమర్థత కలిగిన పెట్టుబడిదారుడు కూడా శ్రమదోపిడీ ఫలితంగా లాభాలు గడించగలడు. అదెలాగో ఇప్పుడు మార్క్సిస్టు సిద్ధాంతం ఆధారంగా పరిశీలిద్దాం.

అత్యధిక పెట్టుబడిదారులు అవినీతికి, మోసానికి పాల్పడతారు. కార్మికుల చేత వీలయితే నిర్బంధ శ్రమ చేయించడానికి కూడా ప్రయత్నిస్తారు. అయితే ఇవన్నీ మౌలిక లక్షణాలు కావు. శ్రమ దోపిడీ మాత్రమే మౌలిక లక్షణం. మన చర్చ కొరకు పెట్టుబడిదారులంతా నీతి, నిజాయితీపరులనే భావిద్దాం. మౌలిక లక్షణమైన శ్రమ దోపిడీపైనే దృష్టి కేంద్రీకరిద్దాం. అలాగే పెట్టుబడిదారులలో అసమర్థులుంటారు. వారు ముడి సరుకులు కొన్నప్పుడు సరిగ్గా బేరమాడలేరు. అవసరానికంటే ఎక్కువ చెల్లిస్తారు. మార్కెట్ ధరల ఎగుడుదిగుడులో ధరలు తక్కువగా ఉన్న సమయంలో లేదా ప్రాంతంలో కొనాలి. కాని వీరు అసమర్థత వలన మార్కెట్ సరాసరి ధరకంటే ఎక్కువ చెల్లిస్తారు. వీరు నష్టపోతారు. ముడి సరుకులు, సహాయక సరుకులు అమ్మే పెట్టుబడిదారుడు లేదా వ్యాపారి లాభపడతాడు. మరొక విషయం, అసమర్థుడైన పెట్టుబడిదారుడు తన ఉత్పత్తులను మార్కెట్ సరాసరి ధరకంటే తక్కువ ధరకు అమ్ముతాడు. ఇటువంటి అసమర్థ పెట్టుబడిదారులు ఎక్కువ కాలం రంగంలో నిలువలేరు. వారి పెట్టుబడి అనతికాలంలోనే ఇతర పెట్టుడిదారులకు, వ్యాపారులకు, బ్యాంకర్లకు చేరిపోతుంది. రంగంలో నిలబడేది కనీస సమర్థత ఉన్న పెట్టుబడిదారులే. కనీస సమర్థత ఉన్న పెట్టుబడిదారుడే మన చర్చకు నమూనా పెట్టుబడిదారుడు. సమర్థతల విషయం ఇక్కడితో విడిచిపెట్టేద్దాం.

మనం చేస్తున్న చర్చలో మార్కెట్ సరాసరి ధరలు అంటున్నాం. దానిని రెండు మాటలలో వివరించుకుందాం. బంగారం ధర డిమాండ్ సప్లయిలలో ఉన్న వత్యాసం వలన సంవత్సరం పొడుగునా అనేక ఎగుడు, దిగుడులకు గురికావచ్చు. కాని ఒక దేశంలో, ఒక సంవత్సర కాలంలో దానికి ఒక సరాసరి ధర ఉంటుంది. ఆ సరాసరి ధరకు రెండు వైపులా డిమాండ్, సప్లయిపై ఆధారపడి వాస్తవ ధర చలిస్తూ ఉంటుంది. నిజానికి వస్తువులో చేరిన శ్రమ ఫలితంగానే వస్తువుకు ఒక విలువ, ఒక సరాసరి ధర ఏర్పడుతుంది. ఒక గ్రాము బంగారం విలువ 3,000 రూపాయలు అంటే బంగారం ఖనిజంపై 3,000 రూపాయల విలువైన మానవ శ్రమ జరగడం వలన ఒక గ్రాము బంగారం తయారయిందన్నమాట. ఒక వస్తువు సరాసరి ధర అందులో చేరిన శ్రమ విలువకు లేదా మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే శ్రమ గంటలకు/దినాలకు సమానం. అందుకే వస్తు మార్పిడి పద్ధతి అమలు జరిగిన కాలంలో ఒక పనిదినంలో తయారైన కుండలు ఒక పనిదినంలో తయారైన బట్టతో మారకం జరిగేవి. వాటిలో ఉన్న శ్రమ సమానం కాబట్టి వాటిలో ఉన్న విలువ సమానం కాబట్టి వాటి ధర సమానం. మరొక విషయం, అడవిలో చెట్టుకు విలువ ఉండదు. దానిని కొట్టి ఆ కట్టెలను గ్రామంలోకి మోసుకువస్తే దానికి విలువ ఉంటుంది, ధర ఉంటుంది. ప్రకృతి వనరైన చెట్టుకు మానవ శ్రమ కలపడం వలననే విలువ, ప్రకృతి వనరులకు మానవ శ్రమను జోడించడం వలననే లేదా ప్రకృతి వనరులపై మాన శ్రమ జరగడం వలననే సరుకులు రూపొందుతాయి.

ఒక సరుకుకు విలువ దానిలో నిబిడీకృతమైన మానవ శ్రమ మాత్రమే. సరుకుకు ఉన్న విలువ ఆధారంగానే దానికి సరాసరి ధర వస్తుంది. సరకు విలువను రూపాయలలో చెపితే అదే దాని సరాసరి ధర. సరాసరి ధరకు రెండు వైపులా (డిమాండ్, సప్లయి పరిస్థితిపై ఆధారపడి) వాస్తవ ధర చలిస్తుంది. పారిశ్రామిక వస్తువులకు కూడా ఇదే వర్తిస్తుంది. పారిశ్రామిక వస్తువుల తయారీలో యంత్రాలుంటాయి. అయినా అక్కడ కూడా మానవ శ్రమ ఫలితంగానే సరుకులకు విలువ ఏర్పడుతుంది. యంత్రాలలో తరుగుదల మాత్రమే తయారీ సరుకులకు చేరుతుంది. మిగిలిన విలువ అంతా మానవ శ్రమ ఫలితంగానే సరుకులకు కలుగుతుంది.

ఇదే సందర్భంలో మరొక విషయాన్ని పరిశీలిద్దాం. ఒక వ్యక్తి ఒక వస్తువును తయారు చేసుకుని తన స్వంతానికి వాడుకుంటే దానిని వస్తువు అంటాము. దానిలో శ్రమ ఉంటుంది, దానికి ఉపయోగపు విలువ ఉంటుంది. అయితే దానిని అమ్మకానికి పెట్టినప్పుడు దానికి ఉపయోగపు విలువతో పాటు మారకపు విలువ వస్తుంది. దాని మారకపు విలువను డబ్బులలో చెప్పినప్పుడు అదే దాని సరాసరి ధర. మనం మార్కెట్‌లో అమ్మకాలలో, కొనుగోళ్లలో ఉన్న వస్తువుల గురించే చర్చిస్తున్నాం కావున ఉత్పత్తులను సరుకులుగానే వ్యవహరిస్తున్నాం.

మన లెక్కలన్నీ సరుకుల సరాసరి ధరలపై ఆధారపడే జరుగుతున్నాయి. అంటే సరుకులో ఉన్న శ్రమ విలువపైనే ఆధారపడి జరుగుతున్నాయి. మన సరాసరి సామర్థ్యమున్న పెట్టుబడిదారుడు అన్ని సరుకుల కొనుగోళ్లు, అమ్మకాలు వారి సరాసరి ధరలపై ఆధారపడే చేశాడని అంగీకరిద్దాం. ఆయనతో మనకొచ్చే పేచీ అంతా కార్మికుల శ్రమ శక్తిని సరుకుగా పరిగణించి దాని సృజనాత్మకతను గుర్తించకపోవడం గురించి మాత్రమే. అక్కడ నుంచే శ్రమదోపిడీ పుట్టుకువస్తుంది. బానిస వ్యవస్థలో బానిసలను సరుకుగా భావించేవారు. బానిసల కొనుగోలు, అమ్మకాలు జరిగేవి. వారు బానిస యజమాని ఆస్తిలో భాగం భూస్వామ్య వ్యవస్థలో రైతులు, వృత్తికారులుపై భూస్వామికి ఉత్పత్తి రంగంలోనే కాకుండా అన్ని రంగాలలో ఆధిపత్యం ఉండేది, ఆర్థికేతర అణచివేత (ఎక్స్‌ట్రా ఎకనమిక్ కోయర్షన్) కూడా ఉండేది. భూదాస్య రైతులు వెట్టి చేయవలసి వచ్చేది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుడిపై పెట్టుబడిదారుడికి ఎటువంటి ఆధిపత్యం ఉండదు. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థ రైతులను, వృత్తికారులను ఉత్పత్తి సాధనాల నుండి దూరం చేసింది. ఉత్పత్తి సాధనాల

నుండి దూరమైన రైతులు, వృత్తికారులు కూలీలుగా మారి తమ జీవనాధారాల సంపాదనకు పెట్టుబడిదారుడితో కాంట్రాక్టు కుదుర్చుకోక తప్పదు. అందుకే పెట్టుబడిదారుడు కార్మికుడి శ్రమ శక్తికి మార్కెట్ ధర నిర్ణయిస్తాడు. కార్మికుడు ఇతర మార్గాలు లేక చేసుకునే నష్టదాయకమైన కాంట్రాక్టునే పెట్టుబడిదారుడు స్వేచ్ఛ అంటాడు. అటువంటి కాంట్రాక్టు శ్రమ మార్కెట్ ఎగుడుదిగుడులపై ఆధారపడి ఉంటుంది అని వేరుగా చెప్పనవసరం లేదు. అందుకే కార్ల్ మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమశక్తి ఒక సరుకుగా దిగజార్చబడింది అంటాడు. సాధారణంగా కార్మికుల సప్లయి, లేబర్ మార్కెట్ డిమాండ్ కంటే ఎక్కువగా ఉంటుంది. అందుకే కాంట్రాక్ట్ బేరంలో పెట్టుబడిదారుడిదే సాధారణంగా పైచేయి అవుతుంది. అయితే కార్మికుడు తనను తాను పెట్టుబడిదారుడికి అమ్ముకోడు. 8 గంటలకు, 10 గంటలకు లేదా 12 గంటలకు పనిచేయడానికి తన శ్రమశక్తిని ఒక రోజుకు/ఒక నెలకు/ఒక సంవత్సరానికి మాత్రమే అమ్ముకుంటాడు. పెట్టుబడిదారుడు కొనేది కార్మికుడి శ్రమశక్తిని మాత్రమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమశక్తి మార్కెట్ సరుకుగా పరిగణించబడుతుంది. అది న్యాయం కాదు. కాని, అలాగే జరుగుతుంది. ఇప్పటి నుండి ప్రతిసారీ సరుకుల సరాసరి ధర అనకుండా సరుకుల ధర అనిమాత్రమే వ్యవహరిద్దాం. అర్థం మాత్రం సరాసరి ధరగానే తీసుకోవాలి.

కార్మికుడి శ్రమశక్తి విలువ

శ్రామికుని శ్రమశక్తి విలువకంటే శ్రామికుడు సృష్టించే విలువ ఎక్కువ. ఈ రెండు విలువల మధ్య వ్యత్యాసాన్నే పెట్టుబడిదారుడు దోపిడీ చేసేది. ముందుగా కార్మికుడి శ్రమశక్తి విలువను పరిశీలిద్దాం. కార్మికుడి శ్రమశక్తికి చెల్లించే ధరే వేతనం. విలువ ఉంటేనే కదా ధర ఏర్పడేది. అందుకే ముందుగా కార్మికుడి శ్రమశక్తి విలువను గణిద్దాం. ఒక కార్మికుడు 8 లేక 10 లేక 12 గంటలు పనిచేయాలంటే ఆయన జీవించాలి. అందుకు ఆహారం, వసతి అవసరమవుతాయి. భార్య సాధారణంగా కార్మికురాలుగానే ఉంటుంది. వారు కనే పిల్లలు భవిష్యత్తులో కార్మికులుగా ఉంటారు. కార్మికుని వృద్ధ తల్లిదండ్రులు కార్మికులుగానే జీవించి ఉంటారు. అంటే ఆయన కుటుంబ జీవితం కూడా పెట్టుబడిదారీ వ్యవస్థకు అవసరమే. కార్మిక కుటుంబం నడవడానికి అవసరమయ్యే తిండి, బట్ట, వసతి వంటి కనీస జీవితావసరాలు సమకూరితేనే ఆ కార్మికుడు మరుసటి రోజు 8/10/12 గంటలు పనిచేయగలుగుతాడు. అంటే శ్రమ చేయడానికి కావలసిన శక్తి లభిస్తుంది. శ్రమ చేయడానికి కావలసిన శక్తి లభించడానికి అవసరమైన కనీస వస్తు సముదాయం లేదా విలువ మొత్తాన్ని కార్మికుని శ్రమశక్తి విలువగా పరిగణిస్తారు. ఒక ఉదాహరణ చూద్దాం. పనిచేసేవారు వారిపై ఆధారపడిన పిల్లలు, వృద్ధులు మొత్తం ఐదు మంది సభ్యులు కలిగిన కార్మిక కుటుంబం ఉందనుకుందాం.

నిజానికి మనం ఒక సరాసరి కార్మిక కుటుంబాన్ని పరిశీలిస్తున్నామన్న మాట. ఈ కుటుంబానికి నెలకు కనీసం జీవితావసరాలకు 10,000 అవసరం అవుతాయనుకుందాం. ఆ కుటుంబంలో ఇద్దరు కార్మికులు ఉన్నారనుకుందాం. వారిద్దరు పనిచేయాలంటే వారి కటుంబం నడవాలి. వారి కుటుంబం నడవాలంటే నెలకు రు. 10,000 కావాలి. అంటే వారిద్దరి శ్రమశక్తి విలువ నెలకు రు. 10,000 ఒక్కొక్కరికి శ్రమశక్తి విలువ నెలకు రు. 5,000. వారిద్దరికి కలిపి రు. 10,000 చెల్లిస్తేగాని వారు పనికి రాలేరు. కార్మికులలో శ్రమచేయడానికి కావలసిన శక్తి కలిగించడానికి అవసరమయ్యే తిండి తీర్థాల ఖర్చే అంటే కార్మిక కుటుంబం కనీస అవసరాలకయ్యే కనీస జీవితావసరాల విలువనే శ్రమశక్తి విలువగా నిర్వచిస్తారు. సరాసరిగా ఈ శ్రమశక్తి విలువను మాత్రమే పెట్టుబడిదారుడు కార్మికునికి వేతనంగా ఇస్తాడు. అది ఐదువేల రూపాయలు అని గణించాము. దీనర్థం కార్మిక కుటుంబ స్థితిగతులను పరిశీలించి, అవసరాలు గుర్తించి పెట్టుబడిదారుడు వేతనం ఇస్తాడని కాదు. జరిగేదేమంటే ఆ మాత్రం సరాసరి కనీస వేతనం ఇవ్వకుంటే ఏ కార్మికుడు పనిలో చేరలేడు, చేరడు. వేతనాల బేరసారాలలో కార్మికుడు దిగిరాగలిగే కనీస బిందువు ఇది. కార్మిక కుటుంబం కనీస జీవితావసరాల విలువే కార్మికుని శ్రమశక్తి విలువ. దానిని అనుసరించే కార్మిక వేతనం నిర్ణయం అవుతుంది. అయితే, కార్మికుడు సృష్టించే విలువ తన శ్రమశక్తి విలువకంటే ఎక్కువ. దానినిప్పుడు పరిశీలిద్దాం.

మన ఉదాహరణలో పెట్టుబడిదారుడు 100 మంది కార్మికులకు నెలకు రు. 5,000 చొప్పున రు. 5 లక్షలు వేతనాలుగా ఇస్తున్నాడు. అయితే కార్మికుడి కనీస జీవితావసరాలు ఏమిటి అన్నది దేశ కాలమాన పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కుటుంబాలకు ప్రకృతి మద్దతు, సమాజం మద్దతు తగ్గిపోతున్నకొద్దీ, ప్రతీది కొనుగోలు చేయవలసి వస్తున్నకొద్దీ ఈ కనీస జీవితావసరాలు పెరుగుతుంటాయి. విద్యా, వైద్యం, తాగునీరు వంటివి ప్రైవేట్ పరమవుతున్న కొద్దీ కనీస జీవితావసరాలు పెరుగుతాయి. నగరాల పరిమాణం పెరుగుతూ పని స్థలాలకు నివాస ప్రాంతాలకు దూరమవుతున్న కొద్దీ కనీస అవసరాలు పెరుగుతాయి. దేశ అభివృద్ధి స్థాయినిబట్టి, ఉత్పత్తి సాంకేతికత పెరుగుతున్న కొద్దీ తదనుగుణంగా కనీస జీవితావసరాలు నిర్ణయమవుతూ ఉంటాయి. అయితే, కార్మికులకు ఈ కనీస వేతనం అందుతుందనే గ్యారంటీ ఏమీలేదు. అది ఒక సరాసరి పరిస్థితి మాత్రమే.

ఇంతకు ముందు చెప్పుకున్నట్లు కార్మిక శ్రమ మార్కెట్ సరుకుగా దిగజార్చబడడం వలన దాని ధర కూడా డిమాండ్, సప్లయిలపై ఆధారపడి శ్రమశక్తి విలువకు రెండు వైపులా చలిస్తుంది. జనాభా ఎక్కువగా ఉన్న సందర్భంలో, నిరుద్యోగం ఎక్కువగా ఉన్న సందర్భంలో పెట్టుబడిదారులు శ్రమశక్తి విలువకన్నా తక్కువ వేతనాలు ఇస్తారు. కనీస అవసరాలు కూడా తీరకుండా 8/10/12 గంటలు పనిచేయడం వలన కార్మికుల ఆరోగ్యం చెడిపోయి చివరికి ఆయు ప్రమాణం తగ్గిపోతుంది. అథోమానవీయ (సబ్ హ్యూమన్) పరిస్థితులు ఏర్పడతాయి. జనాభా తక్కువ ఉన్నప్పుడు, నిరుద్యోగం తక్కువ ఉన్నప్పుడు ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు బలపడి వేతనాలు శ్రమశక్తి విలువకంటే కాస్త ఎక్కువగా కూడా ఉండవచ్చు. కార్మికుల పరిస్థితి కాస్తా మెరుగ్గా ఉంటుంది. మొత్తం పైన చూస్తే శ్రమశక్తి మార్కెట్ ధర శ్రమశక్తి విలువకు అంటే కార్మిక కుటుంబం కనీస జీవనాధారాల విలువకు అటు ఇటుగానే ఉంటుంది. ఒక దేశంలో సంఘటిత, అసంఘటిత కార్మికుల వేతనాలలో వ్యత్యాసం ఉంటుంది.

(ఇంకా ఉంది)

(రచయిత విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం

చార్లెస్ డార్విన్ జీవితాన్ని, జీవి ఆవిర్భావాన్ని తెలుసుకోవడంలో ఆయన చేసిన కృషిని, పరిణామ క్రమంలో అది సాధించిన పురోగతిని ఉదాహరణలతో వివరించిన తీరును విశ్లేషిస్తున్నారు **సత్యం**

లక్షలాది సంవత్సరాల పూర్వం, ఇంకా నిర్దిష్టంగా నిర్ధారణ కాని ఒకానొక యుగంలో, భూమి చరిత్రకు సంబంధించి భూ విజ్ఞాన శాస్త్రజ్ఞులు మూడవది అని పిలిచే భూ యుగంలో అందునా ముప్పాతిక మూడు పాళ్లు ఆ యుగాంతంలో, ఉష్ణ మండలానికి చెందిన ఏదో ఒక ప్రాంతంలో - బహుశా ఇప్పుడు హిందూ మహాసముద్ర (ఇండియన్ ఓషన్) గర్భంలో కలిసిపోయిన ఒక మహా భూ ఖండంపైన - బాగా అభివృద్ధి చెందిన ఏదో ఒక ప్రాంతంలో నరరూప వానరజాతి ఒకటి ఉండేది. మన ఈ పూర్వీకులను గురించి డార్విన్ ఇంచుమించుగా సరైన వర్ణన చేశాడు. వాటికి శరీరమంతా రోమాలుండేవి. మొనలు తేలిన చెవులుండేవి. అవి చెట్లపైన గుంపులుగా నివసిస్తూ ఉండేవి. (ది డిసెంట్ ఆఫ్ మ్యాన్ అండ్ సెలక్షన్ ఇన్ రిలేషన్ టు సెక్స్ డార్విన్ రాసిన ఈ పుస్తకం 1871లో లండన్‌లో ప్రచురించారు).

చెట్లు ఎక్కడంలో చేతులు, పాదాలు భిన్నమైన పనులను నిర్వహించాల్సి ఉంటుంది. తమ జీవిత పద్ధతిని అనుసరించి చదునైన నేలపై కదలవలసి వచ్చినప్పుడు ఈ వానరీలు క్రమంగా నడకలో తమ చేతులను ఉపయోగించే అలవాటును కోల్పోయి అంతకంతకూ నిటారుగా నిలబడ్డానికి అలవాటు పడ్డాయి. వానరుడు మానవుడిగా పరివర్తన చెందే క్రమంలో ఇదే నిర్ణయాత్మక ముందంజ.

ఆహారం కోసం శ్రమపడడం, దాని వెన్వెంటనే మాట చేతులతో రాయిని, ఎముకలను, కట్టె లేదా కర్రనుయోగించడం - పై పరివర్తన ఏకకాంలో జరిగింది. చేతులకు, కాళ్ల మధ్య విభజన రేఖ గీయబడింది. 1968లో విడుదలైన '2001 స్పేస్ ఒడిస్సీ' అనే ఆంగ్ల సినిమా ప్రారంభంలో నర వానరుల మధ్య నీటి గుంట దగ్గర జరిగే ఘర్షణలో ఎముకలను ఉపయోగించిన నర వానరాల చిన్న గుంపు విజయాన్ని సాధిస్తాయి. విజయ గర్వంతో ఒక నర వానరం తన చేతిలోని ఎముకను పైకి విసురుతుంది. ఆ ఎముక (పనిముట్టు) అలా పైకి ఎగిరి స్పేస్ స్టేషన్‌గా రూపొందుతుంది. ఈనాడు ఆంథ్రోపాలజీ ఇతర శాస్త్రాలు అభివృద్ధి అయ్యాయి. మోర్గన్ తదితరులు ఆదిమ మానవులు రాతియుగం నుంచి అభివృద్ధి ఎలా జరిగిందో పుస్తకాలను రాశారు. 160 ఏళ్ల కిందటితో పోలిస్తే ఇప్పుడు మానవుడి విజ్ఞానం ఎంతో పెరిగింది. డార్విన్ పరిణామవాద సిద్ధాంతం ప్రాతిపదికపైనే నేటి ఇతర శాస్త్రాలు (ఎకాలజీ మొదలగు) పురోగతిని సాధించాయి.

చార్లెస్ డార్విన్ పరిణామవాద సిద్ధాంతాన్ని ఖండిస్తూ ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో ఆయన సిద్ధాంతాన్ని, జీవితాన్ని జ్ఞాపకం చేసుకోవడం ఎంతైనా అవసరం. ఆయన సిద్ధాంత పత్రాన్ని లిన్నేయస్ సొసైటీలో చదివి 160 సంవత్సరాలు పూర్తయ్యాయి. జె.డి. బెర్నల్, డార్విన్ పరిణామవాద సిద్ధాంతాన్ని ఈ కింది విధంగా పేర్కొన్నాడు.

చార్లెస్ డార్విన్ - జీవ పరిణామ సిద్ధాంతం

వివిధ రకాల జంతువులు ఒకదాని నుండి మరొకటి ఏ విధంగా వంశానుగత సంతతిగా పరిణామం చెందాయో వివరించే న్యాయబద్ధమైన పద్ధతులు రుజువు దొరికేవరకు ప్రాచీన మతం, మంత్రకట్టు లేక వశీకరణను చేదించడం సాధ్యం కాలేదు. అటువంటి రుజువును వ్యవస్థను చార్లెస్ డార్విన్ తన ప్రకృతివరనము లేక ప్రకృతి సహజ ఎంపిక అనే పుస్తకం ద్వారా అందించాడు. ఎరాస్మస్ డార్విన్ మనవడైన చార్లెస్ డార్విన్ విక్టోరియన్ పెట్టుబడిదారీ విధానం ప్రభావంతో (అనుబంధ ఉత్పత్తి) ఎదిగినవాడు, స్వతంత్ర భావాలు, సాధనాలు కలిగిన వ్యక్తి. 'బీగిల్' అనే ఓడలో 1831 - 1836 వరకు ప్రపంచ యాత్ర సాగించిన తర్వాత డార్విన్ డౌన్ హౌజ్‌లో తన అధ్యయన గదిలో, తన తోటలో స్థిరపడి ఆరిజిన్ ఆ స్పీషీస్ (జాతుల పుట్టుక) అనే అంశం మీద ప్రకృతిలోని కదలికలు, మార్పులను క్షున్నంగా, జాగ్రత్తగా సూక్ష్మమైన విషయాలను కూడా అధ్యయనం చేశాడు.

గాలాపాగోస్ వంటి ఏకాకిగా ఉన్న ద్వీపాలలో చాలా అరుదుగా ఉన్న (స్పీషీస్) జాతుల లభ్యత గురించి డార్విన్ చేసిన అధ్యయనంలో జాతులలో ఉన్న సమస్య ప్రత్యేకించి ఆయనను ఆకట్టుకుంది. అటువంటి జాతులు మెయిన్‌లాండ్ (మాతృ భూమి) మీద ఉన్న పూర్వీక జాతుల నుండి సంతతిగా వచ్చాయి కాని ఎందుకో వేరుగా పెరిగాయి అని ఊహించుకోవాలని డార్విన్‌కి గట్టిగా కోరిక కలిగింది. కానీ అది ఎందుకు, ఎట్లా జరిగింది? ఇతర లక్షణాల కంటే కొన్ని లక్షణాలకు అనుకూలంగా ఉన్న వాటి జీవన పరిస్థితుల వల్ల ఇది సంభవించిందా? మనుషుల ఆర్థిక జీవితంలో ఉండే పోటీ పరిస్థితులు జంతు ప్రపంచానికి కూడా వర్తిస్తాయా, దానికి అవకాశం ఉందా అని ఆయన ఆలోచించడం మొదలు పెట్టాడు. పెట్టుబడిదారీ దోపిడీని సమర్థించే సంపూర్ణంగా వివరించిన సిద్ధాంతం ఆయన చేతికి దొరికింది. మాల్థస్ సిద్ధాంతం ప్రకారం జీవితం ఒక పోరాటం, దానిలో ఉత్తములు, బలవంతులు బతుకుతారు. ఆ పోరాటంలో నీతికి, సుకృతానికి లభించే బహుమతులు సంపద, అధికారం. జబ్బులు, యుద్ధాలు అనేవి అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలు పొట్టనింపగలిగిన వారికంటే ఎక్కువగా ఉన్న జనాభాను అదుపులో ఉంచే సాధనాలు. ఇదే విధంగా జంతు సమాజాలలో కూడా జరిగినట్లయితే గనుక పర్యావరణానికి బాగా అనుకూలంగా ఉండే జాతులు ఆ మంచి లక్షణాలను తమ సంతతికి వారసత్వంగా ఇస్తాయి, క్రమంగా మనం ఇప్పుడు చూస్తున్న జాతులు పరిణామం చెందుతాయి అని డార్విన్ ఆలోచించాడు. ఆకలిగొన్న 40వ దశాబ్దం (హంగ్రీ ఫార్టీస్) ఈ దుర్గోచర విషయం జరుగుతున్నప్పుడు దానిని పరిశీలించడానికి సరైన సమయంగా ఉండింది.

ప్రకృతి వరణం లేక ప్రకృతి సహజమైన ఎంపిక

అయితే డార్విన్ చాలా జాగ్రత్తపడి ఈ ఆలోచనను ప్రచురించకుండా ఆగాడు. దానికి రుజువులను సేకరించడానికి 20 ఏళ్లు గడిపాడు. ఆ రుజువులను ప్రకృతి చరిత్ర అన్ని కోణాల నుండి సేకరించాడు – రాళ్ల చరిత్ర వాటి గత యుగాలలో వాటి రూపం క్రమంగా విస్తరించడాన్ని తెలిపింది, ప్రపంచంలో జంతువులు, వృక్షాలు వివిధ ప్రాంతాలలో విస్తరించి ఉండడాన్ని అధ్యయనం చేశాడు. చివరగా 19వ శతాబ్దంలో జరుగుతున్న (ది గ్రేట్ బ్రీడింగ్) ప్రజనన ప్రయోగాలను అధ్యయనం చేశాడు. ఆ ప్రయోగాలు పాక్షికంగా కుక్కలు, పావురాల సంఖ్యను పెంచడానికి పాక్షికంగా వాటిలో అందంగా నాణ్యంగా ఉండే మేలైన జాతులను ఉత్పత్తి చేయడానికి సాగించారు. ఈ ప్రయోగాల ద్వారా డార్విన్‌కి పరిణామంలో జరిగిన మార్పుల వంటి విచిత్రమైన మార్పుల ఉదాహరణలు దొరికాయి. అయినప్పటికీ ఆయన తన సిద్ధాంతాన్ని ప్రచురించి ఉండేవాడు కాదు. ఆల్ఫ్రెడ్ రసెల్ వాలేస్ (1823 – 1913) అనే మరొక యువ యాత్రికుడు ఈస్ట్ ఇండీస్‌లో జంతువుల లభ్యత గురించి చేసిన అధ్యయనం ద్వారా జీవ జాతుల పరిణామ క్రమం అనే ఆలోచన లేక సిద్ధాంతాన్ని స్వతంత్రంగా ప్రచురించిన తర్వాత డార్విన్ తన సిద్ధాంతాన్ని 'ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్' గ్రంథంగా 1859లో ప్రచురించాడు.

చార్లెస్ డార్విన్ జీవిత సంగ్రహం

1809 – ఫిబ్రవరి 12 చార్లెస్ రాబర్ట్ డార్విన్ ఇంగ్లాండులోని ష్రేస్‌బరీలో జన్మించాడు.

1818 – డార్విన్ ష్రేస్‌బరీలో ఒక స్కూల్లో బోర్డర్‌గా చేరాడు.

1825 – వైద్యశాస్త్రం చదవడానికి డార్విన్ ఎడిన్‌బరో యూనివర్సిటీలో చేరాడు.

1826 – డార్విన్ మొదటి సారిగా తన సైంటిఫిక్ పేపరని నేచురల్ హిస్టరీ యూనిర్సిటీలో చదివాడు.

1828 – చార్లెస్ డార్విన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ పట్టా తీసుకున్నాడు.

1831 – ఆగస్టు 29, డార్విన్ వయస్సు 22 సంవత్సరాలు. అతను హెచ్ఎమ్ఎస్ బీగిల్ (షిప్) లో అన్‌పెయిడ్ నాచురలిస్ట్‌గా ఆహ్వానం అందుకొన్నాడు. డార్విన్ సెప్టెంబర్ మొదట్లో క్యాప్టెన్ ఫిట్స్‌రీయ్‌ని కలిసి ఆ ఉద్యోగాన్ని (పోస్ట్) అంగీకరించాడు. డిసెంబర్ 27న సౌత్ అమెరికాకు ప్రయాణం.

1832 – బీగిల్ ప్రయాణం ప్రారంభమైంది. దక్షిణ అమెరికా తూర్పు తీరానికి వెళ్లిరావడానికి ప్రయాణమయ్యాడు. ప్రధాన రేవు పట్టణాలైన సాల్వడార్ రియోడి జనిరియో, మాంటి ఎవిడియో, టెర్రాడెల్ ఫ్యీగో ప్రాంతాలు ఈ ప్రయాణంలో భాగమయ్యాయి. డార్విన్ 1833లో పాంటా అట్లా, అర్జెంటినాలో ఫాసిలైజ్డ్ జేంట్స్‌ను కనుగొన్నాడు.

1834 – పసిఫిక్‌లో బీగిల్ ప్రవేశించింది.

1835 – సెప్టెంబర్ 15 సౌత్ అమెరికా పశ్చిమ తీరం ప్రయాణం పుర్తయిన తర్వాత, బీగిల్ గాలపాగోస్ ఆర్చిపిలాగోకి చేరింది. అక్టోబర్ 20 వరకు అక్కడే ఉన్నాడు.

1835 – బీగిల్ మాతృదేశానికి బయలుదేరింది. న్యూకోలాండ్, అస్ట్రేలియా, హిందూ మహా సముద్రం, కేప్ ఆఫ్ గుడ్ హోప్‌ల నుండి ఇంగ్లాండుకు 1836 అక్టోబర్ 2న చేరింది.

1837 – లండన్‌లో బసచేశాడు. పంటా అట్లాలో, గాలపాగోస్‌లో చూసిన వాటితో ఉత్తేజితుడయ్యాడు. స్పిసీస్ ఎవల్యూషన్‌ని అధ్యయనం చేయడం ప్రారంభించాడు. 28 వయస్సులో అనారోగ్యం అతని కృషికి అడ్డంకి అయింది.

1838 – డార్విన్ మాల్థస్ పాపులేషన్‌ను చదివాడు. స్వేచ్ఛాయుత పోటీ స్పిసీస్ తమ మనుగడకు పోరాటం చేస్తాయని వాటి పరిణామానికి ఆ పోరాటానికి సంబంధం ఉందని గమనం లోకి తీసుకున్నాడు.

1839 – చార్లెస్ డార్విన్ అతని కజిన్ విమ్మవెడ్జ్ వుడ్‌ని వివాహం చేసుకున్నాడు. ఆరోగ్యం కొంత క్షీణించింది. అతని జర్నల్ ఆఫ్ వోయోజ్ ప్రచురించారు.

1842 మే – డార్విన్, స్పిసీస్ సిద్ధాంతం పెన్సిల్ స్కెచ్‌ని రాయడం ప్రారంభించాడు. సెప్టెంబర్ కెంట్‌లోని డౌన్‌హౌస్‌కు తరిలాడు.

1844 – స్పిసీస్ థీయరీ లాంగర్ వర్షన్‌ని రాయడం ప్రారంభించాడు.

1846 – డార్విన్ (ఎనిమిదేళ్ల) బర్నాక్లస (సీ ఎనిమిల్) పై అధ్యయనం ప్రారంభించాడు.

1856 – ప్రకృతావరణంతో పరిణామ సిద్ధాంతాన్ని ఔట్‌లైన్‌ని ఒక పెద్ద గ్రంథంగా రాయడానికి ఉపక్రమించాడు.

1858 – వాలెస్ ఉత్తరం డార్విన్‌కి చేరింది. డార్విన్ సిద్ధాంత పత్రాన్ని వాలెస్ పేపర్‌నా లిన్నేయస్ సొసైటీలో చదివారు. డార్విన్ ఆరిజిన్ ఆఫ్ స్పిసీస్‌ను రాయడం ప్రారంభించాడు. ఆ పేపర్ మతం పైన బాంబును పేల్చింది.

1859 – నవంబర్ 24 – లండన్‌లో ఆరిజిన్ ఆఫ్ స్పిసీస్ గ్రంథాన్ని ప్రచురించారు.

1860 – ప్రొఫెసర్ టి.హెచ్. హక్సలీ (డార్విన్ బుల్‌డాగ్) బిషప్ వితబర్‌ఫోర్స్‌కు ఆక్స్‌ఫర్డ్ చర్చల్లో పరాజయాన్ని చవి చూపించారు. అది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్ బ్రిటిష్ అసోసియేషన్ వార్షిక సమావేశం.

1862 – ఆర్చిడ్ పోలినేషన్ గ్రంథం వెలువడింది.

1864 – భూగర్భ శాస్త్రం, జీవశాస్త్రం, వృక్ష శాస్త్రంలలో డార్విన్ కృషికి రాయల్ సొసైటీ కోప్లే పతకాన్ని బహుకరించింది.

1868 – 'వేరియేషన్ ఆఫ్ ఎనిమల్స్ అండ్ ప్లాంట్స్ అండర్ డొమిస్టికేషన్' గ్రంథాన్ని ప్రచురించారు.

1871 – 'డిసెంట్ ఆఫ్ మ్యాన్' గ్రంథం ప్రచురించారు.

1872 – 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ది ఎమోషన్స్ ఆఫ్ మ్యాన్ అండ్ ఎనిమల్స్' పుస్తకం ప్రచురించారు.

1881 – డార్విన్‌కు 72 ఏళ్లు. అతని చివరి పుస్తకం 'ది ఫార్మెషన్ ఆఫ్ వెజిటెబుల్ మౌల్డ్, ది ఆక్షన్ ఆఫ్ వార్మ్స్' ప్రచురించారు. డిసెంబర్ – లండన్‌లోని ఒక స్నేహితుడిని కలవడానికి వెళ్లినప్పుడు గుండెపోటు వచ్చింది. కోలుకున్నాడు.

1882 – ఏప్రిల్ 19న చార్లెస్ డార్విన్ (73) జౌన్‌లో మరణించారు. ఏప్రిల్ 26న ఇంగ్లాండు నేషన్ ఆయన గౌరవ సూచకంగా లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ అబ్బేలో ఖననం చేశారు.

ఫ్రెడరిక్ ఎంగెల్స్ – జె.డి. బెర్నాల్ – ఓరియంట్ లాంగ్‌మెన్ పుస్తకాల ఆధారంగా.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

మార్క్స్ దృష్టిలో పరాయీకరణ

మార్క్స్ చేసిన సామాజిక విశ్లేషణల్లో అత్యంత మౌలికమైనదైన పరాయీకరణ సిద్ధాంతం గురించి వివరిస్తున్నారు

లోకే రాజ్‌పవన్

ఆదిమమానవ స్థితి నుంచి నాగరికత పరిణామం చెందే క్రమంలో మానవులు తమ స్వభావం నుంచి పరాయీకరణ చెందుతారని అనేక మంది చరిత్రకారులు అభిప్రాయపడినారు. పరాయీకరణం అనగా వ్యక్తులు తనపై వస్తున్న అనేక ఒత్తిడులకు సంక్షోభాలకు సమస్యలకు కలతచెంది, సంక్లిష్ట జీవన పోరాటంతో విసుగుచెంది సంఘం నుంచి దూరమవడం. ఆధునిక సమాజంలో పారిశ్రామికీకరణతోను పెట్టుబడిదారి వ్యవస్థలోని ఆధునిక సాంకేతిక యాంత్రిక పని ప్రక్రియలతోను మనుషులు తమ చుట్టు ఉన్న సమూహాలతో తమ ఇష్టాఇష్టాలతో దూరంగా బతికే పరిస్థితికి నెట్టివేయబడుతున్నారు. నిరంతరం ఆర్థిక కార్యకలాపాలలో నిమగ్నమైపోయి తమగురించి తాము ఆలోచించుకునే వ్యవధిని కూడా కోల్పోయారు. అంటే మనుషులు తమ నుంచి తామే స్వీయ పరాయీకరణకు గురవుతారు.

నేటి సమాజం ఎంతో సంక్లిష్టమైంది. అంటే అన్నివైపుల నుండి ఒత్తిడులు వ్యక్తి స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయి. సమాజంలో చిన్నస్థాయి నుంచి ఉన్నతస్థాయికి పెరిగేకొద్ది ఆర్థికపరమైన లేదా వాణిజ్య సంబంధమైన అనేక సమస్యలు ఒకదానితో మరొకటి కలగాపులగమై సంక్షోభ స్థితిని, సమస్యను జటిలమయ్యే విధంగా పరిస్థితులను కల్పిస్తున్నాయి. నాగరికతా క్రమంలో సమాజం ఎల్లలు విస్తృతమై ఉత్పాదనా నైపుణ్యంపై ఆధారపడి దానికి ప్రగతి తోడైన సందర్భంలో మానవులు సమాజానకి ఉత్పత్తిని అందించడం ప్రారంభమైంది. ఈ ఉత్పత్తిని పెంపొందించడంలో, నిర్వహించడంలో మనిషికి నిరంతర శోధన అవసరమవుతుంది. ఉత్పత్తి ఎప్పుడైతే సరుకుగా మారి డబ్బు రూపంలోకి వచ్చిందో, తదనంతర కాలంలో డబ్బు కేంద్రీకరణ ప్రారంభమై కొందరు పెట్టుబడిదారులుగా మారి మానవులను శ్రామికులుగా ఉపయోగించుకుని వాళ్ల శ్రమను దోపిడి చేస్తూ వచ్చారు. ఈ సందర్భంలో మానవులు తమకు పరిచయమున్న వృత్తులలో నిమగ్నమై పోయినందున తమనుతాము పరిశీలించుకునటకు సమయం దొరకలేదు. ఈ క్రమంలోనే మానవులు తమ పని స్థలాలలో ఒంటరిగా ఆలోచించే సగటు మనిషిగా మిగిలిపోయి సమాజానికి దూరమవుతున్నారు. సమాజంలో వ్యక్తులు ఒకరినొకరు కలుసుకునే సమయం లేక ఒంటరిగా సమాజం నుండి వేరు పడిన వారుగా ఒంటరి జీవితంను గడపవలసి వస్తున్నది. వ్యక్తి చుట్టు ఉన్న పరిస్థితులు వ్యక్తిని యాంత్రిక దృక్పథంతో నడిపిస్తూ సామాజిక విలువలకు దర్శనాలకు దూరంగా ఉంచుతూ పరాయీకరణను పెంపొందిస్తున్నాయి. వ్యక్తి అభద్రత, అరక్షణ, అవ్యవస్థీకరణ, అసమగ్రత, క్షీణత, అస్థిరత్వం మొదలైన సమస్యల వలయం చుట్టు తిరిగే పరిస్థితులు అధికమవడం పరాయీకరణ భావన విస్తృతిని మరింత పెంచుతున్నాయి.

పరాయీకరణ భావన మూలాలు తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రం, అర్థ శాస్త్రం యొక్క ప్రాథమికాంశాలలో ఉన్నాయి. కనుక శాస్త్రీయమైన విషయ పరిజ్ఞానం లేకుంటే పరాయీకరణను సరిగా అర్థం చేసుకోవడం కష్టమవుతుంది.

పరాయీకరణ భావనను పూర్తిగా యాంత్రికమైన అర్థంలో కొందరు బూర్జువా సామాజిక సిద్ధాంతకారులు విశ్లేషించారు. దాన్ని పరాయీకరణకున్న పాజిటివ్ కోణంగా పేర్కొంటూ వచ్చారు. ఇందుకు సమర్థింపుగా కొన్నిసార్లు గతితార్కిక నియమాలను కూడా ఉటంకిస్తూ వచ్చారు. మనందరికీ తెలిసిన నియమం గతితార్కిక నియమాల్లో ఒకటైన 'అభావం అభావం చెందడం' (నెగేషన్ ఆఫ్ నెగెషన్). అంటే ప్రతిదీ దానికంటే ముందున్నదాన్ని నాశనం చేసి ఏర్పడుతుంది అని మొత్తంగా దాని భావం. తరచూ దీనికి ఉదాహరణగా మనం విత్తనాన్ని పోగొట్టి చెట్టువస్తుందని, గుడ్డును పోగొట్టి పిల్ల వస్తుందని చెప్తుంటాం. ఇది మానవ పరిణామ క్రమాన్ని కూడా వివరించే అద్భుతమైన నియమం. ఈ పరిణామ క్రమంలో ఏర్పడ్డ అనేక దశలూ ఈ నియమంపైన ఏర్పడినవే. ఈ నియమం పాత దశ అభావం చెందడం లేదా నాశనం గురించి చెప్తే ఆ దశలోని మనిషి కొత్త స్థితిలోకి మారడం లేదా రూపాంతరం చెందడం వల్ల కొత్త దశలోకి రావడమనే మార్పులో అంతర్లీనంగా పరాయీకరణ భావన ఉన్నదనే విషయాన్ని మనం గ్రహించాలి. ఈ మార్పు అనేకసార్లు అవసరమైన, అభివృద్ధికరమైన మార్పుగా కూడా జరిగిందని మనకు తెలుసు. ఇదీ వాళ్ల విశ్లేషణ. ఒక ఉదాహరణగా చెప్తే మనిషి ఆదిమదశలో చెట్ల ఆకులు తినేవాడు. ఆ దశ నుంచి కాయలు, పండ్లు తినేదశకు చేరుకున్నాడు. అలాగే పచ్చి మాంసం తినే దశ నుంచి అగ్గి కనుగొన్నాక కాల్చుకుని తినేదశకు వచ్చాడు. ఈ దశలను గమనిస్తే ఆకులు తినే దశను అభావం చెందించి పండ్లు తినే దశ వచ్చింది. పచ్చి మాంసం తినేదశను అభావం చెందింది కాల్చుకుని తినేదశ ఏర్పడింది. ఈ దశలో మనిషి పాత్రను మనం గమనిస్తే మనిషి తన జ్ఞానం ద్వారా, శ్రమ ద్వారా కొత్త దశకు చేరుకున్నాక అప్పటివరకు ఉన్న పాత దశ పరిస్థితులతో, శ్రమతో, సాధనాలతో, శ్రమచేసే పద్ధతులు విధానాలతో పరాయీకరించబడ్డాడు. ఆకులు తినే దశలో గనుక మనిషి పరాయీకరించబడి ఉండకపోతే పండ్లుతినే దశ అభివృద్ధి కరమైన దశగా ఏర్పడి ఉండదు. కాల్చడం తెలిశాక పచ్చి మాంసాన్ని వద్దనుకున్నాడు గనుక మనిషికి కాల్చిన మాంసంలోని సౌకర్యం అందింది. అట్లాగే మొదట్లో నగ్నంగా తిరిగిన మనిషి క్రమంగా చెట్ల ఆకులు చుట్టుకోవడం, ఆ తర్వాత బట్టలను నేసి వేసుకోవడం చేశాడు. ఈ క్రమంలో ఆకులు చుట్టుకోవడం తెలిశాక నగ్నత్వ దశ నుంచి పరాయీకరించబడ్డాడు. బట్టలు నేయడం, తయారు చేయడం తెలిశాక ఆకులు చుట్టుకునే దశ నుండి పరాయీకరించబడ్డాడు. అంటే ఆయా ముందు దశలలో పరాయీకరణ జరిగి ఉండకపోతే నేడు ఈ తరాలకు బట్టల తయారీ, స్పృహ అందకపోవును. కనుక వాళ్ల ప్రకారం ఇక్కడ పరాయీకరణ లక్షణం లేదా స్వభావం ఏమిటంటే మనిషిని అభివృద్ధికరమైన మార్పులో కొనసాగేలా చేయడం. అంటే పరాయీకరించ

బడడం అనేది మనిషికి లాభాన్ని, ప్రయోజనాన్ని చేకూరుస్తున్నదని, ఇది పరాయీకరణకున్న పాజిటివ్ కోణమని. చాలా మంది తత్వవేత్తలు, సిద్ధాంత కర్తలు పరాయీకరణను కేవలం వ్యతిరేకార్థంలోనే చూస్తూ అందులోని చెడును విశ్లేషిస్తూ వచ్చారు కాని, పరాయీకరణలోని పాజిటివ్ అంశంగా అభివృద్ధికరమైన మార్పును పొందడమనే భావనను విస్మరించారని వాళ్లు వాదిస్తూవచ్చారు. అయితే దీనికి కొనసాగింపుగా వివిధ ప్రాంతాల సామాజిక పరిస్థితులు, రాజకీయార్థిక పరిస్థితులు మారిన తర్వాత ముఖ్యంగా మనిషికి స్వంత ఆస్తిమీద ఆలోచన ఏర్పడ్డాక పరాయీకరణ దానికున్న పాజిటివ్ స్వభావాన్ని క్రమ క్రమంగా కోల్పోతూ వచ్చిందని, ఆ పరిస్థితులు రానురానూ నేటి పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థలు ఏర్పడడం లాంటి దుర్మార్గమైన పరిస్థితులుగా తయారవుతుండడంతో పరాయీకరణ అర్థం కూడా నెగెటివ్ అర్థాన్నే ఎక్కువగా సంతరించుకుంటూ వస్తున్నదని చెప్పి వాళ్ల పరాయీకరణ భావనను మార్క్సిస్టు పరాయీకరణ భావనతో అతికించారు.

ఆంత్రోపాలజీలో మానవ పరిణామక్రమాన్ని వివరించే ఫిజికల్ ఆంత్రోపాలజిస్టులు పరాయీకరణ భావనను పై సిద్ధాంతవేత్తల వలెనే జీవపరిణామ క్రమంలోని ఒక భాగంగా చూస్తూవచ్చారు. వారి ప్రకారం ఆటవిక యుగంలోని తొలి దశలో మానవులు పళ్లు, కాయలు, దుంపలు తిని బతికేవారు. తరచు క్రూర జంతువుల భారినపడి బలవుతుండేవారు. అందుకే వాటి నుంచి తప్పించుకోవడానికి వలసపోయేవారు. మధ్య దశకు వచ్చేనాటికి ఒరిపిడి ద్వారా నిప్పులను కనుగొన్నారు. దాంతో ఆహారపు అలవాట్లలో మార్పు వచ్చింది. పాత ఆహారం స్థానంలో కాల్చితినే, ఉడికించితినే ఆహారం వచ్చి చేరింది. చేపలు, పీతలు, నత్తలు, దుంపలు, కాయలు మొదలైన వాటిని ఆ విధంగా తినే కొత్త అలవాటు ప్రారంభమైంది. ఇక్కడ పచ్చివి తినే పనిని తీసేస్తూ నిప్పును వాడి తినేపని వచ్చి చేరింది. ఈ దశలోనే జంతువుల నుంచి తనను తాను రక్షించుకోవడానికి మోటైన, పదునుచేయని రాతి పనిముట్లను మనిషి తయారు చేసుకున్నారు. ఆటవిక దశలోని చివరి దశలో పదునైన ఆయుధాలు విల్లు, నారి, అంబు వంటి ఆయుధాలు తయారు చేయడం నేర్చుకున్నారు. అంటే పాత ఆయుధాలను పోగొడుతూ ఈ కొత్తవి వచ్చి చేరాయి. ఈ ఆయుధాల వల్ల చాలా మార్పు జరిగింది. వేట ద్వారా జంతువులను సులభంగా చంపడం ప్రారంభమైంది. దీనివల్ల తనకు రెండు రకాల లాభాలేర్పడ్డాయి. మొదటిది జంతువులకు భయపడుతూ చాలా దూరం వలస వెళ్లే కష్టంపోయి తక్కువ దూరాల వలసలు మొదలవడం. కొన్నిచోట్ల ఇళ్లు కట్టుకుని స్థిర నివాసాలు ఏర్పడడం. రెండోది చంపిన జంతువుల రూపంలో ఆహారం అధికంగా లభించడం. జీవనాధార ఉత్పత్తుల్లో కూడా కొత్త వాటిని తయారు చేయడం జరిగింది. అంటే వేట, ఆహారం విషయంలో కొత్త పనులవైపు వెళ్లడం వలన పాత వాటి నుంచి మానవుడు పరాయి అయిపోయాడు. రెండో యుగం అయిన అనాగరిక యుగంలోని తొలి దశలో అంతకుముందున్న కొయ్య లేదా చెక్క వంటి పాత్రలు పోయి మట్టి పాత్రలు లేదా కుండలు వచ్చాయి. అప్పటిదాకా పశువులను అప్పటికప్పుడు చంపి తినడం స్థానంలో ఈ దశలో పశువులను మచ్చిక చేసుకోవడం ప్రారంభమైంది. కొన్ని ప్రాంతాలలో మొక్కజొన్న లాంటి పంటలు పండించడం ప్రారంభమైంది. అంటే వంట విషయంలో, పశువుల విషయంలో మానవులు పాత పనుల నుంచి పరాయి అయ్యారు. మధ్య దశలో పశువుల మచ్చిక, వ్యవసాయం విస్తృతమైనాయి. పోడు వ్యవసాయం ప్రారంభమైంది. పశువులను మందలుగా పెంచడం ప్రారంభమైంది. పశువుల మేత కోసం ప్రారంభించిన ధాన్యం పండించడం క్రమంగా మానవుల ఆహారంలో ప్రధాన భాగమైంది. ఈ దశదాకా కొనసాగిన మానవ భక్షణం, ఇతర ఆహారాలు సమృద్ధిగా దొరకడంతో ఈ దశ నుండి తగ్గిపోయింది. చివరి దశలో ఇనుమును కనుగొనడం, ఆయుధాలు, పనిముట్లు తయారు చేసుకోవడం, రాతి పనిముట్లు, ఆయుధాలను వదిలేయడం జరిగింది. అడవులను నరికి పచ్చిక బయళ్లుగా మార్చి వ్యవసాయం అధికంగా చేయడం ప్రారంభమైంది. ఇలా రాతి వస్తువుల నుంచి, వ్యవసాయనికి నిరుపయోగమైన పరిస్థితుల నుంచి మానవులు పరాయీకరించబడ్డారు. ఇనుము వాడుకంలోకి రావడం అనేది చాలా పెద్ద సంఖ్యలో పాత పనుల నుంచి మనిషిని పరాయీకరించింది.

పై విషయమంతా గమనిస్తే మానవులు ఆటవికదశ నుంచి అనాగరిక దశ పూర్తయ్యే వరకు పాత వాటిని వదిలేస్తూ క్రమక్రమంగా కొత్తవాటిని ఉపయోగిస్తూ వచ్చారు. ఇవన్నీ అనాగరికత నుంచి నాగరికత వైపు జరిగిన ప్రయాణాలు. జ్ఞానం అభివృద్ధి చెందని కాలం నుంచి జ్ఞానవంతుడయ్యే వైపు జరిగిన ప్రయాణాలు. ఆయా దశలలో మానవులు పాతవాటితో పరాయీకరణ చెందుతూ పోవడం వల్ల ఇవన్నీ సులభంగా, వేగవంతంగా జరుగుతూ వచ్చాయి.

కుటుంబ వ్యవస్థ ఏర్పడిన తర్వాత పరాయీకరణకు నెగెటివ్ పార్శ్వం ఏర్పడిందని వాళ్లు చెప్తారు. అప్పటివరకూ సమూహాలుగా జీవించిన మనిషి క్రమంగా కుటుంబంగా బతకడం ప్రారంభించాడు. 'తన సొంత కుటుంబం' అనే భావన ప్రారంభమై బలపడింది. ఎక్కడికక్కడ కుటుంబాలు ఏర్పడ్డాయి. కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యాలు, పరస్పర సహకారాలు ఏర్పడడం, అలాగే శత్రు సంబంధాలు ఏర్పడడం ప్రారంభమైంది. రక్త సంబంధీకుల కుటుంబం, దంపతి కుటుంబం, జంట కుటుంబం వంటి రకరకాల కుటుంబాలు ఏర్పడ్డాయి. లైంగిక సంబంధాలలో నియమ నిబంధనలు ఏర్పడ్డాయి. అప్పటిదాకా సమూహ జీవనం, విశృంఖల లైంగిక సంబంధాలు గడిపిన మనిషి వాటినుంచి పరాయీకరించబడి కుటుంబంగా ఏర్పడడం, లైంగిక నియమావళిని ఏర్పరుచుకోవడం ఆవశ్యకమైన నాగరిక మార్పు. అయితే సమూహం నుంచి కుటుంబంగా ఏర్పడే దశలో మనిషిలో స్వార్థం ప్రవేశించింది. సమూహ భావన కుంచించుకుపోయి కుటుంబంగా మారింది. అంటే మనుషులు విశాలతత్వం నుంచి సంకుచితత్వం వైపుకు వచ్చారు. ఇది పరాయీకరణ నెగెటివ్ పార్శ్వం. కుటుంబాలు ఎప్పుడైతే ఏర్పడ్డాయో అప్పటి నుంచి పరాయీకరణ చెడు ప్రభావాలు ప్రారంభమైనాయని చాలా సందర్భాలలో కనిపించింది. ఈ కుటుంబ వ్యవస్థే తర్వాత కాలంలో క్రమంగా స్వంత ఆస్తి అభివృద్ధికి కారణమైంది. ఇదీ ఫిజికల్ ఆంత్రోపాలజిస్టుల దృష్టిలో పరాయీకరణ భావన. కానీ ఇది పూర్తిగా అసమగ్రమైన భావన. భౌతికమైన జీవపరిణామక్రమంలో జరిగే దశలన్నిటినీ పరాయీకరణ భావనకు ఆపాదించి చెప్పడం ఆ భావనకు సమగ్రమైన అర్థాన్నివ్వదు.

ఇక సోషల్ కాంట్రాక్ట్ సిద్ధాంతవాదుల భావనలో పరాయీకరణ అర్థాన్ని ఇప్పుడు చూద్దాం. రాజ్య వ్యవస్థ ఏర్పడ్డ తర్వాత రాజు ప్రజలను పరిపాలించే నాయకుడు అయ్యాడు. కానీ ప్రపంచం మొత్తంలోని ఏ రాజ్య వ్యవస్థలో రాజైనా ప్రజల పట్ల నిరంకుశంగానే వ్యవహరించాడు. విపరీతమైన శిస్తులు, పన్నులతో ప్రజల సొమ్ము దోపిడీ చేయబడేది. కాలక్రమంలో ఉత్పత్తి సాధనాలు అభివృద్ధి చెందినా కూడా వాటి ఫలితాన్ని ప్రజలకు అందకుండా రాజు దోచుకునేవాడు. మనిషికి సహజంగా ఉండే అనేక మానవ హక్కులు రాజు పరిమితాధికారులు లోబరుచుకున్నారు. మనిషి ఎలా ఉండాలో, ఏం చేయాలో రాజ్యం,

రాజ్య యంత్రాంగం నిర్ణయించేవి. రాజు దైవాంశ సంభూతుడని లేదా రాజుకు సార్వభౌమత్వం ఇవ్వబడిందని కనుక అతని అధికారాన్ని ప్రశ్నించ వీలులేదనే దబాయింపుతో రాజు ప్రజలపై నిరంకుశాధికారాలు చెలాయించేవాడు. దాంతో మనిషి రాజరిక వ్యవస్థలో తినేతిండి, మాట్లాడే మాట మొదలు చాలా రకాల ప్రాథమిక రక్షణల నుంచి పరాయీకరించబడుతూ వచ్చాడు. వ్యక్తికి స్వేచ్ఛ లేకపోవడమనే పరిస్థితి అతి సాధారణం కావడం అయిపోయి జీవించే పరిస్థితులను కోల్పోయిన మనిషి పరాయీకరణలోకి దుర్మార్గమైన ప్రభావాలను రాజరిక వ్యవస్థలో అనుభవించాడు. ఇక్కడ సోషల్ కాంట్రాక్ట్ అనే సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని గురించి ఒకసారి చర్చించుకోవాలి.

పురాతన ప్రాకృతిక వ్యవస్థలో దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ ఉన్న మానవులు ఆ దశ నుంచి మార్పు చెందడం కోసం అందరూ కలిసి ఒక ఒడంబడిక చేసుకున్నారు. ఈ ఒడంబడిక ద్వారా సమాజ శ్రేయస్సు లక్ష్యంగా రాజ్యం ఏర్పడింది. సమాజంలోని ప్రతివ్యక్తి ఎదుటి వ్యక్తితో 'నన్ను నేను కాపాడుకునే హక్కును ఫలాన వ్యక్తి లేదా కొందరు వ్యక్తుల కూటమికి ఇచ్చాను. అలాగే నువ్వు కూడా నీ హక్కును ఆ వ్యక్తికిచ్చి అతనికి ఆధీనంగా ఉండడానికి సమ్మతించవలెను' అని ఒప్పందం చేసుకుంటాడు. అట్లా మానవులు తమ సహజమైన హక్కులను ఒక ప్రత్యేక వ్యక్తికి గానీ, వ్యక్తుల సమూహానికి గానీ ఇచ్చివేసి అతని ఆధీనంలో ఉంటారు. వారి ఆస్తిని, ప్రాణాలను కాపాడడానికి తగిన ఏర్పాటు చేసుకుంటారు. ఈ వ్యక్తే సార్వభౌముడు. ఈ ఒడంబడిక ద్వారా సార్వభౌమునికి ప్రజలను కాపాడే అధికారం లభిస్తుంది. ఇక ఈ సామాజిక ఒడబండిక సిద్ధాంతాన్ని వివిధ తత్వవేత్తలు వేర్వేరు రకాలుగా విశ్లేషించారు. రూసో అభిప్రాయంలో ప్రజలలో హేతువాదం పెరగడం, జనాభా పెరగడం, ప్రైవేట్ ఆస్తి హక్కు ఏర్పడడం వల్ల సామాజిక ఒడంబడిక చేసుకోవడం తప్పనిసరి అయింది. ఈ ఒడబండికను ప్రజలందరు అందరితో చేసుకుంటారు. ఒడబండిక సందర్భంగా ప్రతివ్యక్తి తన ఆస్తి హక్కులన్నింటినీ సమాజానికి ఇచ్చి వేస్తాడు. దీనివల్ల ఎవరూ నష్టపోరు. ప్రతివ్యక్తి రాజ్యానికి లేదా సార్వభౌమునికి లోబడి నివసిస్తారు.

ఈ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ద్వారా స్థూలంగా తెలిసేదేమంటే మనిషి ఒక ఒడంబడిక ద్వారా తన ఆస్తిని, హక్కులను, జీవించే విధానాన్ని శాసించే, నియంత్రించే అధికారానికి వేరొకరికి అప్పగించాడు. అంటే ఒక ఒడంబడిక చేసుకుని మరీ తన స్వతసిద్ధమైన రక్షణల నుంచి తాను పరాయీకరించబడ్డాడు. ఆ నిర్దిష్ట కాలానికి అది అవసరమే అనుకున్నా దాని ఫలితంగా మనిషి తన జీవన గమనంలోని అనేక పరిస్థితుల నుంచి పరాయీకరణ చెందాడు. ఈ సిద్ధాంతాన్ని సమర్ధిస్తూ ఎందరో రాసినా సామాజిక శాస్త్రాలు అభివృద్ధిచెందుతూ వచ్చిన క్రమంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం తీవ్ర విమర్శలకు గురైంది. ఈ భావనలోని నిర్హేతుక అంశాలను మార్క్సిస్టులు బట్టబయలు చేశారు.

ఇప్పుడు భూస్వామ్య పెట్టుబడిదారి సమాజాలలో పరాయీకరణ ఏర్పడిన, అమలయిన తీరును పరిశీలిద్దాం. దీన్ని తర్వాత కాలంలో మార్క్సిస్టులు చాలా అభివృద్ధి పరిచారు. ఫ్యూడల్ సమాజంలో భూమిపై యాజమాన్యం భూస్వాములది. రైతులు ఆ భూమికి సంబంధించబడి ఉండేవారు. అయితే ఈ వ్యవస్థపై ఆధారపడ్డ సంబంధాలు ఒకప్పుడు ఉత్పత్తి శక్తుల కనుగుణంగా ఉండేవి. అందుచేత అభివృద్ధికి సహాయపడేవి. అయితే ఈ సమాజాలలో కూడా మనిషి పరాయీకరణకు గురయ్యాడు. భూమి భూస్వామి చేతిలో ఉండేది. ఆ భూమి కూడా అతనికి వారసత్వం ద్వారా గానీ, ఆక్రమణ ద్వారా గాని వచ్చిందే. ఒకవేళ వారసత్వంగా వచ్చిననూ వెనకటి తరాలలో ఏదో ఒక కాలంలో అది ఆక్రమణ ద్వారా పొందినదే. ఎందుకంటే భూమి ప్రకృతి సహజమైన వనరు. దాన్ని ఎవరూ సొంతం చేసుకోలేరు కనుక. అట్లా ఆక్రమణ ద్వారా పొందిన భూమికి యజమానిగా ఉంటూ భూస్వామి తన భూమిలో ప్రజలతో వెట్టిచాకిరి చేయించేవాడు. ప్రతిఫలంగా కేవలం ఆ పూటకు సరిపడా నాలుగు గింజలు బదిలించేవాడు. చాలా సార్లు అది కూడా ఇవ్వకపోయేవాడు. అంటే ఆ దశలో శ్రామికునికి దక్కేది కేవలం తిండిగింజలే. అంతకు మించిన శ్రమ ఫలితం లభించేది కాదు. దాన్నంతా భూస్వామి దోచుకునేవాడు. ఏ పూటకాపూట తిండి కోసం పనిచేసే మనిషి తన వ్యక్తిగత జీవితంలో సంతృప్తిగా, సుఖంగా ఎలా ఉండగలడు? అట్లా మనిషి అనేక వ్యక్తిగతాంశాల నుంచి పరాయీకరణకు గురయ్యేవాడు. పైగా భూస్వాముల హింసలు, దౌర్జన్యాలు, రాజు లేదా అధికారుల అండదండలతో ప్రజల ధన మాన ప్రాణాలను కబళించడాల వల్ల మనిషికి ఫ్యూడల్ సమాజంలో జీవించడం దినదిన గండంగా మారిపోయింది. ఇవన్నీ పరిస్థితుల వల్ల మానవులు ఫ్యూడల్ యుగంలోనూ పరాయీకరణ దుర్మార్గపు నీడలను అనుభవించాడు.

ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థను చూద్దాం! పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఏర్పడక ముందు అంటే మధ్య యుగాలలో చిన్ని చిన్న పరిశ్రమల ద్వారా వస్తువులను ఉత్పత్తి చేసే పద్ధతి వ్యాప్తిలో ఉండేది. కార్మికుల సొంత ఆస్తిగా ఉండే ఉత్పత్తి సాధనాల మీద అది ఆధారపడి ఉండేది. గ్రామాలలో చిన్న రైతులు లేదా స్వేచ్ఛగల రైతులు లేదా అర్ధ బానిసలు వ్యవసాయం చేసేవారు. పట్టణాలలో చేతి వృత్తులన్నీ వృత్తి సంఘాలలో సంఘటితమై ఉండేవి. ఉత్పత్తి సాధనాలు – భూమి, వ్యవసాయ పరికరాలు, పనిముట్లు ఇవన్నీ వ్యక్తులవి. ఒక్కొక్క వ్యక్తి మాత్రమే ఉపయోగించడానికి అవి వీలుగా ఉండేవి. అందుకే చాలా చిన్నగా, తక్కువ పరిమాణంతో ఉండేవి. ఇట్లా చెల్లా చెదురుగా ఉన్న, వేర్వేరుగా ఉన్న, కుంచించబడి ఉన్న ఉత్పత్తి సాధనాలన్నింటినీ కేంద్రీకరించవలసి వచ్చింది. విస్తృతపరచవలసి వచ్చింది. బలమైన ఉత్పత్తి సాధనాలుగా వాటిని మార్చవలసి వచ్చింది. ఇది అప్పటి పెట్టుబడిదారీ విధానం, ఆ విధానాన్ని బలపరిచే పెట్టుబడిదారీ వర్గం ప్రధాన కర్తవ్యం అయింది. ఇది 15వ శతాబ్దం తర్వాత సామాన్య సహకారం, కార్ఖానాలు, ఆధునిక పరిశ్రమలు అనే దశలలో నిర్వర్తించబడింది. మధ్య యుగాలలో ముఖ్యంగా మధ్యయుగాల తొలి శతాబ్దాలలో ఉత్పత్తి ప్రధానంగా వ్యక్తుల అవసరాలు తీర్చడానికే కొనసాగేది. ప్రధానంగా అది ఉత్పత్తిదారుల అవసరాలను, వారి కుటుంబ అవసరాలను తీర్చేది. గ్రామాలలో లాగా పరాధీన సంబంధాలున్న చోట ఆ ఉత్పత్తి ఫ్యూడల్ ప్రభువుల అవసరాలను కూడా తీర్చేది. అందువల్ల ఆ రోజులలో డబ్బు మారకం అనేది లేదు. కాబట్టి వస్తువులు వర్తకపు సరకుల స్వభావం కలిగి ఉండేవి కావు. రైతు కుటుంబాలు ఇంచుమించు తమకు కావలసినవన్నీ అంటే బట్టలు, ఫర్నీచర్, జీవితావసర వస్తువులు వంటివి తయారు చేసుకునేవారు. తమ అవసరాలు, ఫ్యూడల్ ప్రభువుకు శిస్తుల రూపంలో చెల్లించాల్సింది పోను అదనంగా వస్తువులను ఉత్పత్తి చేయడం ప్రారంభించినప్పుడే వాళ్లు వర్తకపు సరుకులను కూడా తయారు చేసేవారు. ఈ అదనపు ఉత్పత్తి సామాజిక మారకంలో ప్రవేశించి, అమ్మకానికి వచ్చినప్పుడే అవి వర్తకపు సరుకులు అయ్యేవి. అట్లా పెట్టుబడిదారీ వర్గం వర్తకపు సరకుల ఉత్పత్తిని లాభాల కోసం విస్తరించడంతో ఆ విధానం బాహాటంగా, బలంగా అమలులోకి వచ్చింది. మధ్యయుగాలలో మానవ శ్రమవల్ల తయారైన వస్తువులకు యజమాని ఎవరనే ప్రశ్న ఉదయించలేదు. వస్తువులను ఉత్పత్తి చేసే ప్రతివ్యక్తికి సొంత ముడి పదార్థాలను కలిగి ఉండేవాడు. సొంత పనిముట్లను కలిగి

ఉండేవాడు. సొంత శ్రమతో లేదా కుటుంబ శ్రమతో ఆ వస్తువులను తయారు చేసేవాడు. అలా తయారైన వస్తువులను అతను ఇతరుల కోసం అమ్మడం, వేరే ఆర్థిక పనుల కోసం వినియోగించడం చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అవి పూర్తిగా, సహజసిద్ధంగా అతనివే. అందుచేత వస్తువులపై అతని యాజమాన్యం అతని సొంత శ్రమమీద ఆధారపడి ఉండేది. ఒకవేళ అతడు బయటివారి సహాయాన్ని కూడా ఉపయోగించుకున్నప్పటికీ దానికసలు ప్రాధాన్యతే ఉండేది కాదు. సాధారణంగా పెట్టుబడిదారీ విధానం ప్రారంభం కాకముందు ఈ పద్ధతి ఉండేది. కానీ పెట్టుబడిదారీ విధానం మొదలయ్యాక వస్తువులకు ఒక యజమాని వర్గం అనేది పుట్టుకొచ్చింది. ముడి పదార్థాలు, పనిముట్ల పరిధి, ప్రయోజనం విస్తృతమై కొత్త రకాల ముడిపదార్థాలు, పనిముట్లను పెట్టుబడిదారీ వర్గం తయారు చేయడంతో మనిషి తయారు చేసిన వస్తువులకు యజమానిగా వేరొకరు అయ్యే పరిస్థితులు ప్రారంభమైనాయి. ఇదేలా జరిగిందో ఓసారి చూద్దాం!

పెట్టుబడిదారుడు తన పనిని డబ్బుతో ప్రారంభిస్తాడు. ఉత్పత్తి సాధనాలను, శ్రమ శక్తిని కొంటాడు. శ్రామికుడు తన శ్రమ శక్తిని ఉత్పత్తి సాధనాలపై వినియోగించి సరకును ఉత్పత్తి చేస్తాడు. ఆ సరకులను మార్కెట్‌లో అమ్ముకొని పెట్టుబడిదారు డబ్బు చేసుకుంటాడు. ఈ ప్రక్రియంతా ముగిసే సరికి అతనికి వచ్చే డబ్బు ప్రారంభంలో ఉన్నదాని కంటే ఖచ్చితంగా ఎక్కువ ఉంటుంది. ఈ తేడానే పెట్టుబడి దారుని లాభం. ఈ క్రమంలో ప్రారంభపు పెట్టుబడి కంటే అదనంగా డబ్బు పెట్టుబడిదారునికి రాకపోతే లాభం ఉండదు. లాభం లేనందున సరకుల ఉత్పత్తిని నిలిపివేస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి క్రమం ఆరంభం గానీ, అంతం గానీ డబ్బు మీదనే ఆధారపడి కొనసాగుతుంది. డబ్బును డబ్బుగానే నిలువచేసినా లేక దాచినా అది అధికం అవదు. దాన్ని పెట్టుబడిగా వినియోగిస్తేనే అది పెరిగే వీలు ఉంటుంది. అంటే శ్రమశక్తిని, ఉత్పత్తి సాధనాలను కొని వాటిని ఉపయోగంలో పెట్టి ఫలితంగా వచ్చిన నూతన విలువలో ఒక భాగాన్ని పెట్టుబడిదారుడు లాభంగా పొందుతాడు.

ఈ కార్యక్రమమంతా ఒక క్రమం ప్రకారం నడుస్తున్నట్లు కనబడుతుంది. పెట్టుబడిదారు అధికంగా లాభాలు కోరుకుంటాడు. అందుకు అధికంగా పెట్టుబడిని సమీకరించుకుంటాడు. పెట్టుబడి సమీకరణ అయినకొద్దీ లాభాలు పెరుగుతాయి. పెట్టుబడిదారుడు సరకులను త్వరగాను, అధికంగాను తక్కువ ధరలకు శ్రామికుడు సృష్టించేటట్లు చేయడం మూలాన అధిక లాభాలు పొందగలుగుతాడు. ఇదీ స్థూలంగా పెట్టుబడిదారీ విధానం అమలయ్యే తీరు.

అయితే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా దుర్మార్గమైనది. ఈ విధానం శ్రామికులను అట్టడుగు స్థితికి చేర్చుతుంది. పనిచేయగల వారికి అన్ని వేళలా పని దొరకదు. మానసికంగా, శారీరకంగా పనిచేయగల అనేక మంది పనిలేకుండా బతకవలసి వస్తుంది. ప్రకటన కర్తలు, వర్తకులు, ఏజెంట్లు వంటి అనవసరమైన వ్యక్తులు అవసరంగా మారతారు. అసహ్యకరమైన పోటీలలో తమ సరకులు నాణ్యమైనవంటే తమవి నాణ్యమైనవని ప్రచార పటాటోపాలకు మాత్రమే వారిని వాడుకోవల్సి వస్తుంది. ఈ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాల శక్తులు ఎక్కువగా విలాస వస్తువులను ఉత్పత్తి చేయడానికి వినియోగిస్తున్నాయి. అందువలననే ఒకానొక సమయంలో నిత్యజీవితావసర వస్తువులను అవసరమైనంతగా దొరకవు. ఎంతసేపూ దృష్టి ధరల పెరుగుదల మీద, లాభాల మీద తప్ప సామాన్య మానవుని అవసరాలపై కాదు. ఇదంతా పెటుబడిదారీ వ్యవస్థ అసమర్థత ఫలితమే.

వ్యాపారస్తుడు తన స్వప్రయోజనం కొరకై చేసే కృషి మొత్తం సమాజానికి కూడా మేలు చేస్తుందనే నిరాధారమైన నమ్మకం మూలంగా ఈ వ్యవస్థ పెరిగి పెద్దది కాగలిగింది. అధిక లాభాలను పొందడానికి స్వేచ్ఛగా వ్యక్తులను వదిలిపెడితే సమాజం మొత్తంగా బాగుపడుతుందనేదే ఆ నమ్మకం. పెట్టుబడిదారులను ఎక్కువ లాభాలు తీసుకోనివ్వడమే ఉత్తమ విధానమని అలా లాభాలు తీసుకునే క్రమంలోనే ప్రజల అవసరాలు కూడా తీరతాయి అనేదే ఆ నమ్మకం. నిజానికి ఇది పచ్చి అబద్ధం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి ప్రజల అవసరాలకు అనుగుణంగా జరగదు. కొద్దిమంది లాభాల కోసం ఉత్పత్తి కొనసాగించ బడుతుంది. ప్రజల అవసరాలతో దానికి సంబంధముండదు. ప్రజల అవసరాలను ఏ మేరకు తీర్చాలనే అంశం కూడా లాభాపేక్ష పరులైన పెట్టుబడిదారులే నిర్ణయించడం జరుగుతుంది. ఆర్థిక యంత్రాంగాన్ని తమ స్వప్రయోజనం కోసం ప్రజానీకం అదుపుచేయని చోట ఆర్థిక స్వేచ్ఛకు బదులు ఆర్థిక నియంతృత్వం అవతరిస్తుంది. ఈ విధానంలో ధనవంతులు అల్ప సంఖ్యాకులై ఉండి కూడా జీవిత సౌఖ్యాలన్నింటినీ నిరంతరం పొందుతూ ఉంటారు. కాగా బీదలు అత్యధిక సంఖ్యాకులై ఉండి కూడా భయోత్పాతాన్ని కలిగించే భద్రతా రాహిత్యం, నిత్య దారిద్ర్యం, అవకాశాలలో అసమానతలకు గురి అవుతుంటారు. ఉత్పత్తి సాధనాలను వ్యక్తులు తమ స్వంత ఆస్తిగా కలిగి ఉండడం పెట్టుబడిదారీ వ్యవస్థకు మూలం. అందువల్లనే ఈ అసమానత్వం ఏర్పడుతుంది. స్వంతదారుల వ్యక్తిగత స్వాతంత్ర్యానికి ఉత్పత్తి సాధనాలను కోల్పోయిన ప్రజల వ్యక్తిగత స్వాతంత్ర్యాలకు మధ్య ఉండే అంతరానికి కూడా ఇదే కారణం. శ్రామికుడు తన ఇష్టమున్నట్లుగా తాను బతకడానికి సూత్రరీత్యా స్వేచ్ఛ ఉంది. కానీ వాస్తవంలో ఈ స్వేచ్ఛ పరిమితం చేయబడుతుంది. యజమాని విధించే దుర్మార్గపు షరతులను ఒప్పుకోవడానికి గానీ, లేక ఆకలితో మరణించడానికి గానీ మాత్రమే శ్రామిక వర్గానికి స్వేచ్ఛ ఉంది. ఇదే పెట్టుబడిదారీ విధానంలో జరిగే పరాయీకరణ. పెట్టుబడిదారీ విధానంలోని డబ్బును పెంపుచేసుకోవడం మాత్రమే లక్ష్యంగా ఉండే ఉత్పత్తి విధానం వర్తకపు సరకులను ఉత్పత్తి చేసే వారందరి మధ్య చొరబడడం వల్ల ఉత్పత్తి దారులు తమ మధ్య అన్యోన్యంగా ఉండే సామాజిక సంబంధాలపై ఆధిపత్యాన్ని కోల్పోతారు. అతని సరకు మార్కెట్‌కెంత వస్తుందో ఎవరికీ తెలియదు. అసలు అతని సరుకుకు గిరాకి ఉందో లేదో, ఉత్పత్తి ఖర్చులైనా అతనికి వస్తాయో రావో, అసలు ఆ సరకు అమ్ముడవుతుందో లేదో ఎవరూ చెప్పలేరు. అంతా మాయ. అంటే సామాజికోత్పత్తిలో అరాజకం ప్రవేశించడమిది. ఇది ఉత్పత్తికి, పెట్టుబడికి మధ్య ఏర్పడే ప్రధాన వైరుధ్యం. అదే విధంగా తమ లాభాలు పెరగడం పెట్టుబడిదారునికి సంతోషకరంగానే ఉంటుంది. కానీ శ్రామికవర్గ ఆదాయం అంటే జీతాలు పెరగడానికి అతను సముఖంగా ఉండడు. వేతనాల పెరుగుదల వలన తన లాభాలలో కొంత తగ్గుతుందని అతినికి తెలుసు. అతనికి లాభాలు అతి ముఖ్యమైనవి. వేతనాలు పెరగడం అనేది అతని గరిష్ట లాభాలు పొందే లక్ష్యానికి అడ్డుపడుతంది కనుక వాటిని వీలైనంతగా కనిష్ట స్థాయిలో ఉంచడానికే ప్రయత్నిస్తాడు. ఈ విధానాల ఫలితంగా శ్రామికులు తాము ఉత్పత్తి చేసిన వస్తువులను తామే కొనలేని శక్తిహీనులుగా మారిపోతారు. ద్వేషానికి బదులు ప్రేమించడం, స్వంతానికి పోగేసుకోవడం బదులు ఇతరుల సేవ, తోటివారికి సహాయం, సంపదకై వెంపర్లాడకపోవడం వంటి ఉన్నత విలువలకు సరిగ్గా వ్యతిరేకమైన జీవనశైలిని పెట్టుబడిదారి విధానం తీసుకుని వచ్చింది.

(ఇంకా ఉంది)

(రచయిత ప్రభుత్వ ఉపాధ్యాయుడు)

చైనా-శాస్త్రీయ అధ్యయనం: సమీర్ అమీన్ విశ్లేషణ

చైనా గురించి సమీర్ అమీన్ వెలిబుచ్చిన అభిప్రాయాన్ని వివరిస్తున్నారు **కె.జె. రామారావు**

సమీర్ అమీన్ (జననం1931, ఈజిప్టులో) సమకాలీన మార్క్సిస్టు మేధావులలో, 'దక్షిణం నుంచి-పేదదేశాల నుంచి - ముందుకొచ్చిన బుద్ధిజీవులలో అగ్రగణ్యుడుగా గుర్తింపబడినవాడు. ప్రముఖ విశ్లేషకుడు, బహుగ్రంథకర్త అయిన సమీర్ అమీన్ గుత్తఫైనాన్స్ పెట్టుబడిదారీ ఆధునిక దశల గురించి, సామ్రాజ్యవాద దోపిడి పరిణామ క్రమం గురించి, ఆచరణలో సోషలిజం గురించి స్వతంత్రంగా అనేక సైద్ధాంతిక ప్రతిపాదనలు చేసినవాడు.

వెనకబడిన దేశాల అభివృద్ధి క్రమాన్ని, చైనా ఆర్థిక వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన కొద్దిమందిలో ఒకడు. అమెరికన్ వామపక్ష పత్రిక 'మంత్లీ రెవ్యూ' ఆయన రచించిన అనేక రచనలను- పుస్తకాలుగా కూడా- ప్రచురించింది. 1980లో స్థాపించబడిన' థర్డ్ వరల్డ్ ఫోరమ్' వ్యవస్థాపక డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు. 1997 నుంచి' ప్రత్యామ్నాయాల ప్రపంచ వేదిక' చైర్మన్ కూడా ఆయన.

చైనా 2013 శీర్షికతో ఆయన ఒక పత్రాన్ని సమర్పించాడు. అనేక మంది చైనా మేధావులతో, చైనా గ్రామీణ కార్యకర్తలతో చర్చించి తయారుచేసిన పత్రం ఇది.' మంత్లీ రెవ్యూ' మార్చి 2013 సంచికలో ప్రచురింపబడింది. చైనా స్వభావం గురించిన శాస్త్రీయ అవగాహనకై అధ్యయనం చేయాల్సిన ముఖ్య రచన ఇది. దీనిలోని కొన్ని ముఖ్యాంశాలను క్లుప్తంగా ఈ కింద గమనించవచ్చును.

నిర్దిష్టమైన, లోతైన అవగాహన లేకుండానే చైనాను తిట్టిపోయడం ఒక పద్ధతిగా మారింది - ముఖ్యంగా మనదేశ అతివాదుల్లో. మరొక అభిప్రాయాన్ని కనీసం పరిశీలించ నిరాకరించే' వామపక్ష ఫండమెంటలిజం' ఒకటి రాజ్యం చేస్తున్నది. ఆచరణతో సంబంధంలేని పాశ్చాత్య-ముఖ్యంగా అమెరికన్- మేధావుల రాతలను; అలాంటివే అయిన, చైనా ద్వేషంతో కూడిన మేధావుల కథనాలను ఆధారం చేసుకుని, 8కోట్ల సభ్యులు కల చైనా పార్టీ ఏం చెపుతున్నది, చేస్తున్నది అని కనీసం చూడకుండా, సోషలిస్టు చైనాను నిరాకరించడం ఒక పెడధోరణిగా ఉంది. దానికి భిన్నంగా, 'చర్చ' శీర్షికలో-'చైనా పరిణామాలు- శాస్త్రీయ అధ్యయనం' వ్యాసాన్ని ప్రచురించడం బహుధా అభినందనీయం(వీక్షణం- జూన్ 2018 సంచికలో). అ చర్చకు సమీర్ అమీన్ రచన దోహదం చేస్తుంది.

ఆ వ్యాసం సుదీర్ఘమైనది. ఆయన అభిప్రాయాల సారాంశం- అతి క్లుప్తంగా-మాత్రమే ఇది.

చైనాది 'ఒరిజినల్ మార్గం': చైనా పెట్టుబడిదారీ మార్గంలో పయనిస్తున్నదా, సోషలిస్టు మార్గంలోనా? ఈ ప్రశ్నే సబబుగా లేదు. ఈ డిబేట్ చాలా అమూర్త, అనిర్దిష్ట పద్ధతిలో సాగుతున్నది. చైనా పరిణామక్రమాన్ని అర్థం చేసుకోకుండా ఈ చర్చ సాగుతున్నది. నిజానికి ఇవ్వాళ కాదు, 1950 నుంచి కూడా చైనా ఒక 'ఒరిజినల్ మార్గాన్ని' అనుసరిస్తున్నది.

చైనా పరిణామంలోని ప్రతి దశలోనూ ఇది ఒరిజినల్ మార్గంగా ఉన్న తీరుని వివరించడానికి ఇక్కడ ప్రయత్నిస్తున్నాను-అంటారు సమీర్ అమీన్, తన 'పత్రాని'కి ఉపోద్ఘాతంగా. రష్యన్ మార్గానికి భిన్నంగా 'ఒరిజినల్ మార్గం' లో చైనాలో విప్లవం, నిర్మాణం కూడా మావో నేతృత్వంలో మొదలై నేటికీ కొనసాగుతున్నది అని అంటారు 2013 నాటి ఈ వ్యాసంలో.

'లెనిన్ నేతృత్వంలోని రష్యాలో ఇలా సాగలేదని; బోల్షివిక్ పార్టీ ఫెయిల్ అయిన విషయంలో మావో కృతకృత్యులయ్యారని; గ్రామీణ జన బాహుళ్యంతో కార్మిక ఐక్య సంఘటనను జయప్రదంగా నిర్మించ గలిగారని' అంటారు సమీర్ అమీన్.

చైనాలో భూమి సరకు కాదు

వ్యవసాయ సమస్యకు చైనా విప్లవంలో కనుగొన్న పరిష్కారం చాలా విశిష్టమైనది. రైతాంగానికి పంచబడిన వ్యవసాయ భూమిని ప్రైవేటీకరించ లేదు. భూమి యావత్ దేశానికి చెందిన ఆస్తిగా ఉన్నది. రష్యాలో అలా జరగలేదు; ప్రైవేటు ఆస్తిగా భూమిని గుర్తించాల్సిన తప్పనిసరి పరిస్థితులను ('ఫెయిట్ అకాంప్లి'ని) లెనిన్ ఎదుర్కొన్నారు. చైనాలో పరిస్థితి వేరు, వియత్నాంలో కూడా చైనాలో లాగే. ఈ రెండుచోట్లా రైతాంగం ఈ పరిస్థితిని అంగీకరించారు; ఇది మరెక్కడా లేదు. ఆస్తి అంటే తెలియని సాంప్రదాయం నుంచి ఇది వచ్చిందని వివరించబూనడం సాధ్యం కాదు. ఈ రెండు దేశాల కమ్యూనిస్టు పార్టీలు అమలుచేసిన వివేకవంతమైన, విశిష్టమైన రాజకీయ పంథా ఫలితం ఇది.

చైనాకి సంబంధించిన ఈ నిర్దిష్ట లక్షణం చాలా చాలా ముఖ్యమైనది. వ్యవసాయ భూమి సరకుగా(కమోడిటీగా) మారకూడదు; భూమిని అమ్మడం కొనడం అనుమతించరానిది -అన్న సూత్రాన్ని చైనాలో అమలు చేయగలిగారు. రష్యాలో అలా జరగలేదు. భూమిని సమిష్టి ఆస్తిగా మార్చాలని (కలెక్టివైజేషన్) స్టాలిన్ బలవంతం చేయగా, అక్కడ అంతులేని రైతాంగ యుద్ధాలు సాగినాయి, అని గుర్తుచేస్తారు సమీర్ అమీన్. ఈ నిర్దిష్ట లక్షణం కారణంగా సమకాలీన చైనాను (2013 లో కూడా) మనం పెట్టుబడిదారీ అని సూత్రీకరించజాలము; ఎందుకంటే భూమిని సరకుగా మార్చడం అన్న ప్రాతిపదికపైనే పెట్టుబడిదారీ మార్గం

ఉంటుంది.' ఈ మౌలిక సూత్రానికి లోబడి, భూమిని ఎలా వినియోగించాలి అన్నది అనేక రూపాల్లో ఉండవచ్చును: చిన్న ఆస్తిని, చిన్నస్థాయిలో ఉత్పత్తిని వేరు చేసి చూడాలి.

'పెట్టీ ప్రొడక్షన్'కి ప్రముఖ స్థానం: 'చిన్నస్థాయి ఉత్పత్తి' (పెట్టీ ప్రొడక్షన్) – అది రైతులదైనా, చిన్న చేతివృత్తుల వారిదైనా– గత సమాజాలన్నింటా ప్రబలంగా ఉంటూ వచ్చింది. ఆధునిక పెట్టుబడిదారీ విధానంలోనూ దానికొక ముఖ్యమైన స్థానం ఉంది–వ్యవసాయంలోనూ, సర్వీసుల్లోనూ, చివరకు కొన్ని విభాగాల పరిశ్రమల్లో కూడా అలాంటి స్థానం ఉంటుంది. ...బహుశా భవిష్యత్తు సోషలిజంలో కూడా దానికి ప్రముఖ స్థానం ఉంది.

నేటి చైనాలో వ్యవసాయ రంగంలోనే కాక, పట్టణ జీవితంలోని చాలా పెద్ద విభాగాల్లో కూడా 'పెట్టీ ప్రొడక్షన్'కు ప్రముఖ స్థానం ఉంది. అయితే ఇది చిన్న ఆస్తితో ముడిపడి ఉన్నది కాదు. చైనా తన భూమిని వివిధ రూపాల్లో– విభిన్న రూపాల్లో కూడా–సమిష్టి ప్రయోజనంకై వినియోగించగలుగుతున్నది.

ఉత్పత్తిని, ఎకరాకు ఎంత? ఒక శ్రామికునికి ఎంత? ఇలా ఉత్పాదకతనీ కూడా–సమర్థవంతంగా పెంచగలిగింది చైనా. ఈ క్రమంలో అనేక మంచి ఫలితాలు, పరివర్తనలు కూడా మొదలై, కొనసాగుతున్నాయి–వీటిని పరిశీలించకుండా నిర్ధారణకు రావడం అర్థం లేనిది – అంటారు సమీర్ అమీన్.

స్టేట్ క్యాపిటలిజం–రెండు దశలు

జనాభా పెరిగినకొద్దీ జనాభా లోని గణనీయ భాగాన్ని పట్టణాలకు తరలించడం, వ్యవసాయ భూమిపై (డిమాండు) వత్తిడిని తగ్గించడం అవసరం, అనివార్యం. ఇండియా, బ్రెజిల్, చైనాల్లో ఇదే జరుగుతున్నది– కాని ఒక ముఖ్యమైన తేడాతో. ప్రపంచమంతటా పట్టణ పేదరికం, మురికివాడల దుర్భర జీవితం తాండవిస్తున్నది. చైనాలో అలాంటి స్థితిలేదు. మొత్తంమీద చూస్తే, పట్టణ జనాభా మెరుగ్గా, మెరుగైన ఉపాధి, నివాస అవకాశాలతో జీవిస్తున్నది. చాలా 'అభివృద్ధి చెందిన దేశాల'తో పోల్చిచూసినా కూడా చాలా మెరుగ్గా ఉన్నది. ఈ ప్రక్రియ ఎక్కడా లోపరహితంగా, పర్‌ఫెక్టుగా జరగదు. చైనాలోనైనా అంతే. అయితే అక్కడ ఈ క్రమంలో ఎదురయ్యే సమస్యలను చర్చించి పరిష్కరిస్తున్నారు. ఈ పరిస్థితిని 'స్టేట్ కాపిటలిజం' అనడం మామూలు.

ఏ దేశంలోనైనా అనివార్యం. అది అనేక రూపాలలో, లక్ష్యాలతో సాగుతుంది. దీని నిర్దిష్ట సారాన్ని విశ్లేషించకుండానే అలా పేరు పెట్టేయ్యడం సబబు కాదు. అది పైపై పరిశీలనే అవుతుంది.ఈ దశ లేకుండానే సోషలిజం నిర్మించడం బాగా అభివృద్ధి చెందిన దేశాలలో సైతం సాధ్యం కాదు. (వారికా లక్ష్యమే లేదు, నిజమే) సోషలిజం సాధన సుదీర్ఘ ప్రయాణం, సుదీర్ఘ పోరాటం. అది ఆంతరంగిక వైరుధ్యాలతో సంఘర్షణలతో సాగడం ఎప్పుడూ ఉండేదే.

చైనాలో స్టేట్ క్యాపిటలిజం రెండు దశల్లో సాగింది:మొదటిది మావో కాలంలో (1954–1980). ఆ దశలో భూమిని, అన్నికంపెనీలనూ కూడా (చిన్న,పెద్ద కూడా) జాతీయం చేశారు. రెండో దశలో (1980 తర్వాత, డెంగ్ కాలంలో) దేశ, విదేశ ప్రైవేట్ ఎంటర్‌ప్రైజెస్ కి 'తలుపులు తెరిచారు'. ఈ దశలోనూ భారీ పరిశ్రమలను అలాగే (ప్రభుత్వ రంగం లోనే) ఉంచారు. అలాగే పరపతి విధానాన్నీ మావో కాలంలో వలెనే ఉంచారు. సోషలిస్టు మార్కెటి కి తగిన రీతిలో కొన్ని' నిర్మాణ రూపాలను' మార్పు చేశారు.

ఈ క్రమంలో 1950 నుంచి 2012 వరకు వారు సాధించినది అమోఘం. ఒక విశాల దేశానికి తగినరీతిలో, స్థాయిలో 'సార్వభౌమ, సమగ్ర, ఆధునిక ఉత్పత్తి వ్యవస్థ'ని (Sovereign, integrated modern productive system) నెలకొల్పారు. ఈ క్రమపద్ధతిని కంట్రోల్ చేసే, నియంత్రించే కేంద్ర సాధనం ఈ నాటికీ ప్రణాళికా వ్యవస్థే 'ఓపెన్' పద్ధతి కాదు.

మావో దశలో 'విలువ' సూత్రం గురించి ఆసక్తికరమైన డిబేట్ జరిగింది. చర్చా వ్యాసంలో దీనినే పరిచయం చేసారు. ఆ దశలో సాధించిన విజయాల క్రమాన్ని కొనసాగించడానికి 1980–90 తర్వాత అవసరమైన మార్పులు చేశారు. సోవియట్ యూనియన్‌లో (దాని పతనానికి దారితీసిన) ఏర్పడిన, ఆర్థిక నిస్థబ్దత(స్టాగ్‌నేషన్)ని నివారించడానికి ఇవి అవసరమైనాయి.

నయా ఉదారవాదం–సోషలిస్టు మార్కెటు వ్యవస్థ

ఈ రెండోదశ కాలంలోనే ప్రపంచస్థాయిలో 'నయా ఉదారవాదం' పైచేయి సాధించింది. ఈ రెండూ ఒకే సమయంలో సంభవించడం కాకతాళీయమే. ఈ దశలోనే చైనాలో 'మార్కెట్‌తో కూడిన సోషలిజం' రూపుదాల్చింది. మొత్తంగా చూస్తే – ఈప్రక్రియ సమర్థనీయమేనని నా అభిప్రాయం.

ఈ మార్గం ఎంచుకున్న ఫలితంగా సమకూరిన ఫలితాలు అద్భుతంగా ఉన్నాయి. దీని ఫలితంగా 60 కోట్ల మంది ప్రజలతో కూడిన పారిశ్రామిక పట్టణీకరణ జరిగింది. ఇందులో 65శాతం గత రెండు దశాబ్దాల్లోనే– అపూర్వమైన వేగంతో– సాధించబడింది. ఇది మొత్తం యూరప్ జనాభాతో సమానమైనదని గమనించాలి.

ఇలాంటి విజయాన్ని మరే (దక్షిణ) దేశమూ సాధించలేదు. (కొరియా, తైవాన్‌లు తప్ప అని చెప్పాలి. అది అమెరికా మద్దతుతో, వారి అగ్రరాజ్య వ్యూహంలో భాగంగా సాధ్యమైంది). ఈ భారీస్థాయి పారిశ్రామిక పట్టణీకరణకు తగిన స్థాయిలో మౌలిక వసతులు (రోడ్లు, రైళ్లు, విద్యుత్, డ్యామ్‌లు మొదలైనవి), అదనంగా చేరిన 40 కోట్ల మంది పట్టణవాసులకు కొత్తగా ఇళ్లు నిర్మించారు.

ఇదంతా ప్రణాళికాబద్ధంగా జరిగింది, మార్కెట్ ద్వారా కాదు. ప్రణాళికలలో అంచనా వేసిన రీతిలోనే ఫలితాలని సాధించారు, మొత్తంగా చూస్తే. 1990ల తరువాత కొద్దికాలంపాటు అశ్రద్ధకు గురైన సామాజిక అంశాల సముద్ధరణ (విద్య, వైద్యం, గృహవసతి, ఇన్సూరెన్స్, పెన్షన్లు మొదలైనవి) తర్వాతి దశలో బాగా సాగింది. ఈ క్రమానికి ప్రజల ఉద్యమాలు కూడా దోహదం చేశాయి. ఇలాంటి ఘన విజయాలు ప్రపంచంలో మరెక్కడా లేవు (వర్ధమాన 'దక్షిణ' దేశాల్లో).

ఇంకా దోపిడి రూపాలు, లోటుపాట్లు ఉన్నాయి నిజమే. సోషలిజం దశలో అసమానతలుంటాయి. కాని ప్రపంచమంతటా – అభివృద్ధి చెందిన దేశాలలో సైతం –నెలకొన్న మురికివాడలు,పేదరికమూ లేని

వ్యవస్థ చైనాలో అభివృద్ధి చెందింది. ఈ ప్రక్రియంతా గ్లోబలైజేషన్, దానితో ముడిపడి కూడా సాగింది. కాని ఈ ప్రక్రియపై చైనా ప్రభుత్వానికి, పార్టీకి పూర్తి కంట్రోలు ఉంది. దీన్ని అవసరమైన రీతిలోనే సాగించారు.

2007లో అమెరికాలో మొదలైన గ్లోబల్ సంక్షోభాన్ని తొలిదశలోనే గమనించి, చైనా దిద్దుబాటు చర్యలు తీసుకున్నది. ఆంతరంగిక మార్కెట్ పై, పడమటి చైనాలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై కేంద్రీకరించి ఈ సంక్షోభాన్ని చైనా ఎదుర్కొన్నది. ఈ అభివృద్ధి మల్టీనేషనల్ పెట్టుబడి వల్లనే అంటే అది మూర్ఖత్వం అవుతుంది. 90 శాతం విజయాలు ప్రణాళికబద్ధ అభివృద్ధి ఫలితమే. విదేశీ పెట్టుబడిని, టెక్నాలజీని దీనికి ఉపయోగించుకున్నారు. దాని పాత్ర 10 శాతమే. ఇండియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, మలేషియా మొదలైనవి. మరెక్కడా ఇలాంటి విజయాలులేవు. పైపైన చూస్తే చైనాలోని ఈ విశిష్టత, ఈ తేడాలు కన్పడవు. కాగా ప్రపంచమంతటా నయా ఉదారవాదమే – ఒకేలా ఉన్నట్టుగా – కనిపిస్తుంది.

స్వతంత్ర, సార్వభౌమమార్గం ద్వారా ప్రపంచశక్తిగా ఎదుగుతున్న చైనా

ఇవ్వాళ చైనా ఒక ప్రపంచ శక్తిగా ముందుకొస్తున్నది. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని ఎంచుకోకుండా, స్వతంత్ర, సార్వభౌమ మార్గాన్ని, ఒరిజినల్ మార్గాన్ని ఎంచుకోవడం వల్లనే ఇది సాధ్యమైందని నా అభిప్రాయం. చైనాపై నల్లమందు యుద్ధాల రూపంలో పాశ్చాత్య పెట్టుబడి దాడి చేసిన వెంటనే కార్ల్ మార్క్స్ ఇలా రాశారు; 'మీరు చైనా బూర్జువా రిపబ్లిక్ సరిహద్దు లోపలికి ప్రవేశించబోతున్నారు, గమనించండి' అన్న బేనర్లు వారికి కనబడతాయి.

ఎంతో ముందు చూపుతో మార్క్స్ ఇలా రాశారు; అయితే అందులో చిన్న పొరపాటు ఉంది; 'చైనా ప్రజా రిపబ్లిక్' అన్న బేనర్ ఉంది ఈనాడు; బూర్జువా రిపబ్లిక్ కాదు. లెనిన్ కంటే మెరుగ్గా మావో ఈ విషయాన్ని అర్థం చేసుకున్నారు. స్వతంత్రమైన మార్క్సిస్టు ఆలోచనలు కల మావో ఆయన! అయితే సోషలిజం –కమ్యూనిజం కై పోరాటం అంత తేలికైనది కాదు, చాలా సుదీర్ఘమైనది అని కూడా మావో అర్థం చేసుకున్నారు. చైనా ఒక ఒరిజినల్ మార్గాన్ని 1980 ల నుంచే కాదు, 1950 ల నుంచే అనుసరించింది, అది అనేక దశల గుండా సాగుతున్నది, తన అవసరాల కనుగుణంగా చైనా తన మార్గాన్ని మలచుకుంటున్నది.

ఇది క్యాపిటలిజం కానే కాదు. అదే అయితే భూమి ఒక సరకుగా ఉండే వ్యవస్థ కావల్సి వచ్చేది. చైనాలో అది లేదు. అంతేకాదు, గ్లోబలైజేషన్ ను ఉపయోగించుకుంటూనే, చైనా సమకాలీన 'ఫైనాన్షియల్ గ్లోబలైజేషన్'కి వెలుపల ఉందని కూడా గమనించాలి. ఆ విధంగా అది సార్వభౌమ వ్యవస్థను నిర్మించుకుంటున్నది. అలాగని సోషలిజం సాధించేశారని కాదు, ఆ మార్గంలో ముందుకు సాగుతున్నారు. ఈ మార్గంలో ప్రమాదాలు లేవని దీని అర్థంకాదు. నయా ఉదారవాద యుగంలో అసమానతలు తీవ్రమైనాయి, చైనాలో కూడా. కానీ అంతమాత్రమే చూడగలిగితే అది పైపైపరిశీలనే అవుతుంది. అలా కన్పడుతుంది కాని అదే మొత్తం నిజం కాదు.

అసమానతలను (గినీకో ఎఫిషెంట్స్‌తో) లెక్కించేటప్పుడు–విభిన్న వ్యవస్థలతో కూడిన దేశాల మధ్య పోలికలు సరికావు. అలా పోలిస్తే అవి అర్థరహితమౌతాయి. చైనా పరిస్థితి భిన్నమైనది. (అసమానతల సూచిక (గినీ కోఎఫిషెంట్) వివిధ దేశాల్లో ఒకటే ఉన్నా, వాటి సామాజిక ఫలితాలు, అర్థం చైనాలో వేరుగా ఉంటుందన్న విషయాన్ని తాజాగా సమీర్ అమీన్ మళ్లీ వివరించారు. ఫ్రంట్‌లైన్ మార్చి11,2018 సంచికలోని ఇంటర్వ్యూ చూడండి).

చైనా గురించి ఇంత వివాదం, గందరగోళం ఎందుకు?

చైనా దశ – దిశ గురించి అనేక తప్పుడు అభిప్రాయాలు వ్యాప్తి చేయబడుతున్నాయి. చైనా బ్యాషింగ్ (చైనాని చావమోదడం) అన్ని ధోరణుల పాశ్చాత్య మీడియాకీ ఒక క్రీడ అయింది. అందులో దురదృష్టం కొద్దీ వామపక్ష మీడియా కూడా ఉంది. ఒక క్రమపద్ధతిలో చైనాని తూలనాడడం, నిందించడం, అక్కడ జరిగే ప్రతి విషయాన్ని 'క్రిమినలైజ్' చేయటం వారి పనిగా ఉంది... శక్తిహీనమైన పాశ్చాత్య 'వామపక్షం'లోని కొన్ని ధోరణుల 'పిల్లకాకి' అభిప్రాయానికి (infantile opinion) దోహదం చేసేదిగా ఉంది ఈ క్రీడ.' '23వ శతాబ్దంలో ఉండాల్సిన కమ్యూనిజం' నేటి చైనాలో లేదు, నిజమే, దాన్నే విద్రోహం అంటారు వీరు!

చైనాపై అమెరికా సాగించదల్చిన మిలిటరీ దాడి దృష్ట్యా, ఆ దేశం పట్ల శత్రుభావాన్ని పెంచి పోషించే క్రమబద్ధమైన క్యాంపెయిన్‌లో పాల్గొంటున్నది ఈ క్రీడ. 'పేద 'దక్షిణ' దేశాల నుంచి ఒక గొప్ప ప్రజ సాధికారికంగా తలఎత్తుకు ముందుకు వచ్చే అవకాశాలను నాశనం చేయడం తప్ప మరొకటి కాదు ఇది' అని సమీర్ అమీన్ చైనా వ్యతిరేక ప్రచార లక్ష్యాలను వివరిస్తారు. (మన దేశంలోని మీడియాపై, వామపక్ష మేధావులపై ఈ ప్రభావమే పనిచేస్తున్నది.)

'అమెరికా తన ప్రపంచాధిపత్య వ్యూహాన్ని నెరవేర్చుకోవడానికి మిలిటరీ కంట్రోల్ని అనుసరిస్తున్నది. మధ్య ప్రాచ్యంలో యుద్ధాలు సాగించడం ద్వారా ఈ లక్ష్యసాధనకు కృషి చేస్తున్నది. మరీచేయి దాటకముందే చైనా పై అణు యుద్ధం సాగించటానికి నాందిగా ఈ యుద్ధాలు సాగిస్తున్నది.

చైనా పట్ల ద్వేష భావాన్ని ప్రేరేపించడం ఈ ప్రపంచ వ్యూహం నుంచి విడదీయరానిదిగా, నాందిగా ఉంది. టిబెట్ లోనూ, సింకియాంగ్‌లోనూ ఉన్న బానిస యజమానులకు మద్దతు రూపంలోను, చైనా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల మోహరింపు గాను, జపాను మిలిటరీ శక్తిని శక్తికొద్దీ ప్రోత్సహించడం రూపంలోను ఇదంతా వ్యక్తమవుతూ ఉంటుంది. చైనా బ్యాషింగ్ క్రీడాకారులు ఈ ద్వేషభావానికి దోహదం చేస్తుంటారు' అని ఆయన విశ్లేషిస్తారు.

మార్క్సిజం దృష్టి కోణంతో, నిర్దిష్ట పరిశీలనతో శాస్త్రీయంగా చైనాని అర్థం చేసుకోవడానికి చేసిన సీరియస్ ప్రయత్నం సమీర్ అమీన్ ది. 'వామపక్ష ఫండమెంటలిజం'తో చైనాని తిట్టి పోసే ధోరణికి, ఆచరణతో సంబంధంలేని పాశ్చాత్య విమర్శకుల దాడులకు భిన్నంగా–(వెనుకబడిన దేశాలలో) 'ప్రత్యామ్నాయ మార్గాల వరల్డ్ ఫోరం' చైర్మన్ అయిన సమీర్ అమీన్ విశ్లేషణని లోతుగా అధ్యయనం చేయడం అవసరం, ఉపయోగకరం. ఈ చర్చకు వీలు కల్పిస్తున్న 'వీక్షణం' కు అభినందనలు.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

ప్రగతి నివేదన సభ

టిఆర్ఎస్ పార్టీ ప్రగతి నివేదన బహిరంగ సభను రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం మండలం కొంగరకలాన్‌లో సెప్టెంబర్ 2న నిర్వహించింది. ఈ సభలో కెసిఆర్ ముందస్తు ఎన్నికలను ప్రస్తావించకుండానే తమను మళ్లీ ఆశీర్వదించాలని కోరాడు. ఈ సభకు 25 లక్షల మంది హాజరవుతారని అంచనా వేయగా నాలుగు నుంచి ఐదు లక్షల మంది వచ్చినట్లు సమాచారం. సభలో కెసిఆర్ ప్రసంగిస్తూ గొర్రెలు, బర్రెల పంపిణీ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా పథకాల గురించి మాట్లాడాడు. మేనిఫెస్టోలో లేని 76 అంశాలను అమలు చేసినట్లు తెలిపాడు. కాగా మేనిఫెస్టోలో పెట్టిన దళితులకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇండ్లు, కెజి టు పిజి విద్య, ఇంటికో ఉద్యోగం, ముస్లిం, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్‌లు, నియోజక వర్గానికి 100 పడకల ఆసుపత్రి లాంటి విషయాలను ప్రస్తావించలేదు.

తెలంగాణ అసెంబ్లీ రద్దు

తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వ అసెంబ్లీ 4 సంవత్సరాల 3 నెలల 4 రోజుల పాలన రద్దయింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 6న ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.సి.ఆర్. అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం జరిగింది. అసెంబ్లీ రద్దుపరుస్తున్నట్లు ఏకవాఖ్య తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మంత్రి మండలి ఆమోదించిన తీర్మానాన్ని ముఖ్యమంత్రి గవర్నర్‌కు అందజేశారు. ఈ తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు. తెలంగాణ తొలి శాసనసభను రద్దు చేస్తునట్లు గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేస్తూ ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగాలని ఆదేశించారు.

ప్రజాస్వామికవాదుల అరెస్టులకు నిరసన

దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదుల అరెస్టులకు నిరసనగా సెప్టెంబర్ 4న కవులు, రచయితలు, కళాకారులతో విరసం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. నల్గొండలో సెప్టెంబర్ 8న నిరసన సభ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయం లో ప్రజాస్వామికవాదులు రచయితలపై నిర్బంధానికి వ్యతిరేకంగా విరసం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో సెప్టెంబర్ 9న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు.

గోకుల్ చాట్ పేలుళ్ల కేసులో దోషులకు ఉరిశిక్ష

గోకుల్‌చాట్, లుంబినీ పార్కు జంట పేలుళ్ల కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పును సెప్టెంబర్ 10న వెలువరించింది. ఇప్పటికే దోషులుగా తేల్చిన అనీఖ్, ఇస్మాయిల్‌కు ఉరిశిక్ష విధించింది. అంతేకాకుండా ఒక్కొక్కరికీ చెరో రు.10 వేల చొప్పున జరిమానా విధించింది. జంట పేలుళ్లకు సంబంధించి దోషులకు ఆశ్రయం కల్పించారనే కేసులో తారిక్ అంజున్‌ను కూడా దోషిగా తేల్చిన కోర్టు అతడికి జీవిత ఖైదు విధించింది. ఈ కుట్రల్లో తమకెలాంటి భాగస్వామ్యం లేదని, పోలీసులు తమను ఇరికించారని దోషులు న్యాయమూర్తి ఎదుట వాదనలు వినిపించారు. పోలీసులు పక్కా ఆధారాలు సమర్పించడంతో దోషులకు న్యాయమూర్తి శిక్ష విధించారు. 2007 ఆగస్టు 25న జరిగిన జంటపేలుళ్ల ఘటనలో 44 మంది అమాయక ప్రజల ప్రాణాలు హరించడానికి కారణమైన వీరిద్దరినీ న్యాయస్థానం దోషులుగా తేల్చి శిక్షలు ఖరారుచేసింది.

బస్సు ప్రమాదంలో 57 మంది మృతి

జగిత్యాల జిల్లా కొండగట్టు సమీపంలో సెప్టెంబర్ 11న ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొడిమ్యాల మండలం శనివారంపేట నుంచి కొండగట్టు ఘాట్ రోడ్డు మీదుగా జగిత్యాలకు వెళుతున్న తెలంగాణ ఆర్.టి.సి. బస్సు కారును తప్పించబోయి అదుపుతప్పి 20 అడుగుల లోయలో పడింది. ఈ ప్రమాదంలో 57 మంది మృతిచెందారు. మృతుల్లో 36 మంది మహిళలు, 4 చిన్నారులు, 15 మంది పురుషులున్నారు. 43 మంది గాయపడ్డారు.

విద్యా పోరాట యాత్రను అడ్డుకున్న పోలీసులు

ప్రభుత్వ పాఠశాలలను, విశ్వవిద్యాలయాలను బతికించుకుందామని, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని, ప్రైవేట్ స్కూళ్లను నియంత్రించా లంటూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 100 రోజుల విద్యా పోరాట యాత్రను నిర్వహిస్తున్నారు. ఈ యాత్రను ప్రారంభించేందుకు సెప్టెంబర్ 14న గన్‌పార్క్‌కు చేరుకున్నారు. అమరవీరులకు నివాళులర్పించి సమావేశం నిర్వహిస్తుండగా పోలీసులు యాత్రకు అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. హరగోపాల్‌తో పాటు పలువురు విద్యావేత్తలను, విద్యార్థులను, ప్రజా సంఘాల నాయకులను గన్ పార్క్‌వద్ద సెప్టెంబర్ 14న అరెస్ట్ చేశారు.

కొండపల్లి కోటేశ్వరమ్మ మృతి

కమ్యూనిస్టు యోధురాలు కొండపల్లి కోటేశ్వరమ్మ(100) విశాఖపట్నం లోని తన స్వగృహంలో సెప్టెంబర్ 19న కన్నుమూశారు. ఆమె కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోశించారు. ఆమె జీవితంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని చివరివరకు కమ్యూనిస్టుగా నిలబడ్డారు. ఆమె భౌతికకాయాన్ని ప్రజా సంఘాల నేతలు, సాహిత్యకారుల ఆధ్వర్యంలో ర్యాలీగా తీసుకెళ్లి ఆంధ్ర మెడికల్ కళాశాల అనాటమీ విభాగానికి అప్పగించారు. ఆమె నిర్జనవారధి పుస్తకాన్ని రాశారు.

చైతన్య ప్రకాశ్ మృతి

ప్రముఖ కథకుడు చైతన్య ప్రకాశ్ సెప్టెంబర్ 22న సిరిసిల్లలో మృతిచెందారు. ఆయనకు పక్షవాతం రావడంతో ఒక కాలిని కోల్పోయి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన 1968లో ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో జన్మించారు. పదవ తరగతి వరకు చదివిన తరువాత ఆయన విప్లవ సాహిత్యం వైపు ఆకర్శితులయ్యారు. ఆయన తెలంగాణలోని ఉద్యమాలు, నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు, వలసలతో అతలాకుతలమవుతున్న బతుకులు ఇతివృత్తంగా ఎంచుకొని రచనలు చేశారు. ఆయన రచనలు అరుణతార, ప్రజాసాహితి, ప్రగతి పత్రికలలో కథలు, కవిత్వం అచ్చయ్యాయి. తెలుగు మహాసభల్లో ఆయన సేకరించిన సామెతలు తెలంగాణ సాహిత్య అకాడమి సంకలనంగా ముద్రించింది.

మన్యంలో మావోయిస్టుల కాల్పులు

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ మన్యంలో మావోయిస్టులు డుంబ్రిగుడ మండలానికి సమీపంలోని లివిటిపుట్టు-గుంటసీమ రోడ్డులో తెలుగుదేశం ఎంఎల్ఏ కిడారి సర్వేశ్వరరావును, మాజీ ఎంఎల్ఏ సివేరి సోమలను మావోయిస్టులు కాల్చిచంపారు. కండ్రూం పంచాయతీ సర్పంచ్‌రాయికి పార్టీ కార్యక్రమంలో భాగంగా కార్లలో వెళుతున్న నాయకులను మావోయిస్టులు అడ్డగించి మీతో మాట్లాడేది ఉందని వెంట తీసుకెళ్లి బాక్సైట్ తవ్వకాలు, ఒడిశాలోని రాంగుడలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు మీరే కారణమంటూ నిలదీసి కాల్చి చంపారని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. వీ

పెద్దనోట్ల రద్దు ప్రయోజనం శూన్యం

పెద్దనోట్ల రద్దు అక్రమ సంపాదన, నకిలీ కరెన్సీ, ఉగ్రవాద తీవ్రవాద నిధుల కట్టడికి పరిష్కారమని ప్రభుత్వం చెప్పింది. ఆగస్ట్ 29న రిజర్వు బ్యాంకు వెల్లడించిన వార్షిక నివేదక ప్రకారం రద్దయిన నోట్లలో 99.3 శాతం తిరిగొచ్చిందని తెలిపింది. నోట్లరద్దు నిర్ణయం ఎన్నికల కోసమే తప్ప దొరికిన అక్రమ సంపాదన లేదనే విషయం దీనిద్వారా స్పష్టమైంది.

ఎన్‌కౌంటర్లపై దర్యాప్తును వ్యతిరేకిస్తున్న సైనికులు

మణిపూర్, అసోం రాష్ట్రాలలో వేర్పాటువాదాన్ని అణచివేయడానికి అమలుచేస్తున్న సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని బలహీనపర్చడానికి జరుగుతున్న ప్రయత్నాలను నిరసిస్తూ 380 మంది సైనిక అధికారులు, సైనికులు ఆగస్టు 30న సుప్రీం కోర్టుకు వెళ్లారు. ఎన్‌కౌంటర్లపై దర్యాప్తు చట్టవిరుద్ధమని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. మణిపూర్, అసోం రాష్ట్రాలలో చట్టపరమైన అనుమతి లేకుండా ఆందోళనకారులను ఆర్మీ ఎన్‌కౌంటర్ చేయడంపై హక్కుల సంఘాల నేతలు ప్రశ్నిస్తూనే ఉన్నారు. దీనిపై సుప్రీం కోర్టు గత సంవత్సరం జూలైలో బూటకపు ఎన్‌కౌంటర్లపై ప్రత్యేక బృందం (సిట్) వేసి, దర్యాప్తు చేసి బాధ్యులైన ఆర్మీ అధికారులు, సైనికులపై చార్జిషీటు నమోదు చేయాలని పేర్కొంది. దీంతో సిబిఐ 15 మంది సైనికులపై అభియోగాలు నమోదు చేసింది. 14 మంది సైనికులపై హత్యానేరంతో పాటు సాక్ష్యాల ధ్వంసం, సాక్షుల బెదిరింపు మొదలైన అభియోగాలను మోపింది.

గిరీష్ కర్నాడ్‌పై కేసు

గౌరీ లంకేశ్ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 5న ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో 'మీ టూ అర్బన్ నక్సల్' అని రాసి ఉన్న ప్లకార్డును మెడలో ధరించినందుకు ప్రముఖ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత గిరీష్ కర్నాడ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. భీమా కోరేగావ్ కేసులో ఇటీవలే అరెస్టయిన హక్కుల కార్యకర్తలను అర్బన్ నక్సల్స్‌గా ముద్రవేయడాన్ని నిరసిస్తు ప్లకార్డును ప్రదర్శించిన గిరీష్ కర్నాడ్‌పై నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, గౌరీ లంకేశ్ హత్య కేసుల్లోని నిందితుల తరపున వాదిస్తున్న హిందూ విధిన్య పరిషత్ (న్యాయవాదుల బృందం) సభ్యులు ఎంపి అమృతేష్ ఫిర్యాదు చేశాడు. స్వయంగా తనను తాను అర్బన్ నక్సల్ అని ప్రకటించుకున్న కర్నాడ్‌పై దర్యాప్తు చేపట్టాలని అన్నాడు.

ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ

దేశ రాజధాని ఢిల్లీలో వామపక్ష అనుబంధ సంఘాల కార్మికులు, రైతులు సెప్టెంబర్ 5న భారీ ర్యాలీ నిర్వహించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రుణ మాఫీ చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం నెలకు రు. 18 వేలు చేయాలన్న డిమాండ్లతో నిరసన ప్రదర్శన చేపట్టారు. సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు ఆధ్వర్యంలో 'మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ' రామ్‌లీలా మైదాన్ నుంచి పార్లమెంట్ స్ట్రీట్ వరకు నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి రైతులు, కార్మికులు 1.50 లక్షల మంది వరకు పాల్గొన్నారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు, కార్మికులు కలిసి నిర్వహించిన పెద్ద ర్యాలీ ఇదేనని నిర్వాహకులు తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు తమ పోరు ఆగదన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి చట్టానికి సవరణకు నిరసనగా బంద్

కేంద్రప్రభుత్వం ఇటీవల ఆమోదించిన ఎస్.సి, ఎస్.టి సవరణ చట్టానికి నిరసనగా సెప్టెంబర్ 6న అగ్రవర్ణాలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌లో ఓబిసి, ఉన్నత కులాలకు చెందిన 150 సంఘాలు పాల్గొన్నాయని బ్రాహ్మణ సమాగమ సవర్ణ జనకల్యాణ సంఘటన్ జాతీయ అధ్యక్షుడు ధర్మేంద్ర శర్మ తెలిపారు. ఆందోళనకారులు పలు రాష్ట్రాల్లో దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. రైళ్లను అడ్డుకున్నారు. మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో హింసాత్మక సంఘటనలకు పాల్పడ్డారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల్ని కాదని కేంద్రం ఎస్.సి, ఎస్.టి చట్టంలోని పాత నిబంధనను పునరుద్ధరించడంతో అగ్రవర్ణాలు ఆందోళనకు దిగాయి.

స్వలింగ సంపర్కం నేరం కాదు

స్వలింగ సంపర్కం నేరం కాదంటూ సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. అసహజ శృంగారమే అయినా పరస్పర అంగీకారంతో చేస్తే తప్పేమీ లేదని స్పష్టం చేసింది. ఇది ఇద్దరు పెద్దలకు సంబంధించిన విషయం. దీని వల్ల ఇతరులకు హాని కలుగదు అని తెలిపింది. 158 సంవత్సరాలుగా అమలులో ఉన్న ఐపిసి సెక్షన్ 377లోని కీలకమైన నిబంధనలు ఈ తీర్పుతో రద్దయ్యాయి. స్వలింగ సంపర్కులు, బైసెక్సువల్, ట్రాన్స్ జెండర్స్, క్వీర్ (ఎల్‌జిబిటి) సమూహానికి ఊరటనిచ్చే తీర్పును ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం సెప్టెంబర్ 6న తీర్పు వెలువరించింది. స్వలింగ సంపర్కం నేరం అంటూ 2013లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది.

పెట్రోల్ ధర పెరుగుదలకు నిరసనగా భారత్ బంద్

పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెరుగుదలకు నిరసనగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు సెప్టెంబర్ 10న భారత్ బంద్ పాటించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఎన్‌సిపి నేత శరత్ పవార్, ఎల్‌జెడి నేత శరత్ యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ తదితర 20 ప్రతిపక్ష పార్టీలు బంద్‌లో పాల్గొన్నాయి. మోడీ సర్కార్ విధానాలను వ్యతిరేకిస్తూ ఛత్తీస్‌గఢ్, బిహార్, గుజరాత్‌లలో ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు పలు చోట్ల నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. పెట్రోల్ ధర పెరుగుదల, నోట్ల రద్దు, జిఎస్‌టి పేదలకు చేటు చేశాయని ఈ సందర్భంగా విమర్శించారు.

జమ్మూకశీర్‌లో ఎన్‌కౌంటర్ హత్యలు

జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా మునివార్డ్ గ్రామంలో ఆగస్టు 29న భద్రతా బలగాలకు, మిలిటెంట్లకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మిలిటెంట్లు మరణించగా, అదే రోజు పోషియాన్ జిల్లా బోనాగామ్ పండ్ల మార్కెట్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు పోలీసులు మృతిచెందారు. కుల్గాం జిల్లా క్వాజీగుండ్ ప్రాంతంలోని చౌగామ్ సమీపంలో సెప్టెంబర్ 5న మిలిటెంట్లకు భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థలకు చెందిన ఐదుగురు మిలిటెంట్లు మృతిచెందినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. సెప్టెంబర్ 21న షోపియాన్ జిల్లాలోని బటగుండ్, కప్రాన్ గ్రామాల్లో పోలీసుల ఇళ్లపై మిలిటెంట్లు దాడిచేసి ముగ్గురు ఎస్‌పిఐలను తీసుకెళ్లి కాల్చిచంపినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

గృహ నిర్బంధంలో ప్రజాస్వామికవాదులు

దేశవ్యాప్తంగా ఆగస్టు 28న ప్రజాస్వామికవాదులను పోలీసులు అరెస్ట్ చేయడంపై రోమిల్లా థాపర్‌తో పాటు నలుగురు సామాజిక కార్యకర్తలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో ఢిల్లీలో గౌతమ్ నవలఖా, సుధా భరద్వాజ్, అరుణ్ ఫెరీరా, వెర్నాన్ గొంజాల్వెస్, వరవరరావులను పుణె పోలీసులు అరెస్టు చేశారు. ఆ పిటిషన్‌ను విచారించేవరకూ ఈ ఐదుగురినీ అరెస్టు చేయగూడదని, గృహనిర్బంధంలో ఉంచవచ్చునని సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఎం. ఖాన్విల్కర్, జస్టిస్ డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన బెంచి సెప్టెంబర్ 6న, 17న, 19న, 20న ఈ పిటిషన్ మీద వాదనలు విని, తీర్పు 28కి వాయిదా వేసింది. వీ

ఘర్షణలతో లక్షలాది చిన్నారుల మృతి

ఆఫ్రికాలో ఇరవై ఏళ్లలో అంతర్యుద్ధాలు, దాడుల వల్ల యాభై లక్షల మందికి పైగా చిన్నారులు మరణించినట్లుగా లాన్సెట్ మెడికల్ జర్నల్ తెలిపింది. 1995 నుంచి 2015 వరకు జరిగిన సాయుధ పోరాటాలు, ఘర్షణలు, వ్యాధుల పాలై, ఆకలితో అలమటిస్తూ 12 నెలల నుంచి ఐదు సంవత్సరాల గల పిల్లలు మృతి చెందినట్లు తెలిపింది. ప్రపంచంలోనే ఒక్క ఆఫ్రికా ఖండంలోనే అధికంగా సాయుధ పోరాటాలు జరిగాయని తన నివేదికలో తెలిపింది. సాయుధ పోరాటాల వల్ల గాయాలతో, గర్భిణులు, నవజాత శిశువులు సకాలంలో వైద్యం అందకపోవడంతో, వ్యాధులు ప్రబలి, పోషకాహార లోపంతో కూడా లక్షలాది పిల్లలు చనిపోయారని తెలిపింది.

అఫ్ఘనిస్తాన్‌లో బాంబు పేలుళ్లు

అఫ్ఘనిస్తాన్‌లో నిత్యం బాంబు పేలుళ్లతో అతలాకుతలం అవుతోంది. భారీ సంఖ్యలో సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. సెప్టెంబర్ 6న రాజధాని కాబూల్‌కు సమీపంలోని షిటీ నగరంలో రెండు బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనలో ఇరవై మందికి పైగా మరణించారు. మృతుల్లో ఇద్దరు స్థానిక రిపోర్టర్లు కూడా ఉన్నారు. ముందుగా దస్త్ ఈ బార్క్ ప్రాంతంలో పేలుడు జరగగా, స్థానిక జిమ్‌లో కుస్తీ పోటీలు చూడడానికి భారీగా జనం పోగయిన స్థలంలో మరో పేలుడు సంభవించింది. ఈ ఆత్మాహుతి దాడిలో మరో డెబ్బై మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. సెప్టెంబర్ 11న మరో ఆత్మాహుతి దాడి జరిగింది. జలాలాబాద్ సరిహద్దులో కమాండర్ చర్యలను నిరసిస్తూ దాదాపు నాలుగు వందల మంది నిరసన ప్రదర్శన చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఇరవై ఐదు మంది మరణించగా, 130 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.

ఇరాన్, టర్కీ, రష్యా దేశాల సమావేశం

ఇరాన్, టర్కీ, రష్యా దేశాల త్రైపాక్షిక సమావేశం సెప్టెంబర్ 7న టెహ్రాన్‌లో జరిగింది. ఈ సదస్సులో మూడు దేశాల అధ్యక్షులు హస్సన్ రౌహానీ, తయ్యిప్ ఎర్డోగన్, వ్లాద్‌మిర్ పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ మాట్లాడుతూ ఇద్లిబ్‌లో కాల్పుల విరమణకు కృషి చేయాలని కోరారు. తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్న ఈ ప్రాంతంలో రక్తం ఏరులై పారుతోందని, శాంతి స్థాపన కోసం కృషి చేయాలని అన్నారు.

అర్జెంటీనాలో పొదుపు చర్యలు

అర్జెంటీనాలో ప్రభుత్వం మరోమారు పొదుపు చర్యలకు ప్రణాళికలు చేస్తోంది. బడ్జెట్ లోటు తగ్గించుకునేందుకు ఎగుమతులపై పన్నుల పెంపు, సంక్షేమ కార్యక్రమాలపై కోతను విధించింది. డాలర్‌తో అర్జెంటీనా కరెన్సీ పెసో మారకపు విలువ గణనీయంగా పడిపోయింది. అది తీవ్ర కరెన్సీ సంక్షోభానికి దారితీస్తోంది. దీనిని అధిగమించే క్రమంలో అర్జెంటీనా అధ్యక్షుడు మాక్రి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)ను ఐదు వేల కోట్ల డాలర్ల రుణం కోసం ఆశ్రయించారు. ఇందు కోసం ఐఎంఎఫ్ విధించిన షరతుల్లో అతి ముఖ్యమైనది పొదుపు చర్యలు. ఈ తాజా పొదుపు చర్యల వల్ల నిర్మాణ రంగంలో దాదాపు నలభై వేల మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇంతకు ముందే అర్జెంటీనా సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను 60 శాతానికి పెంచింది. ఆర్థిక ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే ఈ లక్ష్యంతో ఈ చర్య తీసుకుంది.

పాకిస్తాన్ అధ్యక్షుడిగా ఆరిఫ్ అల్వీ

పాకిస్తాన్ పదమూడవ అధ్యక్షుడిగా ఆరిఫ్ అల్వీ ఎన్నికయ్యారు. ఆరిఫ్ పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అత్యంత సన్నిహితుడు, తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. సెప్టెంబర్ 9న ఇస్లామాబాద్‌లో ప్రధాన న్యాయమూర్తి సాక్విబ్ నిషార్ అలీతో ప్రమాణ స్వీకారం చేశారు.

ఫ్రాన్స్‌లో నిరసనలు

పారిస్ ఒప్పందంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని అంటూ ప్రజలు ఫ్రాన్స్ ప్రధాన వీధుల్లో నిరసన ప్రదర్శలు చేశారు. పర్యావర పరిరక్షణ పట్ల ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ ఆ శాఖ మంత్రి నికోలస్ హులౌత్ తన పదవికి రాజీనామా చేశారు. నికోలస్‌కు మద్దతుగా సెప్టెంబర్ 10న మార్సిలెస్, టౌలౌస్ నగరాల్లో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని దాదాపు యాభై వేల మందికి పైగా నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

లిబియాలో పడవ ప్రమాదం

లిబియా నుంచి బయలుదేరిన రెండు పడవలు మధ్యధరా సముద్రంలో మునిగిపోయాయి. సెప్టెంబర్ 11న జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు వంద మందికి పైగా మరణించారు. ఇందులో ఇరవై మంది దాకా పిల్లలు ఉన్నారు. నిత్యం అంతర్యుద్ధాలతో అల్లాడే సూడాన్, మాలి, నైజీరియా, కామెరూన్, ఘనా, లిబియా, అల్జీరియా, ఈజిప్టు దేశాలకు చెందిన దాదాపు 185 మంది రెండు పడవల్లో ప్రయాణం అయ్యారు. సముద్రం మధ్యలోకి రాగానే ఇంజిన్ సమస్య తలెత్తడంతో ఈ ప్రమాదం జరిగింది. లిబియా తీరంలో తరచూ పడవ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతర్యుద్ధాల నుంచి తప్పించుకుని ఇతర ప్రాంతాలకు వలసపోయే క్రమంలో పరిమితికి మించి పడవల్లో ప్రయాణం చేయడంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గత ఏడాది జరిగిన పడవ ప్రమాదాల్లో దాదాపు మూడు వేల మంది మరణించారు.

దక్షిణ, ఉత్తర కొరియా దేశాల మధ్య చర్చలు

దక్షిణ కొరియా, ఉత్తర కొరియా దేశాల మధ్య అణు నిరాయుధీకరణ కొరకు చర్చలు నడుస్తున్నాయి. సెప్టెంబర్ 18-20 మధ్య దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్-జె-ఇన్ ఉత్తర కొరియాలో మూడు రోజుల పర్యటన చేశారు. ఇందులో భాగంగా ఉ. కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలు జరిపారు. గత దశాబ్ద కాలంలో దక్షిణ కొరియా నేత ఒకరు ఉ.కొరియా పర్యటించడం ఇదే తొలిసారి. ఇరు దేశాలు అణు నిరాయుధీకరణ, ఆర్థిక సంబంధాలను మెరుగు పర్చుకోవడంపై ఈ చర్చలో ముఖ్య అంశాలు. ఈ సందర్భంగా ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఒక ముఖ్యమైన క్షిపణి పరీక్ష కేంద్రాన్ని మూసివేయడానికి అంగీకరించారు.

వియత్నాం అధ్యక్షుడి మృతి

వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డైకాంగ్ సెప్టెంబర్ 21న మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1956 అక్టోబర్ 12న ఒక చిన్న రైతు కుటుంబంలో జన్మించారు. న్యాయశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందిన డైకాంగ్ చైనీస్ లాంగ్వేజ్‌పై మాస్టర్ డిగ్రీ చేశారు. వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీలో కృషి చేస్తూ పోలీస్ జనరల్‌గా వ్యవహరించారు. 1997లో కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా వ్యవహరించారు. హోంమంత్రిగా ఉన్న డైకాంగ్‌ను 2016లో పార్లమెంట్ దేశాధ్యక్షుడిగా ఎన్నుకుంది.

మాల్దీవ్స్ అధ్యక్షుడిగా ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్

మాల్దీవ్స్ పార్లమెంట్‌కు సెప్టెంబర్ 23న ఎన్నికలు జరిగాయి. రెండున్నర లక్షల మంది (89.2 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారు. సెప్టెంబర్ 24న వెలువడిన ఫలితాల్లో ప్రతిపక్ష మాల్దీవ్ డెమోక్రాటిక్ పార్టీ (ఎండిపి)కి 58.3 శాతం, ప్రొగ్రెసివ్ పార్టీ ఆఫ్ మాల్దీవ్స్‌కు 41.7 శాతం ఓట్లు వచ్చాయి. ఎండిపి నేత ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(ఆగస్ట్ 1 నుండి ఆగస్ట్ 31, 2018 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (971), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (952) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1923)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	3	4	–	32	27	16	18	15	3	2	3	3	1	4	32	38	–	–	–	5	–
హైదరాబాద్	–	–	–	7	16	6	7	–	1	4	4	7	4	2	21	17	–	–	–	–	–
కరీంనగర్	–	3	–	6	3	3	4	–	–	2	1	4	–	8	14	10	–	–	–	–	–
ఖమ్మం	–	2	–	9	12	6	15	2	–	–	–	–	–	9	20	14	–	–	–	–	–
మహబూబ్‌నగర్	–	3	–	4	4	2	6	5	5	3	3	5	8	10	45	4	–	–	–	–	4
మెదక్	–	12	3	2	3	9	4	2	1	2	4	9	6	22	22	28	–	–	–	6	4
నల్గొండ	–	7	–	4	9	3	3	2	–	1	3	1	2	7	14	8	–	–	–	–	–
నిజామాబాద్	–	–	–	3	4	2	3	–	–	–	–	1	–	6	15	8	–	–	–	–	–
వరంగల్	–	15	2	3	2	4	4	2	1	3	7	4	9	18	21	24	–	–	–	4	1
వికారాబాద్	–	2	–	2	4	1	3	–	–	2	–	2	2	4	11	8	–	–	–	–	–
తెలంగాణ	**3**	**48**	**5**	**72**	**84**	**52**	**67**	**28**	**11**	**19**	**25**	**36**	**32**	**90**	**215**	**159**	**-**	**-**	**-**	**15**	**9**
అనంతపురం	–	6	2	23	14	1	6	1	1	2	2	3	3	10	56	1	–	–	–	–	–
చిత్తూరు	–	1	–	4	8	4	9	–	2	3	4	6	6	–	10	–	–	–	–	–	–
కడప	–	–	–	4	12	–	–	–	–	2	1	1	–	3	17	8	–	–	–	–	–
గుంటూరు	–	1	–	5	4	1	3	1	2	5	4	2	–	5	17	15	–	–	–	–	–
కృష్ణా	–	–	–	2	7	1	4	–	–	–	3	1	–	1	16	8	–	–	–	–	–
కర్నూలు	–	3	–	8	8	5	3	–	–	1	1	2	13	5	19	16	–	–	–	–	–
తూర్పు గోదావరి	–	–	–	3	12	6	9	–	2	2	2	1	–	9	31	32	–	–	–	–	–
ప్రకాశం	–	–	–	8	9	1	2	–	–	3	1	3	–	5	20	11	–	–	–	–	–
శ్రీకాకుళం	–	–	–	1	7	10	21	10	–	4	1	–	5	4	29	11	–	–	–	–	1
పశ్చిమ గోదావరి	–	–	–	4	2	1	6	–	–	2	2	–	2	5	13	12	–	–	–	–	–
నెల్లూరు	–	1	–	3	6	2	4	1	–	3	5	4	1	3	17	7	–	–	–	1	–
విజయనగరం	–	–	–	3	3	5	6	9	1	4	3	2	2	3	15	5	–	–	–	–	1
విశాఖపట్నం	–	–	–	4	14	–	1	2	1	4	–	3	2	4	20	11	–	–	–	11	2
ఆంధ్రప్రదేశ్	**-**	**12**	**2**	**72**	**106**	**37**	**74**	**24**	**9**	**35**	**29**	**28**	**34**	**57**	**280**	**137**	**-**	**-**	**-**	**12**	**4**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ	హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్ స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
పస్ట్ లక్కీ పాన్ షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్ స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్ స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్ స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్ స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్ స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
రెడ్డి బుక్‌స్టాల్	అశోక్‌నగర్, హైదరాబాద్	
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమాండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహిదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలెబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీలక్షి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
లక్ష్మణ్	చిక్కడపల్లి, హైదరాబాద్	93910 12051
మల్లిఖార్జున్ బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
బాల్‌రెడ్డి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	98660 18829
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
మహాలక్ష్మి బుక్‌స్టాల్	సిటీ బస్‌స్టాండ్, హన్మకొండ చౌరస్తా, వరంగల్	99893 30297
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్ స్టాల్, కూల్ డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్ స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్ స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్ సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 207 - October 2018 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/9/2018 ● Postal Regn. No. HD/1100/2017-19
Date of Posting : 29th, 30th

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao